
Lacking Issue August 86

- పూర్తి నవల
  నానిగాడి ప్రేమ కథ : "వసుంధర"
- కొత్త సీరియల్ : మధురాంతకం
  సహగమనం నరేంద్ర
- వడ్డమానులో జైన అవశేషాలు : డా. టి. వి. జి. శాస్త్రి
- ద్రవిడియన్ థియరీస్ : డా. హెచ్. ఎస్. బ్రహ్మానంద






సాహిత్య
మాస పత్రిక

భారతి

అక్టోబరు
1985


కృష్ణ సమర్పించు
శ్రీ విజయకృష్ణా మూవీస్
సూర్యచంద్ర
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: విజయనిర్మల
నిర్మాత: ఎస్.రమానంద్ నిర్వహణ: ఎస్.రవికుమార్ సహనిర్మాత: ఎస్.రఘునాధ్
కృష్ణ ఎంటర్‌ప్రైజెస్
• రిలీజ్: శ్రీ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్. • డిజైన్: శ్రీ సాయి కృష్ణ
PADMALAYA PUBS.

సంపుటము : 62
సంచిక : 10

భారతి

సాహిత్య మాసపత్రిక

అక్టోబరు
1985

*

సంస్థాపకుడు
కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

*

సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్
(1938-1972)

*

విషయానుక్రమణిక

*

ముఖచిత్రం : ఆరుద్ర, డా. చిట్టిబాబు

విడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు ప్రచురణకర్త శివలెంక రాధాకృష్ణ
ముద్రణ ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3. సంపాదకుడు . శివలెంక రాధాకృష్ణ

స్వవిషయం

భారతి ముద్రణలో వచ్చిన మార్పులు బాగా ఉన్నాయనే ఉత్తరాలు వస్తున్నాయి. రాసినవారందరికీ కృతజ్ఞత తెలుపుకుంటున్నాము! కొత్త పద్ధతి వల్ల ఎక్కువ "సరుకు" ఇవ్వటానికి వీలవుతోంది (కాని కావలిసినన్ని కథలు రావటం లేదని మాత్రం అనక తప్పటం లేదు.) కవిత్వం విషయంలో ఎన్నో రకాల ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. రాసేవారు పుష్కలంగానే తమ రచనలని పంపుతూనే ఉన్నారు. భారతిలో ప్రచురణకి వచ్చే కథల సంఖ్య తక్కువగా ఉండటమే కాకుండా వాటిలో వైవిధ్యం అనతగినది కూడా తక్కువగానే ఉంటోంది. కథలు రాసేవారు కూడా భారతికి మరింతగా తమ రచనలని పంపగలరని ఆశిస్తున్నాము.

నాటకాలు తక్కువగా పడుతున్నాయన్న అభిప్రాయాన్ని కొందరు వెలిబుచ్చారు. రచయిత(త్రు)లు ఇంకా ఎక్కువగా నాటకాలని రాసి పంపితే వాటిని ప్రచురించే అవకాశాలు పెరుగుతాయి!

చిన్న నవలల పోటీ ఒక దానిని నిర్వహిస్తున్నాము. భారతిలో ప్రతి నెలా ఒక చిన్న నవల వెయ్యాలని మా ఆకాంక్ష.

చరిత్ర, శాసనాలు, వ్యాకరణం, మొదలయిన వాటికి సంబంధించిన వ్యాసాలు బాగానే వస్తున్నాయి. ఆధునిక సాహిత్యం మీద విమర్శ అంతగా రావటం లేదు. రచయిత్రు(త)ల సహకారంతో ఈ లోటుని తీర్చగలమని ఆశిస్తున్నాము.

ఆధునిక సాహిత్యమే కాదు, ఎన్నో రకాల సమకాలిక విశేషాల మీద వచ్చే వ్యాసాలని వెయ్యాలని ఉంది. భారతి తెలుగు వారి సంస్కృతికి ప్రతిబింబంగా ఉండాలని మేము అనుకుంటూ ఉంటాము. తెలుగువారిది ఎప్పుడూ సంకుచితమయిన దృష్టి కాదు. ఇప్పటికే భారతిలో విజ్ఞానశాస్త్రం, రాజకీయాలు, సాంఘిక శాస్త్రం వంటి విషయాల మీద వ్యాసాలు పడుతున్నాయి. వీటి సంఖ్య అధికం కాగలదని మేము ఎదురు చూస్తున్నాము.

ఈ నెల నుంచి భారతికి రాసే వారి పరిచయాలు సంగ్రహంగా వేస్తున్నాము!



పరిచయాలు

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు గారి స్వంత ఊరు మెదకు జిల్లాలోని సిద్దిపేట. వరంగలు సంస్కృతాంధ్ర కళాశాలలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. "ఉన్నత పాఠశాలలో ఆంధ్రాధ్యాపకత్వం" తమ ఉద్యోగం అని తెలుపుతున్నారు. 1946 నుంచి, అంటే తమ 6వ ఏట నుంచి, కవితా రచన చేస్తున్నారు. పద్య గేయ కావ్యాలు ఇరవయిదాకా ప్రచురించబడినాయి. శ్రీ నరసింహాచార్యులు గారికి "విద్వత్కవి", "కవి కోకిల" అన్న బిరుదులు ఉన్నాయి. మెదకు జిల్లా రచయితల సంఘానికి, సాహితీ వికాస మండలికి అధ్యక్షులు. ●

ఉండే ఊరు : అనకాపల్లి. ఉద్యోగం : జీవిత భీమాసంస్థ. రచనలు : భారతిలో అనాడు శ్రీ మధురాంతకం రాజారాం, శ్రీ చిదంబరం, వంటి రచయితలు వ్రాసినవి– నేను రచయితని కావడానికి దోహదం చేశాయి. కలం పడుతూనే పెట్టుకున్న ధ్యేయం భారతిలో నా రచన పడాలని. 20–25 కథలు. నేను గర్వించిన–'తెలుగు మాస్టారు' నవలిక. మృత్యువు సీరియల్ భారతిలో ప్రచురించినా– ఎప్పటి కప్పుడే భారతికి వ్రాయడమంటే ఎక్కడలేని ఉత్సాహమూ.... ప్రత్యేక శ్రద్ధా. భారతిలో సీరియలైజేషన్‌కి "సృష్టి" అనే నవల అంగీకరించబడింది. ఆంధ్రసచిత్ర వారపత్రికలో –"హరేక్రిష్న" పాఠకులు నన్ను– "మంచి" రచయితగా గుర్తించారు. 300 పైగా కథలు . 30 పైన నవలలూ వ్రాసినా ప్రతి రచనలోనూ, చివరకి ఫాంటసీ లో కూడా "మంచి" నే నిలుపుకోవాలని కృషి చేస్తున్నాను. ప్రస్తుతం... 'కులం' మీద నవల ప్రారంభించాను. 'ఏ కులము నీదంటే' పేరిట. ఇంకా చాలా రాయాలనే ఉత్సాహం ఉంది. పరిస్థితులు ప్రతికూలించక పోతే వ్రాస్తాను కూడా. సత్సంప్రదాయాలు కల ఆంధ్రపత్రిక సంస్థతో అనుబంధం పెరగడమూ.. భారతి– నన్ను "మంచి" రచయితగా దిద్దడమూ– నా అదృష్టంగా భావిస్తూనా పాఠకులకి నేను బాధ్యతాయుత మయిన రచనలే చేస్తానని సవినయంగా వాగ్దానం చేస్తున్నాను. మంచి చెయలేక పోయినా చెడుని మాత్రం చేయవు నారచనలని హామీ యిస్తున్నాను భారతి నవలికల పోటీకి వ్రాసేందుకు మంచి యితి వృత్తం కోసం ఆలోచిస్తు న్నాను.

ఇచ్ఛాపురపు రామచంద్రం ●

డా. హెచ్. ఎస్. బ్రహ్మానంద గారు. (ఎం ఎ. తెలుగు. ఎం ఎ . లింగ్విస్టిక్స్ పిహెచ్. డి.) శ్రీకృ. వి. వి. ఆంధ్ర భారతిలో ఉపాచార్యులు (రీడర్)గా ఉంటున్నారు.

వీరి సిద్ధాంత వ్యాసం : సాహిత్య విమర్శ–భాషాశాస్త్రం రెండూ కలిసిన 'వ్యంజన సూత్రం' అనే అంశం మీద (1981) భాషా తత్త్వం, అలంకార శాస్త్రం, రెండూ కలిసిన రచన అది.

ఇతర రచనలు : 1. 'తెలుగు సాహిత్య విమర్శ: పాశ్చాత్య ప్రభావం' అన్న గ్రంథానికి (1983), 'తెలుగు సాహితీ సన్నయ ఒరవడి' (1985) అనే గ్రంథానికి, ఆం. ప్ర. సాహిత్య అకాడమి అవార్డులు వచ్చాయి. 2. అనంతపురం జిల్లాలోని 'సుగాలీ' భాషకు వ్యాకరణం రాశారు. (1983) 3. బసిన్ రాసిన 'ది సిమాంటిక్ ఫిలాసఫీ ఆఫ్ ఆర్ట్' అనే గ్రంథాన్ని 'కళార్థ తత్త్వం' అనే పేరిట అనువదించారు. (1983) 4. మమ్మటుని 'శబ్ద వ్యాపార విచారం' అనే గ్రంథాన్ని తెలుగు చేశారు.(1984) 5. 'గుత్తి దుర్గ చరిత్ర' అనే బుర్రకథను రాయల కళాగోష్ఠి ప్రచురణగా పరిష్కరించారు(1983) 6. 'గిడుగు రామమూర్తి పంతులు'గారి మీద ఆంగ్లంలో ఒక పరిశోధన గ్రంథం రాశారు(కేంద్ర సాహిత్య అకాడమి ప్రచురణ 1985) 7. పలనాటి వీరచరిత్రను 'వీర భారతి' అనే పేర నవలగా రాశారు. 8. భారతి, త్రివేణి, ఓపిల్ మొదలైన ప్రామాణిక పరిశోధన పత్రికల్లో 50 వరకు వ్యాసాలు ముద్రితాలు. 9 డి. ఎల్. ఎ. లో జీవిత సభ్యుడు. 10. 4 గురు పర్యవేక్షణలో పి హెచ్ డి పొందారు. ముగ్గురు ఎమ్. ఫిల్ పొందారు. 11 భారతదేశంలోని లంబాడీ– బంజారా– సుగాలీ తెగల మాండలికాలు, జానపద సాహిత్యాల మీద యు. జి సి. ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. ●

డాక్టరు టి. వి. జి. శాస్త్రి గారు కొంతకాలం భౌతికశాస్త్రం అధ్యాపకులుగా పని చేసి ఆ తరువాత పురావస్తు శాస్త్రం లేదా ఆర్కియాలజీలోకి దిగారు. ఆయన ఇప్పుడు హైదరాబాదులో ఉంటున్నారు. అక్కడి బిర్లా ఆర్కియలాజికల్ ఎండ కల్చరల్ రిసర్చి ఇన్స్టిట్యూట్‌కి డయిరక్టరుగా పనిచేస్తున్నారు. ఈ బిర్లా సంస్థ వడ్డమాను (గుంటూరు జిల్లా) లో, రెబ్బలదేవిపల్లి (కరీంనగర్ జిల్లా) లో తవ్వకాలు జరిపించారు. అంతేకాకుండా హైదరాబాదు నగరం పరిసరాలని గురించి పరిశోధనలు జరిపిస్తున్నారు. అతి ప్రాచీన కాలం నుంచి ఈ మహానగరం ఉన్న చోటు యొక్క చరిత్రని తయారు చేయించటానికి: నిశ్చ యించుకున్నారు. శ్రీశైలం కొండలలో మౌర్య కాలపు అవశేషాల కోసం అన్వేషణ జరిపిస్తున్నారు. 'మంజీరక' అనే ప్రాచీనపు రేవు పట్టణం ఎక్కడ ఉందో కనిపెట్టేందుకు కృష్ణానది వెంబడే పరిశోధనలు చేయిస్తున్నారు. ప్రస్తుతం బిర్లా సంస్థ తరపున అంతర్జాతీయ స్థాయిలో పురావస్తు శాస్త్రజ్ఞుల సదస్సు ఏర్పాటు చేసేందుకు తగిన సన్నాహాలు చేయిస్తున్నారు. ●

శ్రీ చెల్లపిళ్ల సోమసుందరరావు గారు ప్రస్తుతం ఆంధ్రవిశ్వవిద్యాలయములో చరిత్ర, పురావస్తు శాఖలో ప్రొఫెసర్‌గాను, ఆ శాఖకు అధ్యక్షుడుగాను ఉన్నారు. ఇరవై ఏండ్లకు పైగా యీ శాఖలోనే అధ్యాపకవృత్తిలో ఉన్నారు. ఎమ్.ఎ. డిగ్రీ తరువాత "క్రీ.శ. 1565 తరువాత కాలమునాటి విజయనగర చరిత్ర" అనే పరిశోధనాంశమునకు ఎమ్.ఎ. (ఆనర్స్) డిగ్రీ, "గౌతమిపుత్ర శాతకర్ణి" అనే సిద్ధాంత వ్యాసమునకు పి.హెచ్.డి. డిగ్రీ లభించాయి. "క్రీ.శ.1336 నాటివరకు ఆంధ్రుల చరిత్ర" అనే ఆంగ్ల గ్రంథము ప్రచురణంలో ఉంది. ఇది ఎమ్.ఎ. డిగ్రీ విద్యార్థులకు పాఠ్యగ్రంథముగ నుండుటకొరకు యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ వారిచేత ఆమోదించబడింది. తెలుగులో ఎమ్.ఎ. స్థాయీ చరిత్ర గ్రంథముల తయారీ చేబట్టిన తెలుగు అకాడమివారి ఆధ్వర్యంలో "విజయనగర చరిత్ర" అనే గ్రంథాన్ని వీరు వ్రాస్తున్నారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి, ఆంధ్రదేశ శాసనాలు వీరి పరిశోధనా విషయాలు. వీరు సుప్రసిద్ధ చరిత్రకారులు, శాసన పరిశోధకులు అయిన శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి శిష్యులలో ఒకరు. వీరు 'ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' 'ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్' వంటి సంస్థలలో "కార్యనిర్వాహక సభ్యులు. ●

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ గారు గత కొద్ది సంవత్సరాలుగా 'భారతి' పాఠకులకు సుపరిచితులైనవీరు ప్రముఖ విద్వాంసులైన కీ.శే. కొల్లూరు నారాయణ రావుగారి పుత్రులు. ఆంధ్రుల చరిత్ర, తెలుగు సాహిత్యం– వీరి అభిమాన విషయాలు. ఆచార్య చెల్లపిళ్ల సోమ సుందరరావుగారి పర్యవేక్షణలో వీరు పరిశ్రమించి సమర్పించిన 'హిస్టరీ ఆఫ్‌ది మైనర్ చాళుక్య ఫెమిలీస్ యిన్ మిడివల్ ఆంధ్రదేశ' అనే పరిశోధక వ్యాసానికి యీ మధ్యనే వీరికి ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు 'డాక్టరేటు' పట్టా ప్రధానమొనరించారు ప్రస్తుత మచ్చటనే చరిత్రశాఖలో "తెలుగు లిటరేచర్ ఏజ్‌ఏ సోర్స్ ఫర్‌ది సోషియో– కల్చరల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్ర (కీ.శ. 1100–1600), అనే అంశంమీద పోస్టు డాక్టరల్ పరిశోధన చేస్తున్నారు. అనేక చారిత్రక సంస్థలతో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయి. ●

1926 మార్చి ఒకటవ తేదినాడు రాజమండ్రిలో పుట్టాను. ఆంధ్రా యూనివర్సిటీ వారి బి. ఎ. డిగ్రీ పుచ్చుకున్నాను. 1943 నుండీ రచనలు ప్రచురిస్తున్నా– తెలుగు స్వతంత్ర, భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల వారూ, ఆలిండియా రేడియో వారు ఎన్నాళ్ళూ ఆదరించారు. కథలు, గేయ నాటికలు నవలలు, కవితలు హెచ్చుగానే రాశాను. అట్టడుగు వారి యాసలో కవితలు రాయడం వల్ల, ఆరకపు రచనలకు వచన కవితలో మొదటగా బొట్టు పెట్టింది నేనే. (పెద్దగా తెలిసిన వాళ్ళు కాను. వ్యాపకశక్తి పరిమపూర్ణం. నోరు విప్పి ఎక్కడా మాట్లాడలేను.) నేను అభ్యుదయ రచయితని. రసస్ఫూర్తియున్న, ఎవరి అండనూ నిలవలేనివాణ్ణి. దుర్మార్గం కించిత్తూ సహించలేను. మోసపోతే ధ్యేయంగా బతుకుతూన్నాను. ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ గరియసి కదా....పోనీ అలాంటి వాణ్ణి!

శ్రీ జాస్తి శ్రీకృష్ణమూర్తి గారు, శ్రీ ఎం. వి. యస్ మూర్తి గారలతో (మేనేజింగ్ డైరెక్టర్స్, బాట్లింగ్ కంపెనీస్ హైదరాబాదు అండ్ వైజాగ్) వాటాదారుగా ఉంటూ, వారి ఫ్యాక్టరిలలో ఎకౌంట్స్ ఆఫీసరుగా పనిచేసి వారి ఆదరానికి మన్ననకు ఎంతో పాత్రుడనయ్యాను. అలాగే డా. శ్రీ యస్. బి. పి. పట్టాభి రామారావుగారి సదరన్ ఏజన్సీస్‌లో బ్రాంచి మేనేజరుగ పదహారు సంవత్సరాలు పని చేశాను. వారు ఎంతగానో అభిమానించారు. మొదట్లో ఏడు సంవత్సరాలు గోదావరి సెంట్రల్ కో ఆపరేటివ్ స్టోర్స్‌లో పనిచేశాను. ఇప్పుడు ఓ ఐస్ ఫ్యాక్టరి యజమానిగా ఉంటున్నాను. ఇంతవరకూ 16 పుస్తకాలు (కథలు, నవలలు గేయనాటికలు, కవితలు) వెలుగు చూశాయి.

శ్రీ ఆవుల సాంబశివ రావుగారు, డా. సి. నారాయణ రెడ్డి, డా. దాశరథి ఆరుద్ర, డా. సంజీవ దేవ్, డా. యస్. యస్. ప్రభాకరరావు, డా. వి. నారాయణరావు శ్రీ శీలాలి, వి. కె. రామబ్రహ్మం, డా. అమరేంద్ర నగ్న ముని మిత్రులు.

శ్రీ తుమ్మల వేణుగోపాల రావుగారు, వారి సతీమణి శ్రీమతి కృష్ణాబాయి గారు మొదట్లో ఎంతగానో అభిమానించారు. తరువాత ఆలోచనా విధానాలలో అభిప్రాయ భేదాలు పెరిగి వీడు అంటరానివాడు అనుకున్నారు. దూరంగా ఉంచారు. కాని నేను మాత్రం 'ఇంటింటా వెలుగుతూన్న అంటరాని దీపాన్ని!' అవును అదే అదే నా బతుకు!

రెండు వందల పేజీల కవిత పుస్తక రూపంలో రావలసి ఉంది. ఓ నవల రాయాలని మనసులో ఉంది. మా మూర్తి ద్వయం దయ ఉంది త్వరలోనే వెలుగు చూస్తాయి! ఇదే సంక్షిప్తంగా సోమరాజు కథ.

–రంధి సోమరాజు ●

ఎలుక గుర్రాల పరుగు

పేగులు తెగి పోతున్నాయా....
ముక్కు పుటాల్లోంచి సన్నగా
గుండె లదిరేలా నెత్తురా ...
అయినా తప్పదు
పరుగెత్తు.... పరుగెత్తు.......
ఊ.... ....
నీ కాళ్ళ కింద లేళ్ళు బలాదూర్
నీ ముందు ఆకసాన
అశేష విమానాల హారతులు
నీ చుట్టూ సోదర సూర్యకిరణాలపూగుత్తులు.
ఓ హ్
ఊ.... పరుగెత్తు.... పరుగెత్తు....
జనం కోసం మానధనం కోసం
జన మాన సంరక్షణ కోసం
య్యింకా వేగం.... వేగం....
అయ్యయ్యో....
కాళ్ళు తేలిపోతున్నాయా....
ఊపిరి అందడం లేదా
గొంతుకలోంచి పెనుమంటలా....
బా బ్బాబు
య్యింకొక్క క్షణం
ఓపిక........ ఓపిక .... ఓపిక
అదే........ అదే........ జీవగర్ర
అదిగదిగో
నిన్నే పెనవేసుకున్న
నీ ప్రియురాలి
ఎడ తెగని వీక్షణం....
మధురం.... మధురం.... మధురం
ఆశలు మధురం
ఆశయాలు మధురం
రేపుల పూరేకులు మధురాతి మధురం....
అవునయ్యా.... అవును.
బర్హి బర్హాల కిరణ వేగాల
అనంత శక్తుల అమృత మూర్తివి
నీ కోసం నీకో స్వర్గం కోసం
నీ దేశానికో చరిత్ర కోసం
నీ జీవననాడుల ముడుల్లోంచి

వేడి వేడి నెత్తుటి పాయల్లోంచి
గుండె గుండెల లోతుల్లోంచి
దూకు.... దూకు
య్యింకొక్క అడుగు....
నువ్వు చక్రవర్తివి
నియమబద్ధ చలత్ చలన ధరిత్రివి
అద్భుతం.... అద్భుతం....
అందరి కన్నా నువ్వే.... నువ్వేముందు....
నువ్వమును ముందుకు ముందువు
సెహబాష్....
య్యింకొక్క అడుగు.... య్యింకొక్క అడుగు
ఆయాసాన్ని అడుగు
పేగుల్ని అడుగు
గుండెల్ని అడుగు
రక్తాన్ని అడుగు
నరనరాన్ని అడుగు

య్యింకొక్క య్యింకొక్క య్యింకొక్క అడుగు
అయ్యయ్యయ్యయ్యయ్యో....
ఇదేమిటిదేమిటి
అడుగు పాతాళానికి
ఉరి తీసినట్టు నీ శిరస్సు
కలసిగాని నీ జీవననాడుల అనైక్యతకు
శ్వాస ఆగిపోయిందా....
ఎప్పుడూ ఈ పందెం దరిదాపుల్లో లేని వాణ్ణి
తుదీ మొదలూ తెలియనివాణ్ణి
విఘ్నేశ్వరుణ్ణి
చుట్టూ మూడు ప్రదక్షిణలుచేసి
ఓ దండం పెట్టిన ముద్దుల తనయుణ్ణి
మోళీ మొనగాడి వారసుణ్ణి
నియ్య మందేరు.... నెత్తిని పెట్టేరు
ఉజ్వల కాంతి కిరీటం
ఉత్తుంగ శిఖరారోహణల సారథ్యం....
చిత్రం.... చిత్రం....
మరి చూడాలి ఈయనగారి
'ఎలుక గుర్రాల గాదుల ఉగాదుల విముఖత్వపు పరుగు!

శ్రీ రంది సోమరాజు

శ్రీ టి. యల్. కాంతారావు

ఆరుద్ర ముద్ర

కవిత్వం తాను నిర్వహించవలసిన చారిత్రిక బాధ్యతను విస్మరించి రాజుల, రాణీల, కాకపోతే వారి ఉంపుడుకత్తెల మోహాన్ని అసభ్యంగానూ, అసహ్యంగానూ ఆలింగనం చేసుకొన్న రోజులున్నై. ప్రజలను వారి సుఖదుఃఖాలను పట్టించుకొనకుండా పాలకులు చెప్పిందే శాస్త్రంగా, ధర్మంగా, కవిత్వపు తొడుగును ధరించి ప్రజల నెత్తినెక్కిన రోజులున్నై. మత పోరాటాలనూ, అధికారం కోసం సాగిన పోరాటాలనూ, ఆక్రమణ కోసం సాగిన పోరాటాలనూ ధార్మికమైనవిగా భావించి ఇతిహాస రూపంలో, పురాణరూపంలో కావ్యరూపంలో ప్రజల్లో ప్రవచించటం జరిగిన రోజులున్నై. సంప్రదాయం పేరున మూఢమైన విశ్వాసాలనుఆచారాలను, అలవాట్లను ప్రజల జీవిత విధానంలో కట్టుబాట్లుగా చేసి వాటినే కవిత్వంగా ప్రచారం చేసిన రోజులున్నై. మొత్తం మీద కొన్ని వందల సంవత్సరాలు అలతి మార్పులతో ఇట్టి కవిత్వమే తెలుగు సాహిత్యంలో అవిచ్ఛిన్నంగా,అప్రతిహతంగా రాజ్యం చేసింది.

సాంస్కృతిక పునరుజ్జీవనం భారతదేశంలో ప్రారంభమైనపుడు ఆంధ్రదేశంలో కందుకూరి దానికి స్వాగతం పలికి సామాజిక వ్యవస్థలో, సాహిత్య వ్యవస్థలో పురోగమన శీలమైన పరిణామానికి దారితీశాడు. ఆ పిమ్మట గురజాడ ద్రష్టయై, స్రష్టయై సమకాలీన జీవన చైతన్యాన్ని సజీవభాషలో సాహిత్యగతం చేశాడు. కాలం ఘనీభవావస్థలేని ద్రవస్వరూపం కనుక సామాజిక స్వరూపంలో, స్వభావంలో వచ్చినట్లుగానే సాహిత్య స్వరూపంలో, స్వభావంలో పెనుమార్పులు వచ్చినై.

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు, భూస్వామ్య సంస్కృతి, పెట్టుబడిదారీ నాగరికత మానవజాతి ఆలోచనా విధానంలో బృహత్తరమైన మార్పును తీసుకువచ్చినై. మానవుని కష్టాలకు, కన్నీళ్ళకు దైవాన్ని కర్మాన్ని కారణంగా చూపించే ఆలోచనా సరళిపై తిరుగుబాటు ప్రారంభమైంది. మార్క్సిజం ప్రభావం మేధావులను కదలించింది. భౌతిక సమస్యలకు మార్క్సులోనూ, మానసిక రుగ్మతలకు ఫ్రాయిడ్‌లోనూ సమాధానాలు లభించినై. మార్క్సు ఆర్థిక విధానం, ఫ్రాయిడ్ మనస్తత్వ శాస్త్రం. సార్త్రే అస్తిత్వవాదం మానవమేధకు పదును పెట్టినై. ఈ తాత్త్విక సిద్ధాంతాలు ప్రవచించిన, ప్రవరించిన వెలుగులో మానవజాతి సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించటం మొదలు పెట్టింది. సామాజిక అవగాహనలో ఈ కొత్త సిద్ధాంతాలు తీసుకువచ్చిన మార్పు సాహిత్య అవగాహనలోనూ, సృజనలోనూ, అనుశీలనలోనూ ప్రవేశించినై ఫలితంగా శతాబ్దాల సంప్రదాయ సాహిత్యం ఈ భావాల పెనుముట్టడిలో ఒక్కసారిగా శిథిలమై నూతన రూపంలో సాక్షాత్కరించింది. ఈ నూతన రూపాన్ని చూడలేక కళ్ళు మూసుకున్నవాళ్ళు ఎక్కువమంది.

ఇరవయ్యోశతాబ్దపు ఆధునిక తెలుగు కవులలో మొదటి తరగతి కవుల వరుసలో ఆరుద్ర ఒకడు. శ్రీశ్రీ, నారాయణబాబు, ఆరుద్ర ఇదొక కవిత్రయం. ఆరుద్ర కవిత్వంపై శ్రీశ్రీ ముద్రలేని మాటవాస్తవమే కాని కవితా వస్తునిర్దేశకత్వంలో ఆధునిక కవిత్వానికి శ్రీశ్రీ గురజాడ తరువాత మార్గదర్శకత్వం వహించిన ఆచార్యుడు. గురజాడ కాలానికీ, శ్రీశ్రీ కాలానికి సామాజిక సిద్ధాంతాలలో కనిపించిన వ్యత్యాసమే గురజాడకు, శ్రీశ్రీకి కవితా వస్తు స్వీకారంలో ఉన్న భేదం. ఆరుద్ర శ్రీశ్రీకంటె పదిహేనేళ్ళు చిన్నవాడైతే కావచ్చుకాని అభ్యుదయ కవితోద్యమంలో ఆరుద్ర పాత్ర తక్కువ దేమీకాదు. వి ర. సం. ఏర్పడిన తరువాత ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే దిగంబర కవుల పుట్టుక తరువాత అభ్యుదయ కవులలో వచ్చిన భేదాభిప్రాయాలవల్ల పోలరైజేషన్ ఆఫ్ గ్రూప్స్ అనే స్థితి ఏర్పడింది. ఆ స్థితి ఈనాటికి కొనసాగుతూనే ఉంది. ఈ అభిప్రాయ భేదాలలో - అప్పటి వరకూ కవుల మీద వ్యవస్థితమై ఉన్న అంచనాలను కవులే తారుమారు చెయ్యటం మొదలు పెట్టడంతో ఒక అవ్యవస్థత ఏర్పడింది. ఈ అవ్యవస్థ ఇప్పటికీ అట్లాగే ఉంది, ఉంటుంది కూడా. ఈ ముఠాలు, అభిప్రాయ భేదాలు ఎలా ఉన్నప్పటికీ, ఈ తగాయిదాల్లో ఆరుద్ర ఏ వైపు ఉన్నప్పటికీ అతను ముందుచూపు కలిగిన గొప్పకవి అనేమాట నిర్వివాదమైన విషయం. మోటూరు హనుమంతరావుగారు చెప్పినట్లుగా కాక అ. ర. సానికి వి. ర. సానికి దూరంగా నిలవటంలో ఆరుద్ర గొప్పతనంలేదని హనుమంతరావుగారే అన్నట్లు "కవులను, రచయితలను ఒకరితో మరొకరిని పోటీపెట్టలేము. సమతూకంలో తుయ్యనూలేము. ఎవరి ప్రత్యేకత వారిది. ఎవరి శైలి వారిది. ఎవరిఘనత వారిది. ఆవైవిధ్యాన్ని చెడగొట్టకుండా విలువలు గట్టడం మంచిది. ప్రధాన గీటురాయి వెనుక చూపా ముందుచూపా అన్నదే" అనే నిర్ణయానికి రావటంలో పెద్ద కష్టమేమీ ఉండదు కాని అక్కినేని నాగేశ్వరరావుగారి నటనకు ఒక ఎక్‌స్ట్రా నటుడి నటనకు ఎవరి ప్రత్యేకత వారిదని అనుసంధానం చెయ్యగలమా ? నిస్సందేహంగా చెయ్యలేం. ఆరుద్ర ప్రత్యేకత ముమ్మాటికీ ఆరుద్రదే. తదితర కవుల కవితా విశిష్టతలో తులనాత్మక పరిశీలన చేసేటప్పుడు మాత్రమే తూకపురాళ్ళు మారుతై.

అభ్యుదయ యుగాదిగా వచ్చిన తెలుగు కవిత్వ పరిణామాల్లో ఆరుద్ర ప్రతిస్పందన తక్కువదేమీకాదు. ఆధునిక కవిత్వంమీద సినీవాలి కావ్యానికి ముందు ఆరుద్ర, శ్రీశ్రీ, వరద రాజేశ్వరరావులు సాహిత్యోపనిషత్ పేరుతో సాగించిన చర్చలో ఆరుద్ర అభిప్రాయాలు చాలా తెలుస్తై. కవిత్వం ఎందుకు ? అనేది కవిత్వం సృష్టినాటినుంచీ ఉన్న ప్రశ్నే. శివేతరక్షతి కొరకు అని పూర్వాలంకారికులు సమాధానం చెప్పనే చెప్పారు.

"ఎప్పుడో మానిషాదతో పుట్టిందట మొదటి కవిత్వం.
ఎప్పుడైనా అలాంటి ఘటనతో పుట్టడమే దాని తత్త్వం.

ఆక్రమం జరగడం కవితకు నాంద నేది ముఖ్యం" కరుణలోంచే కవిత్వం పుడుతుంది. బాధ కవిత్వానికి పర్యాయపదం అన్నాడు శ్రీశ్రీ. సహితం సాహిత్యం అయినప్పుడు కవిత్వం దాంట్లో భాగమైనప్పుడు అది తప్పని సరిగా వ్యక్తిక్షేమాన్ని గాక సంఘక్షేమాన్ని, వ్యక్తి వికాసాన్ని కాక సామాజిక వికాసాన్ని కోరుతుంది. సంఘక్షేమం, సామాజిక వికాసమే అనాటి అభ్యుదయ కవుల లక్ష్యం కనుక అభ్యుదయ కవితోద్యమంలో భాగస్వామి అయిన ఆరుద్ర కవిత్వ లక్ష్యం కూడా అదే. ఏ కాలంలోనైనా యధాస్థితి వాదులు ఉండనే ఉంటారు. వాళ్ళకు మారుతున్న కాలంతో, విశ్వాసాలతో సంబంధం ఉండదు. వారికే వర్తమానమూలేదు. భవిష్యత్తూ ఉండదు. గతంలోనే జీవిస్తారు. కవిత్వసిద్ధాంతాలపట్ల కూడా గతానికే కట్టుబడ్డ వాళ్ళు ఉంటారు. వాళ్ళు వచ్చేమార్పుల్ని ప్రతిఘటిస్తారు. వాళ్ళకున్నది ఒకే ఒక్క ఆయుధం. అది 'సంప్రదాయం' అనే ఒకమాటలో నూతన జీవిత విలువల్ని, సాహిత్య విలువల్ని, ఇతర సమస్త విలువల్నితోసిపారేస్తారు. ఎదుగుతున్న

సమాజంలో రావలసిన మార్పులను, ఉండవలసినతీరును రూపొంచించి అందుకను గుణంగా సాహిత్యకారులు తమసాహిత్యాన్ని జనుల్ని ప్రభావితం చెయ్యటానికై అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దుతారు. దానికై కంకణం కట్టుకుంటారు.

"వర్తమాన కాలం గురించి కవిత్వం చెప్పందే
ప్రవర్తనలు మార్చడం అసంభవం అనకతప్పదు.

ఈనాటికీ యింకా గతానికి గబ్బిలాల్లాగ
వేళ్లాడుతున్నవాళ్ళు వేన వేలున్నారు
అదేకథ అదే ప్లాటు అదే వర్ణన
ఏదో యథాశక్తి ఉపమానాలు
వాటికైనా పాతవే కొలమానాలు
వెనుక చూపువాళ్ళు వేయిమందున్నా
ముందుచూపు కవి ఒక్కడు చాలు
వాడు అవశ్యం కలిగిస్తాడు మేలు
మేలుకొంటాడు రోగిష్టి మానవుడు"

మంచికవిత్వం జ్ఞాన చక్షువును తెరుస్తుందని, నిత్య నైమిత్తికాలనుంచి నిరంతర సత్యాలదాకా మహాకావ్యం ప్రవచిస్తుందని, మహాకావ్యలక్షణం రంజింప చేస్తూ సందేశమివ్వటమని ఆరుద్ర అభిప్రాయం, రంజన సందేశం అనే రెండు శబ్దాలు మహాకావ్యానికి రెండు ముఖాలు. ఒకటి శిల్పానికి, ఒకటి ప్రయోజనానికి చెందినవి. కవిత్వంలో శిల్పం దెబ్బతింటే దాని ప్రయోజనం కూడా దెబ్బతింటుంది. శిల్పరహితమైన ప్రయోజనం, ప్రయోజనశూన్యమైన శిల్పం నిష్ప్రయోజనాలు. కవిత్వంలో ప్రయోగం అవసరమా? అయితే ఎంతవరకూ? అనే ఆరుద్ర ప్రశ్నకు శ్రీశ్రీ ఈవిధంగా సమాధానం చెప్పాడు,

"కవిత్వానికికూడా సైన్సుకివలె
కావాలి రీసెర్చీ ఎక్స్‌పెరిమెంటూ
కాని దాని పరమార్థం
పలాయనం కాదు ప్రజాక్షేమం
పరిశోధన చీకట్లో చిందులాడుట కాదు
జీవితాన్ని పణం పెట్టిన చీట్లాటకాదు.
ప్రగతి శీలం కాలం సంఘర్షణ దానిమూలం.
పరిణామం దాని నైజం పరాజయం లేనిది ప్రాణం.
పౌరం పర్యం గమనించి
పౌరస్పర్యం గుర్తించి
పరిశోధన సాగిస్తే బయలు పడుతుంది రహస్యం
ఈ దారిలో ప్రయాణానికే ఇంకోపేరు కవిత్వం"

ఆరుద్ర త్వమేవాహం కావ్యంలో ప్రయోగమే చేశాడు. దృక్పథంలో ముందు చూపేచూశాడు. స్పేదును, స్పేసును జయించిన, సాధించిన మనిషి కాలాన్ని జయిస్తాడనే విశ్వాసం ఆవాహనలో వ్యక్తం చేశాడు. ఆధునిక కవిత్వంలో కాలజిజ్ఞాస ఒకభాగం. శ్రీ శ్రీ చతురస్రం నాటికలో ఈ జిజ్ఞాసను బాగా వ్యక్తం చేశాడు.

"మేధాశోధన నాళికలో కాలాన్ని పోసి
మండుతున్న గుండెల మీద మరగపెడతాను
మానవాళికి పని కొచ్చే ఫలితాలకోసం
పాటు పడతాను, టపాకడతాను"
అంటూ అభ్యుదయ కవితాలక్ష్యాన్ని ప్రదర్శించి

వంకరటింకరగా పోయే వర్తమానకాలపథంలో
కష్టాల కంకరరాళ్ళు లేకుండా చూస్తాను
కాలాన్ని మీకు బానిసగా చేస్తాను
కళ్ళల్లో జ్యోతులు వెలిగిస్తాను
భూతలం స్వర్గానికి తలుపులు తీస్తాను"

అని భవిష్య దాశావాదాన్ని ప్రకటించాడు.

తెలంగాణా భయంకర చరిత్ర, దాని తాలూకూ వాస్తవాలు మానవజాతి స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, సోదరభావాన్ని, సమభావాన్ని కాంక్షించే ప్రతి రచయితను కవిని కదలించినై. ఆరుద్రత్వమేవాహం కావ్యానికి పునాదిరాయి అయిన ఒక సందర్భాన్ని గురించి కవే కావ్యంలో చెప్పుకున్నాడు. ఇంకా ఇతరులు చాలామంది ఇప్పటికే రాశారు, అందులోవున్న ప్రతీకాత్మక కవితా విధానాన్ని గురించి కూడా వలసినంత చర్చ జరిగింది. కనుక మళ్లా వాటి ప్రస్తావనతేవటం పునరుక్తి దోషమే అవుతుంది. త్వమేవాహం కావ్యంలో భిన్నవర్గాల మనస్తత్వాలు కనబడతై వర్తమానకాల బీభత్సం కనబడుతుంది. కదలిగర్భంలో అగ్నిలాగ పీడితవర్గ అంతరాంతరాల్లో దాగిఉన్న కోపానలం ఎగిసిపడే మహాజ్వాలగా మారవలసిన అవసరం కనబడుతుంది, ఇదంతా వస్తుసంభారం సంగతి. కవిత్వరూపంలోకి వస్తే ప్రతిభావం ప్రతీకాత్మకంగా కనబడుతుంది. అనేక రకాల ఛందస్సులు కనబడతై. వచనగేయం కనబడుతుంది. ఇతర భాషాపదాలను తెలుగుపదాలతో సదుసింపచెయ్యటం కనబడుతుంది. భావోచిత పదబంధాలు కనబడతై.

సినీ వాలి కావ్యంలో అధునాతన నాగరికత నగర వర్ణన, జీవిత వైక్లబ్యమూ, విషాదమూ సమగ్రమైన రూపంలో సాక్షాత్కరిస్తై. కొత్త కవిత్వంతో నగరాన్ని, దాన్ని కృతకత్వాన్ని, వికృతిని పఠాభి తన కవిత్వంలో బాగా అపహాస్యం చేశాడు. నగరవర్ణన విషయంలోనూ, శబ్ద చమత్కృతిలోనూ ఆరుద్రపై పఠాభి ప్రభావం ఏకొంచెమైనా ఉండకపోదు.

"పాడుతాను నాకు తెలిసిన నగరం గురించి
నగరంలో శాంతిగురించి నీతి గురించి
రకరకాల సన్నివేశాలలో ఆవేశాలలో
ప్రకటించుతాను మనలాంటి మనుష్యులగురించి"

అంటూ నగరజీవితాన్ని వర్ణించటమేకాదు. ఆ జీవితంలో ఉన్న స్వర్గం, నరకం రెండీసీ మన కళ్ళముందుంచాడు ఆరుద్ర. నగరంలో రాజకీయాలున్నై. వ్యాపారం ఉంది; దోపిడీ ఉంది వ్యభిచారం ఉంది; దొంగతనం ఉంది; నగరం అన్నిటినీ సంపాదించుకుంది; హృదయాన్ని పోగొట్టుకుంది. క్లార్కు సూర్యారావు టైప్ కారక్టర్. ఎంతోమంది సూర్యారావులు నగరంలో. నగరం నాతికి, నగరంలో నాతికి అట్టేతేడాలేదు. వ్యాపారయుగంతో శరీరాలుకూడా వ్యాపారవస్తువులైనై.

"పోతున్నారు ఆడా మగా చిన్నా పెద్దా
అంతులేని పాపాల ప్రాంతాలకు
అంతరాళ కరాళ గహ్వారాలకు
పోతున్నారు పోతున్నారు పోయారు
జీవితంలో ఓడిపోయారు
మంచినుంచి వీడిపోయారు
అది విలయం
నైచ్యానికి నిలయం
భయంకర విలాసవలయం

....

శంకరా!

శ్రీ బేతవోలు రామబ్రహ్మం

రాజద్రాజిత రాజతాచల శిఖాభ్రాజిష్ణు రించోళికా
రాజీరంజిత పాదపంకజలసత్ప్రాకార మంజీరయు
గ్మాజిహ్మోత్తమ భూషణ వ్యతికరప్రావృణ్ణిభాంగాంగ సం
యోజన్నైకసురీ స్తుతి ప్రకర నిత్యామ్రేడితా! శంకరా!

విలసన్మానవ మానసాంచిత సరో విద్యోత మానాబ్జ సం
కులముష్టింధమ మధ్యమానికటునాకూజాత లేలిహ్య ని
స్తులకాలాళి ముహుర్ముహుర్లుఠిత పాంసూత్తం సితఃపక్షపం
కిల జన్మాంతర వాసనా నివహ పూత్రేక్కాకరా! శంకరా!

మహిమ ప్రావృత సత్త్వసంపద చలన్మాంజిష్ఠ సంఘృష్టితా
తిహిమానీ పరిశోభితాంతర మహోద్ధీ దీపితాంబా సుఖో
ద్వహితైజశ్చయ దుష్ట కంటక దహద్ గ్రైష్మాతపప్రౌఢసం
దిహ బీజాక్షర సంపుటీ త్రిపుటవత్ శ్రీచక్రపా! శంకరా!

పిట్ట కొంచెం - కూత ఘనం

సౌభాగ్య

మాకూ ఆస్తిపాస్తులున్నాయి.
'అనువాదాలు' తెచ్చిపెట్టిన అగ్రహారాలూ అష్టైశ్వర్యాలూ
మట్టిగొట్టుకు పోయినా
అందం, ఆర్ద్రతా మాకు మిగిలిన ఆస్తిపాస్తులు.
కులాలు కులాయాల్లో కూలిపోతున్నా

మా కులం మిగిలింది. మాది కవి కులం.
కలకలం మిగిలింది. కలం మిగిలింది. కల మిగిలింది.

అంతఃపురాల్ని వదిలేసి అన్నార్తులతో కలిసిపోయాం
పద్యాలు పల్చబడినా ఆవేదన చిక్కగానే వుంది.
అందమైన పత్రికల్లో

అక్కడక్కడా నలుసుల్లా అడ్డుపడతాం
విన్నపాలు చెయ్యం
వెన్ను చరుస్తాం.

ఆహ్వానిస్తాడు పాప పంకిలాలచిలాలు
అరుస్తాయి బేహారుల గొంతులు

ఇది నగరజీవితంలో ఒక భాగం నగర సమగ్రచిత్రణ. దాని భయంకర స్వరూపం క్లారో సూర్యారావు ప్రధానకథలో ఒక ఉపకథ. నేదమవాస్య అని కవి వేరుగా చెప్పకుండానే ఈ సమాజం నిత్య అమావాసకు అంకితమైంది. ఐతే ఈ చీకటే శాశ్వతమా? ఇక ముక్తి లేదా? అంటే కవి నిరాశకు తావు ఇవ్వటంలేదు.

"ఈ కావ్యం విషాదాంతమనుకోడం తప్పు
అసలు అంతమవుతుందనుకోడమే తప్పు
ఇది అనంత సౌఖ్యవంతం అనడం ఒప్పు
ఈ నిరాశలోంచి ఆశజనించడం ఒప్పు"

అంటున్నాడు ముగింపులో. మానవజీవితమే కావ్యం కదా !

ఇంత ఆశఉన్న ఆరుద్ర తన కవిత్వాన్ని గురించి మాత్రం నిరాశ పడిపోయాడు. త్వమేవాహం అచ్చు అయిం తర్వాత వచ్చిన విమర్శలు ఆరుద్రను "జీర్ణమంగే సుభాషితం" అనే మానసిక పరిస్థితికి తీసుకువచ్చాయని ఆరుద్ర చెప్పుకున్నాడు. కవిత్వరహస్యం తిలక్ అన్నట్టుగా కవికే తెలుస్తుంది. అకవులకు, కుకవులకు తెలియదుగదా ! (అ కవి అనేమాటను గురజాడ అప్పారావుగారి మీద ప్రయోగించటానికి ఎవరో డిస్కవరీ చేశారనుకుంటాను)

"బేడీలుపడ్డ చెయ్యి ఏంరాస్తుంది ?
....
వినం వినం వినం వినం గాక వినం అనే
సీసం బిరడాలు తాపడంకాబట్టి
చెవుల ముంద్నెదుకి విమల గాంధర్వం ?
ధనం ధనం ధనం తప్ప వేరేదీ
ఘనం కాదు కాదు కానేకాదనే
గాజుకళ్ళ ముందెందుకి రసమయ కళాగంధం"

సమకాలీనులు తమనితాము తప్ప మరొకరిని భరించరు. "మెచ్చనంటావు నీవు; మెచ్చకుంటె మించిపోదు!" అనుకొనడంకంటె అసూయాగ్రస్త మనస్కులను ఇగ్నోర్ చెయ్యటానికి మరోమార్గం లేదు. పఠాభి, ఆరుద్ర, బైరాగి వీళ్ళు ఒక తరహా కవులు. ప్రత్యేకముద్రను కలిగిన కవుల కవిత్వం అర్థంకాదనే నెపంతో కొంచెం చెయ్యటం కురచబుద్ధికి నిదర్శనం. ఆధునికాంధ్ర కవిత్వంలో ఆరుద్ర ముద్ర ఎన్నటికీ చెరగనిది. (సిద్ధాంత వైరుధ్యాలు అనేకం ఉండవచ్చు.) □

శ్రీ వాసర సరస్వతీస్తవము

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

ఉ॥ వ్యాసముని ప్రతిష్ఠిత సమంచిత దివ్యకళా స్వరూపిణీ!
భూసుర వేదవిన్నికర పూజిత భవ్యపదాంబుజాత! అ
ధ్యాసిత యంత్రపీఠ! కమలానను కూరిమిరాణి, వాణి! శ్రీ
వాసరవాసినీ! మృదుల భాసుర హాసిని! వాగ్విలాసిని!

క॥ సద్యోగామృతగాత్రీ!
సద్యః ఫలదాత్రి! భక్తజన జనమిత్రీ!
ఉద్యత్త్రి భువననేత్రీ!
విద్యా సంధాత్రి! నుతకవీ! సావిత్రీ!

గీ॥ తెలుగువారిబుద్ధి విలసనమ్ము దలచి
తెలుగువారి తలపు పొలుపు వలచి
తెలుగునేల వెలుగు తొలక వాసరలోన
వెలసినావు కరుణ పలుకు కలికి!

మ॥ కువలశ్రీ రుచిరాంబుపూర విలసత్ గోదావరీ వీచికా
నివహార్ద్రామల కోమలా నిలములున్మేష ప్రచారమ్ముతో
ఇవతాళింపు ఘటింప బంధుర కళా హేవాక పాకంబునన్
చివురుం గొమ్మకు చేవ గూర్తువుకదా! చిద్భాసినీ! భారతీ!

సీ॥ నీ వీణ పాటలో నెరయు స్వరావళి
మూగగొంతుకు రాగయోగమొసగ
నీ కృపాలోకన శ్రీకందళింపు
విద్యాదరిద్రత యథాయథలు సేయ
నీ చిరునవ్వు వెన్నెలవన్నె కారు
చీకటి గుండెలో కాంతికలన మెలప
నీ కాళ్ళ పారాణి రేకలు వర్ణ
శూన్యపు నాలుకకు సొంపు నలవరింప

గీ॥ నీ స్వరూప వైభవము నిర్నిద్రభక్త
వాంఛితార్థ ప్రదాయిగా వరలుచుండ
వెలయుచున్నావు వాసర నిలయమందు
వల్లకీపాణి! వినుత గీర్వాణి! వాణి!

గీ॥ ప్రత్యూషమ్మున చిన్నారి బాలలీల
పట్టపగలింటి సమయాన ప్రౌఢరీతి
అపరసంధ్యను పండు ముత్తైదువ వలె
తోచుచుందువు భాషావధూటి! నీవు
అద్భుతము తల్లి! నీ మహిమాతిశయము

గీ॥ నిన్ను దలచినవాని పాండితి వరించు
నిన్ను గొలుచువానికి కళానిధి లభించు
నిన్ను దెలచినవాని పున్నెము ఫలించు
శారదా! శారదాబ్జ సు స్వచ్ఛమూర్తి!

ఉ॥ అక్షర భిక్షపెట్టి, మనుజాళికి తత్త్వవివేచనా విధా
శిక్షణ నిచ్చి,నంతతము శ్రేయము, తీయము గూర్చి కావగా
దీక్ష వహించి వాసర ప్రదేశమునన్ విలసిల్లు నీ దయా
వీక్షణ సేచనమ్ము నుతియింపగ శక్యమె? శారదాంబికా!



డా॥ పి. బి. శ్రీనివాస్

సంగీత కళావారిధి డా॥ చిట్టిబాబు

సంగీతం అజరామరానంద పారవశ్యం కలిగించే మధురసుధారసం. మానవ జీవితంలో సర్వసామాన్యాలైన కలతలకి వేదనలకి రామనామం వలెనే మరో దివ్యౌషధం. సంగీతాన్ని కళాధిదేవత అయిన సరస్వతీదేవి పయోధర కుంభ ద్వయంలో ఒక రసమయ పూర్ణకుంభంగా వర్ణిస్తారుకవులు. అట్టి వాణీకర పల్లవాలని అలంకరించే వాద్యపుష్పంగా, "నాదఫలమనదగిన" వీణకే ఘనతదక్కింది. అట్టి వీణను పలికించే అదృష్టంగం వైణికులు ఎందరెందరో మహానుభావులు. వారిలో ప్రథమ శ్రేణిలో అగ్రగణ్యులుగా విలసిల్లే పుణ్యమూర్తులు బహుకొందరు. ఆ బహుకొందరిలోనూ ముఖ్యాతిముఖ్యుడు ఈ నాటి మన వ్యాసనాయకుడు.

హిస్ మాస్టర్స్ వాయిస్ రికార్డింగు హాల్లో మొన్న అడుగు పెట్టానోలేదో అద్భుతమైన సంగీతం నా మనస్సుని సుమధురనాదసుధారసాస్వాదన అందించే దివ్యానందంలో ఓలలాడించింది. హాలు అపూర్వంగా, నలభై తొమ్మిది వీణలతోనూ, నలభై తొమ్మండుగురు వైణికమణులతోనూ, నిండివుంది. ఆ వైణికులు వివిధభాషల విభిన్న ప్రాంతాలవారు. రాష్ట్రీయ సమైక్యతకి చిహ్నంగా స్ఫురించింది నాకు, ఆ బహు వైణిక సమాగమ సంరంభం. అంతటి అపూర్వవైణిక బృందాన్ని కన్‌డక్ట్ చేస్తూ తనతాళంలో నడిపిస్తున్నవ్యక్తి మరెవరోకాదు, నాటి బాలవైణికుడూ, నేటి మేటి మహా వైణికుడూ, అయిన భారతీయ సంగీత కళాభిజ్ఞుడు, ఆంధ్రభూమిలో అవతరించి, అంతర్జాతీయ ఖ్యాతినార్జించి, అఖండ మేధావీ, అపార ప్రతిభాశాలీ,అనంత సంగీతనిధీ" అని అనిపించుకుంటూ, నిత్యనవీన సాధనాయజ్ఞంలో నిమగ్నుడైన కళాదేవతని, మనోవాక్కాయ కర్మలచే, భక్తి శ్రద్ధలతో, పూజించే పూజారి, అగణిత రసజ్ఞ ప్రేక్షక శ్రోతృజనగణ మనస్సింహాసనాధి రూఢుడైన వైణికి సార్వభౌముడు "చిట్టిబాబు"!!

చిట్టిబాబు కళామయ జీవితంలో ఈ బహువీణా వైణికసంగమం నవ్యతలో నవ్యతనీ, భవ్యతలో భవ్యతనీ, శ్రావ్యతలో శ్రావ్యతనీ, సాధించ గలిగే విలక్షణ సులక్షణయుత వినూత్న ప్రక్రియ. చిన్నవయస్సునుండీ, "కళ", తమ జీవితాన్ని అర్పించుకున్న మనచిట్టిబాబు తల్లి దేవీత్రయ శక్తిస్వరూపిణి శ్రీమతి సుందరమ్మ. తండ్రి మనశ్శక్తికి మరోపేరైన కీ॥ శే॥ చల్లపల్లి రంగారావు గారు. తమ పుత్రుడి కళాభివృద్ధి కన్నివిధాలా పాటుపడి మహా కళాకారుడుగా రూపొందించిన ఘనత చిట్టిబాబు తండ్రిగారిదే. చిట్టిబాబు చేత అహర్నిశం ఏకైక ధ్యేయంతో పట్టువిడని పట్టుదలతో అనన్యభక్తి శ్రద్ధలతో సాధకం చేయించిన రంగారావుగారి దీక్షని కనులారకని విస్మితులైనవారిలో నేనొకణ్ణి. అట్టితలిదండ్రులు అల్లారుముద్దుగా పెంచిపెద్దచేసిన ఏకైక పుత్రరత్నం చిట్టిబాబు. ఈ రత్నానికి గల సహజ ప్రతిభా ప్రభని బాల్యదశలోనే గుర్తించి నిత్యకళాభివృద్ధికి దోహదం చేసిన చిట్టిబాబు జననీ జనకులు ఎంతైనా అభినందనీయులు. అనుసరణీయులైన ఆదర్శదంపతులు.

1936వ సంవత్సరంలో అక్టోబరు పదమూడవ తేదీన జన్మించిన చిట్టిబాబు జన్మస్థలం, కళల కాణాచియని పేరొందిన కాకినాడ. ఆ కాకినాడే నా జన్మస్థలం కావడం నాకెంతైనా ప్రతిష్ఠాకారణం. కాకినాడ ఆంధ్రసీమలో పవిత్రమైన తూర్పు గోదావరి జిల్లాకి చెందిన మహాపట్టణం. చిట్టిబాబు తనవాడని గర్వపడడంలో కాకినాడతో సరి ఉజ్జీగా పోటీపడగల వూరు పిఠాపురం. అక్కడే చిట్టిబాబు తమ మహోజ్జ్వల భవిష్యత్తుకి పునాది వేసిన బాల్యదశని గడిపారు. ఓరోజున రంగారావు గారు"వరవీణా మృదుపాణీ" అని సాగే జనప్రియ సంగీత రచనని వీణపైన తమ ఇచ్ఛానుసారంగా పరిధినిమీరి పలికిస్తున్న సమయాన ఇంటిబయట సాటిపిల్లలతో ఆడుకుంటున్న నాలుగున్నర సంవత్సరాల బాలుడు చటుక్కున లోపలికొచ్చి అదే పాటని వీణపై ఇలా వాయించాలి అని నిరూపిస్తున్న విధాననిర్దుష్టంగా వాయించి చూపించేసరికి, ఆశ్చర్య చకితులై, ఆక్షణానే తమపుత్రుడిని గొప్ప వైణికుడిగా మలచి రూపొందించాలన్న దీక్షాకంకణం ధరించి సీనియర్ కేంబ్రిడ్జిదాకా సాగిన కళాశాలా విద్యాభ్యాసం చాలునని తీర్మానించి, సంగీత శిక్షణ యిప్పించటం ప్రారంభించారు అకుంఠిత లక్ష్యంతో. ఆయన చెప్పుచేతల్లో భయవినయ భక్తులతో పెరిగి నందువలననే ఆనాటి చిట్టిబాబు ఈనాటి ఇంతటి గట్టిబాబై ఔన్నత్యాల శిఖరాన్ని అందుకుని నిలబడగలిగే స్టేచర్‌కి స్టేటస్‌కి ఎదగ గలిగారు. పరమపదించిన తలిదండ్రుల ఆత్మీయ ప్రేమాభిమానాలని తలుచుకున్నప్పుడల్లా కృతజ్ఞతా భావంతో కంటతడిపెట్టుకునే సత్పుత్రులకోవకి చెందినవారు మన చిట్టిబాబు. ఆ ధన్య జననీ జనకుల దీవెనే చిట్టిబాబుకి సదా శ్రీరామరక్ష.

పుట్టగానే పరిమళించిన పువ్వులా వికసించి, పూర్వజన్మల బహుపుణ్య ఫలం అనదగిన సంగీతవిద్యలో ప్రావీణ్యం పొందేందుకు, అన్నివిధాలా క్రమ శిక్షణ ఎంతైనా అవసరం. అయిదేళ్ల చిట్టిబాబుకి తొలిగురువు సంగీత పరంగా శ్రీ పంద్రవాడ ఉప్మాకయ్య. తొలిగురువుగారి తనయుడైన శ్రీ సింగరాజు ద్వితీయ గురువు పిదప రెండు సంవత్సరాల పర్యంతం తగు శిక్షణనొసగిన తృతీయ గురువు శ్రీ ఈయుణ్ణి అప్పలాచార్యులు. పువ్వు పిందెయై, కాయయైన పిదప ఫలించడానికి కారణ భూతులైన "విశిష్ట చతుర్థ" గురుదేవులు, సంగీత విశ్వవిఖ్యాత వీణావాదన కళాసామ్రాట్టులూ, సంగీత శిక్షణ కళానిపుణులూ అయిన మహామహోపాధ్యాయ, పద్మశ్రీ డాక్టర్ ఈమని శంకరశాస్త్రివర్యులు. చిట్టిబాబుకి నాకూ మెంటర్‌గా లభించిన శ్రీ ఈమని సంగీత కళా సుమవనానికే నిత్యమైన ఆమని. (వసంతం) పదమూడేండ్ల ప్రాయంలో (చిట్టిబాబు జన్మదినాని కనుగుణ్యంగా) లభించింది చిట్టిబాబుకి శ్రీ ఈమని మార్గదర్శకత్వం. సంఖ్యాశాస్త్రానుసారంగా 13 సంఖ్యకి 4 చాలా అదృష్టసంఖ్య. అందుచేతనే కాబోలు 13వ తేదీన జన్మించిన చిట్టిబాబుకి నాలుగవ గురువులైన వారు, శ్రీ ఈమని శంకరశాస్త్రి. ఈమని అనన్యసాధ్యమైన తమ బాణీలోగల వైశిష్ట్యాలనీ వివరాలనీ, మర్మాలనీ క్రమంగా బోధించి, చిట్టిబాబు కట్టుకోగలిగిన భవిష్యద్విశ్వకీర్తిస్వర్ణ సౌధానికి పునాది వేసిన మేస్త్రి అనదగిన మహాశిల్పి ఆయనవద్ద అభ్యసించిన వరవిద్యని వరతరంగా, వరతమంగా, క్రమేణ అభివృద్ధి పరచుకొన్న ఘనత నిత్యస్వర కళారాధకులైన శ్రీ చిట్టిబాబుదే.

తనదైన ఒకబాణిని తనవ్యక్తిత్వంతో మలచుకుని పెంపొందించు కుంటున్న నిరత నిరంతర దివ్యసంగీత క్షేత్ర కృషీవలుడు. చిట్టిబాబు.

పన్నెండేళ్ళ పిన్నవయసులోనే పరిపూర్ణ సంగీత కార్యక్రమాన్ని తమ వీణావాదన కళాకౌశలంతో విజయవంతం కావించుకోగల సామర్థ్యాన్ని సంపాదించిన ధీమంతులూ, అదృష్టవంతులూ, బహుభాగ్య శ్రీమంతులూ నేటి మేటి ఆర్ట్ డాక్టరు చిట్టిబాబు.

"వేలెడంత లేడుగాని, వీణలో ఎంత విద్వత్తు గడించాడీ బుడుతడు" అని ఆడియన్స్ విస్తుపోయిచూస్తూ వినే విధాన ఆకట్టుకున్న విశిష్టప్రజ్ఞామూర్తి. నాటినుండీ నేటికి, ఏ నాటికీ, వీరి జీవితం సర్వవిధసాధనా విజయ సంపన్నం. ఈ ధీమంత

శ్రీమంతుడి జీవితంలో శుభ పదార్పణ కావించిన ఏరిశ్రీమతి, శ్రీమతి సౌభాగ్యవతి సుదక్షిణాదేవి. చరిత్రప్రసిద్ధిగన్న శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి అనుగ మనుమరాలు. ఈ శ్రీమతి తన పతి కన్నివిధాలా సహకరించే సహధర్మచారిణియై, చిట్టిబాబు సాధించి, సాధిస్తున్న అతోధిక తదనంతర బహుముఖ కళావిజయ పరంపరలకి ముఖ్యకారణ మైనారు. వీరిద్దరికీ కలిగిన పిల్లలు రత్నమౌక్తిక మాణిక్యాలలాగా ముగ్గురు. వారి నామధేయాలు వరుసగా రంగశాయి, రాధాకృష్ణ, సుందర్. ముగ్గురూ సంగీత కళాభిమానులైన రసజ్ఞులు. ఈ కుటుంబ సభ్యులందరూ నాకు సన్నిహితులైన ఆప్తులు. చిన్నతనంనుండీ, నాకూ చిట్టిబాబుకీగల పరిచయం మైత్రిగా రూపొంది, చిత్రసీమలో మరింత అభివృద్ధి చెందింది.

నేను పాడిన ఎన్నో హిట్టు సాంగ్సుకి చిట్టిబాబు వీణావాదన స్వర్ణసుగంధం ముఖ్యంగా "ఎంత ఘనుడవయ్యా" అని శ్రీ పెండ్యాల సంగీత దర్శకత్వంలో "శ్రీకృష్ణగారడి చిత్రానికై నేనుపాడిన పాటలో చిట్టిబాబు వీణ ప్రత్యేకతతో మోగింది. బంగారు తిమ్మరాజు చిత్రానికై, శ్రీ ఎస్. పి. కోదండపాణి సంగీతంలో నే నాలపించిన వేంకటేశ్వర సుప్రభాతానికి ఏకైక ప్రత్యేక వీణావాద్య వాదకులు, చిట్టిబాబే. శ్రీ అశ్వత్థామ, శ్రీ టి. చలపతిరావు శ్రీ ఎస్. రాజేశ్వరావుగారు మున్నగు పలువురు మహాసంగీతజ్ఞుల జనప్రియ గీతాలలో చిట్టిబాబు మధురవీణా స్వరాలు మనోహరంగా ప్రమోగాయి.

ఇటీవల ప్రసంగవశాన పైన పేర్కొన్న నా రెండుపాటలనీ జ్ఞప్తికి తెచ్చిన చిట్టిబాబు అసాధారణ జ్ఞాపకశక్తి మేధావుల సాధారణజ్ఞప్తిరాహిత్యానికి అసాధారణమైన అపవాదం (ఎక్సెప్షన్) ఆరోజున ఇద్దరం కొంతసేపు పురాతన సంభవాల మధురస్మృతి పథంలో భావరథంపైన విహరించాం. మాటలమధ్య మా సంభాషణ ఇలా సాగింది.

నేను : చెన్నపురి మీరు ఎప్పుడుచేరు కున్నారు?

బాబు: 1948లో. అలిండియా రేడియో ప్రోగ్రాములో పాల్గొనేందుకు వచ్చాను డాక్టరు బి. రజనీకాంతరావు నాకు మంచిప్రోత్సాహం ఇచ్చారు. తదుపరి నేను చిత్రసీమకి చేయగలిగిన సేవకి కారకులైనవారు శ్రీ రజని. బహుముఖ ప్రజ్ఞావతి శ్రీమతి పి. భానుమతి తాము అప్పట్లో నిర్మిస్తున్న లైలా మజ్నులో చిన్న ఫైస్‌గా నటించేందుకు తగిన అబ్బాయిని మీరు సూచించండి అని రజనిగారిని, అడిగిన సందర్భాన, వెంటనే నా పేరు సూచించారు. ఆ సుసమయ సూచనా ఫలితంగా, నేను ఆ చిత్రంలో నటించగలిగాను. బాల నటుడుగా పేరు గడించగలిగాను. తరవాత, దీక్ష, నాయిల్లు వంటి విజయవంత చిత్రాలలోకూడ మంచి పాత్రలు ధరించాను. కాని నా ముఖ్యధ్యేయం సదా సంగీతమే కావడం వలన అలా నటిస్తూనే, అనేక చిత్రసంగీత దర్శకుల వద్ద ముఖ్య వీణా వాదకుడుగా పనిచేసి అనుభవం సంపాదించాను. అలా పదేళ్ళ పర్యంతం చిత్ర వీణావాదనానంతరం, నా జీవితధ్యేయమైన శాస్త్రీయ సంగీత కార్యక్రమాలపైనే సంపూర్ణ శ్రద్ధవహించడం ప్రారంభించాను.

నేను : అలా వీణ కచేరీలు జయప్రదంగా సాగిస్తూనే మీరు కొన్ని చిత్రాలకి సంగీత దర్శకత్వంకూడా వహించారు కదూ !

బాబు: ఔను గ్రేట్ స్టేట్స్‌మాన్ అయిన శ్రీ సి. రాజగోపాలాచారి వ్రాసిన చిరుకథ (షార్ట్‌స్టోరి) ఆధారంగా 'దిక్కట్రపార్వతి' అనే ఒక తమిళచిత్రం తయారవుతున్న రోజుల్లో ఆ చిత్రానికి సంగీతం అందించేందుకు నన్ను ఎన్నుకున్నారు దర్శక నిర్మాతలు. అది నా అదృష్టం. ఆ చిత్రం పలు అవార్డులు గడించింది. ఆ చిత్రంలో శ్రీ సి. రాజగోపాలాచారిగారే వ్రాసిన గీతం "ఎన్నకుట్రంసెయ్దేనో" దానికి స్వరకల్పన చేసే మహా భాగ్యం నాకే అబ్బడం నాకెంతైనా ముదావహం. పిమ్మట ప్రఖ్యాత రచయిత జయకాంతన్ రాసిన కథ "ఉన్నైప్పోల్ ఒరువన్" అనే తమిళ చిత్రంగా రూపొందే సందర్భాన, ఆ చిత్రానికి నేపథ్య సంగీతం మాత్రమే సమకూర్చాను. పాటలు లేనందువలన "డెస్టినేషన్ మద్రాస్" అనే డాక్యుమెంటరీ ఫిల్ముకి కూడా సంగీతం సమకూర్చాను. ఇటీవల విడుదలైన "శ్రీ రాఘవేంద్ర వైభవం" చిత్రానికి తెలుగు కన్నడ భాషల్లో నేనే, సంగీతం అందించాను.

నేను : ఆ చిత్రంలో మీ సంగీతంలో నేను పాడిన గీతాలు నా కెన్నడూ మరపురానివి మరి చిత్రాలకి, టి. వీ. కి., సంగీతం ఇవ్వడంలోనూ, రేడియో గ్రామోఫోను రికార్డులకై సంగీతం అందించడంలోనూ మీకు అగుపించిన వ్యత్యాసం. ఏమిటో సెలవిస్తారూ ?

బాబు: రేడియో ఆడియోలకి గల వ్యత్యాసమే, చిత్రాలలోనూ, టి. వి. లోనూ మనకి కథాసన్నివేశాలు స్వరకల్పనకి కొంత సహకరిస్తాయి. ఇతరత్రా మనం ఇమేజినేషన్‌పైనే అధికంగా ఆధారపడవలసి వస్తుంది. ఏ సంగీత రచన చేసేటప్పుడైనా, సాహిత్యార్థ భావాలకి అనుగుణంగా వరసలు కూర్చడం మంచి ఫలితాన్ని అందిస్తుందని నా విశ్వాసం.

నేను : గురు శిష్యులైన శ్రీ ఈమని శంకరశాస్త్రి గారికీ, మీకూ ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టరేటు (కళాప్రపూర్ణ) బిరుదిచ్చి గౌరవించడం అపూర్వసన్నివేశం. జీవితకాలంలోనే గురుశిష్యులిద్దరూ గౌరవ డాక్టరేటు పొందడం మీవిషయంలోనే జరిగిందని అభినందిస్తున్నాను.

బాబు : థాంక్స్. నిజంగా ఈ సంభవం నాజననీ జనక గురుదేవాశీర్వాద ఫలమైన అదృష్టం. గురువుకి తగిన శిష్యుడనిపించుకో గలిగినభాగ్యశాలి శ్రీచిట్టిబాబు ఇచ్చిన వీణకచ్చేరీలు అగణితాలు. ఈ నాడూ ఏనాడూ గొప్పదిమాండుని కమాండు చేయగల గ్రేట్ ఆర్టిస్టులలో అగ్రశ్రేణికి చెందినవారు చిట్టిబాబుగా ప్రఖ్యాతిగాంచిన ఈ హార్టిస్టూ, గుడ్ హ్యూమరిస్టూ.

పలుమార్లు విదేశపర్యటనలు కావిస్తూ, అక్కడిరసజ్ఞహృదలయాని రంజింపచేస్తూ భారత దేశపు కళాత్మక కీర్తిని బహుగుణీకృతం చేస్తున్న చిట్టిబాబు బహుమాన్యభారత పౌరులు, బిరుదులూ, రివార్డులూ, అవార్డులూ, సన్మానాలూ, ఎన్నెన్నో వీరిని వరించి వచ్చాయి. అన్నిటినీ పేర్కొనాలంటే బృహద్గ్రంథం అయికూర్చుంటుంది.

"వైణిక సార్వభౌమ", "వీణాగానప్రవీణ", "వైణిక శిఖామణి", "వీణా విరించి" (ఇది నేను సూచించినది), కలైమామణి (తమిళనాడు ప్రభుత్వపుబిరుదు) వైణికసామ్రాట్, సంగీత కళాసాగర, తెలుగు వెలుగు (ఆంధ్రప్రభుత్వపుబిరుదు), మొదలైన ప్రైజ్‌ల్సు ఎన్నిటిలోనో కొన్నిమాత్రమే. ఆంధ్ర విశ్వవిద్యాలయం వీరికి "కళాప్రపూర్ణ" (డాక్టరేటు) ని అందజేసింది వీరి అసమాన సంగీత కళా సేవని ప్రశంసించి.

శ్రీలంక, (సిలోన్), బల్గేరియా, యూగోస్లావియా, హంగేరీ, మలేషియా, సింగపూర్, పశ్చిమ జర్మనీ అమెరికా, కెనడా, హాంగ్‌కాంగ్, లండన్, పారిస్, ఆస్ట్రేలియా మున్నగు విదేశాలలోనూ మహానగరాలలోనూ, పర్యటించి, తమ వీణావాదన ప్రాభవాన్ని నిరూపించి ఎన్నెన్నో మన్ననలుపొందారు.

డౌలాషిన్‌గన్ ప్రపంచ సంగీతోత్సవంలో ఏకైక భారత సంగీత కళా ప్రతినిధిగా పాల్గొని వన్నెకెక్కారు.

మలేషియా కౌలాలంపూర్‌లలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకి ప్రత్యేకాహ్వానితులై పాల్గొని తమకీర్తికిరీటంలో మరో సముజ్జ్వల మణిని పొదిగారు

అనేక సంగీత సంస్థలలో చిట్టిబాబు ముఖ్యసభ్యులు, సలహాదారులు. తిరుమల తిరుపతి దేవస్థానా స్థానవిద్వాంసులుగా విలసిల్లుతున్న సుయోగ సంయుతులు

తమిళనాడుకి రాష్ట్రకళాకారులు (స్టేట్ విద్వాన్ 1981-84 - 1984-87)

అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లోగల శ్రీ వేంకటేశ్వరాలయంలోనూ, వాల్‌డోర్ఫ్ ఆస్టోరియాల్లోనూ వీణకచ్చేరీ యిచ్చిన ప్రప్రథమ భారతీయ కళాకారులు శ్రీ చిట్టిబాబు. అన్నిటికన్నా ముఖ్యంగా ఎన్నిసాధనలూ, ఘనవిజయాలూ, సాధిస్తున్నా వినయధనాన్ని ఎన్నడూ పోగొట్టుకోని నిరాడంబరుడు చిట్టిబాబు. సరస సంభాషణ చతురులు హాస్యరసప్రియులు. ఆంగ్లనవలాధ్యయనవిరతులు, చదరంగం ఆటలో నిష్ణాతులు, స్పురద్రూపులు, బహు సుగుణ సంపన్నులు. నూతన ప్రక్రియాన్వేషణ సదాసాగించే కళా పరిశోధకులు.

చిట్టిబాబు అభిమానించే రాగాలలో "సముద్రప్రియ" ప్రముఖ స్థానం వహించింది. "ఉదయ రవిచంద్రిక"లోని స్వరాలతో శుద్ధమధ్యమానికి బదులుగా ప్రతిమధ్యమ ప్రయోగం వలన సిద్ధించే విశిష్టరాగం ఈ సముద్రప్రియ. అందుకే కాగలిగింది సంగీత కళా సముద్ర (చిట్టిబాబు) ప్రియ. దీనిని "హనుమంతప్రియ" అనడంగూడా సమంజసమే. అవలీలగా సముద్రాన్ని లంఘించిన హనుమంతుని నామధేయమే చిట్టిబాబుకి పుట్టినప్పుడు పెట్టబడిన పేరు, "చల్లపల్లి హనుమాన్లు". హనుమంతుడు శ్రీ రామసేవాభావానికి పెట్టినపేరు. అదే విధాన హనుమాన్లుగా పుట్టిన మన చిట్టిబాబు సంగీత కళాసేవకి పెట్టినపేరుగా విరాజిల్లుతున్న గాంధర్వ విద్యా నిపుణుడు. హనుమంతుడు రాళ్ళనిసైతం కరిగించిన శ్రుతిమయ శాస్త్రీయ సంగీతజ్ఞుడు. దివ్య మహాగాయకుడు, అట్టివారి పేరుగొన్న చిట్టిబాబుకూడా మంచిగాయకుడు. రసజ్ఞహృదయ సామ్రాజ్య సింహాసనాధిష్ఠిత సార్వభౌముడవదగినసంగీతకళాభిజ్ఞ మహానాయకుడు. ఉత్తమాభిరుచిగల వీణావిరించి. ఈయన వీణపైపలికించే ప్రతిసుమధురస్వరమూ, వైయక్తిక విపంచి.

ప్రేక్షక శ్రోతృగణాల అభిరుచులని అనుసరించి, ఎట్టిసంగీతాన్నైనా ఇట్టే వీణపై మనోజ్ఞంగా పలికించి వినిపించగల దిట్ట అయిన "చిట్టిబాబు" సినానికి, కథ దొడ్డబాబు. వాదనంలోనూ చర్చలలోనూ తమదృక్పథాన్ని విశదంగా వివరించి నిరూపించి, గెలుపొందగల గట్టిబాబు, లాంగ్ ప్లే రికార్డులద్వారానూ, కేసెట్లద్వారానూ ఇటీవల వీరు అందిస్తున్న సంగీతం వీరి నిత్యనూతన ప్రియత్వానికి సంకేతం.

తమ సంగీత రచనలకి వీరుపెట్టే టైటిల్సు కూడా వీరి ఇండివిడ్యువాలిటీ ప్రత్యేక నిదర్శనలు. వీరి సంగీత రచనలన్నిటికీ మకుటాయమానంగా ఖండ ఖండాంతర ఖ్యాతి నార్జించే పద్ధతిలో రూపొందిన నేటి అర్థశత వైణిక వీణావాదన నూతన ప్రయోగం, "టెంపుల్ బెల్స్" ఈ ప్రయోగం వలన ఇతోధికంగా అనుభవించగలదు వీరి సుయోగం. నిరంతరాయంగా, సర్వదిశావ్యాప్తమై మాధుర్యాన్ని వర్షించగలది వీరి బహుముఖ ప్రతిభా ప్రజ్వలిత యశోరాగ మేఘం. వీరిభవిష్యత్తు మరింత మహోజ్జ్వలం కాగలదనే హితైషుల శుభవచనం అమోఘం.

శ్రీమంతుడై మహా ధీమంతుడౌ యశశ్శ్రీ ప్రభాదీప్తుండు చిట్టిబాబు!
నిరుపమ సాధనానిరతుండు స్వరకళాశ్రేయోభిలాషియౌ చిట్టిబాబు!
వాసికెక్కిన "కళావారిధి"యనదగు సిద్ధసంకల్పుండు చిట్టిబాబు!
సన్మిత్రులకు, సదా సన్మిత్రుడై మనుస్థిరచిత్తుడనమన చిట్టిబాబు!
ప్రముఖవైణిక వరకళా రాజితుండు!
భోగభాగ్యయుతుండు జ్ఞాన భూషితుండు!
పాడగల వాద్యనైపుణ్య భాసితుండు!!!
హితకర సుకార్యనిరత సుహృద్వరుండు!!!!



కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారి సంస్మరణ సంచిక

సుప్రసిద్ధ పండితులూ, చారిత్రిక పరిశోధకులూ అయిన కీ. శే నిడుదవోలు వేంకటరావు గారి స్మృత్యర్థం భారతి ప్రత్యేక సంచికని ఒకదానిని వెలువరించటానికి నిశ్చయించుకున్నాము

ఈ ప్రత్యేక సంచికలో శ్రీయుతులు పి. పరబ్రహ్మశాస్త్రి, ఇరగుపు కార్తికేయశర్మ, వంతరాం రామకృష్ణరావు, ముదిగొండ ఈశ్వరచరణ్, చీమకుర్తి శేషగిరిరావు, తిరుమల రామచంద్ర తిరుమల శ్రీధరమూర్తి, వక్కలంక లక్ష్మీపతి సూర్యదేవర రవికుమార్ ముదిగొండ వీరేశలింగం, కీ. శే. రేకళిగ మఠంవీరయ్యగారల రచనలు పడగలవని తెలుపటానికి సంతోషిస్తున్నాము.

1985 డిసెంబరు భారతి, కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారి సంస్మరణ సంచికగా వెలువడటానికి ఏర్పాట్లు చేస్తున్నాము.

సంపాదకుడు







పల్లెటూళ్లో రోడ్డు
పట్టణంలో రోడ్డు
నగరంలో రోడ్డు
మంత్రిగారింటికెళ్లే రోడ్డు

దయచేసి చంపెయ్యండి!

ఇచ్ఛాపురపు రామచంద్రం

తలుపులు వేసేసి వెళ్ళిపోదామనుకుంటున్నాను. సరిగ్గా నేను లేవబోతూండే వొచ్చాడతను.

"డాక్టర్ !"

"యస్...." చెప్పమన్నట్టు చూశాను.

"నాకు కొంచెం పొటాషియం సయనైడ్ యివ్వగలరా ?"

"సా...రీ..." చెబుతూ చూశాను. "ఎవరినేనా హత్య చేద్దామనుకుంటున్నారా ?" కటువుగా అడిగాను.

"మీరెలా గ్రహించారు ?" తెల్లబోతూ అడిగాడు. నేను నవ్వేశాను.

అతనొకనిముషం మౌనంగా ఉండి.... "నిజంగా వాడొట్టి పూర్ ఫెలో అతను ఇథనేషియా కన్నివిధాలా అర్హుడే. వాడు చచ్చిపోవాలి. కాని ఉత్త పిరికివాడు. నూతిలోదూకితే కప్పలు కరుస్తాయేమో అని భయం కరంటయితే వొళ్ళు కాలుతుందనీ.... రైలుకింద తలపెడితే రక్తం వొస్తుందని,. ఉరిపోసుకుంటే మెడ నొప్పెడుతుందని.. భయపడుతున్నాడు. అటువంటి వాడికి ఇథనేషియాకంటే మంచి దేముంటుంది?"

"అతనిమీద మీ దయకు చాలాసంతోషం. కాని.. మీరనుకున్నట్లు ఇథనేషియాకి సరయిన అర్థం మెర్సీకిల్లింగ్ కాదు. బాధలేని చావు"

"అదే...." సర్దుకున్నాడతను. "ప్లీజ్....డాక్టర్ !... ఎలాగయినా అతన్ని కొంచెం మెత్తగా - బాధలేకుండా చంపేద్దురూ...మీకు చాలా పుణ్యముంటుంది." బ్రతిమాలాడు.

"ఎవరతను ?"

"దగాపడిన తమ్ముడు."

"ఎవరు దగా చేశారు ?"

"ఒకరేమిటి అందరూను. మొట్టమొదట విద్య."

విద్య !.... నేను కాలేజీలో చదువుతున్నప్పుడా పేరుతో ఓ అందమయిన అమ్మాయుండేది. నేను ఆమెకు ప్రేమలేఖ వ్రాశాను కూడా. కాని - అదృష్టవంతుణ్ని. దెబ్బలు తినలేదు. వాళ్ల తండ్రి పోలీసాఫీసరుట.

"బళ్లో వేసింది మొదలు - విశ్వవిద్యాలయం యింకబయటకు పో" అని ప్రపంచంలోకి తరిమేసే వరకూ అమ్మా నాన్నా బంధువులూ...మాస్టర్లూ — అందరూ ఒకటే మాట -

"బాగా చదువుకో, వృద్ధిలోకి వస్తావు. మంచి మార్కులు తెచ్చుకో, గొప్పవాడివౌతావు. చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకుని సుఖపడు' ప్రేరిపేరు. నిజమే అనుకుని....గుడ్డెద్దుచేలో పడ్డట్టు ఒకటే చదువు. పగలూ రాత్రీ చదువే. ఒక్క నిముషం పుస్తకం వొదిలి ప్రపంచమేమిటో చూసేవాడు కాదు. క్లాసులో ఫస్టు మార్కులు. యూనివర్సిటీలో గోల్డ్ మెడల్....వాడివే...."

"ఇకనేం ?"

"చదువు పరుగులో ఏం కోల్పోయాడో - చదువయ్యాక తప్ప తెలియలేదా యిడియట్‌కి"

"ఏం తెలిసిందప్పుడు ?" మామూలుగా అడిగాను.

"చదువు - ఉద్యోగమివ్వదు. ఉద్ధరించదు. బ్రతకడం నేర్పదు...."

ఐతే - చదువెందుకు ?" ఆశ్చర్యంగా అడిగాను.

"చదువు - చదువెందుకు కొరగాదో తెలుసుకుందుకే." - ఓసారాగి - "చదువు కున్న వాడి కంటె చాకలి మేలు. డామ్‌కరక్ట్. అతగాడి కంటె చాలా చిన్నవాడు వాళ్లచాకలి. వాడేమీ చదువు కోలేదు. అందుకనే అమ్మా నాన్నలనీ ఓ పెళ్లాన్నీ పోషించగలుగుతున్నాడు. వాణ్ని చూస్తే - మావాడికి తను చదువుకోసం తగలేసినడబ్బు....కాలం త్యాగంచేసిన సరదాలు - అన్నీ గుర్తుకొచ్చి - అసూయ వేస్తుంది. తనెంత వెర్రివెధవ పనిచేశాడా అని ఏడుపొస్తుంది."

"అందుకేనా....పోస్టుగ్రాడ్యుయేట్ విత్ గోల్డ్ మెడల్ అయినా ఉద్యోగం రాలేదనేనా మీవాడు చచ్చిపోవాలనుకుంటున్నది ?"

"ప్రాక్సిమేట్ (అసలు) కాజ్ అదే అనుకోండి. కాని....నిజానికి - దొంగబాధ కంటె లింగబాధ అధికం అన్నట్లు-నిరుద్యోగం తాలూకు బైప్రొడక్ట్స్ ఉన్నాయి చూశారూ....అవే ఎక్కువ"

"ఏమిటవి?"

"తల్లిదండ్రులమీద ఆధారపడటం....నాన్నని డబ్బులడగడానికభిమానపడి-కొన్నిటికి దరఖాస్తులు కూడా పంపడం మానేశాడు. ఇంటర్వ్యూనుంచి రాగానే-'ఈసారయినా నీమీదపెట్టిన పెట్టుబడికి ఫలితముంటుందా?' అన్నట్లుంటాయిట వాళ్ళ నాన్నచూపులు. ఇంకా ఎన్నాళ్ళు మామీదపడి తింటావు, మమ్మల్ని పోషించాల్సిందిపోయి-అన్నట్లు చూస్తుంది అమ్మ."

"ఛ ఛ....అమ్మా... నాన్నా అలా చూస్తారంటే నేన్నమ్మను."

"చూడండి .... నిరుద్యోగులపట్ల సెంటిమెంట్లుండవెవరికీ. అన్నట్లు యిదంతా దేనికి చెబుతున్నానో తెలుసా?"

"తెలుసు. మీ ఫ్రెండ్‌కి ఇథనేషియా రికమెండ్ చేస్తూను."

అతనికి ఉత్సాహం వొచ్చినట్లుంది నా చిరునవ్వుతో. కొంచెం-కుర్చీలోంచి నా ముందుకువొంగి-"మీకు దారుణమయిన రహస్యమొకటి చెప్పనా?" అన్నాడు. చెప్పమన్నాను.

"వాడి మనసు కుళ్ళిపోయింది. రోడ్డుమీదో మరెక్కడో వయసులో ఉన్న దంపతులు కంటపడితే-వాడు దెయ్యంలా ఐపోతాడు. తన యీడువాడే అయిన ఆ యువకుణ్ని వతలకు లాగేసి తను ఆమెచుట్టూ చెయ్యివేసి....అలాగ..."

జాలివేసింది. నిరుద్యోగి ఐనంతమాత్రాన వయస్సాగదుగా? తీరని కోరికలిలాటి వెర్రితలలేసావేస్తాయి. మెల్లగా అన్నాను-

"అలా కోరికలణచుకు ని శాడిజమ్ పెంచుకోడంకంటే..."

వాడికిమాత్రం బ్రహ్మచారిగా మిగిలిపోడం సరదానా? ఎంతటెంతట పెళ్ళి చేసుకుందామా అనే తహతహ లాడతాడు. కాని-పైసాకి టికానాలేని వాడికి పిల్ల నిచ్చేదెవడు? ఏతల మాసిన తండ్రయినా యిచ్చినా - పెళ్ళంటే సిల్కు గుడ్డలు కట్టుకుని పల్లకిలో ఊరేగడమేకాదుగా? రేపు ఆ పెళ్లానికి పూలు కొనాలన్నా తండ్రినడగాలంటే అతని కెలా ఉంటుంది? పోనీ-ఏకొంపకేనాపోయి వేడి చల్లార్చు కొందామంటే....ప్రపంచంలో మంచిపనికి చెడ్డపనికి కూడా కావలసింది ముందు డబ్బేకద?

"నిజమే." నిట్టూర్చాను జాలిపడుతున్నట్లు.

"మావాడనుభవించిన....అదే...ఎదుర్కొన్న అవమానాలుకూడా అన్నీ యిన్నీకావు." జాలి పడుతున్నట్లే ఉందతనికంఠం.

"అవమానాలా!" నమ్మలేకపోయాను.

"ఔను.ఎమ్. కామ్.... గోల్డు మెడలిస్ట్‌ని పట్టుకుని - పిగ్ అన్న దెవరో తెలుసా?"

"తెలియదు." అన్నాను బుద్ధిగా.

మెట్రిక్యులేట్ మాత్రమే...అదీ మూడో ఛాన్సులోనో నాలుగో ఛాన్సు లోనో పాసయి ఉంటాడు. కాకపోతే అతను గుమాస్తాపదవిలో ఉన్నాడు. అదీ తేడా. అదీ అతని అహం,"

"మీరలా పొడిగా చెబితే నాకెలా అర్థమౌతుంది? - మీరు - సిగరెట్ కాలుస్తారా?" నేనందించి - ప్యాకట్ ముందుకు తోశాను.

"నో, థాంక్స్. ఒకప్పుడు....స్వర్ణయుగంలో సిగరెట్లు కాల్చేవాడిని. టీ, కాఫీలు తాగేవాడిని, ఇప్పుడన్నీ మానేశాను..."

"ఏం?"

నిరుద్యోగికవి లగ్జరీలు కనుక " నవ్వారు.

"మీరూ నిరుద్యోగులేనా?"

"అఫ్‌కోర్స్.... నేను మావాడి తరపున మాట్లాడుతున్నాను. ఎందుకు ఎలా మానేశాడో తెలుసా! నెససిటీ యీజ్ ద మదరాఫ్ ఇన్‌వెన్షన్ అన్నట్లే- వేకింగ్ ఇన్ యీజ్ ద ఎండాఫ్ హాబిట్. నపుంసకుడు పరమ పవిత్రుడు. ఓహ్! మనం జపం విడిచి లొట్టల్లో పడినట్లున్నామే.... ఆవేళ.... మహోత్సాహంతో ఎంప్లాయి మెంట్ ఎక్స్ఛేంజికి బయలుదేరాడు మావాడు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అర్హతతో గోల్డ్ మెడలిస్టేమో - గోల్డులా వెలిగిపోతోంది ముఖం. మొదటి సారిగా ఆ కార్యా లయాన్ని దర్శించడం కదా.... అమాయకపుదశలో, అజ్ఞానపు కలలూ, ఎనిమిది న్నరకు క్యూకట్టాడు, ఎండ మండిపోతోంది అప్పటికే - క్యూ పెరుగుతోంది. అతను చాలా వెనుకగానే ఉన్నాడంతముందుగా వొచ్చినా, తొమ్మిదిన్నర ....పది- పదిన్నర.... పదకొండు.... గుమాస్తాగారు కరుణించివేంచేశారు. వారు కుర్చీలో కూర్చోడమేమిటి.... అంతవరకూ నిరీక్షించి నిరీక్షించి అలసిపోయిన అభ్యర్థు లొక్కసారి ఆతృతగా ఎగబడ్డారు. అంతే.... సదరు గుమాస్తాగారికి కోపం వొచ్చేస్తుంది...." చదువుకున్నారన్న మాటే కాని డిసిప్లిన్ లేదు. ప్రవర్తన తెలి యదు. బ్రూట్స్....పిగ్స్" అంటూ అరిచాడు. మావాడూ ఆ తిట్లు తిన్న వాళ్ళలో ఒకడే. బ్రూట్.... పిగ్ మావాడు అతని మీదుకు దెబ్బలాటకు వెళ్ళే వాడే.... కాని.... మిగిలిన వాళ్ళు ఆపి- "మీకింకా కొత్త. అందుకే ఫీలౌ తున్నారు. రెన్యూవల్ కొచ్చినప్పుడల్లా మాకిలాటివి పరిపాటే, ఉద్యోగం దొరికే వరకూ యిటువంటి దూషణ భూషణ తిరస్కారాల కతీతంగా ఉండాలి." అని సర్దేశారు...."

"అన్యాయమే. అతనుద్యోగి కావచ్చు. వీళ్ళు నిరుద్యోగులూ తనతో అవ సరం పడి వచ్చిన వారూ కావొచ్చు. అంతమాత్రాన _ వీళ్ళకి.... నిరుద్యోగుల కాత్మాభిమానం ఉండ కూడదన్నట్లు నీచంగా తిట్టడమేమిటి ?



"సర్లెండి. ఇవి అలవాటయిపోయాయి. నిజంగా - నేనెందుకు చెబుతున్నానంటే.... మావాడి కింతకంటే చేదు అనుభవాలే ఎదురయ్యాయి. ఉద్యోగమూ సద్యోగమూ లేదుగా.... కరంటు బిల్లు కట్టిపెట్టిరా నాయనా అని పక్కవాటా బామ్మగారు గ్రాస్ యిన్‌సల్ట్ చేసినా దులిపేసుకోగలిగిన మావాడు -

వాళ్ళమ్మ మాటల కేడిచాడు తెలుసా?"

"ఏమన్నారావిడ ?" కుతూహలంగా అడిగాను.

"ఉద్యోగం వొచ్చాక కాఫీతాగొచ్చు. అంతవరకూ చద్దెన్నంతినరాదూ కాఫీపొడి ధర పెరిగిపోయింది. పంచదార దొరకడం లేదు."....

నిర్ఘాంతపోయాను. ఏ అమ్మయినా అలా అనగలదా ? నిజంగా !

"సినిమాకి డబ్బులా?....అవి చూడకపోతే కొంపమునగదు కానీ ఉద్యోగం రానీ ... చూడొచ్చు...." అన్నారు నాన్న. విద్యోగమే తప్ప వుద్యోగం లేని నేను అడిగిన డబ్బులు - సినిమాకి కావు నిజంగా. సిగరెట్లంటే బీడీలు.... అవీ మానెయ్యాల్సొచ్చింది బలవంతంగా....అంటే - డబ్బుల్లేక...." నవ్వాడు విషాదంగా.

"విద్యోగం ఎంత కరుణించిందో వుద్యోగం అంత కఠినత్వం చూపింది మా వాడిమీద. డాక్టర్! ప్రేమంటే ఏమిటి?" తెల్లబోయాను - అతనలా హటాత్తుగా ఆ ప్రశ్న వేసినందుకు.

"తెలీదు-" అనేశాను కన్వీనియంట్‌గా.

"నిజంగా తెలుసు మీకు.... సర్లెండి.... నేనేచెబుతాను.... మావాడి మాటలలో వయసుతోపాటు కోరిక పెరుగుతుంది. ఒకదశ వరకూ. యౌవనంలో చాలా ఉధృతంగా మనిషిని కాల్చేసేటంత తీవ్రంగా ఉంటుంది బియోలాజీకల్ అర్జ్. ఔనా?"

"ఊఁ. ఇది కూడా మనిషికి. ప్రాణికి....ప్రాథమికావసరమే.

"నాగరికత పెరిగి....ప్రతిదానికీ సభ్యతనేది అడ్డుపడుతూంటుంది. కనుక బయొలాజికల్ అర్జ్....కామాన్ని తెలపడానికుపయోగించే సభ్యతా ప్రయోగమే ప్రేమ అని నేనంటే....అదే....మావాడంటే...."

"నేనుకాదనను-" జాగ్రత్తగా అన్నాను.

"మావాడొక అమ్మాయిని ప్రేమించాడు. తలలు బోడులయిన తలపులు బోడు లెలాకావో. సంపాదన లేదని శృంగార వాంఛా అలాగే ఆగదుకద ?"

"ఔను."

"ముందా అమ్మాయికి తెలీదుకాబోలు....మనిషి బాగానే ఉన్నాడని ప్రేమించేసింది. నన్నడిగితే - యీ ప్రేమనేది పెద్ద హిపోక్రసీ అంటాను."

"ఎలా ?"

"అమ్మాయి ప్రేమ వెనుక పెళ్లి ఉంటుంది. అబ్బాయి ప్రేమ వెనుక కామం ఉంటుంది. ప్రేమనేది అందమైన ప్యాకింగ్ పేపరు మాత్రమే. లోపలి సరుకుని అందమైన బాహ్యరూపాన్నివ్వడమే యీ ప్యాకింగ్ పేపరు ప్రేమపని. అందుకే - పెళ్లయ్యేసరికి....మిఠాయినిచుట్టిన కాగితంలా ప్రేమ మూలపడడం.... చీపురుతో తుడిపించుకోడం....

'భార్యా భర్తల మధ్య కూడా ప్రేమ ఉంటుందికదా ?" సందేహం వ్యక్తపరిచాను.

"పోషిస్తాడు కదా అని భార్య భర్తనీ....యింటిపనీ వంటపనీ చేస్తూ సుఖపెడుతుంది కదా అని భర్తభార్యనీ భరిస్తారు. దానికి అనురాగమనీ, ప్రేమనీ ఏవేవో పేర్లు పెడతారు. మన బ్రతుకులనిండా హిపోక్రసీ యేగా..." అని అంతలోనే మళ్లీ గుర్తుకివొచ్చినట్లు.... "మావాడి ప్రేమకథకదూ చెబుతున్నాను ?" అడిగాడు.

"ఊఁ."

"రెండు నెలల ప్రేమ అనంతరం - ఆ అమ్మాయికి అసలు విషయం తెలిసింది కాబోలు-

"ఏ మొహానికి నిరుద్యోగిమొహానికి ప్రేమేమిటి...." అని ముఖం మీదే అనేసింది.

"రాధా !" ఏడుపుమొహంపెట్టేశాడు. "కూలినగోడలు కూలినట్లుందవు. మనం చేసుకున్న బాసలు...." జ్ఞాపకం చేయబోయాడు.

"ఆ పీడకలలు జ్ఞాపకం చెయ్యకు. నీకుద్యోగమూ సద్యోగమూ లేదని తెలిసినప్పుడు చేసిన పొరపాట్లవి. నువ్వేదో నన్ను పెళ్లిచేసుకుని ఉద్ధరిస్తావనుకున్నాను."

"ఉద్యోగం రాగానే పెళ్లి చేసుకుంటాను. మనని భగవంతుడు కూడా విడదీయలేడు. నామాటనమ్ము రాధా..."

"నీకుద్యోగమొచ్చి నన్ను పెళ్లి చేసుకుంటావా !" విరగబడి నవ్వి.... "అప్పటికి నాకు పెళ్లే అక్కర్లేనంత ముసలి దాన్నయిపోతాను. చూడు మోహన్.... నువ్వు నన్నిక వేధించకు. నీముఖం చూపకు. అదే పది పెళ్లిళ్లనాకు. ఈ వొక్క ఉపకారమూ చెయ్యి చాలు. పొరపాట్లు ఎవరికేనా వస్తాయి -" అని వెళ్లిపోయిందామె.

మగాడి కింత కంటె అవమానం ఏంకావాలి ? నిరుద్యోగి మాత్రం మగవాడు కాడా !"

"ఎందుకాడు ?"

అతను తృప్తిచెందినట్లున్నాడు. ఒక్కసారి ఊపిరిపీల్చుకుని - స్థిమితపడి- "మావాడికి జన్మలో ఉద్యోగంరాదు." అని తీర్మానించేస్తున్నట్లున్నాడు.

"ఆశ - మనిషికాధారం మనిషి ఆశను వదలకూడదు.

"ఏం ఆశ ? ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజిలో కాల్ లెటరు ఖరీదు వెయ్యి రూపాయలు. ద్రవ్యోల్బణం వల్ల యీ మధ్య యింకా పెరిగిందేమో తెలీదు. కాల్ లెటర్ ఖరీదే వెయ్యిరూపాయలయితే - అపాయింట్‌మెంట్ ఆర్డరు ఖరీదు పదివేలు పైనేఐతే ఆశ్చర్యమేముంది ?"

"లేదు -" అనవలసి వొచ్చింది.

"మానాన్నగారు.... అదే....మావాడి తండ్రి... వెయ్యిరూపాయలు కాదు కదా వెయ్యి పదిపైసలయినా వీడి మీద పెట్టడం దండుగే అని నిశ్చయానికి వొచ్చేసాడు...."

"ప్చ్...పాపం. ఆయనకి ప్రాణం విసుగెత్తినట్లుంది."

"ఒకవేళ ఆయన ఒకటి ప్లస్ పది, వేలు ఏతంటాలు పడో తెచ్చినా మావాడి కుద్యోగంరాదు."

"అదేం ?"

"క్రిందటి వారంతోనే మావాడికి ఏజ్ బారయిపోయింది... వాళ్ల పొదరేమన్నాడో తెలుసా ?"

"ఊహుఁ."

"ఇక నీకుద్యోగం వచ్చేది కల్ల కానీ - హాయిగా రాగిచెంబుతోముకో- అనేశాడు. మేము ఫార్వర్డ్ క్యాస్టు వాళ్లంలెండి."

"కులవృత్తి..."

"అవెక్కడ మిగిలాయి ? కులాలని నిర్మూలించేస్తాననే ప్రభుత్వం - ఓట్లకోసం కులాలని కాపాడుతూ - కులవృత్తులని మాత్రం ధ్వంసంచేసింది కదుటండీ. దానితో....చదువుతున్న వాళ్లు రెండిటికీ చెడ్డ రేవడులయ్యారుగా !"

"ఔను." అన్నాను.

"అందుకే నేను...మావాడు....ఇరవై తొమ్మిదవ జన్మదినోత్సవంనాడు ఒక స్లోగన్ ప్రారంభించాడు."

మొహంజోదారో

శ్రీ గజానన్ తామన్

ఉన్నపాళంగా ఓ సాయంత్రం
నీ ఇంటికి వద్దామని అనుకొని,

ఇన్నాళ్ళుగా అనుకుంటూ వున్నది
విడమరచి నీకు చెప్పాలని అనుకొని,
భయాలను సందేహాలను ప్రక్కకునెట్టి
ప్రయాస కోర్చి చేరుకొన్నాను నీ ఊరును.

నీ ఊళ్ళో ఉన్నవాళ్ళు కాస్త కూస్త
ఉన్నవాళ్ళలా కనిపించారు.
మననే బలహీనత కలవాళ్ళు మాత్రం
మరీ అరుదనే అనిపించారు.
ఒళ్ళంతా కళ్ళు చేసుకుని,
నీ ఆచూకీని గురించి ప్రశ్నించినప్పుడు
తెలుసు — తెలీదులకు మధ్య స్థితిని
తెలివిగా ఆశ్రయించారు.
వారు సూచించిన దిశలు, త్రోవలు, సంకేతాలు
పథికుణ్ణి గమ్యానికి చేర్చనివే అయినా,
పొగమంచు దట్టంగా వ్యాపించిన వేళలో
పోల్చుకోలేని ఆకృతుల వంటివే అయినా,
నీవు వుంటూవున్న, అపరిచితమైన నీ ఊరును
విడకు హత్తుకుని నీ ఇంటికోసం
నలుమూలలూ గాలించాను.
నడచిన త్రోవనే తిరిగి నడుస్తూ,
పలకరించిన వాళ్ళనే మళ్ళీ మళ్ళీ పలకరిస్తూ,
యతనం నీరుగారాక, నియతి చల్లని చూపు మూలంగా
ఏట్టకేలకు నీ ఇంటిని చేరుకొన్నాను

"ద్వారానికో ప్రక్క అమర్చబడిన మీట
తన అస్తిత్వం ఇక ప్రకటించుకుంటుంది;
లేస్తుంది చేయి; కదులుతుంది అనామిక
మెల్లగా చిరుమీటను నొక్కేందుకు;
మ్రోగుతుంది ఘంటిక కింకిణుల అనుకరణంలో!
ప్రతిస్పందిస్తుంది లోనుండి
వేయి జన్మాలుగా విన్న ఓ కంఠం;
'నేను' అని బదులు చెప్పడమే తరువాయి,
తెరుచుకుంటాయి భళ్ళున గేహద్వారాలు;
నిలుస్తావు నీవు నా మ్రోల ఉషస్సులా
నీ రూపం సజీవ శిల్పమై
పలుకరిస్తుంది నాలోని అణువణువును
శబ్దవైభవం నోచని అకించనుణ్ణి
నేనలా శిలలా నిలబడిపోతాను."

మ్రోగింది పదే పదే ద్వారఘంటిక
జీరవోయింది తుదకు మూగవోయింది.
ఊహించిన దేదీ నిజంకాని కారణంగా
ఊహలు తేలాయి గాలిలో దూది పింజల్లా.
ఉస్సురంది మనస్సు;
ఓకాస్త తేరుకుని
అటూ ఇటూ కలయచూశాను.
ప్రాంగణంలో నీవు నాటి పెంచిన తులసి
వసివాడినదిగా అగుపించింది,
హృదయానికి క్రమంగా దూరమై నీ గ్రామం
మొహంజోదారోను తలపించింది.

-**********

"ఏమిటో అది"

"ఐవాంటుడై...."

"అది–మరీ–టూమచ్ కాదూ ?"

"కాదండీ...వన్ మచ్ కూడా కాదు. కనీసం హాఫ్‌మచ్, క్వార్టర్ మచ్ కూడా కాదు. ఎద్దుపుండు కాకికినొప్పా ? నిరుద్యోగి బాధలు – మిగిలినవాళ్ళకి తెలీవు. అవి అనుభవైక వేద్యాలే....అందుకే నేనెంత చెప్పినా మీరు కరుగు తున్నట్టులేదు...."

"ఎందుకు కరగడం లేదు?" అన్నాను ఆశగొల్పుతూ. "కరుగుతున్నారా? థాంక్యూ. సర్ మావాడి నిరుద్యోగ బాధలగీతానికితొందరగానేము క్తాయింపుకి వొచ్చేస్తాను. మీకు యింటికి వెళ్ళే టైమూ.... నాకు.... అతనికి పైకి వెళ్ళిపోయే టైమూ దగ్గర పడుతున్నట్టుంది. చూడండి. నిరుద్యోగి జీవితంలో ఎక్కువ ఎదురు చూసేది పోస్టుమన్ కోసం. పొద్దుటి బీటు.... సాయంత్రపు బీటూ అతనేదో తెచ్చిస్తాడని కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తే – తీరా అతనో రిగ్రెట్ కార్డ్ ముఖాన పడేసిపోతే ఎలా ఉంటుంది? జీవితమంతా రిగ్రెట్ కార్డులే అంటే బతకడందేనికి ? డాక్టర్ ! నిరుద్యోగవైతరణిని ఎవరూ జీవితాంతమూ యీదలేరు. రోజురోజుకి కాల్ లెటర్ ధరా, ఉద్యోగం ధరా పెరిగిపోతూంటే; ఉద్యోగం దొరకదని క్షణ క్షణమూ స్పష్టమైపోతూంటే ... తానందరికీ లోకువై పోతూ.... అమ్మ వేసే దయాధర్మ మెతుకులు తినలేక తింటూ.... నాన్న వేసే ముష్టితో ఎక్కువ ఉద్యోగాలకు ప్రయత్నించలేకపోతూ.... వాళ్ళకి గుదిబండలా.... సమాజానికి బరువుగా.... చిరునవ్వుకి కూడా నోచుకోకుండా.... కనీసపు సుఖాలను కూడా అనుభవించ లేకుండా.... ఏ మనిషయినా ఎన్నాళ్ళు సహనంతో నిరీక్షించగలడు? బ్రతుకంతా ఎదురు చూపేనా? ఎడారేనా? అందుకే.... ఐవాంటుడై. నా.... మావాడి ఓపిక నశించి పోయింది. ఇంకవాడు ఎదురు చూడలేడు. నేనెక్క వలసిన రైలు – జీవిత కాలం లేటు. అందుకే – నేను చచ్చిపోవాలనుకుంటున్నాను." అతని కళ్ళ నిండా నీళ్ళూ, గొంతునిండా దుఃఖమూ. "ప్లీజ్ ! డాక్టర్ ! మావాడికి ఇథినీషియా...."

"మీరు మరీ మరీ కోరుతున్నారు కనుక అలాగే యిస్తాను. అతని బాధా గాధలు విని నా మనసు కరిగిపోయింది. మీరు నాకు చిన్న సాయం చేసిపెట్టగలరా?

"నేను – నిరుద్యోగిని. కాని.... ప్రయత్నిస్తాను...." అన్నాడతను.

"ఏమీ లేదు, నాకి హాస్పిటల్‌లో సహాయంగా ఓ మంచివాడు కావాలి. ఎక్కువ పనుండదు. నెలకి మూడువందలివ్వగలను.... అతనిష్టమైనవాళ్ళే చెయ్యొచ్చు.

"నేను పనికొస్తానా డాక్టర్?" ఆత్రంగా అడిగేశాడతను.

"మీరే అయితే – అంతకంటే కావలసిందేముంది? మరీ మంచిది."

మనసులో నవ్వుకుంటూ అన్నాను." రేపటి నుంచే రండి."

"థాంక్యూ డాక్టర్.... థాంక్యూ.... థాంక్యూ వెరీమచ్...."

మర్నాడు తనువొచ్చి పనిలోచేరాడు. ఆరునెలలు పనిచేశాక అతనికి మంచి ఉద్యోగం వొచ్చి – వెళ్ళిపోయాడు. ఆ ఆరునెలలలోనూ అతను మళ్ళీ నన్ను ఇథినీషియా గురించి అడగలేదు. అడగడనీ నాకు ముందే తెలుసు. ఎందుకంటే – నేను మామూలు డాక్టర్‌నే కాను, మానసిక వైద్యుణ్ని కూడా! అతని మిత్రుడు అతనే అని ముందే గ్రహించాను. ●

భారతి

చిన్న నవలల పోటీ !

భారతీయ సంస్కృతిలో ఒక భాగమైన తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబంగా ఉంటున్న భారతి సాహిత్య మాసపత్రికలో చిన్న నవలల పోటీ పెడుతున్నామని తెలుపటానికి సంతోషిస్తున్నాము. పోటీలో పాల్గొనే రచయిత్రులూ, రచయితలూ క్రింది నిబంధనలని తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది.

★ నవల యితివృత్తం తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించినదై ఉండాలి.

★ నవల నిడివి అరవై అరటావులకి మించి ఉండరాదు. కాగితానికి ఒక వైపునే యింక్‌పెన్‌తో కాని బాల్‌పెన్‌తో కాని రాయాలి. నవల వ్రాత ప్రతిపైన "చిన్న నవలల పోటీకి" అని స్పష్టంగా రాయాలి.

★ అనువాదాలు, అనుసరణలు, కాపీ నవలలు పంపరాదు. గతంలో ప్రచురించబడిన, ఆకాశవాణిలో ప్రసారం అయిన నవలలని పంపరాదు. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్నవాటిని అసలే పంపరాదు.

★ రచయిత్రులూ, రచయితలూ వ్రాత ప్రతులతో పాటు రచన తమ స్వంతమేనని పేర్కొంటూ హామీ పత్రం విధిగా జతపరచాలి. హామీ పత్రంలేని రచనలు పరిశీలించబడవు. రచయిత(త్రు)లు కలంపేరు వాడినా తమ అసలుపేరు, పూర్తి చిరునామా స్పష్టంగా రాయాలి.

★ పోటీలో గెలుపొందిన రచయిత(త్రు)లు తమ ఫోటో, జీవిత విశేషాల ప్రచురణకి అంగీకరించవలసి ఉంటుంది.

★ రచనలపై వచ్చే ఎటువంటి పేచీలకైనా రచయిత(త్రు)లే బాధ్యత వహించవలసి ఉంటుంది.

బహుమతుల వివరాలు -

సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన నవలలకి బహుమతులు లభిస్తాయి. బహుమతుల నిర్ణయంలో సంపాదకునిదే తుది తీర్పు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు.

మొదటి బహుమతి : రు. 2500

రెండవ బహుమతి : రు 2000

మూడవ బహుమతి : రు. 1500

పోటీకి అందిన నవలలలో సాధారణ ప్రచురణకి యోగ్యమైనవి ఉంటే వాటిని ప్రచురణకి స్వీకరించి విలు వెంబడి ప్రచురించడం జరుగుతుంది. ఈ విషయాన్ని ఆయా రచయిత(త్రు) లకి ఉత్తరాల ద్వారా తెలియ జేస్తాము. ప్రచురణకి స్వీకరించబడని నవలలని తిప్పి పంపాలని కోరుకునేవారు తగిన తపాలా బిళ్లలు అంటించిన పూర్తి చిరునామా గల కవరును విధిగా జతపరచవలసి ఉంటుంది.

నవలలు చేరవలసిన ఆఖరుతేది : నవంబర్ 30

పోటీకి పంపే చిన్న నవలలని సంపాదకుడు, భారతి సాహిత్య మాసపత్రిక, ఆంధ్రపత్రిక కార్యాలయం, గాంధీనగరం, విజయవాడ-520003; అన్న చిరునామాకి పంపాలి. వ్యక్తుల పేర పంపరాదు. కవరు పైభాగంలో భారతి- చిన్న నవలల పోటీకి" అని మరచిపోకుండా రాయాలి.

★ రచయిత్రులూ, రచయితలూ ఉత్సాహంగా ఈ పోటీలో పాల్గొని దీనిని జయప్రదం చేయగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు

మాంత్రికుడూ రాజకుమారీ (అను) నానిగాడి ప్రేమ కథ

వసుంధర

నా పేరు నాని. బామ్మయితే ఎప్పుడూ నానిగాడంటుంది మిగతా అందరూ నానీ అని పిలుస్తారు. అందరూ అంటే అమ్మ, నాన్న, బాబాయి, అత్తయ్య, చుట్టుపక్కల వాళ్ళు. చుట్టుపక్కలవాళ్ళలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. మా యింట్లో నేనొక్కడినే చిన్నపిల్లాణ్ణి. అందుకని నేనంటే గారం.

ఎంతగారం చేసినా నేను చెడిపోలేదు. నాకిప్పుడు అయిదేళ్ళు. అక్షరాభ్యాసం జరిగి రెండు నెల్లయింది. అప్పుడే అ ఆ లు, క ఖ లు, గుణింతాలు, ఒత్తులు అన్నీ వచ్చేశాయి. మా పక్కింట్లో రాజిగాడున్నాడా - వాడు నాకంటే ఆర్నెల్లు పెద్ద ఇంకా వాడు వోనమాల దగ్గరే ఉన్నాడు.

ఈ విషయం అస్తమానం యింట్లో చెప్పి బామ్మనన్ను మెచ్చుకుంటూంటుంది. బామ్మంటే నాకు చాలా యిష్టం. ఎందుకంటే బామ్మకు అన్నీ మంచి బుద్ధులే!

పాపం - బామ్మ తెల్లారకట్లే లేచిపోతుంది. చలిలో చన్నీళ్ళ స్నానం చేస్తుంది. అయినా సరే అమ్మ నన్ను పొద్దున్నే లేపేయబోతే - "చంటికుర్రాడు వాణ్ణి కాసేపడుకోనియ్యవే -" అంటుంది. అమ్మ నాకు చన్నీళ్ళు పోస్తానంటే తిట్టి తనే నా కోసం వేణ్ణీళ్ళు కాచిస్తుంది. తాము కష్టపడుతూ కూడా అలాంటి కష్టాలు ఇతరులకు కలిగించకూడదనుకునే వాళ్ళు మంచి వాళ్లట తను అలాంటి మంచిదాన్నని బామ్మేనాకు చెప్పింది.

ఈ విషయం అమ్మకు చెబితే ఒప్పుకోదు. మంచి వాళ్లెప్పుడూ తమగురించి గొప్పలు చెప్పుకోరుట. "నేను చాలా మంచి" అని చెప్పుకునే వాళ్ళందరూ చెడ్డ వాళ్ళట

అమ్మ మాటలు విని నేను సందిగ్ధంలో పడిపోతాను. ఎవరైనా ఒకమాట చెబితే అందులో సగం నిజం, సగం అబద్ధం ఉంటే విన్నవాళ్ళకు ఆ మాట నిజమో, అబద్ధమో తేల్చుకోవడం కష్టం. దాన్నే పెద్దవాళ్ళు సందిగ్ధంలో పడడం అంటారు.

ఇంతకీ అమ్మ మాటలకు నేను సందిగ్ధంలో ఎందుకు పడ్డానంటే బామ్మ తను మంచిదాన్నని అస్తమానూ చెబుతూంటుంది. అయినా బామ్మ చెడ్డదని నాకు అనిపించదు. ఎందుకంటే బామ్మకు నేనంటే ఎంతో యిష్టం. నాకూ బామ్మంటే అంతే.

చిన్నపిల్లలు దేవుడితో సమానం. చిన్నపిల్లలంటే యిష్ట పడేవాళ్ళు దేవుడంటే యిష్ట పడ్డట్టు. దేవుడంటే యిష్ట పడ్డ వాళ్లు మంచివాళ్లే కదా!

నేనంటే యిష్టపడ్డమే కాదు, బామ్మ యింకా చాలా మంచి పనులు చేస్తుంది. పొద్దున్నే దేవుడికి పూజ చేసుకుని నాకు ప్రసాదం పెడుతుంది. ఆ ప్రసాదం కూడా నా కిష్టమైనవే చేస్తుంది. రోజూ ఒకటే అయితే నాకు నచ్చదని ఒకరోజు పటికబెల్లం, ఒకరోజు కొబ్బరిముక్కలు, ఒకరోజు అరటిపండు........ ఇలా మారుస్తూంటుంది.

అంతేకాదు — చుట్టుపక్కల పిల్లలెవరైనా అన్యాయంగా నన్ను కొడితే అమ్మ నన్నే తిడుతుంది. "ఉత్తినే ఎందుకు కొడతారు ? నువ్వూ ఏదో చేసే ఉంటావు. ఏం చేశావో చెప్పు" అని గదిమేస్తుంది. అప్పుడు బామ్మ "అసలే వాడు దెబ్బలు తిని ఏడుస్తూంటే నువ్వలాగ గదిమేస్తావేమిటే" అంటూ నన్ను దగ్గరగా పిలిచి దెబ్బ ఎక్కడ తగిలిందీ అని ప్రేమగా అడుగుతుంది.

అసలే దెబ్బలు తిన్నాను. ఆపైన అమ్మతిట్టింది. అలాంటప్పుడు ఎవరైనా ప్రేమ చూపిస్తుంటే నాకు ఏడుపొచ్చేస్తుంది. అందుకని బావురుమని ఏడ్చేశాను. బామ్మ నన్ను ఓదార్చుతుంది. కాసేపటికి నాకు ఏడుపు అయిపోతుంది.


"దెబ్బెక్కడ తగిలిందో చెప్పమ్మా!" అంటుందప్పుడు బామ్మ మళ్ళీ.

అప్పుడు నేను సందిగ్ధంలో పడిపోతాను.

ఎవరో నన్ను కొట్టిన మాట నిజమే కానీ నాకేమీ దెబ్బలు తగల్లేదు. బామ్మంత ప్రేమగా అడిగినప్పుడు దెబ్బలు చూపించకపోతే ఎలా? చాలా సేపు ఆలోచించి ఏ పిక్కల దగ్గరో చూపించి- "ఇక్కడ"! అంటాను.

నిజంగా బామ్మ మంచిది. అమ్మయితే "ఇక్కడ నాకేం దెబ్బ కనిపించటం లేదు." అంటుంది. బామ్మ మంచిది కదా-వెంటనే అక్కడ ఉఫ్ ఉఫ్ అని ఊది" - చాలాపెద్ద దెబ్బ తగిలిందిరా నానిగా-ఇప్పుడు తగ్గిందా అటుంది. బామ్మ అలా ఊదితే నాకు చాలా బాగుంటుంది. అందుకని అలా దెబ్బలు తగిలినప్పుడు బామ్మ దగ్గరకే వెడతాను. నిజంగా దెబ్బలు తగిలినప్పుడు మాత్రం అమ్మ దగ్గరకు వెడతాను. ఎందుకంటే నిజం దెబ్బలు ఊదితే తగ్గవు. వాటికి మందు రాయాలి. ప్లాస్టరు వేయాలి. దెబ్బలకు మందు రాయించుకుని ప్లాస్టరు వేయించుకోవడం నాకు చాలా యిష్టం. మందులూ ప్లాస్టర్లూ బామ్మదగ్గరుండవు. అమ్మదగ్గరుంటాయి. నిజంగా నాకు దెబ్బలు తగిలితే అమ్మ కూడా నన్ను తిట్టదు. ప్రేమగానే మాట్లాడి ఏడిపిస్తుంది.

ఊఁ ఇంకా బామ్మ ఇంకా ఎన్ని మంచి పనులు చేస్తుందో చెప్పాలిగదా....



రాత్రిళ్ళు బామ్మ నాకు రామాయణం కథ చెబుతుంది. ఆ కథ వింటూంటే ఎంత బాగుంటుందో!

"రోజూ అదే ఏం చెబుతావు?" అని ఎవరైనా అంటే-" చెబితే నాకు, వింటే వాడికి బోలెడు పుణ్యం -" అంటుంది బామ్మ.

బామ్మ అన్ని పనులూ పుణ్యం కోసమే చేస్తుంది. అదికూడా మంచివాళ్ళ లక్షణమే!

కాబట్టి బామ్మ అన్ని విధాలా మంచిది. అందువల్ల అమ్మ బామ్మను చెడ్డదంటే నేను నమ్మకూడదు. అమ్మ అబద్ధం చెప్పిందేమో అనుకోవాలి. కాని నేను సందిగ్ధంలో పడిపోవడానికి కారణం బాబాయి.

బాబాయి అన్నీ తన గురించి గొప్పగా చెప్పుకుంటాడు. కానీ మంచివాడు కాదు. బాబాయి మంచివాడు కాదనేందుకు చాలా సాక్ష్యాలున్నాయి.

బాబాయి అమ్మదగ్గర కూర్చుని బామ్మను వేళాకోళం చేస్తూంటాడు. అమ్మ నవ్వుతూంటుంది. అది చూసినప్పుడల్లా నాక్కోపం వచ్చేసి "పెద్దాళ్ళను వేళాకోళం చేయడం తప్పుకాదూ" అంటాను.

అప్పుడమ్మ నవ్వుతుంది. బాబాయి మాత్రం "గొప్పవాళ్ళు పెద్దాళ్ళని వేళాకోళం చేయొచ్చు. నేనుగొప్పవాణ్ణి-" అంటాడు. అలా అంటాడా మళ్ళీఏ పని మీదైనా బయటకు వెళ్ళేముందు బామ్మకాళ్ళకు దణ్ణంపెడతాడు. బామ్మమంచిది కదా- అందుకని దీవిస్తుంది.

బాబాయి విషయంలో నాకింకోటి అర్థంకాదు. బామ్మ దేవుడికి పూజలు చేస్తుందని అస్తమానూ వేళాకోళం చేస్తాడు. అసలు దేవుడున్నాడా ? ఉంటే మాత్రం ఆ విగ్రహంలోనే ఉంటాడా?" అని కబుర్లు చెప్పి అమ్మను నవ్వించి తనకు పని ఉన్నప్పుడు తనూ దేవుడికి దణ్ణం పెట్టుకుంటాడు.

బాబాయి చెడ్డవాడనుకునేందుకు అసలు కారణాలవి కాదు బామ్మ నన్నెంత ప్రేమగా చూసుకుంటుందో, అంతకంతా బాధలు పెడతాడు నన్ను బాబాయి.

బాబాయికి చదువైపోయిందిట ఇంక ఉద్యోగం రావాలిట. ఉద్యోగం వస్తే యింట్లోంచి వెళ్ళిపోతాట్ట. ఆ ఉద్యోగమెప్పుడొస్తుందో తెలియదు కానీ యింట్లో ఉన్నంతసేపూ నన్నాపనీ ఈ పనీ చెప్పి వేధించేస్తాడు బాబాయి.

బాబాయి మొహం కడుక్కుంటే నీళ్ళు నేనేయివ్వాలి గెడ్డం గీసుకుంటే నీళ్ళందించాలి. స్నానానికి వెడితే తువ్వాలు తెచ్చివ్వాలి. ఇన్నిపనులూ నాచేత చేయించుకుని నన్ను మెచ్చుకుంటాడా అంటే అదీ లేదు. నేను చాలా గొప్పవాణ్ణి, నాకు సేవలు చేయడం నీ అదృష్టం - అంటాడు. చిన్నప్పుడు అంటే నాకు నాలుగేళ్ళప్పుడు ఆ మాటలన్నీ నిజమేనని నమ్మేసేవాణ్ని. ఇప్పుడూ నమ్మేసేవాణ్ని అత్తయ్య నాకు బాబాయి గురించిన నిజం చెప్పేసింది. నాచేత పని చేయించుకుందుకు బాబాయలాగంటూంటాడని.

అది నిజమే అయుండాలి. ఎందుకంటే అన్ని పనులూ బాబాయి నాచేత చేయించుకోడు, బాబాయి పెన్నులో సిరా పోయడం నాకెంతో యిష్టం. ఓసారి పోశానుకూడా. నేను బుడ్డిలోంచి పెన్నులోకే ఒంపాను కానీ ఎంత ఒంపినా సిరా నేలమీదేకానీ పెన్నులో పడదే ! చివరికి సిరా అంతా అయిపోయింది. ఈలోగా బాబాయొచ్చి నాపెన్ను ముట్టుకున్నావంటే తంతానంతే అన్నాడు. నీకు సేవలు చేయడం నా అదృష్టం కదా అంటే - నీకు చేతనైన పనులే చేయాలి తెలిసిందా అన్నాడు బాబాయి. ఏ పనైనా నేర్చుకోకుండా ఎలా వస్తుంది ?

ఇంకా బాబాయి నన్ను చెయ్యనివ్వని పనులు చాలా ఉన్నాయి. తన బట్టలు రోజూ ఇస్త్రీ చాకలికిస్తాడు. ఇంట్లో కరెంట్ ఇస్త్రీపెట్టె ఉంది. నేను చేస్తానంటే వినడు. బాబాయి బూట్లు తనే పాలిష్ చేసుకుంటాడు. నన్ను చెయ్యనివ్వడు. అపైన బాబాయి గది ఎప్పుడూ చిందర వందరగా ఉంటుంది. అలా

ఉంటే నాకు నచ్చదు. పోనీ అని ఓసారి బాబాయి లేనప్పుడు తన గదంతా శుభ్రంగా సర్దిపెట్టాను. ఆ రాత్రి బాబాయొచ్చి తనగది నేనే సర్దానని తెలిసిపోయాక చాలా వస్తువులు కనిపించడం లేదుట.

ఏం కనిపించడం లేదూ అనడిగాను. చెప్పాడు.

బాబాయి పెన్ను, షేవింగ్ క్రీము, రేజరు, టూత్ పేస్ట్, బ్రష్, వాచీ అన్నీ- ఇవన్నీ జాగ్రత్తగా తెలివిగా బాబాయి రెండు బూట్లలోనూ సర్దేశాను. అక్కణ్ణుంచి తీసి యిచ్చాను. బాబాయి సంతోషించడానికి బదులు అంతెత్తున ఎగిరిపడి- ఇంకెప్పుడు కడుక్కునే సామాను బూట్లోపల పెడతావా అని తిట్టి- ఇకమీదట నాగది సర్దావంటే వీపు చీరేస్తాను- అన్నాడు.

నేను చేసిన పనిలో తప్పేమిటో నాకర్థం కాలేదు. అత్తయ్య చెప్పినట్లు బాబాయి స్వార్థపరుడై ఉండాలనుకున్నాను. స్వార్థపరుడంటే తన ఇష్టమైన పనులు మాత్రమే చేయించుకుని మనకిష్టమైన పనులు చేయనివ్వని వాడని చెప్పింది అత్తయ్య.

అప్పట్నుంచీ బాబాయేపని చెప్పినా చేయడం మానేశాను. అంతోటి వాళ్లతో మంచిగా ఉంటే లాభం లేదు. నేను మొండిగా ఉండేసరికి బాబాయితో మార్పు వచ్చింది. ప్రతి పనికీ మంచివాడినని పొగడ్డం మొదలు పెట్టాడు. అలా పొగుడుతూంటే నాకు చాలా బాగుంటోంది.

....నాని చాలా మంచివాడు. నేనడగ్గానే మంచినీళ్ళు తెచ్చిపెడ్తాడు- అనేవాడు బాబాయి. నాకు వెంటనే వెళ్ళి నీళ్ళు తెచ్చి పెట్టాలనిపించేది. అలాగే చేసేవాణ్ణి. అప్పుడు బాబాయి నా వీపు తట్టి మెచ్చుకుని - "నా అంతటివాడికి మంచినీళ్ళిచ్చావు. పెద్దయ్యాక నా అంతటివాడవౌతావులే- అనేవాడు.

అలాగంటే నాకు భయం. అందుకని వెంటనే-" నేను నీ అంతటివాణ్ణైతే, నువ్వు అడ్డగాడిదలా తిరుగుతుంటావని నాన్న అస్తమానూ అమ్మతో అంటుంటాడు- "అని చెప్పేసాను ఒకసారి.

బాబాయి ఏడుపు ముఖం పెట్టి- "అలా నాదగ్గరెప్పుడూ అనకేం-" అనేవాడప్పుడు. నాకు బాబాయిమీద జాలేసింది.

అమ్మా నాన్నా ఎప్పుడూ బాబాయి ఎదురుగా బాబాయిని పొగుడుతూనే ఉంటారు. బాబాయి లేనప్పుడు బాధ్యతలు తెలియని వాడని తిట్టుకుంటూంటారు.

బాధ్యతలు తెలియక పోవడమంటే- అస్తమానూ సినిమాలకు వెళ్ళడం, కొత్తబట్టలు కొనుక్కోవడం, ఊళ్ళు తిరగడం. ఈ అర్థం నేను బామ్మనడిగి తెలుసుకున్నాను.

బాబాయి విషయంలో నేను సందిగ్ధంలో పడిపోవడానికి చాలా వరకూ అమ్మా, నాన్నా కారణం. వాళ్ళు బాబాయెదురుగా ఓ మాటంటారు. ధాటీగా ఇంకోటంటారు. ఏది నిజమో- చిన్నపిల్లాణ్ణి నాకేం తెలుస్తుంది ?

అనుమానం వచ్చి బామ్మనడిగాను. అప్పుడు బామ్మకు చాలా కోపం వచ్చింది- "పాపం మీనాన్న అమాయకుడు వాడికేం తెలియదు. ఇదంతా మీఅమ్మ పని- " అని అమ్మతో మాట్లాడానికి వెళ్ళింది. అప్పుడు యుద్ధం జరిగింది.

యుద్ధమంటే అమ్మా, బామ్మా మాట్లాడు కోవడం. ఈ విషయం నాకు బాబాయి చెప్పాడు.

తల్లికి కొడుకంటే ఎంతో ప్రేముంటుందిట. అందుకని బామ్మ నాన్నను దేనికీ అనుమానించదుట. నాన్న మరి బామ్మకు కొడుకు కదా!

ఇద్దరూ కాసేపు మాట్లాడు కున్నాక అమ్మ నన్ను పిలిచి -" అనవసరంగా ఈ వెధవ మూలంగా వచ్చింది- " అంటూ నన్ను కొట్టింది.

"బామ్మ తన కొడుకును అమాయకుడంది. నువ్వేమో నీ కొడుకును అను మానించి కొడుతున్నావు- " నువ్వు మంచి అమ్మవు కాదు- " అన్నాను ఏడుస్తూ.

ఉన్నట్లుండి అంతా నవ్వేశారు. యుద్ధం ఆగిపోయింది. అయినా నా కోపం గానే ఉంది. అమ్మతో మాట్లాడ కూడదనుకున్నాను. అందుకే అత్తయ్య దగ్గరకు వెళ్ళాను.

అత్తయ్యంటే నాకు చాలా యిష్టం. నాకే ఏమిటి-ఇంట్లో అందరికీ ఇష్టమే అత్తయ్య చాలా అందంగా ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూంటుంది. నామీద అస్సలు కోప్పడదు.

నాకు బాగా చిన్నప్పటిదాకా అంటే మూడేళ్ళు నిండేదాకా అత్తయ్యసలు నన్ను వదిలేదికాదుట. తెగ ఆడించేదట. అప్పుడత్తయ్యకి పెళ్ళిసంబంధం కుదిరిందట. అప్పట్నుంచి అత్తయ్య వేరేలోకాల్లోకి వెళ్ళిపోయిందట: వేరేలోకాలంటే నాకు చాలా ఇష్టం. నాకూ వెళ్లాలనే ఉంటుంది. అందుకని ఈమధ్య అత్తయ్యనే అడిగేశాను.

ఇప్పుడత్తయ్యకి పెళ్ళైపోయింది. అత్తయ్య పెళ్ళి జరిగి ఏడాది దాటిపోయింది. ఆ పెళ్ళి నేను చూసినట్లే గుర్తు. కాని చిన్ననాటి విశేషాలు నాకు బాగా గుర్తుండడంలేదు. అత్తయ్యమొగుడు ఇంకోదేశంలో ఉన్నాట్ట. ఇంకా ఇంకో ఆర్నెల్లదాకా అత్తయ్యను తీసుకునివెళ్ళట్ట.

అత్తయ్యను వేరేలోకాల గురించి అడిగితే- "నీకూ పెళ్ళైతే అప్పుడు తెలుస్తుంది వేరేలోకాల గురించి—" అంది.

"అయితే నేను తొందరగా పెళ్ళి చేసేసుకుంటాను—" అన్నాను.

"ఎందుకని ?" అంది అత్తయ్య నవ్వుతూ.

"అప్పుడు నేనూ వేరేలోకాలు చూడొచ్చు, అక్కడెన్ని తమాషాలుంటాయో—" అన్నాను.

అత్తయ్య నవ్వుతూనే— "అయితే ఎవర్ని చేసుకుంటావేమిటి" అంది.

"నీ అంత అందంగా ఉన్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను-" అన్నాను.

అత్తయ్య విరగబడి నవ్వుతూ - "ఇంకా నయం- నన్నే చేసుకుంటానన్నావు కాదు-" అంది.

"నిన్నెలా చేసుకుంటాను ? నీకు పెళ్ళైపోయిందిగా—" అన్నాను.

అప్పుడత్తయ్య యింకా యింకా నవ్వేసింది నాకు చాలా ఉడుకుమోత్తనం వచ్చింది.

"నువ్వు పెళ్ళిచేసుకుంటే నేను నవ్వానా ? నా పెళ్ళంటే నవ్వుతావేం ?" అన్నాను. ఇంకా ఏమో అనాలనుకున్నానుకానీ నాకేడుపు వస్తోంది. అందుకని మాట్లాడలేక పోయాను. అప్పుడత్తయ్య నన్ను దగ్గరగాతీసుకుని- "కోపం వచ్చిందా ?" అంది ప్రేమగా.

వెంటనే నాకేడుపొచ్చేసింది. ఏడుపు తగ్గేక- "నువ్వెందుకు నవ్వాలి ? నాకోపంరాదా ?" అన్నాను.

"నీపెళ్ళి అనగానే నాకూ ఆనందం కలిగింది. సంతోషం ఎక్కువైపోయి ఆపుకోలేకపోయాను. అయినా నేను నవ్వితే నువ్వూ నవ్వాలికాని అలా ఏడుస్తావేమిటి ? నీకోసం మరి నేను నా అంత అందమైన అమ్మాయిని చూసిపెట్టదా—" అందత్తయ్య.

"ఊఁ" అన్నాను.

వెంటనే అత్తయ్య మళ్ళీ నవ్వేసింది. అత్తయ్యలానవ్వితే నాకు నచ్చలేదు: కానీ అత్తయ్యే చెప్పిందిగా తను నవ్వితే నేను నవ్వాలని.... అందుకే నేనూ నవ్వేశాను.

అప్పుడత్తయ్య నా బుగ్గమీద ముద్దుపెట్టుకుని -"అసలు నీకు పెళ్లామెందుకురా ?" అంది.

వెంటనే నేను సందిగ్ధంలో పడిపోయాను-అత్తయ్యకు నిజం చెప్పాలా అబద్ధం చెప్పాలా అని.

పెళ్ళామెందుకో నాకు నిజంగా తెలుసు. నేను మగాణ్ణి గదా! మగాణ్ణి ఇంట్లో గౌరవించేది పెళ్ళాం ఒక్కతే! నేను నాన్నను చూస్తున్నాగా-అమ్మేమో నాన్నని ఏమండీ అని గౌరవిస్తుంది—పెళ్లాం కాబట్టి! అత్తయ్య, బాబాయి, నాన్నని ఒరేయ్ అన్నయ్యా అంటారు. నాన్న స్నేహితులుకూడా నాన్నని ఏమోయ్ అంటారు. బామ్మయితే వెధవకానా అనికూడా అంటుంది. పోనీ వాళ్ళంతా పెద్దవాళ్ళని సరిపెట్టుకుందాం. ఆఖరికి నేనుకూడా నాన్నని నువ్వనే అంటాను. అసలు అత్తయ్యవాళ్ళలాగా ఒరేయ్ అనాలనికూడా సరదా ఉంది. కానీ అమ్మ కొడుతుంది.

అయితే ఒక్క గౌరవం కోసమే కాదు. పెళ్లాంవల్ల యింకా లాభాలున్నాయి. తిట్టినా సరే ఎదురు చెప్పదు. ఏపని చెప్పినా వెంటనే చేస్తుంది. ఇప్పుడు బాబాయి నాచేత చేయించు కుంటున్నట్లు నేనూ పెళ్ళాంచేత అన్ని పనులూ చేయించు కోవచ్చు. పెళ్లానికి వంట కూడా బాగా వస్తుంది. అమ్మయితే అస్తమానూ చేసేవి- అన్నం, వంకాయకూర, పప్పు, పులుసు, మజ్జిగ. నాకేమో చేగోడీలు, జంతికలు, ఉప్పుపిండి, మినపరొట్టె యిలాంటివన్నీ యిష్టం. అన్నం మానేసి యివే తినాలని నాకుంటుంది. పెళ్ళాముంటే యివన్నీ చేయించుకోవచ్చు.

కానీ యిలాగని అత్తయ్యకు చెప్పేస్తానేమిటి? వినగానే అత్తయ్య నవ్వేస్తుంది. అప్పుడు నాకేడుపువస్తుంది. అయినా నేను నవ్వాలి. లేకపోతే అత్తయ్య నేను మరీ చిన్న పిల్లాడి ననుకుంటుంది. అందుకని అబద్ధం చెప్పేశాను. నేను తెలివైన వాణ్ణిగా — అందుకని- "అమ్మకెప్పుడూ బామ్మ సేవలతోనే సరి పోతుంది. అమ్మక్కూడా ఎవరైనా సేవలు చేయాలి కదా -" అనేశాను.

"అరిభడవా-" అని అత్తయ్య నన్నెత్తుకుని ముద్దులాడింది.

అందుకే నాకు ఎప్పటికీ చిన్న పిల్లాడిలాగానే ఉండి పోవాలనిపిస్తుంది.

పాపం అప్పుడప్పుడు బాబాయి కూడా నాఅంత తెలివిగానూ మాట్లాడు తూంటాడు. అంతా విని నవ్వుతారు కుంటారు. తప్పితే ఎత్తుకుని ముద్దులాడరు. నాకు బాబాయిమీద అలాంటప్పుడు జాలేస్తుంటుంది.

అత్తయ్య ముద్దులాడుతోందని నేను సంబర పడుతున్నానా ఈలోగా అత్తయ్య- "నీకు అమ్మమీద కోపం వచ్చి కదా నాదగ్గరకొచ్చావు? నీ పెళ్లాన్ని అమ్మకు సేవలు చేయనిస్తావా?" అన్నది.

అమ్మో - అత్తయ్యతో మాటల్లో పడి నాకోపం సంగతే మర్చిపోయాను. నేనిక అమ్మతో మాట్లాడను. కానీ అమ్మతో మాట్లాడ కుండా ఎలా?

అమ్మ తిట్టినాసరే నాకు అమ్మంటేనే యిష్టం. అమ్మ కొట్టినా సరే నాకు అమ్మంటేనే యిష్టం. ఎంత మంది నన్ను మెచ్చుకున్నా సరే అమ్మ మెచ్చుకున్న ప్పుడే నాకు ఎక్కువ బాగుంటుంది. అందుకే ఒకోసారి అమ్మ నన్ను కొట్టేసి మళ్ళీ ప్రేమగా పిలిస్తే కోపం మర్చిపోక పోయినా మర్చిపోయినట్లు నటించి దగ్గరగా వెడతాను.

అమ్మ దగ్గరగా తీసుకుంటే ఎంత బాగుంటుందో - వెధవ కోపంకోసం ఆ సుఖం వదులు కుంటానా?

కానీ యిప్పుడు నిజంగానే నాకోపం మర్చిపోయాను. అందువల్ల ఎంచక్కా అమ్మ దగ్గరకు వెళ్ళిపోయేవాణ్ని. కానీ యిప్పుడు అత్తయ్య గుర్తు చేసేసింది. ఈ పెద్దాళ్ళెప్పుడూ యింతే - ఏదీ త్వరగా మర్చిపోనివ్వరు - అందునా కోప మైతే మరీను....

అయితే అత్తయ్య చాలా మంచిది. ఇలాంటప్పుడే మంచివాళ్ళ నుపయో గించుకోవాలి. అందుకని "అత్తయ్యా! నా క్కోపం వచ్చిందనీ, అమ్మతో మాట్లాడనంటున్నాననీ అమ్మకు చెప్పవూ-" అన్నాను

"నేను చెప్పకుండా అమ్మ తెలుసుకోలేదా" అంది అత్తయ్య.

"తెలుసుకుంటుంది కానీ అందుకు చాలా సేపవుతుంది. అమ్మతో మాట్లాడ కుండా నేను అంతసేపు వుండలేను. -" అన్నాను.

"అయితే వెళ్ళి మాట్లాడేయకూడదూ?" అంది అత్తయ్య.

"నేను వెళ్ళి మాట్లాడితే లోకువైపోతాను. అమ్మ వచ్చి నన్ను బతిమా లాలి. అప్పుడే మాట్లాడతాను." అన్నాను.

ఏమనుకుందో అత్తయ్య వెళ్ళి అమ్మను పిల్చుకుని వచ్చింది. అమ్మ వస్తూనే - "ఒరేయ్ నానీ - ఇందాకా నీకు చెప్పడం మర్చిపోయాను. రేపు చిన్నిగాడొస్తున్నాడ్రోయ్ -" అంది.

అమ్మతో మాట్లాడకూడదనుకున్నాను. కానీ చిన్నిగాడనగానే అన్నీ మర్చి పోయాను. చిన్నిగాణ్ణి నా చిన్నప్పుడెప్పుడో చూశాను. వాడు నాకంతగా గుర్తులేదు. చిన్నిగాడు నాకంటే రెండేళ్లు పెద్దట. దొడ్డ అంటే మా అమ్మకు అక్క కొడుకు వాడు.

"ఎందుకొస్తున్నాడమ్మా?" అన్నాను.

"ఎందుకేమిటి? నీతో ఆడుకుందుకు...." అంది అమ్మ.

చాలా సంతోషం కలిగింది. చిన్నపిల్లల్ని చిన్నపిల్లలు అర్థం చేసుకొన్నట్లు పెద్దాళ్ళర్థ చేసుకోలేరు. మా వీధిలో చిన్నపిల్లలున్నారు గానీ వాళ్ళెవరూ నా అంత తెలివైన వాళ్ళు కాదు. అయినా వాళ్లు నాతో కాసేపే ఆడుకుంటారు. చిన్ని గాడొస్తే మా యింటోనే ఉంటాడు కదా — రోజంతా వాడితోనే ఆడుకోవచ్చు.

"మంచి కబురు చెప్పానా? మరి నీ కోపం పోయిందా" అంది అమ్మ.

మళ్ళీ నాకు కోపం గుర్తుకొచ్చింది. కబురు చెబితే కోపం పోతుందా - బతిమాలాలి కానీ! అమ్మ నన్ను బతిమాలాలంటే ఏం చేయాలో నాకు తెలుసు.

బుంగమూతి అంటే ఎలా ఉంటుందో నాకూ తెలియదు. కోపం వచ్చి నప్పుడూ, గారాం చేసేప్పుడూ మనుషులంతా బుంగమూతి పెడతారుట. అమ్మ బుంగమూతి పెడితే నాన్నకిష్టంట. ఇంకెవ్వరూ అమ్మ బుంగమూతిని మెచ్చు కోవడం వినలేదు నేను. నా బుంగమూతిని మాత్రం ఇండిల్లపాదీ మెచ్చుకుంటారు. ఎలాగైనా చిన్నపిల్లలుగా ఉండటంలో చాలా సుఖాలున్నాయి.

"ఇంకెప్పుడూ తిట్టనేం?" అంది అమ్మ.

"ఇందాక నన్ను చూసి నవ్వావు-" అన్నాను మళ్ళీ.

"ఇంకెప్పుడూ నవ్వనేం?" అంది అమ్మ.

ఇంకా ఏదో అనాలనుకున్నాను కానీ యీలోగా అమ్మ తన రెండు చేతులూ ముందుకు చాపింది. అమ్మ అలా చేతులు సాచితే నేనుండగలనా? ఒక్క పరుగున అమ్మదగ్గరకు వెళ్ళిపోయాను. అమ్మ నన్ను దగ్గరగా హత్తుకుంది.

ఎంత సుఖంగా ఉందో! ఈసారి వెధవకోపం గుర్తుకొచ్చినా సరే మర్చి పోతాను....

2

ఇంటి ముందు రిక్షా ఆగింది. అందులోంచి దొడ్డ, చిన్నిగాడు ఇద్దరే దిగారు.

నేను దొడ్డను చిన్నప్పుడెప్పుడో చూశాను. అట్టే గుర్తులేదు. ఇప్పుడు చూస్తే అమ్మకు లాగే ఉంది కానీ కొంచెం లావుగా ఉంది. చిన్ని గాడేమో నాకంటే పొడుగే - మరి నాకంటే కొంచెం పెద్దకదా....

నేను వాళ్ళను చూస్తూనే పరుగున అమ్మ గదిలోకి వెళ్ళిపోయాను. పలకా పలకపుల్లా తీసుకుని కూర్చున్నాను.

అప్పుడు నాకు చదువుకోవాలని లేదు. కానీ అమ్మ చెప్పింది — నాకు చదువంటే ఎంతో శ్రద్ధ అని దొడ్డ అనుకోవాలిట. నాకు అప్పుడే ఒత్తులు కూడా వచ్చేశాయని తెలిస్తే ఆశ్చర్య పోతుందిట. అందుకని వాళ్ళకోసం ఎదురు చూస్తూ పలక పట్టుకుని కూర్చున్నాను. కానీ ఎప్పటికీ రారేం?

వరండాలోంచి వాళ్ళ మాటలు వినబడుతున్నాయి. ఏమిటి అర్థంలేని ప్రశ్నలు వేసుకుంటున్నారు. అన్నీ నాకు వినిపిస్తున్నాయి. పలక పట్టుకుని పట్టుకుని నాకు విసుగొచ్చేసింది. లేచి నేనూ వరండాలోకి వెళ్ళిపోదామా అనుకుంటూండగా దొడ్డ — " నానిగాడేడే— కనిపించడేం ? " అంది.

"ఇప్పటి దాకా ఇక్కడే ఉండాలి - ఏ గదిలోకైనా వెళ్ళాడేమో - అంది అమ్మ.

వాళ్ళు నాకోసమే బయల్దేరుతున్నారని తెలుసు. ఇప్పుడిల్లంతా వెతుకుతూ కూర్చున్నారంటే చాలా సేపట్టుతుంది. నేనెక్కడున్నానో వాళ్ళకు తెలియాలి గదా - అందుకని గట్టిగా దగ్గేశాను.

నేను తెలివైన వాణ్ణిగా - నా ఉపాయం ఫలించింది.

దొడ్డ, అమ్మ నాగదిలోకి వచ్చారు. వాళ్ళ అడుగుల చప్పుడు వినగానే నేను తలను మరీ పలక మీదకు వంచేసి రాసుకోవడం మొదలు పెట్టాను.

"అబ్బా - నానిగాడికి చదువుమీద చాలా శ్రద్ధఎక్కువే ! మా చిన్నిగాణ్ణి పుస్తకం తియ్యమంటేనే తియ్యడు- " అంది దొడ్డ.

నాకు చాలా సంతోషం కలిగింది. ఈలోగా అమ్మ - " ఒరేయ్ నానీ ! కాసేపటి క్రితం దాకా దొడ్డ దొడ్డ అని కలవరించావు కదా- దొడ్డ వచ్చిందిరా- " అంది.

నిజానికి నేను దొడ్డ గురించి అడగలేదు. అస్తమానూ చిన్నిగాడి గురించే అడిగాను. పెద్దవాళ్ళు పెద్దవాళ్ళను సంతోష పెట్టడానికిలాంటి అబద్ధాలు చెబుతూండడం నా అనుభవంలో చాలా సార్లయింది.

అమ్మ మాటలు వెంటనే వినేస్తే నేను శ్రద్ధగా చదువుతున్నట్లు కాదు కదా ! అందుకని నేనింకా తలెత్తకుండా రాసేస్తున్నాను.

"ఒరేయ్ - నానీ !" అంది అమ్మ గట్టిగా.

ఉలిక్కిపడి తలెత్తాను.

"దొడ్డరా !" అంది అమ్మ.

నేను దొడ్డని చూశాను. పక్కనే చిన్నిగాడు కూడా కనిపించాడు. చటుక్కున లేచి నిలబడ్డాను. కానీ అప్పుడు ఎందుకో నాకు చాలా సిగ్గేసింది. తల వంచేసుకున్నాను.

"వెధవ - చాలా పొడుగయ్యాడే !" అంది దొడ్డ.

ఈ పెద్దవాళ్ళలో ఇదే నాకు నచ్చదు. చాలాకాలం తరువాత నన్ను చూసిందా - అయినా దొడ్డ నన్ను చూస్తూనే వెధవ అనేసింది. బొత్తిగా గౌరవం, మర్యాద తెలియవు.

"ఇలారారా-" అంది అమ్మ. నేను కదలలేదు.

అప్పుడు దొడ్డే నా దగ్గరకు వచ్చింది- "నీ దొడ్డినిరా - నాదగ్గర సిగ్గుపడతావేం ?" అంది. అప్పుడు నాకింకా సిగ్గెక్కువైపోయింది. దొడ్డ మాత్రం వన్నొదలలేదు. నన్నవీ యివీ అడిగి నా చదువు గురించి తెలుసుకుని పలకమీద నేను రాసింది చూసింది. పలకకు ఒకపక్క విష్వక్సేనుడు అని వ్రాశాను. రెండో ప్రక్క సందిగ్ధము అని రాశాను. అవి చాలా కష్టమైన పేర్లుగా - అందుకని దొడ్డ- "అరే- నీకు వత్తులూ అవీ వచ్చేశాయే ! మానాని చాలా తెలివైనవాడు, దస్తూరీ కూడా ముత్యాలకోవలా ఎంత బాగుందో-" అని మెచ్చుకుని— "మా చిన్నిగాడూ ఉన్నాడు- వెధవ ! వాడేం రాశాడో వాడికే అర్థమైచావదు-" అంది.

మా పక్కింట్లో రాజుగాడు నాకంటే పెద్దనీ వాడికింకా యారమాలు కూడా రావడంలేదనీ చెప్పాలనిపించింది. కానీ నేను సిగ్గుపడుతున్నానుకదా- ఎక్కువ మాట్లాడలేకపోయాను.

అప్పుడు దొడ్డ నాకు చిన్నిగాడిని పరిచయం చేసి-"మీరిద్దరూ ఆడుకోండి" అని చెప్పి వెళ్ళిపోయింది. పెద్దాళ్ళంతా వెళ్ళిపోయాక ఆగదిలో నేనూ, చిన్నిగాడూ మిగిలాం.

నేను చిన్నిగాడి వంక చూశాను. వాడు నావంక అదోలా చూస్తున్నాడు మాట్లాడతాడేమోనని కాసేపు చూశాను. మాట్లాడంలేదు వాడు. ఆఖరికి నేనే "హమ్మయ్య - పెద్దాళ్ళు వెళ్ళిపోయారు. మనమింక ఆడుకోవచ్చు-" అన్నాను.

చిన్నిగాడు వెంటనే- "నీతో నాకాటలేమిటి? నేను నీకంటే చాలా పెద్దాణ్ణి!" అన్నాడు.

మొదలెడుతూనే ఇలా మాట్లాడతాడేమిటి అనుకున్నాను- "నువ్వు నాకంటే ఎంత పెద్దేమిటి ? రెండేళ్ళేగా !" అన్నాను.

"రెండేళ్ళంటే ఎంతో నీకు తెలుసా ? ఏడాదికి పన్నెండు నెలలు. నెలకు నాలుగు వారాలు. వారానికి ఏడు రోజులు. రోజుకిరవైనాల్గుగంటలు. గంటకరవై నిమిషాలు. నిముషానికి అరవై సెకన్లు - అంటే బోలెడు లక్షల సెకన్లు. ఆ వచ్చిన సెకన్లని రెండుపెట్టి గుణించాలి. అంటే నీకూ నాకూ కొన్ని లక్షలసెకన్లు తేడా అన్నమాట-" అన్నాడు వాడు.

వాడు చెప్పింది నాకు అర్థంకాలేదు. కానీ వాడికి నాకు తెలియనివేవో చాలా తెలుసునని గ్రహించాను. ఆ విషయం ఒప్పేసుకుంటే వాడింకా గొప్పచేసేస్తాడని భయపడి- "కొన్నాళ్ళుపోయాక నేనూ పెద్దవుతాగదా- అప్పుడు నేను నీకంటే పెద్దవాణ్ణయిపోయి యింతకంటే కష్టమైన విషయాలు చెబుతాను"- అన్నాను.

చిన్నిగాడు నవ్వేసి- "నువ్వు నిజంగా బాగా చిన్నవాడివి. నీకు బొత్తిగా ఏమీ తెలియదు. నువ్వు పెద్దవాడివైతే నేనింకా పెద్దవాడినౌతానుగానీ యిలాగే ఉండిపోతాననుకుంటున్నావా ?" అన్నాడు.

అరెరే అనుకున్నాను. నిజమే— ఇది నాకెందుకు తట్టలేదు ?

చిన్నిగాడిని నేను మాటల్లో నెగ్గలేను. కానీ నా గురించి వాడికి సరిగ్గా తెలియదేమో అనిపించి- "నాకు అక్షరాలు,గుణింతాలు, ఒత్తులు అన్నీ వచ్చేశాయి తెలుసా ? నాకంటే పెద్దవాళ్ళకుక్కూడా అవి రాలేదు-"అని చెప్పాను. చిన్నిగాడు వివరాలడిగితే అప్పుడు రాజుగాడి గురించి చెప్పాలనుకున్నాను. కానీ వాడలాంటి వేమీ అడక్కుండా- "పెద్దవాళ్ళంటే స్నేహితులకి ఉత్తరాలు రాసుకోవాలి. నువుత్తరం వ్రాయగలవా ?" అన్నాడు.

నేనెప్పుడూ ఎవరికీ ఉత్తరాలు రాయలేదు. కానీ అమ్మ, నాన్న ఉత్తరాలు రాయడం చూశాను. అందుకని "ఆఁ వచ్చు-" అన్నాను. పరువు నిలబెట్టుకుందుకు అప్పుడప్పుడిలాంటి చిన్న అబద్ధాలు చెప్పడం తప్పుకాదు. అమ్మ, నాన్న, బాబాయి, అత్తయ్య, ఆఖరికి అందరికంటే పెద్దదయిన బామ్మకూడా యిలాంటి అబద్ధాలు చాలా చెప్పగా నేను విన్నాను.

కానీ చిన్నిగాడు నన్నంత సులభంగా వదలిపెట్టలేదు. వాడు నన్నో తెల్ల కాగితమూ పెన్సిలూ తెమ్మన్నాడు. రెండూ బాబాయి గదిలోంచి బాబాయికి తెలియకుండా తెచ్చిచ్చాను. చిన్నిగాడు కాగితాన్ని మధ్యకు మడతపెట్టి రెండు ముక్కలు చేసి ఒకటి నాకిచ్చి- "దీనిమీద పెన్సిలుతో ఉత్తరం రాయి. నాకేరాయి. పూజ్యనీయులైన మహారాజశ్రీ అన్నయ్య సత్యనారాయణకు వాని నమస్కరించి వ్రాయునది- అని మొదలు పెట్టాలి. తెలిసిందా ?" అన్నాడు.

"సత్యనారాయణ ఎవరు ?" అన్నాను.

"నేనే- చిన్ని నా ముద్దుపేరు. నా అసలుపేరు సత్యనారాయణ. పెద్దాళ్ళకు ఉత్తరాలు రాసేటప్పుడు ముద్దుపేరు కాకుండా అసలు పేరు రాయాలి. చిన్నవాళ్లు తమ ముద్దుపేర్లే రాయాలి-" అన్నాడు చిన్ని.

చిన్ని అసలు పేరు చెప్పగానే నాకూ నా అసలుపేరు చెప్పాలనిపించి వాడి నడిగాను. వాడు వెంటనే- వద్దు- నీ అసలుపేరు నీకంటే చిన్నవాళ్ళకే చెప్పు. అప్పుడు వాళ్ళు నీ కుత్తరం రాస్తారు-" అన్నాడు.

ఉత్తరం మొదలుపెట్టాను. కానీ చిన్నిగాడేం చెప్పాడో గుర్తులేక వాణ్ణి మళ్ళీ అడిగాను. ఏకళనున్నాడో గొప్ప చేయకుండానే మళ్ళీ చెప్పాడు.

"పూజ్యనీయు...." అని రాసేసరికి కాగితానికి ఒకవైపు అయిపోయింది. దైనమహా అని రాసేసరికి రెండోవైపూ అయిపోయింది. చిన్నిగాడు ఆ ఉత్తరం చూసి ఒకటే నవ్వు. నాకుడుకుమోత్తసం వచ్చి- "ఎందుకు నవ్వుతావూ ?" అనడిగాడు.

"నువ్వు బాగా చిన్నపిల్లాడివి-" అనేశాడు వాడు.

ఎందుకో కూడా వాడే చెప్పాడు. నేను రాసిన కాగితంమీద పెద్దాళ్ళయితే బోలెడు అక్షరాలు రాస్తారుట. వాళ్ళక్షరాలు చిన్నవిగా ఉంటాయిగా....అందుకని! అసలు పెద్దాళ్ళంటే చిన్నక్షరాలు రాసేవాళ్ళని అర్థంట. చిన్నాళ్ళంటే పెద్దక్షరాలు రాస్తారుట.

"ఏదీ నువ్వు రాయి చూద్దాం !" అన్నాను.

చిన్నిగాడు వెంటనే చకచకా కాగితం రెండుప్రక్కలా ఏమేమిటో రాసేశాడు నేనా కాగితం చూశాను. ఏమీ అర్థంకాలేదు.

ఇవి అక్షరాలు కావు. పిచ్చిగీతలు-" అన్నాను.

"పెద్దాళ్ళ అక్షరాలలాగే ఉంటాయి. కావాలంటే నువ్వు మీనాన్న ఉత్తరం చదువు- చూద్దాం-" అన్నాడు చిన్ని.

అప్పుడు నాకు గుర్తొచ్చింది. ఈమధ్యనే నాన్న ఊరికివెళ్ళినప్పుడమ్మ కుత్తరం రాశాడు.ఏం రాశాడని అడిగితే ఏంలేదులే అని ఊరుకుందమ్మ. అప్పుడమ్మ చూడకుండా రహస్యంగా ఆ ఉత్తరం చదవాలనుకున్నాను కానీ యిప్పుడు చిన్నిగాడి ఉత్తరంలాగే అప్పుడదీ అర్థంకాలేదు.

అంచేత చిన్నిగాడు నిజమే చెప్పాడని నాకనిపించింది. అప్పుడే వాడికి పెద్దాళ్ళలా రాయడం వచ్చేసిందంటే నేను వాడితో మాట్లాడి నెగ్గలేను. వాడు చెప్పినట్లు వినడమే మంచిది. అప్పుడు నాకింకో అనుమానం కలిగింది.

"మరి నా అక్షరాలిప్పుడేకదా చూశావు- నేను బాగా చిన్న వాణ్ణని నన్ను చూడగానే ఎలా తెలిసింది ?" అన్నాను ఆశ్చర్యంగా.

అప్పుడు చిన్నిగాడు నాకు మరో కొత్త విషయం చెప్పాడు.

పెద్దాళ్ళెవరింటికి వెళ్ళినా తమ పిల్లల్ని తిట్టి అక్కడి పిల్లల్ని మెచ్చుకుంటారట. కానీ నిజానికి వాళ్ళకి వాళ్ళ పిల్లలంటేనే యిష్టం. అది పెద్దాళ్ళకు తెలుస్తుంది. చిన్నపిల్లలకు తెలియదు.

"ఇందాకా మాఅమ్మ నన్ను తిట్టి నిన్ను పొగిడిందా? నిజానికి మా అమ్మకు నేనంటేనే ఎక్కువిష్టం. అది తెలియక నువ్వు మా అమ్మ పొగడ్తలకు సంబరపడిపోయావు. ఆ సంబరం చూడగానే నువ్వు బాగా చిన్నవాడివని నాకు తెలిసిపోయింది...." అన్నాడు చిన్నిగాడు గర్వంగా.

ఇదీ నిజమే ! అమ్మకు నేనంటేనే యిష్టం. ఎదుటి వాళ్ళతో మాట్లాడేటప్పుడు అమ్మ నాగురించి చాలా అబద్ధాలు చెబుతుంది.

ఇంట్లో నేను అస్తమానూ ఏదైనా పెట్టమని అడుగుతుంటాను. ఎప్పుడూ నీకు తిండిగొడవే పోయి ఆడుకోరాదూ అని విసుక్కుంటుందమ్మ. కానీ పక్కింటికి వెళ్ళినపుడు —"వెధవకి ఎప్పుడూ ఆటలే-బొత్తిగా ఏమీతినడు. మీవాడేది పెడితే అది బుద్ధిగా తింటాడు—" అని రాజిగాణ్ణి మెచ్చుకుంటుంది. అలాగని రాజిగాడంటే అమ్మకిష్టమూలేదు. వాడు మా యింటికొస్తే నా ఆటబొమ్మలన్నీ దాచేస్తుంది—వాడు పాడుచేస్తాడని ?

చిన్నిగాడికి చాలా తెలుసు. మరి యివి నాకూ తెలుసు. నేనూ పెద్దవాణ్ణే కావాలి. కానీ వాడొప్పుకోడు. అందుకేదైనా ట్రిక్ చేయాలి. నేను తెలివైనవాణ్ణిగా అందుకని వెంటనే అక్కణ్ణించి బాబాయి గదిలోకి వెళ్ళి ఇంకో కాగితం తీసుకుని దానిమీద పెన్సిలుతో చిన్నచిన్న గీతలు, చుక్కలూ, సున్నాలు రాసేశాను. ఆ కాగితం చిన్నిగాడి దగ్గరకు తీసుకెళ్ళి—"చూడు ! నేనూ ఉత్తరం రాశాను-" అన్నాను.

చిన్నిగాడది చూసి "ఇదేం ఉత్తరం? ఇందులో అక్షరాలు లేవు. అన్నీ గీతలూ, చుక్కలూనూ-" అన్నాడు.

"నేనూ పెద్దవాణ్ణి గదా-నా ఉత్తరం అలాగే ఉంటుంది-" అన్నాను గొప్పగా.

వెంటనే చిన్నిగాడు ఆలోచనలోపడిపోయాడు. కాసేపాగి- "నీకు మాంత్రికుడూ రాజకుమారీ కథ తెలుసా ?" అన్నాడు.

"తెలియదు. నాకు రామాయణం ఒక్కటే తెలుసు. బామ్మ నాకు రోజూ చెబుతుంది-" అన్నాను.


అప్పుడు చిన్నిగాడు ఉత్సాహంగా- "అబ్బే-అయితే నువ్వు బాగా చిన్నవాడివి. పెద్దాళ్ళు రోజూ ఒక్కటే కథ వినరు. మా బామ్మయితే నాకు రోజుకో కథ చెబుతుంది. చెప్పిన కథ మళ్ళీ చెప్పదు-" అన్నాడు.


"ఏమో-నాకు రాముడికథ రోజూ వినాలనిపిస్తుంది-" అన్నాను.

"చిన్నవాడివిగా-నీకు అలాగే అనిపిస్తుందిలే! రాముడికథ బాగానే ఉంటుంది. కానీ అంతకంటే మంచికథలింకా బోలెడున్నాయి. నువ్వు వింటానంటే నీకు మాంత్రికుడూ-రాజకుమారీ కథ చెబుతాను. అదెంత బాగుంటుందో ! చెప్పడం నాకు చాలా యిష్టం-" అన్నాడు చిన్నిగాడు.

నాకూ ఆ కథ తెలుసుకోవాలనిపించింది. నేనడగ్గానే చిన్నిగాడు చెప్పడం ప్రారంభించాడు. వాడు చెప్పినంతా మళ్ళీ చెప్పలేను కానీ క్లుప్తంగా యిదీ కథ....

అనగా అనగా ఒక మాంత్రికుడు. వాడు దేవికి వందమంది రాజకుమారుల్ని బలిస్తే ప్రపంచానికి రాముడిలాంటి చక్రవర్తి అయిపోతాట్ట. రాజకుమారుల్ని వెతికి పట్టుకొవడం కష్టం కదా! అందుకని వాడు చాలా అందమైన రాజకుమారిని ఎత్తు





కుని పోయాడు. ఆ రాజకుమారికోసం ఎక్కడెక్కడి రాజకుమారులు వెతుక్కుంటూ మాంత్రికుడి దగ్గరకే వస్తున్నారు. మాంత్రికుడు వాళ్ళను పట్టుకుని దేవికి బలిచ్చేస్తున్నాడు. పాపం-రాజకుమార్తెకు మాంత్రికుడు దుర్మార్గుడని తెలియదు. వాడు చాలా మంచివాడనుకుంటోంది. వాడుకూడా రాజకుమారికి అసలు వేషంలో కాక రాజకుమారుడి రూపంలో కనపడేవాడు. రాజకుమారి మాంత్రికుణ్ని ప్రేమించి వాడేంచెప్పినా వినేది. వందమంది రాజకుమారులను బలిచ్చి కానీ మాంత్రికుడు పెళ్ళి చేసుకోకూడదు. వాడు రహస్యంగా రాజకుమారికి తెలియకుండా తొంభైతొమ్మిది మంది రాజకుమారులను బలిచ్చేశాడు.

"తొంభైతొమ్మిదంటే తెలుసా ? వందకు ఒక్కటి తక్కువ. అంటే ఇంకొక్క రాజకుమారుణ్ని బలిస్తే మాంత్రికుడు ప్రపంచానికి చక్రవర్తి అయిపోతాడు. వాడు దుర్మార్గుడు కదా-అందర్నీ కష్టాలు పెడతాడు—" అన్నాడు



చిన్నిగాడు. వాడలా చెప్పేదాకా నాకు తొంభైతొమ్మిదన్నా తెలియలేదు, మాంత్రికుడు చక్రవర్తి కావడంవల్ల ప్రమాదమూ తెలియలేదు.

"మరి-రాజకుమారినికూడా కష్ట పెడతాడా ?" అన్నాను ఆత్రుతగా.

"మామూలు మగాళ్ళే పెళ్లాలను బోలెడు కష్టాలు పెడతారు. మరి మాంత్రికుడూరుకుంటాడా ? మాంత్రికుణ్ని పెళ్ళి చేసుకుంటే రాజకుమారి చాలా చాలా కష్టాలు పడుతుంది-" అన్నాడు చిన్నిగాడు.

"మరప్పుడేమయింది ?"

చెబుతాను విను. రాజకుమార్తెలెప్పుడూ మాంత్రికుల్ని పెళ్ళి చేసుకోకూడదు. మన రాజకుమారికి తన్నెత్తుకుని వచ్చినవాడు మాంత్రికుడని తెలియదు. అందుకని పాపం పెళ్ళికూడా ఒప్పేసుకుంది. అప్పుడేమో వందో రాజకుమారుడు అంటే ఆఖరివాడు వచ్చేశాడు-" అన్నాడు చిన్నిగాడు.

ఆ రాజకుమారుడుకూడా చచ్చిపోతాడని, మాంత్రికుడు రాజకుమారిని పెళ్ళి చేసేసుకుని కష్టాలు పెట్టేస్తాడని కంగారుపడిపోయాను కానీ అలా జరగలేదు. ఆఖరి రాజకుమారుడు రహస్యంగా రాజకుమారిని కలుసుకుని మాంత్రికుడి గురించిన అసలు నిజం చెప్పాడు. అప్పుడు రాజకుమారి సాయంతో మాంత్రికుడి ప్రాణాలెక్కడుందీ తెలుసుకుని తెలివిగా మాంత్రికుణ్ని చంపేసి తనే ప్రపంచానికి చక్రవర్తి అయి రాజకుమారిని పెళ్ళిచేసుకుని ఎన్నో ఏళ్ళు ప్రపంచాన్ని పరిపాలించాడు.

కథ బాగానేఉంది కానీ నాకంత బాగా అర్థంకాలేదు. రాముడికథైతే నాకు బాగా అర్థమయ్యేది. కథ అర్థంకాలేదంటే చిన్నిగాడు నన్ను చిన్నవాడంటాడని భయమేసింది. అందుకని- "కథ భలే బాగుంది, భలే బాగుంది, మరి నేనూ పెద్దవాణ్ణేగా"—అన్నాను.

చిన్నిగాడు వెంటనే-"ఈ కథ నేను నీకెందుకు చెప్పానో తెలుసా ?" అన్నాడు. తెలియదన్నాను నేను.

ఒక మాంత్రికుడిలాగే రాజకుమారిని ఎత్తుకునిపోతే చిన్నిగాడు రక్షించాడుట. వాడిని రాజకుమారి ప్రేమించిందట.

"అయితే నువ్వు పెళ్ళిచేసేసుకున్నావా ?"

జుట్టుకు సిల్కువంటి మృదుత్వము నిచ్చుటకు నైసర్గిక ఉపాయము...



శుద్ధమైన శీకాయిలోని సహజ లాభకర గుణములు స్వస్తిక్ శీకాకాయ్ సబ్బులో నింపబడినవి. వాడడానికి అనువైనది. లిక్విడ్ షాంపూ కంటే ఎంతో పొదుపైనది.



దీని పుష్కలమైన, మృదువైన నురగ మీ జుట్టును మెత్తగా, పూర్తిగా శుభ్రపరుస్తుంది. మీ జుట్టును ఆరోగ్యంగా, నిగనిగలాడేలా వుంచుతుంది. తాజా సువాసన నింపి పట్టువంటి మృదుత్వాన్ని ఒసగుతుంది.



స్వస్తిక్ శీకాకాయ్ సబ్బు

ఇందులో శీకాయి కలిసి వుంది. భారత స్త్రీల అందమైన జుట్టుకు పారంపర్యమైన రహస్యము.

shilpi dm 25/79 tel

"ఇంకా చేసుకోలేదు. మేమింకా ప్రేమించుకుంటూనే ఉన్నాం. ఈలోగా పనిమీద నేనిక్కడకు వచ్చేశాను. అయినా అవన్నీ పెద్దాళ్ళకబుర్లు—నీకెందుకు" అన్నాడువాడు.

"నేనూ పెద్దాడినేగా-" అన్నాను దిగులుగా. వాడొప్పుకోడేమోనని నా భయం.

నువ్వేం పెద్దాడివి. నిన్నే రాజకుమార్తైనా ప్రేమించిందా ?" అన్నాడు వాడు.

నాకు క్రోషం వచ్చింది. అయినా తెలివైనవాణ్ని కదా, అందుకని" ఇక్కడ రాజకుమారి లేదుగా- ఉంటే తప్పకుండా నన్ను ప్రేమిస్తుంది-" అన్నాను.

"అయితే నీకు నేను రాజకుమారిని చూపిస్తాను. అది నిన్ను ప్రేమిస్తుందేమో చూద్దాం-" అన్నాడు చిన్నిగాడు.

అప్పుడు నాకు లోపల్లోపల భయమేసింది. నిజంగా రాజకుమారి ఉంటే నన్ను ప్రేమిస్తుందా ? మాంత్రికుడ్ని నేను భయపెట్టగలనా ? ఇలాంటి అనుమానాలు నాకు చాలా వచ్చినా బయటకు చెప్పలేదు.

అప్పుడో తమాషా జరిగి నాలో ధైర్యం పెరిగిపోయింది.

గోడమీంచి బల్లి ఒకటి పట్టుతప్పి చిన్నిగాడిమీద పడింది. వాడు హడలిపోయి కెవ్వుమని అరిచాడు. ఆ కేక విని అమ్మ, దొడ్డ అక్కడకు పరుగెత్తుకుని వచ్చారు.

"ఏం జరిగిందిరా ? నువ్వు వాణ్నేమైనా చేశావా ? " అనడిగిందమ్మ.

నేను వెంటనే - " అబ్బే - నేనేం చేయలేదు. గోడమీంచి బల్లి వాడిమీద పడింది - " అన్నాను. చిన్నిగాడింకా వణికి పోతూనే ఉన్నాడు.

అప్పుడు దొడ్డ నవ్వేసి - "వెధవకి కప్పంన్నా, బల్లులన్నా చచ్చేటంత భయం - " అనేసి అమ్మను తీసుకుని వెళ్ళిపోయింది.

అప్పుడు నేను గొప్పగా చిన్నిగాడి వంక చూసి - 'నాకు బల్లి, కప్ప అంటే భయంలేదు. అంచేత మాంత్రికుణ్ణి నీకంటే గొప్పగా ఓడించగలను - "అన్నాను .

చిన్నిగాడు వెంటనే ఏం మాట్లాడలేదు. కాసేపాగి - " అవన్నీ తర్వాత చూద్దాం. ముందు నీకో రాజకుమారిని చూపించనీ - " అన్నాడు.

3

సాయంత్రమే చిన్నిగాడు నాదగ్గరకొచ్చి - " రాజకుమారి మీ ఎదురింట్లోనే ఉందిరోయ్. వెళ్ళి నిన్ను ప్రేమిస్తుందేమో అడుగు అది ఒప్పుకుంటే నువ్వు పెద్దాడికిందే లెక్క. అప్పుడు నేను నీతో ఆడతాను - " అన్నాడు.

ఎదురింట్లో రాజకుమారి అనగానే ఎవరో నాకు తెలిసిపోయింది. ఆ అమ్మాయి అత్తయ్య కంటే కాస్త చిన్నట. కానీ అత్తయ్య కంటే చాలా అందంగా ఉంటుంది. నవ్వినప్పుడు ఇంకా అందంగా ఉంటుంది. ఆ అమ్మాయిపేరు హేమలత. అందరూ లతా అని పిలుస్తారు. నేనూ ల్తా ఆనే అంటాను. ఆ అమ్మాయి గురించి నాకంటే ఎక్కువగా బాబాయికి తెలుసు.

లత గురించి బాబాయి నాకు చాలా చెప్పాడు. కొన్ని అర్థమయ్యాయి. కొన్ని అర్థం కాలేదు. అయితే బాబాయి కంటే నేనే ఎక్కువగా లతతో మాట్లాడాను. అయినా బాబాయికే నాకంటే ఎక్కువగా లతగురించి తెలుసు. పెద్దాళ్ళెలాగైనా చాలా గొప్పవాళ్ళు. బాబాయి అస్తమానూ తన పేరు చెప్పి లత దగ్గర పొగడమంటూండేవాడు. నాకది యిష్టముండేది కాదు. కానీ బాబాయి డబ్బులిస్తాననేవాడ. ఉత్తినే వస్తూంటే వదులుకోవడమెందుకు ? నేను లత దగ్గర బాబాయిని పొగిడేవాణ్ణి.

మాయింటికి లత ఎక్కువగానే వచ్చేది. బాబాయి లేనప్పుడు చూసుకుని వచ్చేది. నామాటలు విని లత నవ్వేది.

"మీ బాబాయి చాలా గొప్పవాడే ! కానీ ఈ విషయం నాకెందుకు చెబుతావు ? " అని లత నన్నోసార అడిగింది.

"మరి బాబాయి నాకు డబ్బులిచ్చాడుగా - " అన్నాను.

లత ఆశ్చర్యపడి - "ఎందుకు ? అంది.

"ఎందుకో నాకూ తెలియదు- " అన్నాను.

లత అందంగా నవ్వేసి - "తన్ను పొగడ్డానికి మీ బాబాయి డబ్బులిస్తాడు. ఈ విషయం నాకు చెప్పినట్లు బాబాయికి చెప్పకు -" అంది.

"చెబితే నీకేం ? " అన్నాను.

లత నన్నెత్తుకుని బుగ్గలమీద ముద్దు పెట్టుకుని- " చెబితే ఇంకెప్పుడూ నీకు డబ్బివ్వరు -" అంది.

లత నన్ను చాలాసార్లు ముద్దు పెట్టుకుంది. లత ముద్దు నాకెంతో బాగుంటుంది. ఎందుకంటే నన్ను అమ్మ, నాన్న, బాబాయి, అత్తయ్య, బామ్మ - అంతా ముద్దు పెట్టుకోవటం గొప్పకాదు. అప్పుడప్పుడు నాన్న స్నేహితులు, బాబాయి స్నేహితులు, మా యిరుగు పొరుగువాళ్ళు కూడా నన్ను ముద్దు పెట్టుకుంటూంటారు. అయితే వాళ్ళు మావాళ్ళు చూస్తున్నప్పుడే ముద్దు పెట్టుకుంటారు. ఎందుకంటే వాళ్ళు నామీద యిష్టంతో నన్ను ముద్దు పెట్టుకోరు. నావాళ్ళని సంతోషపెట్టడం కోసం నన్ను చేరదీస్తారు.

ఈ విషయం నాకూ బాబాయే చెప్పి "ఎవరైతే నిన్ను ఎవరూ చూడనప్పుడు కూడా ముద్దుపెట్టుకుంటారో వాళ్ళకు నిజంగా నువ్వంటే యిష్టమన్నమాట" అన్నాడు. అప్పట్నుంచీ నేను అందరినీ శ్రద్ధగా గమనించడం మొదలు పెట్టాను.

మా వీధిలోనే బాపయ్యగారని ఉన్నారు. ఆయన్ని బాపయ్య తాతయ్యగారని అంతా పిలుస్తారు. నేనైతే తాతయ్యగారనే అంటాను. ఆయన రోజూ సాయంత్రం మా యిందికి వచ్చి కూర్చుని పేపర్లూ పుస్తకాలూ చదివి వెడుతూంటారు. ఆయన నన్ను రోజూ ముద్దులాడేవాడు. ఆయనకు పిల్లలంటే చాలా యిష్టమని మా ఇంట్లో చెప్పుకుంటారు. బాబాయి చెప్పేదాకా నేనూ నిజమేనని అనుకున్నా.

ఒకరోజున ఆయనొక్కడూ వీధి గదిలో కూర్చుని పేపరు చదువుతూంటే నేను వెనక నుంచి వెళ్ళి ఆయన జుట్టుపట్టుకుని లాగాను. ఆయనకెంతో జుట్టులేదు. ఒకసారి బాబాయి నాచేతులవంక చూసి-" ఒరేయ్-నానీ! నీవి చిట్టిచిట్టి చేతులు ఈ చేతుల్తో అయితే బాపయ్య తాత జుట్టు కూడా పట్టుకుని లాగొచ్చు -" అన్నాడు. అదెంతవరకూ నిజమో చూడాలని ఒకరోజున ఆపని చేస్తే ఆయన నాకేసి చాలా కోపంగా చూశాడు. ఇంతలో ఆ గదిలోకి నాన్న వచ్చాడు. అప్పుడా తాతయ్య చేతిలోని పేపరు పక్కన పడేసి నన్నమాంతం ఎత్తేసుకొని "మీ వాడు చాలా చిలిపి. నా జుట్టు పట్టుకొని లాగుతున్నాడు." అంటూ నన్ను ముద్దులాడేశాడు. అదంతా నాటకమని నాకు నిజం తెలిసిపోయిందిగా ఇంక ఆ ముద్దులు నాకు బాగోలేవు.

అలాగే నాన్నగారి స్నేహితుడింకొకడున్నాడు. ఆయన ఎప్పుడూ మా యింటికి అప్పుకోసమే వస్తాడు. ఇంట్లో అందరూ ఆయన్ని అప్పారావంటూంటే నేనదే ఆయన పేరనుకుని ఓ రోజున ఆయన మా యింటికి రాగానే "నాన్నా - అప్పారావుగారొచ్చారు" అని కేక పెట్టాను. అప్పుడు నాన్న కంగారుగా పరుగెత్తుకొచ్చి "అప్పారావుగారంటే ఈయన కాదురా- ఈయన పేరు రమణమూర్తి -" అని చెప్పాడు. రమణమూర్తయితే యింట్లో అప్పారావని చెప్పుకుంటారేమని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. కానీ నాన్న నన్నింక మాట్లాడ నివ్వకుండా నోరు నొక్కేసి లోపలకు తీసుకుని పోయాడు. ఆ తర్వాత కూడా యింట్లో రమణమూర్తిని అప్పారావనే అంటున్నారు. నేనుమాత్రం ఆయన వచ్చినప్పుడు -

రమణమూర్తిగారొచ్చారనే అంటున్నాను. అయితే నాకూ ఆయన్ని అప్పారావని పిలవాలని సరదాగా ఉంది. కాని యింట్లో ఒప్పుకోవడం లేదు. పెద్దవాళ్ళంతే అంతే! తమ సరదాలు తమవేగానీ పిల్లల సరదాల గురించి పట్టించుకోరు.

ఇంతకీ ఆ అప్పారావుగారు మా యింటికొచ్చినప్పుడు నేను కనపడగానే - యింట్లో మీ నాన్నఉన్నాడా - అనడుగుతాడు. నాన్న లేడంటే నా ముఖంకేసి మళ్ళీ చూడకుండా వెనక్కు వెళ్ళిపోతాడు. నాన్న ఉన్నాడంటే పిల్చుకురమ్మంటాడు. నాన్నొచ్చేదాకా ఆగి అప్పుడే నాన్న చూస్తూండగా నన్ను ముద్దులాడుతాడు.

పాపం లత అలా కాదు. ఎవ్వరూ చూడకపోయినా సరే - గదిలో మేమిద్దరమే ఉన్నా సరే - నన్ను ముద్దు పెట్టు కుంటుంది. అంటే లతకు నిజంగానే నేనంటే యిష్టమన్న మాట.

లతకు ఆ విషయం చెప్పి మెచ్చుకుంటే" నువ్వంటే నిజంగా నాకిష్టమని నీకెలా తెలుసు?" అంది.

అప్పుడు నేను లతకు బాబాయి చెప్పిందంతా చెప్పాను. అది విని లత ఒకటే నవ్వు. లత నవ్వుతోంది కదా అని నేను ఇంకా చెప్పేను. ఏవరైనా నా మాటలు విని నవ్వుతూంటే నాకింకా ఏమేమో చెప్పాలనిపించేస్తుంది.

"నాన్న చూస్తుండగా బాపయ్య నెత్తిమీద మొట్టికాయలు మొదతాను అయినా ఆయన నన్ను ముద్దులాడుతాడు-" అన్నాను.

లత యింకా నవ్వింది.

"బాపయ్య తాతయ్యకు పంది ఊడపీకేస్తాను." అన్నాను.

లత మందలిస్తున్నట్లు" తప్పమ్మా - అలా అనకూడదు." అంది.

"ఏం?" అన్నాను.

"నువ్వు మంచివాడివికదా - అందుకే నాకిష్టం. నువ్వు చెడ్డపనులు చేస్తే నా కిష్ట ముండదు," అంది లత.

"అయితే ఈ రోజు నుంచీ ఒక్క చెడ్డపని కూడా చెయ్యను" అన్నాను వెంటనే.

"మరి మీ బాబాయిని పొగడ్డం కూడా చెడ్డపనే !" అంది లత.

అంతే - ఆ తర్వాత ఒక్కసారికూడా లతదగ్గర బాబాయిని పొగడలేదు. లత నన్నెంతో మెచ్చుకుని - మానాని నామాట వింటాడు కదా ! అందుకని నాకెంతో యిష్టం - అంది.

అప్పుడు నేను - "లతా - ఎంత యిష్టమో చెప్పవా ? అన్నాను.

నా ప్రశ్న లతకు అర్థంకాలేదు. అప్పుడునేను— "నాకైతే అందరికంటే అమ్మంటే యిష్టం. ఎందుకంటే అమ్మలేకుండానేనుండలేను. ఆ తర్వాత నువ్వంటేనే యిష్టం. నువ్వుకూడా అలాగే నేనంటే ఎంతిష్టమో చెప్పాలి" - అన్నాను.

"మరినీకు మీ నాన్న, బామ్మ, అత్తయ్య, బాబాయి అంటే ఇష్టం లేదా?" అంది లత.

"ఎందుకులేదూ ? కానీ వాళ్ళందరూ నీ తర్వాతే !" అన్నాను. ఇలా గనడం బామ్మదగ్గర నేర్చుకున్నాను. బామ్మనెప్పుడైనా నేనంటే ఎంతిష్టం బామ్మా అనడిగితే—ఎవరైనా నే తర్వాతేరా అంటుంది.

లత నన్ను మళ్ళీ ముద్దుపెట్టుకుని - "నాకైతే ఎవరైనా నీ తర్వాతే అంటే మా అమ్మకంటేకూడా నాకిష్టం"— అంది.

అప్పుడేమో చిన్నిగాడొచ్చి లత నన్ను ప్రేమిస్తేనే పెద్దాడినని ఒప్పు కుంటానన్నాడు. లత నాకోసం ఏమైనా చేస్తుంది. నాకా నమ్మకముంది. అందుకని లత దగ్గరకు పొద్దున్న మేమురాసిన ఉత్తరాలు తీసుకుని వెళ్ళాను. కానీ వెంటనే చూపించలేదు. ఆ ఉత్తరాలను జాగ్రత్తగా నిక్కరు జేబులో దాచాను.

లత నన్ను చూసి — "ఏరా—నానీ—" అంటూ పలకరించింది. అక్కడ కాస్తదూరంగా లతా వాళ్ళమ్మ ఉంది. అందుకని నేను లతతో నెమ్మదిగా — "నీతో రహస్యంగా మాట్లాడాలి -" అన్నాను,

లత చటుక్కున ఎత్తుకుని నన్ను తన గదిలోకి తీసుకువెళ్ళి — "ఇప్పుడు చెప్పు - నీ రహస్యమేమిటో- ?" అనడిగింది.

నేను గంభీరంగా - "లతా ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వూ నన్ను ప్రేమిస్తావా ?" అనడిగాను.

అప్పుడు లత ముఖం కూడా గంభీరంగా అయిపోయింది - ఇలాగని నిన్ను మీ బాబాయడగ మన్నాడా ? అంది.

"మా బాబాయికాదు - నేనే నిన్ను ప్రేమిస్తున్నాను - " అన్నాను.

లత నన్ను మంచం మీద కూర్చోబెట్టి - "ప్రేమంటే నీకు తెలుసా ?" అంది.

"తెలుసు - మనమిద్దరం పెళ్ళిచేసుకుంటాం - " అన్నాను.

పెళ్ళంటే నీకు తెలుసా?" అంది లత మళ్ళీ.

"ఎందుకు తెలియదు? పెళ్ళిచేసుకుంటే మనమిద్దరం ఒకే గదిలో పడుకో వచ్చు-" సరదాగా బోలెడు కబుర్లు చెప్పుకోవచ్చు—అన్నాను. ఇంకా గౌరవం గురించీ, చేగోడీల గురించీ చెప్పలేదు. ఇలాంటివి తెలివైనవాళ్ళు ముందు చెప్పరుగదా !

లత ఆశ్చర్యపడింది. పెళ్ళంటే దానికి తెలియదుట- "నీకు చాలాతెలుసురా నానీ !" అంది.

"మరి నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అన్నాను.

"ఏమో—అప్పుడే చెప్పలేను. నేను చాలా ధైర్యవంతుణ్ణి కానీ పెళ్ళి చేసుకోను." అంది లత.

"ఏం?" అన్నాను.

"ధైర్యవంతుడైతే నాకే కష్టాలొచ్చినా రక్షిస్తాడు. అందుకని ? అంది లత

"అయితే యింకేం - నేను చాలా ధైర్యవంతుణ్ణి - తెలుసా? నాకు కప్పలన్నా, బల్లులన్నా అస్సలు భయం లేదు-" అని "ఆ చిన్నిగాడైతే వాటికన్నింటికీ భయమే! అన్నాను గొప్పగా.

"చిన్నిగాడెవరు?" అంది లత.

అప్పుడు నేను లతకు చిన్నిగాడి గురించి అంతా చెప్పేశాను. అలా చెప్పడంలో నాకు తెలియకుండా మొత్తం జరిగిందంతా చెప్పేశాను.

"నువ్వన్నీ అబద్ధాలు చెబుతున్నావు-" అంది లత.

"నువ్విలాగంటావని నాకు తెలుసులే - అందుకనే ఉత్తరాలు కూడా తీసుకొచ్చాను చూడు-" అంటూ నానిక్కరు జేబులోని ఉత్తరాలుతీసి చూపించాను. మొత్తం మూడుత్తరాలవి.

లత మొదటి ఉత్తరం చూసి- "నీ ఉత్తరం చూస్తుంటే నీ అక్షరాలు వామనుడి అడుగుల్లా కనబడుతున్నాయి-" అని నవ్వింది.

"వామనుడి అడుగులా? అవేమిటి?" అన్నాను.

"బలిచక్రవర్తి వామనుడికి మూడడుగుల నేల దానమిచ్చాడు. వామనుడు రెండే రెండు అడుగులతో మొత్తం ప్రపంచాన్నంతా ఆక్రమించాడు. మూడో అడుగు పెట్టడానికెక్కడా చోటు లేకపోతే బలిచక్రవర్తి తన తలను చూపించాడు. నీ అక్షరాలు కూడా అంతే! గట్టిగా రెండు పదాలు రాయడానికి కాగితం రెండువైపులా చాలలేదు-" అంటూ నవ్వింది లత.

లత చెప్పింది నాకు సరిగ్గా అర్థం కాలేదు -" అసలా వామనుడెవరు?" అనడిగాను.

"వామనుడంటే విష్ణుమూర్తి అవతారం -" అంది లత.

అంటే దేవుడి అవతారమన్నమాట. లతకు నేనంటే యిష్టం కదా - అందు కని నన్ను గొప్పవాళ్ళతోటే పోలుస్తుంది మరి.

తర్వాత లత మా యిద్దరి ఉత్తరాలూ చూసి-" చిన్నిగాడు నిన్ను మోసం చేశాడు. వాడన్నీ గీతలూ, సున్నాలూ రాశాడు. అవే అక్షరాలని అబద్ధం చెప్పాడు. వాణ్ణిలా పిల్చుకునిరా-" అంది.

"వద్దు లతా: నేనూ అలాగే చేశాను కదా!" అన్నాను.

"నువ్వలా చేయడమేమిటి? ఎంచక్కా అక్షరాలు రాస్తేనూ - నీ ఉత్తరం నేను చిన్నిగాడికి చదివ్వినిపిస్తాను - ఇలా పిల్చుకునిరా -" అంది లత.

నేను అక్షరాలే రాశాననగానే నాకెంతో సంతోషం కలిగింది. వెంటనే వెళ్ళి చిన్నిగాణ్ణి పిల్చుకుని వచ్చాను. వాడికి అసలు సంగతి చెప్పలేదుగా - అందుకని హుషారుగానే వచ్చాడు. అప్పుడు లత వాడి ఉత్తరాన్ని చూపించి దెబ్బలాడేసింది వాడు వెంటనే నిజం ఒప్పేసుకుని - "మరి నానిగాణ్ణి కూడా తిట్టు-" అన్నాడు

"నానిగాణ్ణెందుకూ తిట్టడం - వాడించక్కా ఉత్తరం రాస్తేనూ-" అంది లత.

అదేం ఉత్తరం ? అన్నీ పిచ్చిగీతలూ, సున్నాలూనూ-" అన్నాడు చిన్ని గాడు.

"ఇవి పిచ్చిగీతలా - నీకు చదవడం రాకపోతే సరి -" అని - మహా రాజశ్రీ పూజ్యునీయుడైన సత్యనారాయణకు నాని నమస్కరించి వ్రాయునది-"అని మొదలుపెట్టింది లత.

అదంతా నేనే రాశానని నాకూ తెలియదు. లత చదువుతూంటే నాకు చాలా సంతోషం కలిగింది. నాలో నేనే నవ్వేసుకుంటున్నాను. అపుకుందామన్నా ఆగడం లేదు.

లత ఉన్నట్లుండి నన్నుచూసి - "అదేంటి నానీ ! అలా నీలో నువ్వే నవ్వేసుకుంటున్నావు?" అంది.

అతికష్టంమీద నవ్వాపు కున్నాను, "ఇంకా చదువు లతా! నేనేం రాశానో వినాలనుంది-" అన్నాను.

కానీ లత చదవడం ఆపేసి తనూ నవ్వటం మొదలెట్టింది.

చిన్నిగాడికక్కడ నచ్చలేదు కాబోలు - నాతో నెమ్మదిగా -" ఇక్కణ్ణించి వెళ్ళిపోదాంరా -" అన్నాడు.

ఆ మాటలు విందో లేదో కానీ లత - "ఏయ్ చిన్నీ - నేను నానిన్ని ప్రేమి స్తున్నాను. నువ్వు వాడితో ఆడకపోయావో రోజూ మీ యింటికొచ్చి మరీ నిన్నేడి పిస్తాను" అంది.

చిన్నిగాడు బుద్ధిగా తలూపి "నేనసలిక్కడికి నానిగాడితో ఆడుకుందుకే వచ్చాను. ఊరికే ఏడ్పించడానికని అలాగన్నాను కానీ నువ్వు చెప్పకపోయినా వాడి తోనే ఆడుకుంటాను." అన్నాడు.

ఆ తర్వాత చిన్నిగాడు నాతో బాగానే ఆడేవాడు. కానీ వాడికి లతంటే చాలా కోపంగా ఉంది. "నీ రాజకుమారి చాలా తెలివి తక్కువది. నిన్ను ప్రేమించింది కదా - మాంత్రికుడెవరైనా మాయచేస్తే నువ్వేం చేయగలవు? నీకు మాంత్రికుల గురించి బొత్తిగా ఏమీ తెలియదు -" అన్నాడు నాతో.

ఏం నేనేం తక్కువ ? నీకైతే బల్లులన్నా కప్పలన్నా భయం. నాకా భయంలేదు - " అన్నాను గొప్పగా.

చిన్నిగాడు నవ్వేశాడు - "అసలు సంగతి నీకు తెలియదుగా. అందుకే నీకు బల్లులన్నా, కప్పలన్నా భయంలేదు - " అన్నాడు.

మాంత్రికుడు రాజకుమారుల్ని కప్పలుగానో, బల్లులుగానో మార్చేస్తాడుట వాటిని చూడగానే పొరపాటున తను వాటిని చంపితే మనుషులే చచ్చిపోతారని గుర్తుకొచ్చి భయంవేసి చిన్నిగాడలా అరుస్తాడుట.

"అమ్మయ్యో - మాంత్రికుడికి మంత్రాలు తెలుస్తాయన్నమాట. అలాంటి మాంత్రికుడిని నువ్వెలా ఓడించావు ? " అనడిగాను.

చిన్నిగాడు చాలా గొప్పగా ముఖంపెట్టి - "నేను చెప్పినట్లే విన్నావంటే మాంత్రికుడి గురించిన రహస్యాలన్నీ నీకే చెబుతాను - అన్నాడు.


నేను వాడి షరతులన్నింటికీ ఒప్పుకున్నాను.


పూర్వం మాంత్రికులైతే భుజాలనుంచి పాదాలదాకా ఒక్కటే పొడుగ్గా ఉండే చొక్కా వేసుకునేవాళ్ళుట.

వాళ్ళకు గెడ్డాలూ, మీసాలూ ఉండేవిట. ఎప్పుడూ కోపంగానే చూసేవాళ్ళుట నవ్వినాసరే అహ్హహ్హహ్హ అని పెద్దగా చప్పుడు చేసేవారుట చేతిలో మంత్ర దండం ఉంటుండిట. మనకు అర్థంకాని భాషమాట్లాడే వాళ్ళుట.

ఇప్పుడలా ఉంటే మాంత్రికులెవరో వెంటనే తెలిసిపోతుంది కదా ! అయినా ఇప్పుడు మనుషులెక్కువైపోయారు. అన్నిచోట్లా ఊళ్ళొచ్చేస్తున్నాయి. అడవులూ, కొండలూ తగ్గిపోతున్నాయి. అందుకని మాంత్రికులుండడానికి వేరేచోటులేక వాళ్ళు మనుషుల మధ్యనే ఉంటున్నారుట.

ఇప్పుడు మాంత్రికులు సన్నగా పొడుగ్గా అందంగా ఉంటారుట. వాళ్ళకు గెడ్డాలుండవు కానీ మీసాలుంటాయిట. ఎప్పుడూ నవ్వుతూ ఉంటారుట. మంచిగా మాట్లాడుతారుట. వాళ్ళెంత తెలివైన వాళ్ళంటే - వాళ్ళు చెడ్డపనులు చేసినాసరే -





ఎవరూ వాళ్ళని తిట్టరు సరిగదా పొగుడుతారట. మంచిగా అనిపిస్తూనే మంచిగా మాట్లాడుతూనే అందర్నీ మాయచేస్తారుట. అందరికీ అన్యాయం చేస్తారుట. మాంత్రికుల కారణంగా ఎందరో చచ్చిపోతారుట. అయినాసరే ఎవ్వరూ వాళ్ళ నసహ్యించుకోకుండా ప్రేమిస్తారుట.

"ఇవన్నీ నీకెలా తెలిసాయి?" అన్నాను ఆశ్చర్యంగా.

"నన్నో రాజకుమారి ప్రేమించిందన్నానుగా. అది చెప్పింది-" అన్నాడు చిన్నిగాడు.

"నువ్వు చెప్పినవన్నీ వింటే అమ్మా, నాన్న, బామ్మా- అందరూ మాంత్రికులే ననిపిస్తోంది-" అన్నాను భయంగా.

"అలాకాదు. వాళ్ళందరికీ నిజంగానే మనమంటే యిష్టం. మాంత్రికులంటే బయటి వాళ్ళలోనే ఉంటారు. మనం జాగ్రత్తగా పరీక్షించి వాళ్ళెవ్వరో తెలుసుకోవాలి. వాళ్ళకు తెలియకుండా వాళ్ళ మోసాన్ని బయటపెట్టాలి. అంటే మనం కూడా వాళ్ళతో మంచిగా ఉండి నమ్మించాలి. అప్పుడే మనం వాళ్ళనోడించగలం-" అన్నాడు చిన్ని.

"మాంత్రికులతో నాకేంపని? అసలు నేను వాళ్ళ జోలికి వెళ్ళకపోతే వాళ్ళూ నాజోలికి రారుకదా!" అన్నాను.

"మరి నీ రాజకుమారిని ఏ మాంత్రికుడైనా మాయచేస్తే చూస్తూ ఊరుకుంటావా?" అన్నాడు చిన్నిగాడు.

"ఊరుకోను కానీ అందుకో ఉపాయమాలోచించాను" అన్నాను. అదేమిటని చిన్నిగాడడిగినా చెప్పలేను.

బామ్మ రోజూ పూజచేసుకునే దేవుణ్ణి ఏం కోరుకుంటే అది జరిగిపోతుందట. లతను ఏమాంత్రికుడూ మాయచేయకుండా కాపాడమని ఆ దేవుణ్ణే ప్రార్థిస్తే ఇంక ఏ సమస్యా ఉండదు.

ఈ విషయం చిన్నిగాడికి చెప్పలేదు. చెబితే వాడు ఆ దేవుడి దగ్గరకెళ్ళి—లతను మాంత్రికుడు మాయచేసేలా చేసేస్తాడేమోనని నా భయం.

చిన్నిగాడు మా ఊళ్ళో వో పదిరోజులున్నాడేమో తర్వాతేమో వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేటప్పుడు నాతో "నీ రాజకుమారినెలా రక్షించుకుంటావో ఏమో- నాకు చాలా జాలేస్తోంది. అసలే నువ్వు చిన్నవాడివి అమాయకుడివి కూడాను—" అన్నాడు.

4

ఆ తర్వాత కొన్నాళ్ళకే అత్తయ్య అత్తారింటికెళ్ళిపోయింది. బాబాయి కుద్యోగ మొచ్చి బొంబాయెళ్ళిపోయాడు.

నన్నేమో బళ్ళోవేశారు. నేను చాలా తెలివైనవాణ్ణిగా - అందుకని బళ్ళో వేసారు చెప్పగానే అన్నీవచ్చేసేవి. అందుకని యింట్లో యింకేమీ చదివేవాణ్ణి కాదు. అమ్మ నాన్న నన్ను దెబ్బలాడే వారు. అన్నీవచ్చేస్తే యింకేం చదువుకుంటాను? ఆ సంగతి బామ్మకూ, లతకూ చెప్పుతున్నాను. వాళ్ళు నా మాటే రైటన్నారు.

ఇంటి దగ్గర ఎప్పుడూ ఎక్కువగా లతతో ఆడుకునేవాణ్ణి. అత్తయ్య వెళ్ళిపోయిందని బెంగెట్టుకున్నాననుకుని - అంతా నన్ను లతతో ఆడుకోనిచ్చేవారు. లతానేనూ ప్రేమించుకున్నామని ఎవరికీ చెప్పలేము. లత ఆ విషయం రహస్యంగా ఉంచమంది. ప్రేమ గురించి ముందు పెద్దవాళ్ళకు చెప్పకూడదుట.

ప్రేమించుకున్న వాళ్ళింకా ఏం చేయాలో నేను తెలివిగా పెద్దవాళ్ళ నుంచే చాలా తెలుసుకున్నాను.

మొదటి దేమిటంటే ప్రేమించుకున్నవాళ్ళు త్యాగం చెయ్యాలి. త్యాగమంటే అమ్మ నాకు నాలుగు చేగోడీలిస్తే అందులో రెండు లతకివ్వడం. నేను లతకోసం చాలాసార్లు త్యాగం చేశాను. కానీ లతకూడా నన్నింకా ప్రేమించిందిగా - అందుకని తనూ త్యాగం చేసేది. నా త్యాగం కంటే లత త్యాగం తియ్యగా ఉండేది. అంటే లత నాకోసం మిఠాయి, గులాబ్‌జాం, జిలేబీ లాంటివి తెచ్చిచ్చేది.

రెండో దేమిటంటే ప్రేమికుడు ప్రియురాలికోసం సాహస కార్యాలు చేయాలి. సాహసకార్యమంటే పక్కింటికి వెళ్ళి పిన్నిగారింకా సీరియల్ చదవకుండానే వారపత్రిక సంపాదించి లతకివ్వడం. ఈ సాహస కార్యం రెండుసార్లే చేశాను. మూడోసారి పక్కింటి పిన్నిగారు అమ్మకు చెప్పేసింది. అమ్మ నాన్నకు చెప్పేసింది. నాన్న నన్ను గట్టిగా తిట్టి-అలా ఎందుకు చేశావని అరుస్తూ అడిగాడు. నేను మాత్రం లతా నేనూ ప్రేమించుకున్నామని చెప్పలేదు. మళ్ళీ సాహసకార్యం చేయలేదు. అయినా రెండుసార్లు చేశావుకదా అదిచాల్లే అని లత చెప్పింది.

మూడో దేమిటంటే ప్రేమించుకున్న వాళ్ళెప్పుడూ ఒకరిగురించి ఒకరు ఆలోచించుకోవాలిట. ఒకరికొకరు కల్లో కనపడాలిట. నేను రోజూ తనకు కలలో కనబడుతున్నానని లత నాకు చెప్పింది. అబద్ధమెందుకూ లత ఎప్పుడూ నాకు కలలో కనబడలేదు. రాత్రి బామ్మదగ్గర పడుకుని రామాయణం వింటాను కదా— ఎందుకో అప్పుడు నాకు అసలు లత గురించి గుర్తురాదు. కలలో నాకు చాలా సార్లు రాముడూ, ఆంజనేయుడూ కనిపించారు. అప్పుడు నేను వాళ్ళకు దణ్ణం పెట్టుకున్నానుకూడా. మరి నేను లతకు కల్లో కనిపిస్తున్నానందిగా - అందుకని బాగుండదని నేనుకూడా లత నాకు కల్లో కనిపిస్తోందని అబద్ధం చెప్పేశాను. అబద్ధం చెప్పడం నాకునచ్చలేదు. ఎప్పుడో అది అబద్ధమని చెప్పేస్తాను.

అయితే కొన్ని అబద్ధాలు చెప్పకతప్పదు. అమ్మ నన్ను దగ్గరగా తీసుకుని —"మానానిగాడికి ఆటలంటే యిష్టమా? చదువంటే యిష్టమా? అంటుంది. అప్పుడు నేను కాసేపు సందిగ్ధంలో పడి అబద్ధం చెప్పేస్తాను. పిల్లలెవరికైనా ఆటలంటేనే యిష్టముంటుంది. కానీ చదువంటే యిష్టమని చెబితే పెద్దాళ్ళు సంతోషిస్తారు.

లతా, నేనూ ఎంతో ప్రేమగా ఉంటున్న విషయం కూడా అందుకే రహస్యంగా ఉంచాలని లత నాకు చెప్పింది.

సరేలే అనుకున్నాను కానీ నాకో కొత్త కష్టం వచ్చింది.

నేను ఇంట్లో బాగా చదవడం లేదని నాన్న నా కోసం ఓ ప్రైవేటు మేస్టర్ని పెట్టారు.

"వాడి కన్నీ వచ్చేసు కదురా - ఇంట్లో కూడా మళ్ళీ చదువెందుకూ-" అని బామ్మ నాన్నను దెబ్బలాడితే - "వీడి కన్నీ తొందరగా వచ్చేస్తున్నాయి కాబట్టే యింట్లో ప్రైవేటు. అప్పుడు డబల్ ప్రమోషన్ వస్తుంది. వీడింత ఉండగానే కలెక్టరైపోతాడు. అని నాన్న బామ్మకు చెప్పుకున్నాడు.

కలెక్టరంటే చాలా గొప్ప ఉద్యోగం పోలీసులందరూ కలెక్టరుకు దణ్ణంపెట్టి కలెక్టరు చెప్పినట్లే చేస్తారుట. పోలీసులంటే దొంగాళ్ళకు భయం. మాంత్రికులకూ భయమే అయుంటుంది. అందుకే నాకు కలెక్టరవ్వాలనుంది. అసలు నాకు పోలీసు వీపుమీద కూర్చుని గుర్రపు ఆట ఆడాలని సరదాగాఉంది.

నాకిప్పుడే కలెక్టరై పోవాలనుంది. కానీ చదువుకోవాలంటే విసుగ్గా ఉంది. ఏం చేయాలా అని సందిగ్ధంలో పడి పోనీ కలెక్టరు కాస్త ఆలస్యంగా అయితేనేం అనుకున్నాను. కానీ ప్రైవేటుమేస్టరు వదలడే?

బళ్ళో పాఠాలు చాలా సులువుగా ఉండేవి. కానీ ప్రయివేటు మేస్టారు అవికాకుండా ఏవో కష్టమైన పాఠాలు చెప్పేవాడు. అవి నాకు వచ్చేవి కావు.

"కష్టపడి చదువు. అన్నీ వస్తాయి" - అంటాడు మేస్టారు.

బళ్ళో చదువుకుంటున్నానా, యింటి దగ్గర ప్రైవేటప్పుడు చదువుకుంటున్నానా - మళ్ళీ యింకా చదువేమిటి? అస్తమానూ చదువుకుంటే యింక ఆటలెప్పుడు? లతను ప్రేమించేదెప్పుడు?

వాళ్ళకీ వీళ్ళకీ చెప్పడమెందుకని ఈ విషయం మేస్టర్నే అడిగేశాను. మేస్టారు నాకు వెంటనే తొడపాశంపెట్టి - "ఏ రోజు పాఠాలారోజు అప్పచెప్పక పోతే రోజుకోలా నిన్ను బాధపెడతాను. అన్నారు.

వాడు తొడపాశం పెట్టిన చోట నాకు చాలా మంటపుట్టింది. వెంటనే పరుగున బామ్మ దగ్గరకు వెళ్ళిపోయి మేస్టారు నన్ను కొడుతున్నారని చెప్పాను. బామ్మకు నేనంటే యిష్టం కదా - వెంటనే కోపంగా మేస్టారు దగ్గర కొచ్చేసింది.

బామ్మింకా ఏదో మాట్లాడేలోగా మేస్టారేంచేశాడో తెలుసా ?

"బామ్మగారూ - మీ ముఖంలో దివ్యతేజస్సుంది. ఒక్కసారి మీ కాళ్ళకు నమస్కరించనివ్వండి-" అంటూ చటుక్కున బామ్మ కాళ్ళకు వంగి దణ్ణం పెట్టారు.

అంతే - బామ్మ కోపం మర్చిపోయి మేస్టారితో ప్రేమగా మాట్లాడ్డం మొదలు పెట్టింది. మేస్టారేమో ఆగకుండా బామ్మను పొగిడేస్తున్నారు.

ఇంకలాభంలేదని నేను బామ్మను గోకాను. బామ్మ పట్టించుకోకుండా మేస్టారి పొగడ్తలు వినేస్తోంది. ఆఖరికి నేను - "బామ్మా !" అని గట్టిగా అరిచాను.

అప్పుడు బామ్మ ఉలిక్కిపడింది. నేను చాలాసార్లు ఉలిక్కిపడుతూంటాను. మనం బాగా ఆడుకుంటూంటే పెద్దాళ్ళు మధ్యలో "నానీ !" అనిగట్టిగా అరుస్తారు. అప్పుడు మనం కంగారుపడతాంగదా - అదే ఉలిక్కిపడ్డమంటే ! ఎప్పుడూ నేనే ఉలిక్కిపడ్డం అయ్యేది. ఇప్పుడు నా పిలుపుకు బామ్మ ఉలిక్కిపడితే నాకు చాలా సంతోషం కలిగింది.

బామ్మ ఉలిక్కిపడిందా - ఆ తర్వాత నేను చెప్పకుండానే మేస్టార్ని అడిగేసింది - "ఏమిటీ - మా నానిగాణ్ణి కొట్టావుట"- అంటూ అప్పుడు నాకు బామ్మ మీద చాలా కోపం వచ్చింది. తప్పుచేసిన వాళ్ళని అలాగేనా మందలించేది ? అసలు బామ్మ మాటల్లో కోపంలేదు. పైగా నవ్వుతోంది కూడా.

"మీ నానిని నేను కొట్టడమా? భలేవారే - వాడంటే నాకెంతో ముద్దు. వాడి పాలబుగ్గలు చూస్తూంటే ఎవరికైనా కొట్టబుద్దేస్తుందా? వాడు పాఠం వినడం యిష్టం లేనప్పుడల్లా కొట్టానని అబద్ధంచెప్పి పారిపోతున్నాడు —" అన్నాడు మేస్టారు.

అప్పుడు బామ్మ నన్నే తిట్టింది.

"బామ్మా - మేస్టారు అబద్ధం చెబుతున్నాడు. నన్ను నిజంగా కొట్టాడు-" అన్నాను.

"కొడితే ఎక్కడ కొట్టానో చూపించు -" అన్నాడు మేస్టారు.

వెంటనే మేస్టారు తొడపాశం పెట్టిన చోటు చూపించాను. బామ్మ అక్కడ చూసి- "భడవకానా - అన్నీ అబద్ధాలు -" అంది.

నిజంగానే అక్కడే గుర్తులేదు. నేను చాలా ఆశ్చర్యపడ్డాను. బామ్మ వెళ్ళిపోయింది.

అప్పుడు మేస్టారు - "నేను చెప్పినట్లు బుద్ధిగా పాఠాలు చదువుతున్నావా సరేసరి ! లేకపోతే రోజూ నీకు దెబ్బలే! నేను కొట్టేదెబ్బలు నీకు నొప్పిపెడతాయి కానీ నేను కొట్టినట్లు ఎవ్వరికీ తెలియదు. నేను మాంత్రికుణ్ణి తెలిసిందా ?'" అన్నాడు.

మాంత్రికుడనగానే నాకు భయమేసింది. అప్పటిదాకా నేను మేస్టారు గురించి అలా ఆలోచించలేదు. నాకప్పుడు చిన్నిగాడి మాటలు గుర్తుకొచ్చాయి. మేస్టార్ని పరీక్షగా చూశాను.

వాడు చిన్నిగాడు చెప్పినట్లే సన్నగా పొడుగ్గా అందంగా ఉన్నాడు. గెడ్డ లేదుకానీ మీసాలున్నాయి. ఆ మీసాలవల్ల హుందాగా బాగున్నాడు. వాడెప్పుడూ నవ్వుతూనే ఉంటాడు. ఆఖరికి నన్ను కొట్టేటప్పుడు కూడా నవ్వుతూనే ఉంటాడు.

బకాయిపుట్టుక

శ్రీ సి. హేమచందర్

గడ్డ విరచి గట్టుపెట్టి
విత్తు చల్లి నీరు పెట్టి
నారు పెంచి నాటు వేసి
కలుపు తీసి పిండి చల్లి
కాలు అరుగ తిరిగి తిరిగి
చేనుచుట్టు కాపుకాసి
పైరు పెంచి పెద్దజేసి
కండలెల్ల నరగదీసి
గాలివీచ బెదరి బెదరి
మెరపు మెరయ నదరి నదరి
మబ్బుపట్టు ఒక్క చిక్క
గతిసారిగాలొచ్చి
గింజలన్నీ రాల్చిపోతే
ఆసామికి బకాయిపడి
తిండి గడవక తెల్లమొగంవేశాం
ఈసారయిన
కష్టం మిగులుద్దని
ఆశతోనా ఎదురుజూచి
కోతకోసి ఓదెవేసి
ఒరుపుచూసి ఓదెలెల్ల
ప్రోగుజేసి ఒకటిచేసి
నిదురమాని కాపుకాసి
కుప్పవేసి కూసుంటే
పల్లెమోతై, ఉద్యోగంలేకున్నా
నాగరికత మోజులో
పట్నం వెళ్ళిన కొమందు
బస్తీ వదలి పల్లెకొచ్చి
పాత బకాయి లెక్కగట్టి
పండిందంతా ఎత్తుకు పోతుంటే
కూలైనా మిగలలేదని
నేలచూపులు చూసే నా అలిని
చూడలేక సిగ్గుతో పక్కకు తిరిగా
మన పుట్టుక బకాయిపుట్టుకని
కండలుండగా కన్నీరెందుకు
మంచి రోజులొత్తాయని ఓదార్చా

*

వాడు చేసేవన్నీ చెడ్డపనులే! నన్ను ఆస్తమానూ చదువుకోమంటాడు. కొడుతూంటాడు. తిడుతూంటాడు. అయినాసరే అమ్మ, నాన్న, బామ్మ, అంతా వాణ్ణి మంచివాడనే అనుకుంటున్నారు. వాడు రాగానే తెగ మర్యాద చేసేస్తున్నారు. వాడిమీద నేనేం చెప్పినా ఎవరూ నమ్మడంలేదు సరిగదా వాడొచ్చేక నాకు చదువు బాగావస్తోందని మెచ్చుకుంటున్నారు. అందర్నీ వాడు మాయచేసేస్తున్నాడు.

అంటే ఈ మేస్టారు మాంత్రికుడేకదా- పైగా తనే ఆ విషయం చెప్పేశాడు నాకు. బహుశా నా గొప్పతనం తెలిసుండదు.

ఇప్పుడు నేనేం చేయాలి ?

మాంత్రికుడొచ్చేశాడు. ఇంక రాకుమారికి ప్రమాదం. అందుకని లతకి విషయం చెప్పాలి.

ఆ రాత్రి మేస్టారు వెళ్ళిపోగానే లతయింటికి వెళ్ళి - "లతా! నువ్వు జాగ్రత్తగా ఉండాలి. మాంత్రికుడొచ్చేశాడు -" అని చెప్పాను.

లత అప్పుడు నన్ను అన్నీ అడిగి తెలుసుకుంది. జాగ్రత్తగా ఉంటానని మాటిచ్చింది. కానీ మాట నిలబెట్టుకోలేదు. మర్నాడు నాకు ప్రయివేటు జరుగుతూంటే తనూ వచ్చేసింది. మాంత్రికుడు మాయచేసి రాకుమారినెత్తుకు పోతాడని నేను భయపడుతూంటే రాకుమారే మాంత్రికుడి దగ్గరకు వచ్చేయడం నాకు నచ్చలేదు. కానీ మేస్టారెదురుగుండా ఆ విషయం చెప్పలేదు. నేను తెలివైనవాణ్ణి కదా!

అప్పుడు మేస్టారు, లత చాలా మాట్లాడుకున్నారు. ఇద్దరూ నవ్వుకున్నారు కూడా. వాళ్ళలా నవ్వుకోవడం నాకు నచ్చలేదు. అందుకే మేస్టారు వెళ్ళిపోయాక లతను దెబ్బలాడాను.

"అంతా నీ మంచికే మరి! ఈ రోజు నీకు మేస్టారు పాఠాలెక్కువ చెప్పలేదు. నిన్ను కొట్టలేదు. నేను ఇక్కడే ఉండి నీ మేస్టారికి మంత్రం వేశాను-" అంది లత.



అదీ నిజమే అనిపించింది నాకు.

ఆ రోజునుంచీ ప్రతిరోజూ లత నాతోపాటు తనూ ప్రయివేటుకు వచ్చేది. కూడా తనక్లాసు పుస్తకాలు తెచ్చుకొచ్చేది. తనకూ కొన్ని పాఠాలు అర్థంకాకపోతే మేస్టారినడిగి తెలుసుకుంటున్నానని పెద్దాళ్ళకు చెప్పిందికానీ అది అబద్ధం. అది మేస్టారితో సినిమాల గురించీ, కథంగురించీ, పుస్తకాలగురించీ మాట్లాడేది ఒకో సారి ఇందిరాగాంధీ గురించి కూడా మాట్లాడేది. మేస్టారేమో లతను పొగిడేసేవాడు. లత చాలా అందంగా ఉంటుందిట. చాలా తెలివైనదిట. లత ఏం బట్టలు కట్టుకున్నా ఆ బట్టలక్కూడా అందం వచ్చేస్తుందిట. లత ముఖంలో ముక్కు బాగుంటుందిట. లతనవ్వితే బాగుంటుందిట. కోపంగా ఉంటే ఇంకాబాగుంటుందిట. అలా అనే వాడా—అలాగని లతకు కోపం తెప్పించేవాడు కాదు. అయినా ఎంతసేపూపొగుడు తూంటే లతకు కోపమెలాగొస్తుందీ?

లత చాలా సంబరపడేది. రోజూ ప్రయివేటు మేస్టారికోసం ఎదురుచూసేది. వాళ్ళిద్దరూ ఎక్కువగా మాట్లాడుకోవడం నాకు నచ్చలేదు. కానీ ఆ సమయంలో నాకు చాలాబాగుంటోంది. మేస్టారు నాకు రోజూ ఓ కొత్తరకం ఆట నేర్పుతున్నారు నేనది ఆడుకుంటూ హాయిగా ఉండేవాణ్ణి. మధ్యలో వాడిమాటలూ వినేవాణ్ణి.

ఇలా కొన్నాళ్ళు జరిగేసరికి నాకు అనుమానం వచ్చింది. మేస్టారు నాకు పాఠాలు చెప్పడం మానేసి లతతోనే మాట్లాడేస్తున్నారు. ఇలాగైతే నాకు చదువెలా గొస్తుంది ? కలెక్టరెప్పుడవుతానూ ? పోలీసులచేత పనులెప్పుడు చేయించు కుంటానూ ?

ఒక రోజున మేస్టార్ని అడిగేశాను. అప్పుడు వాడు నవ్వుతూ - "నువ్వు చాలా తెలివైన వాడివికదా - నువ్వు బళ్ళో చదవేదిచాలు. చక్కగా యిలాగే ఆడుకో - ఇంట్లో మాత్రం ఆడుకుంటున్నట్లు చెప్పకు -" అన్నాడు.

ఆ తర్వాత నేను లతతో - "నువ్వూ నేనూ ప్రేమించుకున్నాం గదా - నువ్వు నా మేస్టరితో ప్రేమగా మాట్లాడుతున్నావు. నాకు నచ్చలేదు-" అన్నాను.

అప్పుడు లత వెంటనే- "మొత్తానికి మగాడివనిపించుకున్నావురా - నానిగా -" అంది.

"మరినేను మగాణ్ణేగా !" అన్నాను గర్వంగా.

లతేమో అప్పుడు నా రెండు బుగ్గల మీదా రెండు ముద్దులు పెట్టుకుని — "రోజూ మేస్టారు నిన్ను బాధపెడుతున్నాడు గదా - నిన్ను రక్షించడం కోసం వచ్చాను, నేనిప్పుడు నీ మేస్టారి మనసు మారుస్తున్నాను. అందుకోసం నాకెన్నో పనులున్నాసరే త్యాగం చేసి యిక్కడకు వస్తున్నాను. మరి నేను నిన్ను ప్రేమిస్తున్నాను కదా - అంది.

అవును మరి. లత నన్ను ప్రేమించింది. అందుకని నాకోసం త్యాగం చేస్తోంది. అంతాబాగానే ఉందికానీ నా మేస్టారు మాంత్రికుడు. లత మేస్టారి దగ్గరకు అస్తమానూ వెళ్ళడం మంచిది కాదు. ఎప్పుడైనా మేస్టారు లతను మోసం చేయవచ్చు.

అప్పట్నించీ నేను మేస్టార్ని జాగ్రత్తగా కనిపెట్టడం మొదలెట్టాను. అప్పుడే నాకింకో విషయం తెలిసింది. లత నాకోసం త్యాగం చేస్తున్నానంది కానీ మేస్టారితో మాట్లాడ్డం దానికి యిష్టమే ! వాళ్ళిద్దరూ చాలా యిష్టంగా మాట్లాడు కుంటున్నారు. నేను వినేస్తానేమోనని కొన్నికొన్ని మాటలు నెమ్మదిగా చెప్పుకునే వారు. అప్పుడు నేనేం చేశానో తెలుసా — వాళ్ళమాటలు వినకుండా నేనింకో లోకంలో ఉన్నట్లు నటించేవాణ్ణి. అప్పుడు నేనింకోలోకంలో ఉన్నాననుకుని కాస్త గట్టిగా మాట్లాడుకునే వాళ్ళు. అవి నేను వినేసేవాణ్ణి.

ఆ మాటలు వినగానే నాకు చాలా తెలిశాయి. లత మేస్టార్ని మా యింట్లోనే కాదు—ఇంకా ఎక్కడో పార్కుల్లో కలుసుకుంటోంది. అది బడికి వెడుతుంది. కదా - బడికని చెప్పి పార్కుకి వెళ్ళిపోయి మేస్టార్ని కలుసుకుంటోంది.

అయితే ప్రమాదమే - రాజకుమారి మాంత్రికుణ్ణి పూర్తిగా నమ్మేసింది. మరి నేను మాంత్రికుణ్ణి ఓడించి పంపేయకపోతే రాజకుమారి పని అయిపోతుంది.

కానీ మాంత్రికుణ్ణి ఓడించడమెలా ?

బాగా ఆలోచించాను. ఎంత ఆలోచించినా నాకే ఉపాయమూ తోచలేదు చివరకు వెళ్ళి బామ్మనే అడిగాను.

"మాంత్రికుడి గొడవ నీ కెందుకురా ?" అంది బామ్మ విసుగ్గా.

"విసుక్కోకే బామ్మా ! ఇది నాకు చాలా పెద్ద సమస్య-" అన్నాను.

"వేలెడంతలేవు - వెధవ కబుర్లూ నువ్వూనూ - సమస్యట సమస్య ఫో - అవతలకి -" అంటూ గసిరింది బామ్మ.

అలాగందంటే బామ్మ నాకింకే ఉపాయమూ చెప్పదన్నమాట.

మరేం చేయాలీ? మేస్టారు నాకు పాఠాలు చెప్పకుండా లతతో కబుర్లు చెబుతున్నాడని యింట్లో చెప్పేస్తే !

మేస్టారు మాంత్రికుడు కదా - అందుకని నామాట ఎవరూ నమ్మరు. ఒక వేళ నమ్మేరంటే మేస్టారిని మానిపించేస్తారు. అయినా లత మేస్టార్ని కలుసుకుం టూనే ఉంటుంది. ఓడిద్దామన్నా నాకు మాంత్రికుడు దొరకడు. అందుకని యింట్లో మేస్టారి గురించి చెడుగా ఏమీ చెప్పకూడదు.

మరింకేం చేయాలీ ?

నేనిలా ఆలోచిస్తూనే ఉన్నానా - నేనేదైనా చేసేస్తానని మాంత్రికుడికి భయమేసిందో ఏమో - వాడు లతా వాళ్ళ అమ్మా నాన్నలతో తను లతను పెళ్ళి చేసుకుంటానని చెప్పేశాడు. అంతే - లత అమ్మా, నాన్నా కలిసి మాంత్రికుడి అమ్మానాన్నలకు ఉత్తరం రాసేశారు.

అప్పుడు నేను లతను కలుసుకుని— "నువ్వు నన్ను ప్రేమిస్తున్నావుకదా- మరి మాంత్రికుడినెలా పెళ్ళి చేసుకుంటావు ?" అనడిగాను.

"నీకోసం త్యాగం చేస్తున్నాను. నేను పెళ్ళి చేసుకోకపోతే మాంత్రికుడు నిన్ను బల్లిగా మార్చేస్తానని బెదిరిస్తున్నాడు-" అంది లత.

"లతా- నువ్వు నాకోసం త్యాగం చెయ్యొద్దు. నేను బల్లినైపోయినా ఫరవా లేదు. నువ్వు మాత్రం మాంత్రికుడిని పెళ్ళి చేసుకోవద్దు-" అందామనుకున్నాను. కానీ నిజంగా నేను బల్లినైపోతే - అమ్మ నాకోసం బెంగపెట్టుకోదూ ?

అబ్బా - త్యాగం చేయడం చాలా కష్టం !

నాకోసం లత మాంత్రికుడినే పెళ్ళాడతానంటోంది. అది చాలా పెద్ద త్యాగం. అంత త్యాగం చేస్తున్న లతని నేనెలా రక్షించాలి ?

లతకు మాంత్రికుడితో పెళ్ళయిపోతే అది చాలా కష్టాలు పడుతుంది. ఈ సంగతి చిన్నిగాడు ముందే చెప్పాడు. ఎలాగైనా వాడు నాకంటే తెలివైనవాడు. నేను మాంత్రికుడినేమీ చేయలేననీ వాడు ముందే చెప్పాడు.

ఇదంతా తల్చుకుంటూంటే నాకేడుపు వచ్చేస్తోంది.

5

ఆఖరికి అనుకున్నంతా అయింది. మాంత్రికుడు రాజకుమారిని మోసం చేసేశాడు. ఇప్పుడు లత చచ్చిపోతానని ఏడుస్తోందిట.

అసలేమైందంటే మేస్టారి అమ్మా నాన్నా లతను చూసుకుందుకు వచ్చారుగా. వాళ్ళేమో పెళ్ళికావాలంటే పాతిక వేల రూపాయలు కావాలన్నారుట, పాతిక వేలంటే చాలా ఎక్కువట. లత నాన్నదగ్గర అంత డబ్బులేదుట. ఎంత బతిమాలినా వినకుండా మేస్టారి నాన్నా అమ్మా— "అయితే ఈ పెళ్ళి జరగదు-ఫో !" అని కోపంగా అనేసి వెళ్ళిపోయారుట.

మేస్టారి నాన్న కూడా పెద్ద మాంత్రికుడుట. వాడికి కట్నం అనే మంత్రం తెలుసుట. ఆ మంత్రం వేస్తే పెళ్ళిళ్ళు కావుట. మేస్టారికి నాన్నంటే భయంట. వాడిని కూడా వాళ్ళ నాన్న బల్లిగా మార్చేస్తాడని భయమో - ఏమిటో మరి!

ఇప్పుడేమో లత యింకెవర్నీ చూడనంటోంది. ఆఖరికి నన్ను కూడా చూడనంటోంది. చచ్చిపోతానని ఏడుస్తోంది.

నాకిదంతా తెలియగానే చాలా ఆవేశం వచ్చేసింది. ఆవేశమంటే కోపం రావడం అన్నమాట! మనదేశంలో ఆవేశం రావడం కూడా చాలా గొప్పట. మా బాబాయి చెప్పాడు.

మరి నేను గొప్పవాణ్ణిగా- అందుకని నాకావేశం వచ్చింది. ఆ సాయంత్రం మేస్టారు మా యింటికి వచ్చారు. వాడసలు విచారంగానే లేడు. మాంత్రికుడుకదా- ఎప్పటిలాగే నవ్వుతున్నాడు.

వాడు ప్రయివేటు చెప్పడానికి గదిలోకి రాగానే నేను తలుపులు వేసేశాను. కోపంగా మేస్టారి వంక చూసి- "ఒరేయ్ మాంత్రికుడూ! అవతల ఆ రాజ కుమారి- లత - అలా ఏడుస్తుంటే నీకు నవ్వెలా వస్తోందిరా!" అన్నాను.

మేస్టారు తెల్లబోయి నావంక చూశాడు.

"అలా చూస్తావేంరా? మీనాన్న నీకంటే పెద్ద మాంత్రికుడని ముందుగా నీకు తెలియదా? వాడే మంత్రం వేస్తాడో ముందుగా నీకు తెలియదా? అన్నీ తెలిసీ నా రాకుమారిని మోసం చేస్తావా? నేను లతకు ముందే చెప్పాను- నువ్వు మాంత్రికుడివని. అయినా నీ మాయలో పడిపోయింది-" అన్నాను మళ్ళీ.

వాడు కాస్త కోపంగా నావంక చూసి- "నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసు. కానీ నీకులా నాకు భయం లేదు. నువ్వు మాంత్రికుడివి. దుర్మార్గుడివి. నిన్ను తిడితే నువ్వు నన్ను బల్లిగా మార్చేస్తావని లత నాకు చెప్పింది, అయినాసరే నిన్ను తిడతాను, నీకేమో మీనాన్న నిన్ను బల్లిగా మార్చే స్తాడని భయం, అందుకేగా లతను ఏడిపిస్తున్నావు. నీకంటే నేనే నయం. మాంత్రికుల్ని తిట్టడానికి భయపడను. నీకైతే మాంత్రికుడు మీనాన్నే అయినాసరే తిట్టడానికి భయమే!" అన్నాను ఇంకా ఆవేశంగా.

అప్పుడు మేస్టారు నామీద చాలాకోప్పడతాడనుకున్నాను కానీ అలా జరగ లేదు. వాడు నా దగ్గరగావచ్చి "నువ్వు నన్ను మాంత్రికుడంటావని లత నాకు చెప్పింది. నీగురించి అన్నీ చెప్పింది. నువ్వంటే నాకు చాలా యిష్టం. ఇప్పుడు నేను ఓడిపోయానని ఒప్పుకుంటాను. నేనేంచేయాలో నువ్వే చెప్పు" అన్నాడు.

"ఏంచేయడమేమిటి? మీ నాన్నేదో మంత్రం పెట్టాడు లతకి, అదేమో చచ్చిపోతానని ఏడుస్తోంది. ఆ మంత్రానికి విరుగుడేమిటో తెలుసుకునిరా. లతను మనిద్దరం కలిసి రక్షిద్దాం——" అన్నాను.

మేస్టారు నన్నెత్తుకుని "అలాగే చేస్తాన్రా——నానీ!" అన్నాడు.

నాకు చాలా సంతోషం కలిగింది. నేను నిజంగానే మాంత్రికుణ్ణి ఓడించేశా నన్నమాట! అంటే నామాటల్లోనే ఏదో గొప్ప మంత్రముండి ఉండాలి. అదేమిటో మరి! అప్పుడు నేను ఆవేశంలో ఉన్నాను గదా-ఏంమాట్లాడానో గుర్తులేదు. ఎందుకైనా మంచిదని "నువ్వు నిజంగానే ఓడిపోయావు కదూ!" అన్నాను.

"ఏం- నీకా అనుమానం ఎందుకొచ్చింది?" అన్నాడు మేస్టారు.

"ఎందుకంటే —— నువ్వు ఓడిపోకపోతే చెప్పు. మళ్ళీ ఇందాకటి మంత్రమే వేసి ఓడించేస్తాను-" అన్నాను భయపెడుతూ.

"నిజంగానే ఓడిపోయాను -" అన్నాడు మేస్టారు.

"హమ్మయ్య!" అనుకున్నాను మనసులో. మేస్టారు నిజంగా ఓడిపో లేదంటే మళ్ళీ ఓడించడానికి ఇందాక వేసిన ఆ మంత్రమేమిటో నాకు గుర్తుండ దస్తేగా! ఉత్తినే అలా చెప్పి మేస్టర్ని భయపెట్టేశానంతే!

లత మళ్ళీ నవ్వడం మొదలు పెట్టింది. మేస్టారేమో వాళ్ళ అమ్మనీ నాన్ననీ ఎదిరించి లతను పెళ్ళి చేసుకుంటున్నట్టు. అందుకు లత చాలా సంతోషంగా ఉంది.

"ఒరేయ్ నానీ! ఇదంతా నీ గొప్పతనమేరా! నీమూలంగానే ఈపెళ్ళి జరుగుతోంది. నువ్వు నిజంగానే నన్ను మాంత్రికుడి బారినుండి రక్షించావు——" అంది లత.

"మరైతే మళ్ళీ ఆ మాంత్రికుణ్ణే పెళ్ళి చేసుకుంటానంటావేం? అన్నాను కోపంగా.

"మాంత్రికుణ్ణి నువ్వు- ఓడించేశావు కదా! అందుకని వాడు మంచివాడై పోయాడు. మంచివాణ్ణి నేను పెళ్ళి చేసుకుంటే తప్పేముంది?" అంది లత.

"అది సరేలే-మరి మనమిద్దరం ప్రేమించుకున్నాం గదా- నన్ను పెళ్ళి చేసుకోవా?" అన్నాను కోపంగా.

లత సందిగ్ధంలో పడిపోయినట్టుంది- మాట్లాడలేదు.

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకోనంటే - చచ్చిపోతానని ఏడుస్తూ కూర్చుంటానంతే!" అన్నాను.

లత గమ్మున నన్నెత్తేసుకుని-" అలాగనకురా! నానీ! అంది.

"మరైతే నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాను.

"చేసుకుంటాను కానీ యిప్పుడు కాదు. నువ్వేమో ఇంకా చిన్న పిల్లవాడివి. కొన్నాళ్ళైపోతే నువ్వేమో నాకంటే పెద్దాడివై పోతావు. అప్పుడు మనిద్దరం పెళ్ళి చేసుకోవచ్చు. ఈలోగా నువ్వు బాగా చదువుకుని కలెక్టరువై పోవాలి _" అంది లత.

"అవునవును - పోలీసుల్ని భయపెట్టాలి కూడా-" అన్నాను హుషారుగా.

లత నా రెండు బుగ్గలమీదా ముద్దు పెట్టుకొని- "నానిగాడికి చాలా తెలివి-" అంది.

తెలివి అనగానే నాబుర్ర బాగా పని చేసింది. "ఏయ్- మరి నేపెద్దాడినై పోతే నువ్వూ. పెద్దదానివై పోవూ- నాకు తెలుసులే- నువ్వు నన్ను మాయచేస్తున్నావు-" అన్నాను.

లత నవ్వేసి - "ఆడపిల్లలు పొడుగెదగరు. మగపిల్లలే పొడుగ్గా అవుతారు. కొన్నాళ్ళుపోతే నువ్వు మీ అమ్మకంటే పొడుగౌతావు తెలుసా? అంది.

నిజమే మరి. అమ్మెప్పుడూ నన్ను పెద్దయ్యాక నాన్నంత పొడుగవ్వాలి అని ముద్దులాడుతూంటుంది. అంటే నేను పొడుగులో అమ్మను దాటించేస్తాననే కదా! అంటే అమ్మ ఇంక ఎదగదన్నమాట. అమ్మే ఏమిటి——నాన్నకూడా ఎదగడు.... వెంటనే నేను - "ఆడపిల్లలే ఏమిటి? పెద్దయ్యాక మగపిల్లలూ ఎదగరు, అసలు పెద్దాళ్ళు ఎదగరు. చిన్నాళ్ళే ఎదిగి పెద్దాళ్ళవుతారు అవునా?" అన్నాను.

"అవున్రా- మానానిగాడికి చాలా తెలివి-" అని లత నన్ను మళ్ళీ బుగ్గల మీద ముద్దుపెట్టుకుంది.

"సరేలే- నువ్వు చెప్పినట్టే నేను పెద్దాణ్ణయ్యాక నిన్ను పెళ్ళి చేసుకుంటాను గానీ- మరి ఈలోగా నీ పెళ్ళి అయిపోతోంది కదా!" అన్నాను అనుమానంగా.

"అబ్బే- ఇది సరదాగా ఉత్తుత్తి పెళ్ళి బొమ్మల పెళ్ళి అన్నమాట!" అంది లత.

నాకు మళ్ళీ అనుమానం వచ్చింది - ఇది ఉత్తుత్తి పెళ్ళే అయితే ఇప్పుడూ నన్నే చేసుకోవచ్చు కదా-" అనడిగేశాను తెలివిగా. ఎలాగైనా లతను పెళ్ళి చేసుకోవాలనుంది నాకు.

జీవుని (ని)వేదన

శ్రీ వెలుదండ నిత్యానందరావు

ప్రభూ!

అతులిత వైభవ సముపేతమైన నీ
దివ్య సింహాపీఠి దిగి నా దరి వచ్చావా?
కరాళ మృత్యు దంష్ట్రాగ్ర డోలికల్లో తూలుచు
మరణశయ్యపైబడి నేడో రేపో చావబోతున్న
రోగిలాంటి నా కుటీరమున
కరుదెంచావా నా తండ్రీ!

నా గుడిసెలో ఒక మూల ఒక్కడనే ముక్కి
నాలో నేనే గొణుక్కుంటున్న మూల్గులాంటి
నా గీతం నీ చెవి సోకగానే
నా కుటి నీ గుడిగా,
నా నుడి నీ నుడిగా మలచి
అనన్యమైన అవ్యాజమైన నీ కృపాకటాక్ష
వీక్షణామృతం నాపై వర్షించావా? దేవా?

నారద తుంబురాది మహా సామవేదజ్ఞు
లధికంగా నీ సన్నిధి పెన్నిధిగా నధివసించియున్నారు
వారి మనోజ్ఞ పదకలిత గాత్ర
మాధురీ మరంద ధారలలో నను నిత్యం
పులకిత గాత్రుడ వవుతావు నీవు

కాని

నేడు వారి రాగం నీ అనురాగానికి నోచుకోలేక
పోయింది
లెక్కకురాని ఈ పిచ్చివాని పాటయే
నీ దయాపాత్రమై ధన్యమైంది
అజ్ఞాన బాల్యచాపల్యంగా భావించి కరుణతో
మన్నించాల్సిన నా ఈ మూర్ఖ సాహసం
విశ్వవీణియ వెలిగించు సుమధురగాన
జ్యోతిలో అమరకిరణంగా భాసించింది.

లత మళ్ళీ సందిగ్ధంలో పడిపోయింది. కాసేపాగి - సరేలే - ఇప్పుడే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాము. కానీ మన పెళ్ళయ్యాక-అది ఉత్తుత్తి పెళ్ళైనాసరే- నువ్వు మీ అమ్మదగ్గర ఒక్కసారికూడా పడుకోకూడదు. సరేనా? అంది.

నేను కాసేపాలోచించి-రాత్రిళ్ళకూడానా? అన్నాను గంభీరంగా.

లత నవ్వేసింది - "అస్సలు పడుకోకూడదు. రాత్రిలేదు పగలులేదు. ఎప్పుడూ నాదగ్గరే ఉండాలి-" అంది.

నాకు క్రోషం వచ్చింది. అయినా ఒప్పుకుందామనుకుని - "పోనీ జ్వరం వచ్చినపుడు...." అన్నాను.

"ఎప్పుడూ వద్దన్నానా?" అంది లత.

"అయితే నేనసలు ఈ జీవితానికే పెళ్ళి చేసుకోను. తెలసిందా?" అన్నాను కోపంగా.

అంతే-లత బెదిరిపోయి - "అలాగనేయకురా నానీ! పెద్దయ్యాక నన్ను పెళ్ళి చేసుకోవాలిగా-" అంది.

అప్పుడు నాకు అర్ధమయింది-అంతా పెద్దయ్యాకే ఎందుకుపెళ్ళి చేసుకుంటారో! పెద్దాళ్ళు అమ్మ పక్కలో పడుకోరుగదా-అందుకని! ఈ విషయం నాకెప్పుడో తెలుసు. నాన్న బామ్మను అమ్మా అని పిలుస్తాడా-కానీ పెద్దాడై పోయాడుగదా-ఎప్పుడూ పక్కలో పడుకోడు.

నాకు లతని పెళ్ళి చేసుకోవాలనుందికానీ పెద్దవ్వాలంటే భయంగానూ ఉంది. అప్పుడప్పుడైనా అమ్మ పక్కలో పడుకోకుండా-ఎలా?

"సరేలే-పెద్దయ్యాక చూద్దాం-" అన్నాను.

"మరి పెద్దయ్యాక కిట్నంగానీ అడగవ్వకదా-" అంది లత.

"కట్నమా?" అన్నాను. అప్పుడు గుర్తుకొచ్చింది కట్నమంటే పెళ్ళిళ్ళు ఆపేసే మంత్రం. ఆ మంత్రాన్ని దుర్మార్గులైన మాంత్రికులు వేస్తుంటారు.

"మరి నేను మాంత్రికుణ్ణి కాదుగా-ఆ మంత్రాన్నెప్పుడూ వెయ్యను. ఎవరైనావేస్తే విరుగుడు మంత్రంకూడా నాకు తెలుసు - అన్నాను-" గర్వంగా.

"నువ్వు చాలా గొప్పవాడివిరా నానీ! అని వెళ్ళిపోయింది లత.

అది నిజమో అబద్ధమో తెలియదుకానీ ఆ తర్వాత నాయింట్లోవాళ్ళు, లత యింట్లోవాళ్ళుకూడా నేను చాలా గొప్పవాణ్ణని పొగిడేశారు.

వాళ్ళంతా నన్ను నిజంగానే పొగిడేశారు. ఎందుకంటే వాళ్ళు నేనొక్కడినే ఉన్నప్పుడుకూడా ఎవరూ చూడకపోయినా పొగిడేశారు.

నేను నిజంగానే మాంత్రికుణ్ణి జయించానుగా - ఈవిషయం చిన్నిగాడికి ఉత్తరం రాయాలనుకున్నాను. అందుకని అప్పుడు లత అర్థంచేసుకుని చదివింది-ఆ భాషలోనే ఓ ఉత్తరం రాసి-అమ్మ దొడ్డకుత్తరం రాసినప్పుడు ఆ కవర్లో పెట్టాను.

అమ్మ నా ఉత్తరం చూసింది-"ఏమిట్రా ఈ పిచ్చిగీతలు...." అంది.

"అందులో ఏముందో తెలుసుకోవాలంటే లత నడుగు. నా భాష దానికర్ధమవుతుంది. మరి నేను చాలా పెద్దవాణ్ణిగా-అన్నాను.

వెంటనే నన్ను అమ్మ దగ్గరగా తీసుకుంది. అప్పుడు నేను ఏదో లోకంలోకి వెళ్ళిపోయాను. అలా నాకెంతో బాగుంది.

"అమ్మా! నేను చిన్నవాడిగానే ఉండిపోతానే-" అన్నాను. నే నెప్పుడు పెద్దవాణ్ణవుతానా అని నాకోసం లత ఎదురుచూస్తోంది. అయినాసరే ఈ సుఖం నేను వదులుకోలేనుగా.

అమ్మ నన్ను మరింత దగ్గరగా హత్తుకుంది. నేనేమో అమ్మను బల్లిలా కరుచుకుపోయాను. త్వరగా పెద్దవాడినైపోతానేమోనన్న భయంతప్ప ఇంకేమీ లేదప్పుడు నా మనసులో....

(అయిపోయింది)

డా॥ హెచ్. ఎస్. బ్రహ్మానంద

ద్రవిడియన్ థియరీస్

(స్వామినాథయ్యర్ విమర్శ)

పరిచయం :

శ్రీ త్రిశేషులు స్వామినాథయ్యర్ మదరాసురాష్ట్రంలో తంజావూరు జిల్లాలో పుట్టారు. 19వ శతాబ్దం మేధావుల్ని సమూహాలుగా ప్రసవించింది. అందులోనూ మదరాసు రాష్ట్రం దక్షిణాదిలో అగ్రస్థానం వహించింది. ఆ శతాబ్దంలో పుట్టిన వారు మేధావులే కారు. మహానుభావులుకూడా. పరమధార్మికులు. జాతీయ చైతన్యం రూపుదిద్దుకున్నవారు. చదువును ఉద్యోగం కోసమో సంపాదన కోసమో కాకుండా జాతీయ సమగ్రత కోసం సామాజిక చైతన్య విస్తరణ కోసం అంకితం చేసిన మహా పురుషులానాడు పుట్టారు. అలాంటివారు అయ్యర్.

ఆనాడు చాలామందిలాగానే అయ్యర్ కూడా హెడ్‌మాస్టరుగానే తన జీవితాన్ని మొదలుపెట్టారు. (1880-84) 1886-89 ల నడుమ మదరాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసరయ్యారు. 1889లో ఆయన రెవిన్యూ డిపార్టుమెంటులో చేరారు. హెడ్‌గుమాస్తాగా 1892 వరకు పనిచేశారు. 1893లో రెవిన్యూ బోర్డులో సీనియర్ అసిస్టెంట్‌గా నియమితులై 1894 దాకా చేశారు. 1895లో రెవిన్యూ బోర్డులో రిజిస్ట్రారు అయ్యారు. 1896తో మళ్ళీ అధ్యాపక వృత్తిలోకి పునః ప్రవేశించారు. 1897లో మళ్ళీ రెవిన్యూశాఖలో కరువుకాటకాలకు, 'ఫామిన్ అసిస్టెంట్‌గా' నియమితులయ్యారు. మదరాసు ప్రభుత్వానికి తమిళ అనువాదకుడిగా కూడా ఆయన పనిచేశారు.

1910 తర్వాత మద్రాస్ ప్రెసిడెన్సీలో ప్రెజరీడిప్యూటీ కలెక్టరుగానూ, అడ్మినిస్ట్రేటివ్ డిప్యూటీ కలెక్టరుగానూ పనిచేశారు. తెలుగుదేశంలో గోదావరి, కాకినాడ, జమ్మలమడుగు మొదలైన ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా నివసించారు, కోయంబత్తూరు తిరునల్వేలి జిల్లాల్లోనూ ఉన్నారు.

అయ్యర్‌గారి వ్యక్తిత్వాన్ని గురించి కూడా కొంత రాయాలి. ఆయన ఆభిజాత్యం. సాంస్కృతిక నేపథ్యం, బుద్ధికుశలత, ఆలోచనామార్గం-ఇవన్నీ ఒక విలక్షణమైన రీతిలో విద్యుత్తు సఫలం చేసుకున్నాయి. తనచుట్టూ ఉన్న సమాజం, చదువులపేరిటా, సిద్ధాంతాలపేరిటా ఛిన్నాభిన్నం కావటాన్ని ఆయన సహించ లేదు. ఆయన కాలానికి అలామనుష్యుల్ని 'జాతు'లుగా వేరుచేసే కొత్తసిద్ధాంతాలు కొన్ని పుట్టాయి. అందులోనూ తమిళదేశంలో ఆర్య-ద్రావిడాలన్న పేరిట ఏర్పడ్డ పృథక్కరణ దృష్టి మేళ్ళ కన్నా కీళ్ళే ఎక్కువగా చేసింది. సంస్కృత భాష, బ్రాహ్మణాది శిష్టవర్గాలు -'ఆర్య' మని ఒక సిద్ధాంతం పొటమరించింది. సరిగాఅదే సమయంలో కాల్డ్వెల్ ప్రతిపాదించిన ద్రావిడభాషల సగోత్రతా సిద్ధాంతం అగ్నికి ఆజ్యం తోడు చేసినట్టయింది. ఈ విభాగదృష్టిని ఖండిస్తూ కొందరు సమైక్యతా వాదులు బయలుదేరారు. పి.యస్. శివస్వామి అయ్యర్ అలాంటివారే. స్వామినాథయ్యర్ మిత్రుడు వి. కృష్ణస్వామి అయ్యర్ కూడా సమైక్యతా దృష్టి ఉన్నవారే.

అయ్యర్‌గారి కున్న భారతీయతా నిబద్ధస్పృహను మనం ఈనాటికీ గౌరవించాల్సిన అవసరం వుంది. పాండిత్య విషయం వేరు. అది చాలా సాపేక్షకమైన విషయం. ఒక పండితుడు మరొకడు చెప్పినది ఎప్పుడూ అంగీకరించలేడు. అలాగే అయ్యర్‌గారి పాండిత్యం 19వ శతాబ్దం చివరిరోజులవి. 20వ శతాబ్దం తొలిదశకం లోనివి. అప్పటికీ ఇప్పటికీ పండితులు చాలామంది పుట్టారు. వందల వేల పుస్తకాలు రచింపబడ్డాయి. ఎంతోమంది ఆచార్యులయ్యారు. ప్రపంచ విఖ్యాతిని కూడా పొందారు. కాని ఏ అరవింద మహాశయుడిలోనో, ఏ స్వామినాథయ్యర్‌లోనో కనిపించే జాతీయతా స్పృహతోడి 'ఆర్తి' రచనల్లో మనకీనాడు కనిపించదు. ఆ ఆర్తి ఏమిటంటే నా చదువులోకానికి పనికి రావాలని ఆశించటం. తనచుట్టూ ఉన్న జనాన్ని విడగొట్టే చదువు తనకు అక్కరలేదని గుర్తించడం.

అయ్యర్‌గారు ఈ స్పృహకు లోను కావడానికి నిర్దిష్టమైన కారణాలు వైయక్తిక జీవితంలోనే కనిపిస్తాయి. అందుకే ఆయన చేసిన ద్రావిడ సిద్ధాంత విమర్శను ప్రస్తావించడానికి ముందుగా ఇంత విస్తృతంగా ఆయన వ్యక్తిత్వాన్ని జీవిత విశేషాల్ని గురించి ప్రస్తావించటం. ప్రభుత్వోద్యోగిగా దేశమంతటా తిరిగి ప్రజల అవసరాల్ని, అనుభవాల్ని గుర్తించి తన అవగాహనను పండించుకొన్నాడు. ఇన్ని ప్రాంతాలు తిరగటంమూలాన ఆయా భాషా మాండలికరూపాల్ని గుర్తించడం మాత్రమే కాకుండా వారి వారి సాంస్కృతికమైన అలవాట్లను, భావనలను బాగా అర్థం చేసుకోగలిగాడు. భాషా పరిశీలకుడికి కావాల్సిన సూక్ష్మబుద్ధి - అర్థభేద గ్రహణ శక్తి - ఆయనకి అపారంగా ఉండేది. చిన్నతనంనుంచీ వైదిక లౌకిక సంస్కృత భాషను క్షుణ్ణంగా అభ్యసించి ఉండటంవల్ల భాషలమీద తన అవగాహనను స్పష్టంగా ఏర్పరచుకోగలిగారు. తన పరిశోధన ధ్యేయాన్ని స్పష్టంగా నిర్వచించుకోగలగారు. అలాగే తమిళ సంఘవాఙ్మయం మొదలు కర్నాటాంధ్ర మలయాళ భాషల్లో కూడా ఆయనకు అపారమైన పరిచయం ఉండేది. ఆయన తన ఉపన్యాసాలలో ఉదహరించిన గ్రంథాలే ఆయన పాండిత్యానికి నిదర్శనం.[1]

ఇలా పుట్టుకతో, అభ్యాసంతో, మానసిక ప్రకృతిరీత్యా, వృత్తిలో వచ్చిన అవకాశాల దృష్ట్యా ఆయన తాను చేసిన మహాపరిశోధనకు సమర్థుడయ్యాడు. జీవితాంతమూ ద్రావిడసిద్ధాంత విమర్శకు కావాల్సిన సంభారాల్ని సేకరిస్తూనే కన్నుమూశాడు.

ఆయన్ని బాగా ఎరిగిన పి. యన్. అప్పస్వామివంటి పండితులిలా అంటారు.

'స్వామినాథయ్యర్ మహా గంభీరుడు. కాని ఆత్మీయుడు. విశాలమూ అగాధమూ అయిన పాండిత్యం గలవాడు. కాని విధేయుడు. శిక్షితమైన చిత్తవృత్తి ఉన్నవాడు. పాండిత్యస్ఫోరకమైన సుకుమారమూ ఉదాత్తమూ అయిన హాస్య ప్రవృత్తి ఆయన కుండేది.

(స్వామినాథయ్యర్‌గారి 'ద్రవిడియన్ థియరీస్'కి రాసిన
పీఠిక (31-3-75న) పు. 9)

ఈ లక్షణాల్ని మనం అయ్యర్‌గారి రచనలో చూడవచ్చు. అంతటి పండితుడు కాబట్టే కాల్డ్వెల్ వంటి మేధావి అంచనాలను సతర్కంగా ఖండించగలిగాడు. పునర్విమర్శించ గలిగాడు

రచనాధ్యేయం

అయ్యర్‌గారి తర్వాత కాల్డ్వెల్ సిద్ధాంతాన్ని ఖండించడానికి ప్రయత్నించిన దాక్షిణాత్యుల్లో చిలుకూరి నారాయణరావు గారిని ప్రస్తావించాలి. ఆయన 'ఆంధ్ర భాషాచరిత్రము' (2సం. 1937) అన్న పేరిట ఒక గ్రంథాన్నే రాశారు. కాని ఆయన ఎక్కడా అయ్యర్‌గారిని ప్రస్తావించినట్టు కనబడదు. కాని చాలా ఉదాహరణల్లోనూ, ఖండన రీతిలోనూ అయ్యర్‌గారి సరళి కనిపిస్తుంది.[2] అయ్యర్‌గారి

వాదాలు ఒక గ్రంథరూపంలో 1975 దాకా రాలేదు. అది కూడా ఆయన బ్రతికి ఉండగా కాలేదు. దీనికి ఒకపెద్ద కథ ఉంది.

1917 ప్రాంతంలో తొలుత అయ్యర్‌గారు ఉపన్యాసాలుగా తన అభిప్రాయాల్ని వెలువరిస్తుండేవారు. సౌత్ ఇండియన్ టీచర్స్ యూనియన్ వారి అధ్వర్యంలో ఏర్పాటయిన సభల్లో (ఆ సభలకి డజన్ మందికన్నా ఎక్కువ వచ్చేవారు కాదట) ఆయన వెలువరించిన అభిప్రాయాలు 'స్వదేశమిత్రన్' అన్న తమిళ దిన పత్రికలో మదరాసు నుంచీ ప్రచురితమయ్యేవి.

తరువాత 'తమిళ విద్యా సంఘం' (మద్రాసు) వారు ఈ అభిప్రాయాలనే గ్రంథరూపంలో రాసిమ్మని కోరగా 'తమిళర్ నేషన్' పత్రికకు అనుబంధాలుగా 1922-23లో వ్యాసాలుగా అయ్యర్ ప్రకటించారు. అలా పదిమందికంటా ఈయన అభిప్రాయాలు పడటం సంభవించింది.

ఆయన కేవలం తమిళాన్ని గురించి మాత్రమే కాకుండా ఇతర దాక్షిణాత్య భాషల మీదా రాశాడు. తమిళంలోనూ, ఆంగ్లంలోనూ ఆయన వ్యాసాలు వచ్చాయి. మదరాసు, పూనాలలో జరిగిన (1919 ప్రాంతంలో) జరిగిన పండిత సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలు చదివాడాయన. కలకత్తా విశ్వవిద్యాలయంలో 'స్పెషల్ రీడర్'గా ద్రావిడ భాషల మీద ఉపన్యాసాలు ఇచ్చారు.

అప్పటికి 'లింగ్విస్టిక్స్' అన్న శాస్త్ర విభాగం ఇంకా స్పష్టంగా రూపుదిద్దుకోలేదు. కాల్డ్‌వెల్ తన సిద్ధాంతాన్ని ప్రచురించి ఉన్నా (1857) పండితలోకంలోకి అది ఇంకా బాగా వ్యాపించి ఉండలేదు. 'జనని సంస్కృతంబు ఎల్లభాషలకు' సిద్ధాంతాన్ని గుడ్డిగానమ్మిన వాళ్ళే చాలా మంది ఉండేవారు. వాళ్ళకి ఆంగ్లభాషా పరిచయంలేదు. కొందరు (విద్యాలయ సంప్రదాయంలోని వారు) నిర్విమర్శగా కాల్డ్‌వెల్ సిద్ధాంతాన్ని నమ్మారు. ఈనాటికీ ఈ పరిస్థితి ఇలాగే వుంది. అప్పటికింకా సింధూలోయ నాగరికతకు సంబంధించిన వివరాలు మనకి తెలీదు, అక్కడ దొరికిన 'లిపి' అప్పటికింకా ఛేదింపబడలేదు.[3]

అవన్నీ తెలియక ముందు రాసినా అయ్యర్‌గారి అభిప్రాయాలు చాలా విలువ కలిగినవి. పునరాలోచింప దగినవే. ఆయన వాటిమీద ఖండనలు మండనలు రాసుకునేవాడు. జీవితాంతమూ (1940 ప్రాంతంలో ఆయన పోయినట్టుంది. తేదీ తెలియలేదు) తన వ్రాతప్రతుల్ని సవరించుకొంటూనే మదరాసు లా జర్నల్ ప్రెస్‌కి ముద్రణకోసం ఇచ్చారు. ముద్రణకాకుండానే అయ్యర్‌గారు పరమపదించారు.

సుప్రసిద్ధ సంస్కృత విద్యావేత్త ఆచార్య కుప్పుస్వామి శాస్త్రి వంటివారు ఈ గ్రంథం ఎలాగైనా పూర్తికావాలని పట్టుపట్టి అయ్యర్ విద్యార్థులలో ఒకడైన డా॥ చింతామణిగారికిపనిని అప్పజెప్పారు. శాస్త్రిగారూ పోయారు. చింతామణిగారూ పనిపూర్తి కాకుండానే చనిపోయారు. అలా దాదాపు మూడు దశాబ్దులు గడిచిపోయాయి గ్రంథం జీర్ణితమై ప్రెస్సు ప్రాంగణంలోనే పడివుంది. పుస్తకాన్ని కుట్ట డానికి వీలుకానంతగా పుటలు పాడైపోయాయి.

కాని ఎలా ముద్రించటం! ఆనాడు అయ్యర్ గారితో ఉన్నవారు, విన్నవారు, కన్నవారు ఎవరూ లేకపోయారు. కడకి పి. యన్. అప్పుస్వామి (ఈయన చిన్నతనంలో అయ్యర్‌గారిని చూసినవారు) సంపాదకత్వ బాధ్యతను చేపట్టారు అంత మహా పండితుడి పుస్తకానికి ప్రూఫులు చూడడం ఎంత కష్టమో వారికి తెలిసివచ్చింది. అలా ఇలాచేసి 1975 ప్రాంతానికి 'ద్రవిడియన్ థియరీస్' అనే పేరుతో అయ్యర్‌గారి గ్రంథం విడుదలయింది. ఈ గ్రంథంలోని అంశాలమీదే ఈ వ్యాస పరంపర రాయబడుతోంది.

ఇంత విస్తారంగా ఆయన్ని గురించి పరిచయం చేయాల్సిన అవసరం ఉందే ప్రయత్నపూర్వకంగా చేశాను. ఆంగ్లపరిపాలన పోయినా భారతీయుల్లో ఇంకా పాశ్చాత్య భావదాస్యంపోలేదు. విశ్వవిద్యాలయాల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది: కాల్డ్‌వెల్ రాసిన 'కంపేరిటివ్ గ్రామర్' (సి. జి. డి)కి దాదాపు అనువాద ప్రాయమైన 'ఆంధ్రభాషా వికాసము' (ఆచార్య గంటి జోగి సోమయాజి 1947) తప్ప ఆనాటి నుంచి ఈనాటిదాకా ద్రావిడ భాషా సిద్ధాంత తత్త్వాన్ని గురించి చర్చించిన గ్రంథం మచ్చుకి ఒకటి కూడ లేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యులైౖ ఉంటే చిలుకూరి నారాయణరావుగారి 'ప్రాకృత' వాదానికి ప్రచారమూ, శిష్యరికమూ ఏర్పడి ఉండేవేమో కాని నిజానికి అది జరగలేదు. చిలుకూరి వారు 'డాక్టరు' గానే కన్నుమూసారు[4] ఆచార్య కృష్ణమూర్తిగారూ ఆచార్య పియస్ సుబ్రహ్మణ్యంగారూ ద్రావిడ భాషల్ని వర్ణనాత్మకంగా పరిశీలించడంలోనే తమ శక్తినంతా ధార పోశారు.

ఇకపోతే తమిళదేశంలో రాజకీయంగా ద్రావిడ సిద్ధాంతం 'ద్రవిడమున్నేట్ర కళగం' వారికి వేదతుల్యంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. అంచేత తర్కాన్ని, లోకజ్ఞతను, సామాజిక ప్రయోజనాన్ని - అన్నిటినీ ద్రావిడ సిద్ధాంత ప్రతిష్ఠాపన కోసమే వాళ్ళు ఖర్చుపెడుతున్నారు. కాగా దాక్షిణాత్య విశ్వవిద్యాలయాల్లో చాలాచోట్ల 'ద్రావిడభాషావిజ్ఞానం' (ఫైలాలజీగా మొదలై లింగ్విస్టిక్స్‌గా పరిణమించిన విభాగం) హఠాత్తుగా వచ్చింది. కొన్ని విశ్వవిద్యాలయాలు తెలుగుతోపాటు 22 ద్రావిడభాషల్నీ విద్యార్థులకి బోధిస్తున్నాయి కూడా. అంత వరకు బాగుంది.

కాని సామాజిక నేపథ్యం భిన్నంగాఉంది. భారతదేశంలో భాషా సమస్య కొరకరాని కొయ్యగా తయారవటంలో ద్రావిడ భాషాసిద్ధాంత ప్రమేయం కూడా చాలా ఉంది. సిద్ధాంతాలు కేవలం పండితుల బుర్రల్లోంచి పుట్టవు. సామాజిక సంస్కృతీ ప్రభావానికి ఏ సిద్ధాంత కర్తా అతీతుడుకాడు. క్రైస్తవ మతాధికారిగా వచ్చిన బిషప్‌కాల్డ్‌వెల్ సంస్కృతాన్ని నేర్చుకోవడం మొదలు పెట్టింది ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌దగ్గర.[5] ఒక నెలలో ఆయననేర్చుకొన్నదిఅపారమేఅయినా-భారతీయ సంస్కృతీ నేపథ్యంలో కాకుండా సమకాలీన చారిత్రక దృష్ట్యానే ఆయన సంస్కృతాన్ని మృతభాష - బ్రాహ్మణ భాషగా గుర్తించి ఉండాలి. ఆయనకి సన్నిహితంగా ఏర్పడ్డ వర్గం బ్రాహ్మణవ్యతిరేకులేనని తర్వాతి ప్రచురణల్లో సి.జి.డి. సంపాదకులే రాశారు.[6]

బ్రాహ్మణ - అబ్రాహ్మణ ద్వేషం కూడా స్పష్టమైన చారిత్రక కారణాల్లో నుంచి పుట్టిందే. బ్రాహ్మణ్యం మృతమై బ్రాహ్మణులు మిగిలిన జీవితంనుంచీ మధ్యతరగతి మేధావి బయలుదేరాడు. బ్రాహ్మడుగానే పుట్టిన గురజాడ అప్పారావు ఎదురు తిరిగింది ఈ వాతావరణం మీదే (కన్యాశుల్కంలో ఇది కీలకమైన సమస్య ఎవరూ గుర్తించినట్టు కనిపించదు.)

అంచేత కాల్డ్‌వెల్ సిద్ధాంతం అనాటికి చాలా అవసరం కాబట్టి పుట్టింది. దాని ద్వారానే స్వామినాథయ్యర్ వంటి మేధావి ప్రేరితుడై భారతీయ భాషల తత్త్వాన్ని గురించి విస్తారంగా ఆలోచించగలిగాడు. చిలుకూరివారు అంత పండితుడయ్యారు. వీరిద్దరూ యూనివర్సిటీ బయటే ఉండిపోయారు. అంచేత భాషా సాహిత్య జిజ్ఞాసువులకి పండితుల అభిప్రాయాలు పరిచయంలోకి రాకపోయాయి. చిలుకూరి వారి ప్రాకృత వాదాన్ని కొరాడవారు ఖండించారు - అని కూడాచాలా మందికి తెలీదు.[8] ఎలా ఖండించారో కూడా చాలా మందికి తెలీదు.

తర్వాత వచ్చిన 'భాషావికాసం' లాంటి పాఠ్యపుస్తకాలూ పాతబడ్డాయి. ఇప్పుడు ఆంధ్ర భాషాచరిత్రకు కృష్ణమూర్తి గారి 'తెలుగు భాషాచరిత్ర' (1974) ఆకరగ్రంథమైపోయింది. ద్రావిడ భాషల్ని గురించి తెలుసు కోవాలంటే సుబ్రహ్మణ్యంగారి 'ద్రావిడ భాషలు' (1976) ఒకటి మిగిలింది.

ఇక విశ్వవిద్యాలయ విద్యార్థులు రాస్తున్న సమాధానాలు చూస్తే గగుర్పాటు కలుగుతుంది.[9] మొత్తంమీద సమాజ జీవితంలోనే 'ద్రావిడ' సిద్ధాంతం గల్గించిన అపోహలు రెండు:

1. ఆర్యులు-బ్రాహ్మణులు. శూద్రులు ద్రావిడులు. రాముడు ఆర్యుడు - రావణుడు - శూద్రుడు-ఇప్పటికీ భారతదేశం ఆర్యావృతమైపోయింది. ద్రావిడులు అణగద్రొక్కబడ్డారు.
2. సంస్కృతం అన్యభాష. ఆర్యుల చేత ఆక్రమింపబడ్డ శూద్రులపై -

దాక్షిణాత్యులపై సంస్కృతం రుద్దబడింది.
అచ్చమైన తమిళకర్ణాటాంధ్ర మలయాళాలున్నాయి.

ఈ రెండు ప్రభావమూ ప్రాంతీయతా ధోరణిలో పర్యవసించింది. మిదు మిక్కిలి సంస్కృత భాషల సాహిత్య పరిచయం - సాహిత్యం, బూర్జువా స్వభావంగా ముద్ర వేసుకొన్నాయి. రచనలో సంస్కృతపదం ఎక్కడైనా దొర్లితే పండితుడు 'సారీ' చెప్పుకొంటున్నాడు.[10] అలా ద్రావిడ సిద్ధాంతం అభ్యుదయ దృక్పథానికి పర్యాయవాచక మయిపోయింది.

మరికొంతమందిలో ఇంకా ప్రాచీన వాసనలు పోక జనని సంస్కృతంబు ఎల్ల భాషలకనీ విద్యార్థులకు చెబుతున్నట్టుంది. అందుకే విద్యార్థుల్లో ద్రావిడ సిద్ధాంత వ్యతిరేకత కొందర్లో కనిపిస్తోంది - మరికొందర్లో సంస్కృత వ్యతిరేకత లాగా. వాస్తవానికి ఇవి రెండూ అశాస్త్రీయమైన అవగాహనలే.

జాతికి - భాషకి ఉన్న సంబంధం అర్థ సంబంధమైంది తప్ప రూప సంబంధి కాదు. ఏ భాషా మతం నుంచీ పుట్టలేదు. అలాగే సంస్కృతమూ - అనే అవగాహన ఈనాటిది. ఇది ఉంటే సంస్కృత భాష బ్రాహ్మలది - అని ఎవరూ అనుకోరు. అసలు అలా అనుకొంటున్నది ముఖ్యంగా అగ్రవర్ణీయులే. అది చాలా తప్పు. ఇటీవల ఉత్తర భారతంలో గిరిజన మాండలికం ఒకటి బయట పడింది. అది సంస్కృతానికి నకలుగా ఉందని గుర్తించారు. గిరిజనులంటే ఏమిటో అప్పుడు కొత్తగా నిర్వచించాల్సి వస్తోంది. భాషావగాహన మనిషి క్రియాశీలతలో పర్యవసించే స్వభావం కల్గింది కావటం వల్ల 'ద్రావిడ' స్పృహ సంస్కృత వ్యతిరేకతను సహజంగానే కల్గిస్తోంది. అది మన దేశంలో ఎంత తొందరగా తొలిగిపోతే దేశ సమగ్రతకు, పటిష్ఠతకు అంత క్షేమం. సరిగ్గా ఈ ధ్యేయంతోనే అయ్యర్ గారు తమ పరిశోధన నారంభించారు. భారతీయ భాషల నడుమ - వ్యవహర్తల మధ్య - సదవగాహన ఏర్పడాలంటే అశాస్త్రీయమైన భాషా-జాతి కుటుంబ విభాగ ధోరణి పోవాలి. ఇప్పటికీ 'మద్రాసీ' అంటే 'హిందూస్థానీ'కి చిన్నచూపు. అలాగే హిందీ అంటే దాక్షిణాత్యులకు పడదు. అందేక ఇంగ్లీషునైనా నేర్చుకోవడానికైనా మనం ఇష్టపడుతున్నాం కాని హిందీని కాని, సంస్కృతాన్ని కాని అన్యజాతీయ భాషగానే ద్వేషిస్తున్నాం పండితుల్లో - అందులో భాషా పండితుల్లో - కూడా ఈ అశాస్త్రీయ ధోరణి మిగిలి ఉండటం చింతనీయం. కాని గమ్మత్తు ఏమిటంటే దాక్షిణాత్య భాషలేవీ సంస్కృతస్పర్శ లేకుండా నాగరికం కాలేవు. సాహిత్యమూ పుష్పించుకోలేవు. భాషలో చాలా ప్రధానమైంది క్రియా స్వరూపం భారతీయ భాషలన్నిటి లోనూ క్రియాకాల భావబోధకతల్లో సంస్కృతీయమైన సమాధర్మాలు కొన్ని పరిణమించాయి. ఇండో యూరోపియన్ భాషల్లో లేని లక్షణాలిలాంటివి సంస్కృతంలో ఎన్నో ఉన్నాయి. అంచేత సంస్కృతం ఇండియాలో పుట్టి పెరిగిన భాషే. అది భారతీయభాషే. వేదపూర్వ సంస్కృతం ఎలా వుండేదో మనం ఊహించలేము. చారిత్రకాధారాలు చాలా స్వల్పం. ఇండో ఇరానియన్ యూరోపియన్ భాషలకు సన్నిహితమైన మౌలిక నిర్మాణం ఉంది ఉండవచ్చని పండితులంటారు. సంస్కృతంలోని శబ్దార్థ నిర్మాణం భారతీయమైన చట్రాన్ని కల్గింది. భారతీయ భాషలన్నిటా సమానంగా కనిపిస్తున్నదీ చట్రమే. కాబట్టి సంస్కృతం ప్రాకృతం మొదలైన భారతీయ భాషా సాహిత్యం కల్గినవే దాక్షిణాత్య భాషలుకూడా - అని ఊహించినవాడు అయ్యర్.

అయ్యర్ గారి మాటల్లోనే విందాం :

"నాగరిక ద్రావిడ భాషలన్నిటిలోనూ సంస్కృత పదజాలం విస్తృతంగా ఉండటం మూలాన పండితులందరూ ఒకప్పుడు ఈ భాషలన్నీ సంస్కృతం నుంచే పుట్టాయని అభిప్రాయ పడ్డారు. కాని ద్రావిడ భాషల వ్యాకరణ నిర్మాణాన్ని సూక్ష్మంగా పరిశీలించి ఈదృష్టి తప్పని తెలుసుకోవటంలో కాల్డ్‌వెల్ రాసిన 'కంపేరిటివ్ గ్రామర్' చూపిన ప్రభావం అంతా ఇంతా అని చెప్పడానికి వీలుకాదు.

ప్రస్తుతం పండితులందరూ అంగీకరించిన విషయం ఏమిటంటే ఈ ద్రావిడ భాషలు - సంస్కృత ప్రాకృత భాషావ్యవహర్తలు భారతదేశంలోకి ప్రవేశించే దానికి ఎన్నోవందల సంవత్సరాల ముందే వ్యవహారంలో స్థిరపడి ఉన్నాయని, తర్వాత జరిగిన ఆర్య ద్రావిడ సంపర్కం వల్ల మౌలిక పదజాలంతో సహా ఈ భాషలపైన సంస్కృత ప్రభావం పడ్డదని. అంతే కాకుండా సంస్కృత నిర్మాణం మీద కూడా ద్రావిడ భాషల ప్రభావం పడిందని.

ఇలా విరుద్ధ ప్రతిపాదనలు రెండు పండిత లోకంలో ప్రచారంలో వున్నాయి. సంస్కృతం నుంచీ ఈ భాషలు పుట్టాయని ఒక వర్గం పండితు లంటుంటే- కాదు సంస్కృతం కన్నా ఈ భాషలు మరీ ప్రాచీనమైనవని మరో వర్గం పండితులనటం మొదలుపెట్టారు. ఈ భాషల మౌలిక నిర్మాణం సంస్కృతాది ఆర్యభాషల ప్రభావం చేత ఏమాత్రం మారలేదని ఈ వర్గం పండితులు వాదించటం ప్రారంభించారు.

కాని చాలా కాలం పరిశోధన చేశాక నాకు కనిపించిన విషయం ఏమిటంటే ద్రావిడ భాషల్లో - పదజాలమంతా కాకపోయినా వ్యాకరణ పదాంశాలలో చాల వరకు సంస్కృత ప్రాకృత వ్యాకరణ పదాంశాలను చేర్చటం వల్ల ఏర్పడ్డవేనని. ఈ ప్రక్రియ దాదాపు 20, 25 శతాబ్దాలపాటు కొనసాగింది. అంతే కాకుండా సంస్కృతాది ఆర్య భాషా మూలాలు లేని ద్రావిడ భాషా ప్రాథమి పదజాలం కూడా చాలా స్వల్పంగా ఉంది.

సూచికలు :

1) 'దిస్ బుక్ ఈజ్ ఎ స్టోర్ హవుస్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ ఆన్ ఎవెరీ థింగ్ ద్రవిడియన్, అండ్ బేర్స్ ఎవిడెన్స్, ఆన్ ఎవెరీ పేజ్ ఆఫ్ ఇట్, టుది ఇమ్మెన్స్ లెర్నింగ్ ఆఫ్ ది ఆథర్, హిజ్ ఇన్ డిఫాటిగబుల్ రిసెర్చ్, హిజ్ జీనియస్ ఫర్ ఎనాలిసిస్, అండ్ హిజ్ ఫెమిలియారిటీ విత్‌ది గ్రామర్స్ ఆఫ్ ఆల్ మోస్ట్ ఆల్ ది లాంగ్వేజెస్ ఆఫ్ ది వరల్డ్' అని కాల్డ్వెల్ గారి సి.జి.డి. ని గురించి అయ్యర్ అన్నమాట సరిగ్గా ఆయన పుస్తకానికి అన్వయిస్తుంది - అంటున్నారు పీఠికా కర్త పి.యస్. అప్పుస్వామి (పు. 6)

2) చిలుకూరి నారాయణరావుగారి ప్రతిపాదన ఇది.

క్రీ. పూ. 3వ.శ. నుండి క్రీ.శ. 5వ శ.వఱకును భారత దేశమందంతటను ప్రాకృత భాషలు ప్రచారమందుండినట్లు మనకు దెలియును. నాటి నుండి 6, 7 శతాబ్దముల వఱకును దక్షిణ హిందూదేశమందును, 12వ శతాబ్దము వఱకును తక్కిన భారత వర్షమునందును ప్రచారము నందుండిన భాషల స్వరూప మెట్లుండెనో తెలిసికొనుట కాధారములు లేవు. అట్టి సందర్భమున ద్రావిడభాషల మూలమునఁ బ్రాకృత భాషలను నేఁటి యార్య భాషలను గలిసగివని యూహించుట సమంజసము గాదని తోఁచుచున్నది. కావున ఆ అభిప్రాయమునకుఁ దగిన యాధారములు నిరూపింపబడునంత వఱకును బూర్వలాక్షణికులతో నేకీభవించి ద్రావిడభాషలు కూడఁ బ్రాకృత భాషలే యనియుఁ దక్కిన ప్రాకృత భాషలెట్లు గలిగినవో ద్రావిడ భాషలునట్లే గలిగినవనియుఁ, బ్రాకృత భాషలపై ద్రావిడీ ప్రాకృతమున కెంతటి ప్రోద్బలము కల్గెనో ద్రావిడ భాషలపైఁ గూడ తక్కిన ప్రాకృత భాషల వలన అంతటి ప్రోద్బలము కలిగెననియుఁ బ్రాచీనార్య భాషలనుండి తక్కిన ప్రాకృతముల వలె ద్రావిడ భాషలును వికాసము నొందిన వనియుఁదలంచుచు నా దృష్టితోఁ బరిశోధనల సాగించినచో ద్రావిడ భాషా కర్త్వము తేలఁ గలదని చెప్పుట సాహసము కానేరదు."

(చూ. ఆంధ్ర భాషాచరిత్రము సం. 1-65-66)

3. ఈ భాష - ద్రావిడమనీ, ఆర్యమనీ రెండురకాలుగా పండితులు వాదిస్తున్నారు. లిపి చిత్రాకారంగా ఉండటంవల్ల - భాషాలిపిగా నిర్ధరించటానికి వీలుకావటం లేదు. చిత్రాలకు అర్థం చెప్పడంలో సంస్కృతీ పరమైన అర్థం ఒకటే సాధ్యం. ఆ సంస్కృతి విషయకంగా ఆర్య ద్రావిడ భేద పరిగణనం సింధూలోయ శిధిలాల విషయకంగా కుదరడంలేదు. అంచేత ఈ సమస్య అసాధితంగానే నేలగిలిపోయింది.

అడివిని గాచిన వెన్నెల

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

వింతగానో వురిమి,
అంతలోనే కరిగి,
ఇంతలో మెత్తగా మెరిసిపోయిన మొయిలె!
కన్నతండ్రిని గాని,
కైకమ్మనూ గాని,
అన్నయ్య ఆనతో ఏవిన్ని చెయలేక
వరిగిపోయిన యట్టె. మసలిపోయిన యట్టె
కన్నీటి వానలో కన్నెఱ్ఱ ఎండే!

పురుషోత్తములు భువిని పీఠమెక్కంగా,
పుడమి పుడమీ పొంగి విష్ణుపద మంటంగ,
పదునాలుగేళ్ళూ ముడుచుకొని, ఒక్కపరి
పకపకా నవ్వినా వెన్నెల్ల మొగ్గే!
కొలువంత వింతగా పొంగిపోయిన పాలబుగ్గే!

అలనాడు, ఎప్పుడో, అక్కడయోధ్యలో
ఉరిమిన్న ఆ వురుము, మెరిసిన్న ఆ మెరుము,
ఆమబ్బు, ఆ యెండ, ఆ మొగ్గ, ఆ బుగ్గ
ఎవరనీ అంటే—
సుమిత్ర చేతుల్ల పవడంపు చిలికే!
దశరథుల మేడలా ఆనంద మొలకే!

ఊర్మిళా లోకాల నిత్య మన్మథులే!
పగవాడిపై లేచి పడగలెత్తే నాగె!
నీలంపు మెరుపుల్లు నీరజాక్షులకైతె
పసిడి పచ్చని నీడె! వారె, లక్ష్మణులే!

ఆ లక్ష్మణులు ఎక్కడంటే—
సౌమిత్రు లాయనేడంటే—
రాచ బాటల్లోన, ముళ్ళ దోవల్లోన,
అన్న వదినల నాల్గు నవ్వునాళ్ళల్లోన,
కన్నీళ్ళ కడలిలో, కంటకపు కలనిలో
ఎండలో వానలో, నీడలా నడిచి,

రాక్షసపు తాపాన నీడల్లుగాచి,
నీడలా కొలిచినా, నీడగా మిగిలినా
కల్యాణ రాములా కన్నుల్ల తమ్ముల్లు!
వానరుల కోనలో కానవచ్చేరు...
రావణులు లంకలో రణము సలిపేరు...
రఘురాము అడుగులో అడుగు కలిపేరు

ఈ అదృష్టాధ్వాన
పురుషోత్తముల అడుగు
గగనాలు గగనాలు గడిచి రాగలదీ—
మున్నీటి బాటలా నడిచిపోగలదీ—
గహనాలు గహనాలు దాటిపోగలదీ—
దివుల వైకుంఠమూ భువికి తేగలదీ—
పురుషోత్తముల అడుగు అది ముందు అయితే
చిత్ర ప్రకృతి వాదిన సీత నదుమయితే
లక్ష్మన్న మన అన్న లనుసరించేరు—
ఊర్మిళా దేవులూ అడ్డమ్ము తొలగినా,
ఉర్విజ సీతమ్మ చిత్ర హింసించినా.
మధ్యలో విధి నిలిచి ఎంత ఆటాడినా,
వెలుగు నీడల కీలు బొమ్మలాటాడినా,
అడవులను నాటినా, అబ్ధిపారించినా,
కోతులా, రక్కసుల గుంపులకు నడిపినా,
ఇంద్రజిత్తుల మాయ యుద్ధముల నిలిపినా,
ఆ దివ్య చరణాలే మదిని నిలిపేరు—
అబ్జాక్షు అడుగులో అడుగు కలిపేరు—

తన రాము కౌసల్య లోకానికిచ్చె—
తన బిడ్డ లక్ష్మన్న తల్లి రాములకిచ్చె—
పురుషోత్తములు ఎపుడు లోకాల వెలుగే!
వరలక్ష్మణులు ఎప్పుడా వెలుగుపాయే!
వెన్నంటు చాయే!

★★★★★★★★★★★★★★★★★

4. వారు ఆచార్య స్థానాన్ని పొందకపోవడానికి కారణం కేవలం వారి ప్రాకృత వాద నిష్ఠయే - నని పండితులంటారు. విద్యావంతుడికి దేశంలో జరిగే శిక్షలు ఇలా వుంటాయి.

5. ఈ విషయాన్ని మొదట బయట పెట్టిన వాడు బంగోరె. చూ. బ్రౌన్ లేఖలు - బంగోరె (సం). శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ప్రచురణం (1976)

6. చూ. సి. జి. డి. పునర్ముద్రణా. మద్రాసు విశ్వవిద్యాలయ ప్రచురణ (1963)

7. చూ. బ్రహ్మానంద హెచ్. ఎస్. 'తెలుగు సాహిత్యవిమర్శ. పాశ్చాత్య ప్రభావం' అ. 4 (1981 అము)

8. చూ బ్రహ్మానంద హెచ్. ఎస్. 'తెలుగుభాషాసాహిత్య పరిశోధనలు - పుట్టుపూర్వోత్తరాలు (ప్రాథమిక దశ)', తెలుగులో పరిశోధన (రజతోత్సవ సంచిక) ఆ. ప్ర. సాహిత్యఅకాడెమీ ప్రచురణ జి. వి. సుబ్రహ్మణ్యం (సం) 1984 : 33 - 50.

9. అటు ఉపాధ్యాయుల్లో ఇటు విద్యార్థుల్లో - 'ద్రావిడ' సిద్ధాంతం దురవగాహంగానే కనిపిస్తోందని సమాధానాలు నిరూపిస్తున్నాయి. అందుకే గగుర్పాటనడం. ఇన్ని దశాబ్దాల విద్యాబోధనకూడా ఈ స్థితిలో ఏమీ మార్పును తీసుకురాలేకపోయింది. ఒకడు తెలుగు<తెనుగు నుంచి పుట్టిందని రాస్తాడు. మరొకడు తెలుగు<త్రిలింగ త్రికళింగ నుంచి పుట్టిందంటాడు. ఇంకొకడు 'మిడిమిడిజ్ఞానమున్న భాషాశాస్త్ర పండితులు'— అని రాస్తాడు. మాష్టార్లకు నచ్చడం, నచ్చకపోవడం ఉంటుంది. నచ్చితే మార్కులుపడతాయి. లేకపోతే సున్న పెడతాడు. ఈ స్థితినుంచీ మన భాషాసాహిత్యరంగం బయటపడటానికి చర్య చాలా అవసరం.

10. చూ. చేకూరి రామారావు 'తెలుగువాక్యానికి' (1975) రాసిన పీఠిక ఆ. ప్ర. సా. అకాడెమీ ప్రచురణ (ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా)

[సశేషం]

క్రొత్త సీరియల్ ప్రారంభం

సహగమనం



మధురాంతకం నరేంద్ర

నుదుటిపైని కుంకుమబొట్టును గుండ్రంగా దిద్దుకున్నాక, నిలువుటద్దంలోని తన ప్రతిబింబాన్ని రెండు మూడు నిముషాలసేపు పరీక్షించి చూసుకొంది మానస.

పలుచటి పౌడరుపూతతో ముఖం మంచు తెరను తప్పుకున్న గులాబీలా కాంతులీనుతోంది. ట్రిమ్ చేయించిన కనుబొమలు పందెపు కోళ్ళకు కట్టిన చురకత్తుల్లా కన్పిస్తున్నాయి. ప్రెప్పింగ్ ముక్కు పుల్లపైబడి, జిగేల్మని మెరిసిన కాంతి కిరణం, పెదవులపైని లేత గులాబిరంగు లిప్‌స్టిక్ పూతపై ప్రతిఫలిస్తోంది. జూకాలు కంఠహారంతోనూ, గాజులతోనూ 'మాచ్' అయ్యాయి. పైకెగసిన సముద్రపుకెరటాల్ని కిందికి పడనివ్వకుండా అలాగే వొడిసి పట్టుకున్నట్టున్న నీలిరంగు ఆర్గండీ చీరకు కుచ్చిళ్ళు చక్కగా అమరాయి. వోసారి చీర కుచ్చిళ్లు పైకెత్తి పాదాలకేసి చూసుకొంది. ముదురు వంకాయ రంగు నెయిల్ పాలిష్‌తో వేళ్ళు 'ఫాషన్ పారేడ్‌కు' సిద్ధమయినట్టుగా కనిపిస్తున్నాయి. వెండి మెట్టెలకు మూడు చిరుమువ్వలున్న కొక్కెం వేలాడుతోంది.

చీర పయిటను వోసారి సవరించుకున్న తరువాత నువ్వేమంటావన్నట్టుగా కనుబొమలెగరేస్తూ ప్రతిబింబాన్ని పలకరించింది. "అంతా సక్రమంగానే వుంది"_ అంటూ తానూ కళ్ళెగరేసింది ఆమె ప్రతిబింబం.

తన చేష్టలను చూసి, తనకుతానే నవ్వుకుంటూ గోడ గడియారం కేసి చూసింది. కింది వైపుకు దిగి నిల్చున్న గడియారపు ముళ్లు రెండూ ఆమె అలంకరణ చూడడంకోసం పోటీ - పడుతున్నట్టుగా కనిపించాయి.

కిటికీలోంచి వీధివైపుకు తొంగిచూసింది ఆమె..

జరుగుతున్నది చలికాలం కావడంతో వీధుల్లో ఆరున్నర గంటలకంతా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.

టేప్ రికార్డర్ ఆన్ చేసి, వారపత్రిక నొకదాన్ని చేతబట్టుకుని, సోఫాలో కూర్చొంది. మానస.

యెదురుగా కిటికీలోంచి కాంపౌండువాల్ కున్న గేటు స్పష్టంగా కనిపిస్తోంది చేతిలోని పత్రికపైన ఆమె మనస్సు నిలవడం లేదు. రెండు నిముషాల


Rao

కొకసారి కిటికీవైపుకు చూడక తప్పడం లేదు.

పట్టెమంచం ప్రక్కనున్న టీపాయ్‌పైకి చూసింది ఆమె.

'స్టీలు ఫ్రేం తగిలించుకున్న పెళ్ళినాటి ఫోటోలో చిరంజీవి నవ్వుతూ కనిపించాడు. తలకు పాగా, పట్టు అంగవస్త్రం, పూలమాల— ఆ వేషంలో తమాషాగా కనిపిస్తున్నాడతను. అతని పక్కనే తాను. రాత్రంతా నిద్ర మేల్కొన డంతో ఎర్రబారిన కళ్ళు, నుదుటంతా అలుక్కుపోయిన కుంకుమా కాటుకా, బుగ్గపైన పెద్దచుక్కా, చుట్టూ మనుషులు గుమికూడిపోయి గాలి వీచక పోవడంచేత ముఖంపైన చెమట బిందువులూ— తనకప్పుడు యిప్పటిలా క్రమపడి అలంకరణ విషయంలో శ్రద్ధ తీసుకునే అవకాశం లేదు. అయినా తాను అందంగానే వుంది. ఆ విషయాన్ని చిరంజీవి సైతం ఒప్పుకుంటాడు. అలాగని అలానే తయారై కూచుంటే అతడు సహించలేడు. అసలు హనీమూన్ కోసమని బెంగుళూరు కెళ్ళిన మొదటి రోజున, అతడు చేసిన మొదటిపని- తనను 'బ్యూటీ పార్లర్' కు తీసుకెళ్ళడమే !,

వారపత్రికను టీపాయ్‌పైకి విసిరేసి కిటికీలోంచి కనిపిస్తున్న ఆకాశపు శకలాన్ని చూస్తూ కూర్చొంది మానస.

రోడ్డుపైన ఆటోలూ, బస్సులూ దీపాలు వెలిగించుకుని అట్టహాసం చేస్తున్నాయి.

కాంపౌండువాల్ కివతలున్న క్రోటన్ మొక్కలపైన వీధి దీపాలకాంతి పడటంతో అక్కడొక రంగు రంగుల మోడరన్ ఆర్ట్‌పీస్ ప్రత్యక్షమయ్యింది.

మేడక్రింద, వంటగదిలోంచీ కుక్కర్ శబ్దం వినిపిస్తోంది.

గదిలోని ట్యూబులైటు కాంతి, వెన్నెలతో పోటీకోసం సిద్ధమై కూర్చొంది.

పెళ్ళయి ఆరునెలలు పూర్తికావస్తున్నా ఆ గదీ, ఆ వాతావరణమూ, ఫోటో ఫ్రేంలోంచీ నవ్వుతోన్న చిరంజీవి -ఫోటో- అన్నీ యింకా కలలాగే అనిపిస్తోంది ఆమెకు.

చిరంజీవి సాన్నిధ్యంలో వున్నప్పుడు సైతం ఆమెకు దాదాపు యిలాంటి అనుభూతే కలుగుతూ వుంటుంది. నిద్రలేచిన తరువాత స్పష్టాస్పష్టంగా గుర్తుకొచ్చే కలలోని సంఘటనల్లా ఆమె పుట్టిల్లు జ్ఞాపకానికొచ్చేది,

మానస పుట్టిల్లు అత్తవారింటి నుంచీ పదిహేనుమైళ్ళ దూరంలో వుంది. అలాగని ఆమె పుట్టిల్లు మరోవూరు కాదు. దాదాపు పాతికమైళ్ళ మేరకు వ్యాపించిన నగరంలో వొకచివరన ఆమెపుట్టిల్లు, మరోవైపున అత్తవారిల్లూ వున్నాయి వున్న వొక్కగానొక్క కూతురినీ పెళ్ళిచేసి పంపేయడంతో ఆమె తల్లిదండ్రులకు కూడా తమయిల్లు బోసిపోయినట్లుగా స్పష్టంగానే కనిపిస్తోంది. తలచుకున్నప్పుడల్లా వాళ్ళిద్దరూ వచ్చి చూసి వెళ్తూనే వున్నారు. రోజుకోసారైనా పుట్టింటి నుంచీ ఫోన్ మోగుతూనే వుంటుంది. ఆమె అన్నయ్యనెక్కించుకున్న 'రాజ్‌దూత్' రెండు మూడు రోజులకోసారి కాంపౌండు వాల్ తలుపుల్ని దాటి లోపలికి ప్రవేశిస్తూనే వుంటుంది. వాళ్ళను కలిసి నప్పుడూ, ఫోన్‌లో పలకరిస్తున్నప్పుడూ, యీరెండు కలలనూ కలుపుతున్న వారధిలాంటి పెళ్ళీ, తీయటి స్మృతిలా మిగిలి పోయిన పెళ్లిచూపుల తతంగమూ, మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తూనే వున్నాయి.

టేప్ పూర్తవడంతోనే బటన్ టక్కుమని పైకి లేచ్చింది

కాసెట్ తిప్పిపెట్టి, బటన్ నొక్కి, మళ్లీ వారపత్రికను చేతిలోకి తీసుకొంది మానస.

టెలిఫోను రింగుమంది.

పట్టెమంచం దగ్గరికి వెళ్లి, టీపాయ్‌పైనున్న టెలిఫోన్ రిసీవర్ని అందుకుంటూ "హలో...." అంది

"నేనండీ... రాజేష్‌ను..." రాజేష్ మాట్లాడుతున్నాడు.

"నమస్తే !... "

"హలో అని ఇంగ్లీషులో విష్ చేసింది చాలక తెలుగులో కూడా నమస్కరించాలా చెప్పండి ?... " నవ్వుతున్నాడతను.

మానసకు చిరాకేసింది.

మౌనంగా వుండిపోయింది.

"కోపం వచ్చిందా ? తమాషాకలా అన్నానండోయ్... "

యెదుట నిలబడి చూస్తున్నట్టుగా యెలాకనిపెట్టేశాడితను ? ఆమెకు ఆశ్చర్యం కలిగింది. బలవంతంగా చిరునవ్వును కొని తెచ్చుకొని " అబ్బే లేదు..." అంది.

"నాకు తెలుసులెండి మీకు కోపం వచ్చినట్టుంది."

"లేదంటున్నాను గదా !"

"నిజం... ?"

"నిజం ..." మళ్లీ చిరాకు పడింది ఆమె.

"చూశారా, యీసారి మీకు నిజంగానే కోపం తెప్పించ గలిగాను" మళ్లీ నవ్వసాగాడు.

రిసీవరును విసిరి పారేయాలనిపించింది. ఆమెకు.

ఫోన్ పెట్టేసేయకండి..." అన్నాడతను.

"అబ్బే లేదు... " ఆమె తడబడి పోయింది.

"క్లబ్ నుంచీ ఫోన్ చేస్తున్నాను. సాగర్ యిక్కడే వున్నాడు..."

"యేం చేస్తున్నాడు ?.... "

" యీ రోజెలాగైనా, వో సెట్టయినా నన్నోడించాలనుకొని ట్రైచేసి చేతులు పైకెత్తేసి, ముఖం కడుక్కోవడం కోసం టాయిలెట్‌లో కెళ్ళాడు. యిద్దరమూ యిప్పుడే టెన్నిస్ కోర్టునుంచీ క్లబ్బులో కొచ్చాం. మీకు ఫోన్ చేయాలన్నాడు నాతో. నేను రింగ్ చేసి మాట్లాడుతూ వుంటాను, యీలోగా ముఖం కడుక్కుని రమ్మని చెప్పాను."

మానస మంచంపైన కూర్చొంది.

"చిరంజీవి... ?"

"యింకా రాలేదు...."

"యివ్వాళ క్లబ్‌కు గూడా రాలేదు.... అన్నట్టు మీ అన్నయ్య చిరంజీవితో గూడా పోటీ పడ్డాడు. వస్తే ఓ సెట్టయినా లాగించాలని యెదురు చూసీ చూసీ, పాపం డిసప్పాయింటయి పోయాడు...."

"...... "

"చిరంజీవి ఎక్కడికెళ్లినట్టు ? యింకా ఫ్యాక్టరీలోనే కూచున్నాడా ?"

"వుండొచ్చు. యేదో పనుందని ఉదయం చెప్పారు గూడా...."

యింకా సాగర్ టాయిలెట్‌లోంచీ బయట పడలేదు. యేవయినా విశేషాలు చెప్పండి...."

"యేమున్నాయి ? ... "

"అంకుల్ .... ?"

"రామకృష్ణ మందిరానికెళ్ళారు...."

సేమ్ వోల్డ్ రొటీన్... మరి ఆంటీ... ?"

' సేమ్ వోల్డ్ డ్యూటీ... వంట..."

''పరవాలేదండీ, మీరు మాట్లాడడం నేర్చుకుంటున్నారు. అంతా చిరంజీవి ఘనతే ! ఆరునెలలు సావాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారట గదా" రాజేష్ నవ్వసాగాడు.

"మీరేం చేస్తున్నారు ? ... "

"యెప్పుడు ? "

"ఫోన్ రింగయినప్పుడు...."

టేప్ వింటూ కూచున్నాను. అన్నయ్యింకా రాలేదా ?..."

"యిదుగో వచ్చేస్తున్నాడు. బోరు కొట్టించానా...."

"...... "

"యేంచేయను చెప్పండి ? వాడొచ్చేదాకా యేదో ఒకటి మాట్లాడాలి గదా

యిదిగో మీ అన్నయ్య...."

"మనూ !" సాగర్ కంఠం వినిపించింది.

"అన్నయ్యా !..."

"చిరంజీవి రాలేదా యింకా .. "

"........."

"యేమిటి మాట్లాడవ్ ?"

"నీకేం చెప్పాను ?"

"వో అదా ?" నవ్వుతూ అన్నాడు. "నీకు భర్తగాక మునుపటినుంచీ నాకు తను ఫ్రెండ్. వొకసారిగా 'బావ' అని పిలవమంటే యెలా అలవాటు పడుతుంది చెప్పు ? వోకే. బావగారు యింటికి వేంచేశారా ?..."

"లేదింకా..."

"క్లబ్ కొస్తానని ప్రామిస్‌చేసి యెగ్గొట్టాడు. నేను వోడించేస్తానని భయపడ్డాడు కాబోలు...."

"ఆయన డిక్షనరీలో భయం అన్న పదమేలేదు, తెలుసా ?"

"భలేభలే ! ఆరునెలల్రకితం వరకూ మా చెల్లెలు యేమనేదో తెలుసా ? మా అన్నయ్య డిక్షనరీలో డిఫీట్ అన్నపదమే లేదు అనేది..."

మానసకూడా నవ్వేసింది.

"అమ్మా నాన్నా నన్నప్పుడే మరచిపోయారు." అంది.

"అదేమిటీ అలాగంటావు?

"మరేమంటాను ? యింటికొచ్చి అయిదురోజులు దాటింది. ఫోన్‌చేస్తే యివ్వాళ యిద్దరూ వస్తామన్నారు. చూసిచూసీ విసుగేసింది. కోపంవచ్చి ఫోన్ గూడా చేయలేదు నేను..."

"భలేదానివే, యేదో పని తగిలి వుంటుంది. బహుశా రేపటికి పోస్ట్‌పోన్ చేసుకుని వుంటారు. అన్నట్టు వొక యింపార్టెంటు మేటరుంది. చిరంజీవితో—అదే బావగారితో యింటికిరాగానే చెప్పు. సెవెన్‌హిల్స్ యెక్స్‌పోర్ట్సు వాళ్ళు కొటేషను నిన్ననే పంపారట. ఆ విషయమై మీ ఆయన వొకటే హైరానా పడిపోతున్నాడు. నిన్నటివరకూ నేను వాళ్ళదగ్గరికి వెళ్ళిరాలేదని గొడవచేశాడు. తీరా నేను వెళ్ళి వచ్చాక, నన్ను కలుసుకోకుండా యెక్కడో తిరుగుతున్నాడు. పెళ్ళిచేసుకున్నాడు గదా, తొందర తొందరగా సంపాదించేయాలి కాబోలు. యేమయినా అంటే 'బిజినెస్‌లో రేపు చేయాలి' అని పోస్ట్‌పోన్ చేయడం డ్రా బాక్ లెక్చర్ అంటూ దంచేస్తున్నాడు..."

"సెవెన్‌హిల్స్ యెక్స్‌పోర్ట్స్...వాళ్ళెవరు ?"

"అదంతా నీకిపుడు చెబితే అర్థంకాదు. మా ఫ్రెండు బదరిన్లా అందులో పనిచేస్తున్నాడు. వాళ్ళ దగ్గర కూచుని యీపని చేయించమని మీ ఆయన ఆర్డరు. నేను వొబేయింగ్...రాగానే చెప్పు ఆ పని అయిపోయిందని..."

"అలాగే...."

"యింకేమిటి ? ఫోన్ వుంచేయనా ?"

"మీ ఫ్రెండు...."

"లోపలున్నాడు...."

"యేమిటంత అతిగా వాగుతాడు ?"

"యేమంటున్నాడు ?" నవ్వుతున్నాడు.

"నీకు నవ్వులాటగానే వుంటుంది. నేను మాట్లాడడం నేర్చుకుంటున్నానట ! సావాస దోషం అంటున్నాడు."

"నిజమే మరి !"

"అంటే....?"

మళ్ళీ నవ్వు.

"పెళ్ళికిముందు నాకు మాటలు రావా ?"

"యెవరన్నారు ?"

"యేదో నీకూ ఆయనకూ స్నేహితుడుగదా, అని గౌరవంగా మాట్లాడితే మాటలు రావటున్నాడు. రేపటినుంచి మాటకుమాట అనేస్తాను...."

"అంతకోపం తగదమ్మాయ్. బావగారు యింటికి ఆలస్యంగా వేంచేస్తున్నారే అనుకో! అంతమాత్రాన ఆ కోపాన్ని చూపెట్టాల్సింది మాపైన్నా చెప్పూ?"

"నిన్నూ...."

"ఫోన్‌బిల్లు పెరిగిపోతోంది...."

"నిన్నెవరు ఫోన్ చేయమన్నారు ? రేపు యింటికి రాకపోయావో అప్పుడు చెబుతాను నీపని...."

మానస రిసీవరును క్రెడిల్‌పైన పడేసింది.

అలాగే దిండునానుకుని పడకపైకి వాలిపోయింది.

కిటికీలోంచి చల్లటిగాలి వీస్తోంది.

మంచుగడ్డలాంటి యేకాంతాన్ని పదునైన చరకత్తితో కోస్తున్నట్టుగా టేప్ రికార్డర్‌లోంచి వీణానాదం వినిపిస్తోంది. విషాదంతో కూడిన తీయదనం...ఎప్పుడూ మానవుడు యేకాకిగానే మిగిలిపోతాడన్న విషయాన్ని చాటిచెబుతున్నట్టుగా గుబులు గుబులుగా మ్రోగుతుంది వీణ....

గోడ గడియారం ఠంగుమని మ్రోగింది.

వులిక్కిపడి లేచి టిపాయ్‌దగ్గరికి నడచి టేప్‌రికార్డరును ఆఫ్‌చేసింది. ట్రాన్సిస్టరును ఆన్ చేసింది.

తెలుగులో వార్తలు ప్రసారమవుతున్నాయి.

వార్తల్ని వినడంలో తన ధ్యాసను కేంద్రీకరించడంకోసం ప్రయత్నం చేసింది మానస.

లాభం లేకపోయింది.

చూపులు కిటికీని వదలి పెట్టడంలేదు.

విసుగ్గా ఫోన్ దగ్గరికి నడచి రిసీవర్ చేతికందుకుని ఫ్యాక్టరీనెంబరు డయల్ చేసింది.

అవతల రింగవుతోంది.

రెండు నిమిషాల తరువాత "హలో కే సీ యస్ మెడికల్స్...." అన్న కంఠం వినిపించింది.

"మీ ప్రొప్రయిటరుగారు...."

"లేరండీ గంట్రకితమే వెళ్ళిపోయారు"

"యెక్కడికి ?"

"తెలియదండీ—మీరెవరు ?"

మానస బటన్‌నొక్కి లైను డిస్కనెక్టు చేసేసింది.

ఆఫీసులోలేదు.

చిరంజీవి మరెక్కడికెళ్ళినట్టు ?

రిక్రియేషన్ క్లబ్బుకు రింగ్ చేసింది.

ఆటెండరు యెవరు కావాలంటూ ప్రశ్నించాడు.

చదరంగం ఆడుకుంటూ కూచున్న సాగర్, టెలిఫోను దగ్గరికి రావడానికి రెండుమూడు నిమిషాలు పట్టింది.

ముళ్ళపైన నిల్చున్నట్టే వుంది ఆమెకు.

"యేంచేస్తున్నావింతసేపూ ? లైన్‌లో యెంతసేపని వెయిట్ చేయాలి ?" విసుక్కొంది.

"బయట లాన్‌లో కూచున్నాము. లోపలికి లేచి రావాలిగదా ! రేపటినుంచీ, ఫోన్‌ను చెస్‌బోర్డు దగ్గరే అరేంజ్‌చేయమని చెబుతాను క్లబ్బువాళ్ళతో. అదిసరే

యేమిటీ విశేషం ?"

"మీ బావగారిక్కడికి వచ్చారేమోనని...."

"రాలేదని చెప్పానుగదా !

"క్లబ్ కొస్తానని ప్రామిస్ చేశారని చెప్పావుగదా!"

"అవును...."

"ఫ్యాక్టరీకి ఫోన్ చేశాను. గంట క్రితమే వెళ్ళిపోయారని చెప్పారు. నువ్వు ఫోన్ చేశాక అక్కడి కొచ్చారేమోనని...."

"రాలేదు, బహుశా మరెక్కడికయినా వెళ్లుంటాడు. చెప్పానుగదా, మీ ఆయనకు తిక్కపిచ్చి పట్టుకుంది. ఏ పార్టీదగ్గరకు పరుగెట్టుకెళ్లాడో యేమో! వచ్చేస్తాడ్లే ఏమయినా ప్రోగ్రాం ఫిక్స్ చేసుకున్నారా మీరు ?..."

"సినిమాకెళ్దామన్నారు. మామూలుగా ఆరింటికంతా యింటికొచ్చేసేవారు. యేడున్నరయింది. యింకా రాలేదు. కంగారుగావుంది...."

"కంగారెందుకు ? బయటి కెళ్ళాక యెన్నో పనులు. యిది మామూలే.... యిలా కంగారు పడడం మొదలు పెడితే యిక అయినట్టే...."

"యేమో అన్నయ్యా. నాకు భయంగావుంది...." ఆమె కంఠం వణికింది.

"యేయ్ పిచ్చిపిల్లా, యింత మాత్రానికే అలా కంగారు పడతా వెందుకు ? యింతకూ నువ్వెక్కడినుంచీ మాట్లాడుతున్నావు ? "

"యింటి దగ్గిరినుంచీ...."

"యింటి దగ్గరనుంచీ మాట్లాడుతున్నావన్న సంగతి నాకూ తెలుసు. హాల్లోనా; కిచెన్‌లోనా, మేడపైనా ?"

"మేడపైన్నుంచీ...."

"మీ అత్తగారు...."

"కిచెన్‌లో వున్నారు...."

"అదీ సంగతి. యిదిగో అమ్మాయ్, వొంటరిగా గదిలో కూచుంటే నీకిలాగే పిచ్చిపిచ్చి ఆలోచనలు వస్తాయి. నీకు పెళ్లిచేసింది, కేవలం మీ ఆయనకోసం యెదురుచూస్తూ కూచోడానికి వొకవ్యక్తి కావాలని మాత్రమేగాదు. మీ అత్తగారికి కాస్త సహాయం చేసిపెట్టే తోడుకావాలని గూడా....వెళ్లి వంటపని చూడు...."

"నీకు ఫోన్ చేసింది వుచిత సలహాలకోసంగాదు "

రిసీవర్ పడేసి, మేడ పైన్నుంచీ కిందికి దిగి, కిచెన్‌లోకి వెళ్లింది ఆమె

సరోజమ్మ డైనింగ్ టేబులుపైన పాత్రల్ని సర్దుతూ కనిపించింది.

"ఆయన యింకా రాలేదాండీ ?"

ఆమె తలపైకెత్తి చూసింది.

"టయమెంతయిందిప్పుడు ?"

"యేడున్నర...."

"అంతేగదా ! వచ్చేస్తాడ్లే....బోర్‌గావుంటే టీ వీ ఆన్ చేసుకుని కూచో..".

"వంట... "

"యేమిటి, ఆకలిగావుందా ?" సరోజమ్మ నవ్వుతూ ప్రశ్నించింది.

"అబ్బబ్బే, అదిగాదు. యేమయినా హెల్ప్...."

"వంటయిపోయింది. చిరంజీవి రాగానే వడ్డించడమొకటే నువ్వు చేయాల్సిన సహాయం...."

మానస హాల్లోని టీవీ మీటనొక్కి, యెదురుగా సోఫాలో కూర్చొంది.

వరినాట్ల గురించీ, పశుపోషణ గురించీ కార్యక్రమమేదో నడుస్తోంది

'తన భర్త యేడున్నర దాటుతున్నా యింటికి రాలేదు. అయినా అత్తగారు కంగారు పడడంలేదు. అన్నయ్య పట్టించుకోవడం లేదు. తాను మాత్రమే బెంబేలు పడిపోతోంది. యెందుకని ?' పెళ్లిచూపుల నాటి తన వాగ్వాదం జ్ఞాపకం వచ్చింది ఆమెకు. 'పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలని పట్టుబట్టింది తాను. యిప్పుడిప్పుడే పెళ్లి చేసుకోను పొమ్మంది యింట్లో యెవరూ వొప్పుకోలేదు. అబ్బాయి బావున్నాడు. మంచి ఆస్తిపాస్తులున్నాయి. బాగా చదువుకున్నాడు. పైగా అన్నయ్యకు చాలా రోజులుగా స్నేహితుడు. బాగా తెలిసిన సంబంధం. అందరూ పట్టుబట్టి, బలవంతంగా వొప్పించి, పెళ్లికి ముహూర్తం నిర్ణయించారు. ఆ సంఘటన జరిగి యింకా యేడాదయినా గడవలేదు. ఆనాడు చిరంజీవి యెవడో పరాయివ్యక్తి, అతడుగాకపోతే మరెవరో వొకరు. చదువు పూర్తయ్యాక, నచ్చిన మరో వ్యక్తిని చేసుకుంటే సరిపోతుంది. ప్రపంచంలో మరో మొగాడే లేడా ?– పోట్లాడింది తాను. కానీ యిప్పుడు ? ప్రపంచంలో తన కింతగా యిష్టమయిన మరోవ్యక్తి యెవరున్నారు ? లేడు. యెవడూలేడు. చిరంజీవి తన లక్ష్యం. చిరంజీవి తన గమ్యం. చిరంజీవి తన సర్వం. చిరంజీవే తనకు కావాలి. తానే అతను. అతనే తాను. యెంతలో యెంత మార్పు ? టీ వీ సెట్టుపైన, ఫోటో ఫ్రేంలోంచీ తననే పలకరిస్తున్నాడు చిరంజీవి. అతని కళ్లల్లో మరెవరిలోనూ లేని వింతకాంతి....కొస దేలిన ముక్కు....పెదవులపైన ఆదే చిరునవ్వు.... యేడీ చిరంజీవి ? యింకా రాడేమిటి ?' మానస నిరీక్షణను భరించలేక పోతోంది.

సరోజమ్మ కూడా వంటగదిలోంచీ బయటపడి, టీ వీ ముందు కూర్చొంది

"ఆయనా, వాడూ బయటికెళ్తే, యిలా యెదురు - చూస్తూ కూచోవడం నాకు అలవాటే ! యిప్పుడు నాకు తోడుగా నువ్వొచ్చావు...." ఆమె నవ్వుతోంది.

'మొదట్లో ఆమెకూడా తనలాగే కంగారు పడుతూ కాలంగడిపేదేమో ! నిరీక్షించడం అలవాటు పడ్డాక, తనకు గూడా అలా నవ్వగలిగే శక్తి వస్తుంది కాబోలు....'

"డాక్టరు వొద్దని చెప్పారుకాబట్టి, ఫ్యాక్టరీ కెళ్లడం మానేసి, యిలా ధ్యానం గీనం అంటూ రామకృష్ణ మందిరానికి వెళ్తున్నారుగానీ, ఆయన ఫ్యాక్టరీకెళ్లే రోజుల్లో నేనిలా గంటలకు గంటలు యెదురుచూస్తూ కూచునేదాన్ని. ఆయనతో పోలిస్తే చిరంజీవి యెంతోమేలు...."

హాల్లోని ఫోన్ మ్రోగింది.

పరుగెత్తుకెళ్లి, రిసీవర్ చేతిక్కందుకొంది మానస.

వినిపించిన కంఠం చిరంజీవిది కాదు.

"చంద్రమౌళి గారి యిల్లేనా ?"

"అవును...."

"నేను గవర్నెంటు హాస్పిటల్ నుంచీ మాట్లాడుతున్నాను. అయామ్ వెరీ సారీ. బాడ్ న్యూస్ చెప్పాల్సి వస్తోంది. చంద్రమౌళి గారి అబ్బాయి, చిరంజీవికి ఆక్సిడెంటయింది. క్రాస్ రోడ్స్ దగ్గర కారు లారీని ఢీ కొట్టింది."

కెవ్వుమని కేకేసి నేలవాలిపోయింది మానస.

"స్పాట్ డెడ్....చిరంజీవి మరణించాడు.....మీరు వెంటనే రావాలి...."

చివరి మాటలు వినబడక మునుపే ఆమెకు స్పృహ తప్పిపోయింది,

2

"డోర్ లాక్ చేయమంటారా సార్ ?"

కుర్చీని కిటికీ వైపుకు తిప్పుకుని కూర్చుని యెటో చూస్తూవుండిపోయిన సాగర్ వులిక్కిపడి ప్యూన్ వైపుకు తిరిగి చూశాడు.

"అయిదయిపోయింది. డోర్ లాక్ చేయమంటారేమోనని...." మళ్లీ అడిగాడు అతను.

"నేను కాస్సేపు యిక్కడే వుంటాను. నువ్వెళ్లిపో. నేనే లాక్ చేసుకుంటాను...." అన్నాడు సాగర్.

ప్యూన్ వెళ్లిపోయాడు.

క్లాసులు సాయంకాలం నాలుగు గంటలకంతా అయిపోతాయి. ఆపై డిపార్టుమెంటు దగ్గర జనసంచారం తగ్గిపోతుంది. తమతమ గదుల్ని లాక్ చేసు

కుని లెక్చరర్లందరూ వెళ్లిపోతారు.

యూనివర్సిటీ నగరానికి వొక చివర్లోవుంది. కాబట్టి ట్రాఫిక్ శబ్దాలు అంతగా వినిపించవు. ఆ సమయంలో - డిపార్టుమెంటు ముందున్న రోడ్డు పైన్నుంచీ లైబ్రరీ కెళ్లే విద్యార్థులూ, యూనివర్సిటీ లోపలే షికార్లు తిరిగే జంటలూ తప్ప మరెవరూ కనిపించరు.

కిటికీలోంచీ పెద్ద గానుగ చెట్టొకటి కనిపిస్తోంది.

చెట్టు కొమ్మపై చేరిన పిచ్చుకలు రెండు యెందుకో కీచులాడుకుంటున్నాయి.

పచ్చటి ఆకులు నేలపైకి రాలిపోతున్నాయి.

పండిపోయిన ఆకులు నేల రాలడంలో ఆశ్చర్యంలేదు.

అయితే లే చిగురాకు లెందుకు రాలిపోవాలి.

యెందుకు ?

యెందుకిలా జరిగింది.

యెందుకన్న ప్రశ్న సాగర్‌ను వేధిస్తోంది.

టేబుల్‌పైన చదవడం కోసమని తెరిచి పెట్టిన లైబ్రరీ పుస్తకం అలాగే వుండిపోయింది.

ఆష్ట్రేలోకి పారేసిన సిగరెట్టు ముక్క యింకా పొగల్ని కక్కుతూనే వుంది

కుర్చీని మరి కొంచెం వెనక్కు లాగి, కాళ్లకిటికీలో కెత్తిపెట్టుకుని, చేతుల్లో ముఖం దాచుకున్నాడు అతను.

కళ్లు ఎర్రబారిపోయాయి.

జుట్టురేగిపోయివుంది.

చెక్కిళ్లపైన, అయస్కాంతాన్ని అంటిపెట్టుకున్న యినుపరజనులా, వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

అతను బట్టలు మార్చుకుని మూడునాలుగు రోజులు దాటిపోయివుంటుంది.

దుమ్మును పైకి లేపుతూ, యీదురుగాలి కొరడాను ఝళిపించింది.

టేబులుపైని పుస్తకం పేజీలు టపటపాకొట్టుకున్నాయి.

విసుగ్గా పుస్తకాన్ని మూసి పెట్టాడు.

అట్టపైన యెవడో కుర్రాడు యిష్టమొచ్చినట్టుగా పిచ్చిగీతల్ని గీసిపారేశాడు.

జీవితం కూడా పిచ్చిగీతల సముదాయమే కాబోలు ననిపించింది అతడికి.

పుస్తకం తన స్వంతంకాదు. దాన్ని యెలా పాడు చేసినా తన సొమ్మేమీ పోదు. పిచ్చిగీతలుగీసి పారేసిన తరువాత, ఆ కుర్రాడు నవ్వుకొని వుంటాడు.

మానవ జీవితాల్ని కసిగా చిందరవందర చేసిపారేసే కసాయివాడు యెవడు ?

యెవ్వడువాడు ?

యెందున్నాడు ?

ఆ వ్యక్తి యెవడోగానీ, అతడు తనకెదురైతే ఖూనీ చేసి పారేయాలి— అనిపిస్తోంది అతడికి.

సిగరెట్టుకోసం డ్రా తెరిచాడు,

ప్యాకెట్టులో సిగరెట్లు లేవు.

అతను చైన్ స్మోకర్ గాడు. యేమీ తోచనప్పుడు రోజుకొకటి రెండు సిగరెట్లుకాల్చుకోవడం అతడి అలవాటు. కానీ ఆరోజున అతడు కొనుక్కొచ్చిన సిగరెట్టుప్యాకెట్టు సాయంకాలానికంతా ఖాళీ అయిపోయింది.

ఆ రోజు సాగర్ కాలేజీకి రావల్సిన అవసరంలేదు.

అయినా, యింట్లో కూచోబుద్ధికాలేదు.

క్లబ్బు కెళ్ళడానికి మనస్కరించలేదు.

పదకొండు గంటలవరకూ వొళ్ళలసిపోయేలా వూరు తిరిగి, తరువాత కాలేజీకొచ్చి, తన గదిలో కూచున్నాడు.

యిద్దరు ముగ్గురు తోటి లెక్చరర్లు గదిలోకొచ్చి, సానుభూతిమాటలుచెప్పి, వెళ్ళిపోయారు.

యెందుకో, యెవరితోనూ మాట్లాడాలని అనిపించడంలేదు అతడికి.

వొంటరిగా అలాగే కూర్చుని వుండిపోయాడు.

· మధ్యాహ్నం భోజనం చేయలేదు.

ఆకలికూడా కాలేదు.

టేబుల్‌పైని నీలిరంగు గ్లాసులో వుదారంగు పౌంటెన్‌పెన్ మిగిలిన కలాల్ని వెక్కిరిస్తున్నట్టుగా మెరుస్తోంది.

'అది తనకు మానస మదరాసునుంచీ తీసుకొచ్చిన బహుమతి. తనకు బాగా జ్ఞాపకముంది' డిగ్రీ ఫైనల్ యియర్లో మదరాసుకు టూరు కెళ్ళింది మానస. వస్తూ వస్తూ యింట్లో అందరికీ బహుమతులు కొనుక్కొచ్చింది. నీకేం తెచ్చుకున్నావని తానడిగితే ఠాగూరు 'గీతాంజలి'ని చూపెట్టింది. యెమ్మేలో యింగ్లీషు లిటరేచర్' చదవాలని కలలుగనేది తాను. మంచి పుస్తకమేదయినా కనిపిస్తే యేదో పెన్నిధి దొరికినట్టు సంబరపడిపోయేది. యీ పెళ్ళికి బదులు యెమ్మేలో చేర్పించినా సరిపోయేది. యీ మూన్నాళ్ళ ముచ్చటకేనా అందరూ బలవంతపెట్టి పెళ్ళిచేసింది?'

దీర్ఘంగా నిట్టూర్చాడు అతను.

'యెవరినో నిందించి లాభంలేదు. దీనికంతా తన తొందరపాటే కారణం. చిరంజీవిని యింటికి రమ్మని ఆహ్వానించింది తానే! పెళ్ళిచూపులు యేర్పాటు చేసింది తానే ! మానసను బలవంతపెట్టింది తానే యిలా జరిగినందుకు కారకుడెవడో వేరొకడని అనుకుంటున్నాడు తాను. ఆ కిరాతకుడు మరెవడోకాదు తానే!'

సాగర్‌కు జుట్టు పీకేసుకోవాలనివుంది.

కసిగా తనను తానే శిక్షించుకోవాలనివుంది.

విసురుగా గోడకేసి కాలు విదిలించాడు.

గోరుచిట్లి, రక్తం బొటబొటా కారింది

కళ్ళలో నీళ్ళుతిరిగాయి.

అలాగేవంగి, వేలును చూస్తూ కూర్చున్నాడు.

వేలు నొప్పిగావుంది.

బిగ్గరగా యేడవాలనిపించింది అతడికి.

వాష్‌బేసిన్ దగ్గరికివెళ్ళి, చేతిగుడ్డను తడిపి, వేలికి చుట్టాడు.

మళ్ళీవచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

బయట చీకటితెరలు విడివడుతున్నాయి.

గదిలో బాగా చీకటిగావుంది.

గంటెంతయిందో తెలుసుకోవడంకోసం ముంజేయికేసి చూశాడు.

గడియారంలేదు.

వుదయం బయలుదేరినప్పుడు రిస్ట్ వాచ్ తీసుకోవడం మరచిపోయాడు తాను.

కిటికీ కవతల కానుగ చెట్టుపైన పక్షుల సంరంభం బిగ్గరిగా వినిపిస్తోంది.

లైబ్రరీనుంచీ హాస్టలుకెళ్తున్న విద్యార్థినులు యెందుకో బిగ్గరగా నవ్వుకుంటున్నారు

సాగర్ కాస్సేపు బాహ్య ప్రపంచాన్ని మరచిపోయి, సుషుప్తిలో వుంది

పోయాడు.

కుర్చీలోనే సోలిపోయాడు.

వున్నట్టుండి గదిలో దీపం వెలిగింది.

సాగర్ తిరిగి చూశాడు.

యెదురుగా రాజేష్ కనిపించాడు.

సూటిగా తనవైపే చూస్తున్నాడు.

సాగర్ తలవంచుకున్నాడు.

రాజేష్ యెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

యిద్దరూ యేమీ మాట్లాడుకోలేదు.

కాస్సేపు గడచాక "వెళ్దాం, పైకిలే" అన్నాడు రాజేష్.

రాజేష్ టేబుల్ పైనికి బంచ్ చేతికందుకుని, తానే గదికి తాళం తగిలించాడు.

డిపార్టుమెంటు ముందుకు రాగానే "బైక్ కూడా తీసుకురాలేదన్నమాట!" అన్నాడు.

సాగర్ సమాధానం చెప్పలేదు.

తన మోటారు బైకును స్టార్టుచేశాడు రాజేష్.

సాగర్ వెనక సీటుపైన కూర్చున్నాడు.

దాదాపు నిర్మానుష్యంగా మారిపోయిన యూనివర్శిటీ రోడ్లను దాటుకుని, మోటారుబైకు నగరంలోకి ప్రవేశించింది.

రాజేష్ ముందుగా వో హోటలుకు తీసుకు వెళ్ళాడు.

టిఫెన్‌కూ, కాఫీకీ ఆర్డరిచ్చాడు.

సాగర్ బుద్ధిగా టిఫెన్ చేశాడు.

తరువాత మళ్ళీ మోటార్‌బైక్ బయల్దేరింది.

"క్లబ్బుకొద్దు...." అన్నాడు సాగర్.

"మరి ?...."

"యెక్కడికయినా వెళ్దాం....యెవరూ లేని చోటికి...."

"బీచ్ కెళ్దామా ?...."

"అలాగే...."

బీచ్ దగ్గరికెళ్ళేసరికి గంట యెనిమిది దాటివుంటుంది.

సముద్రంలో అలలు వువ్వెత్తున లేచి పడుతున్నాయి.

కెరటాలు విసిరికొడుతున్నా, చందమామ సముద్రాన్ని అంటిపెట్టుకునే వున్నాడు.

బీచ్ నిర్మానుష్యంగా వుంది.

మోటర్ బైకుని రోడ్డుపక్కన నిలబెట్టి, "యిక్కడే కూచుందాం" అన్నాడు రాజేష్.

"సిగరెట్ వుందా ?" కూచుంటూ అడిగాడు సాగర్.

జేబులోంచి సిగరెట్టు ప్యాకెట్టునూ, సిగర్‌లైటర్‌నూ పైకితీసి అతడికిచ్చాడు రాజేష్.

సిగరెట్టు వెలిగించుకున్నాక, సాగర్ అలాగే యిసుకతిన్నెపైన పడుకున్నాడు.

తానూ సిగరెట్టు వెలిగించుకున్నాక, "వుదయంనుంచీ యూనివర్శిటీలోనే వున్నావా ?" అంటూ ప్రశ్నించాడు రాజేష్.

"లేదు....పదకొండున్నర నుంచీ వున్నాను...."

"అంతవరకూ ?"

"అలా తిరిగాను"

"యింట్లో చెప్పావా ?"

"వూహూ" మూల్గుతున్నట్టుగా వూకొట్టాడు.

"ఫోన్ చేశావా ?"

"లేదు...."

"యెందుకని ?"

"యేమో, తోచలేదు ..."

"మధ్యాహ్నం భోంచేశావా ?"

"...... ... ."

"పోనీ, నేను యూనివర్శిటీకి ఫోన్‌చేశాను. ఆసంగతయినా తెలుసానీకు?"

సాగర్ మిత్రుడివైపుకు తలతిప్పిచూశాడు. "ప్యూన్ చెప్పాడు. యెవరో అడిగారని చెప్పాడు. నువ్వేనని తెలియదు."

"మధ్యాహ్నం మీ నాన్నగారు మా ఆఫీసుకు ఫోన్‌చేశారు...."

"..............."

"యెందుకని అడగవేం ?"

"చెప్పు...."

"ప్రొద్దున్ననగా యిల్లొదిలిపెట్టిన వాడివి. యేమయిపోయావో యేమో... నన్నడిగితేనయినా తెలుస్తుందేమోనని...."

"నేనా ? నేనెక్కడికెళ్తాను ?.... నేనేమైపోతానని....?" నిట్టూర్చాడు.

"యేమో, నీ ధోరణి చూస్తుంటే నాక్కూడా భయంగానే వుంది....."

నేనేంచేస్తున్నాను ?" అతడి కంఠం జీరబోయింది.

"నువ్వేం చేస్తున్నావో, నీకే తెలియదన్న మాట! నువ్వు యెవరితోనయినా పట్టుమని పదిమాటలు మాట్లాడి యెన్నాళ్ళయింది ? వేళకు భోంచేస్తున్నావా నువ్వు ? యింట్లో వుంటున్నావా ? యెందుకిలా యింటినుంచీ దూరంగా పారిపోతున్నావు ? పిచ్చివాడిలా తిరుగుతున్నావెందుకు ? మీ అమ్మా నాన్నా యెంత బాధపడుతున్నారో నువ్వసలు గమనిస్తున్నావా ? కూతురి ప్రైతుకేమో అలాగైపోయింది. నువ్వేమో యిలా తయారై కూచున్నావు. యెంతటి వాళ్ళకయినా గుండెలు నీళ్ళయిపోతాయి..."

"..........."

"యిటు వంటి పరిస్థితిలోనే మనం ధైర్యంగా, స్థయిర్యంగా వుండాలి సాగర్! పారిపోకూడదు. యెదిరించి నిలబడాలి..."

"నిజమేకానీ....రాజూ !"

"యేమిటో చెప్పు."

"యిలా జరగడానికి కారణమెవరో తెలుసా నీకు ?"

"యెవరు ?"

"నేనే !"

రాజేష్ వులిక్కిపడ్డాడు.

"నువ్వా ?"

"అవును, నేనే !"

"యేం చేశావు నువ్వు ?"

"పెళ్ళికి ముందు యింట్లో యెంత గొడవ జరిగిందో నీకేం తెలుసు ? చెల్లాయి యిప్పుడిప్పుడే పెళ్ళిచేసుకోనని మొండి కేసుకుని కూర్చొంది. అమ్మా నాన్నా కూడా ఆటువైపుకే మొగ్గుతున్నట్టుగా కనిపించారు. నేను....నేను ససేమిరా కుదరదని నానాహైరానా చేసిపారేశాను. యింతమంచి సంబంధం పోతేరాదని గిరిగీసుకుని కూచున్నాను...." యేడుపు జీరతో అతడి కంఠం అదోలా వినిపిస్తోంది. "మా అమ్మకూ, నాన్నకూ నామాట ప్రకారం పెళ్ళి జరిగితే బావుండుననివుంది. మానస యిష్టప్రకారం చదివించాలనీ వుంది. మంచి

సంబంధం. తప్పిపోవడం వాళ్లకూ యిష్టంలేదు. అప్పుడు... దెన్ యిటీజ్ మీ హూప్లెయిడ్ దీ డబుల్ గేమ్..."

"అంటే...."

"అంటే...."

"చెల్లెలికిష్టమే నని చిరంజీవికి చెప్పాను. పెళ్లి జరిగి తీరాలని యింట్లో మొరాయించాను. నేను మూర్ఖుణ్ణి రాజా! పెళ్లయ్యేదాకా వొంటికాలిమీద నిల బడ్డాను. లేకుంటే ... లేకుంటే.... భగవంతుడా!.... ఐ ఆయామ్ యే డెవిల్" సిగరెట్టువిసిరి పారేసి, లేచికూచున్నాడు.

రాజేష్ అతడివైపే కన్నార్పకుండా చూడసాగాడు.

"యితరుల జీవితాల్తో ఆడుకోవడానికి నేనెవర్ని రాజా!" గొంతు జీర బోవడంతో సగంమాటమాత్రమే వినిపించాయి.

"నిజమేసాగర్! నీ అంత మూర్ఖుడు మరొకడుండడు..." అన్నాడు రాజేష్.

"ఆ వొక్క తిట్టు చాలదునాకు.... తిట్టురాజా! యీలోకంలో అతినీచ మయిన తిట్లన్నీ తిట్టు....యెంత తిట్టినా నాపాపానికి నిష్కృతి వుండదు...."

"నిన్నేమని తిట్టాలో తోచడంలేదు సాగర్! నిజంగా నీ అంత ఫూల్ మరొకడుండడు. కానీ నిన్ను తిట్టడానికంటే ముందుగా మీ అమ్మా నాన్నల్ని తిట్టాలి.... "

"వాళ్లేం చేశార్రా" సాగర్ చిరాకు పడ్డాడు.

"అసలు దీనికంతా వాళ్లే కారణం. పిల్లల్నసలు కనకుండా వుంటే, యిన్ని బాధలు వుండేవి కావు. పోనీ నీ వొక్కడితో సంతృప్తి పడివున్నా పరవాలేదు. మీ చెల్లాయి పుట్టకపోయినట్టయితే, యిక సమస్యే లేదు ...."

"రాజా! ... " సాగర్‌కేం చెప్పాలో తోచలేదు.

"లేకపోతే నువ్వనేదేమిటి? చెప్పు? బలవంతంగా పెళ్ళిచేశానంటున్నావు. అందుకని తప్పంతా నీదేనంటున్నావ్. అంతేనా? ...."

"........"

"పిచ్చివాడా! అది మంచి సంబంధం. వాడు నీకు స్నేహితుడు. బిజినెస్‌లో పైకొస్తున్నవాడు. చెల్లెలు సుఖపడుతుందని అనుకున్నావు. మంచే జరుగుతుందని భావించావు. యింతలో యిలా జరుగుతుందని యెవరు కలగన్నారు? — "

"........"

"యిలా జరగడానికి అసలు కారణమేమిటో నీకు తెలియదు. కాని నాకు తెలుసు. యేమిటో తెలుసా అది?"

సాగర్ సమాధానం చెప్పలేదు.

"దీనికి కారణం యింకొకరెవరూ కాదు. చిరంజీవే కారణం. కన్నూ మిన్నూ కానకుండా తాగేసి డ్రయివ్ చేస్తే యేమవుతుంది సాగర్? పాపం, తాగాడు గదా అని, వెహికల్స్ తప్పుకుని తిరుగుతాయా? .... "

"రాజా, ఏమిటి నువ్వంటున్నది? నిజమే చెబుతున్నావా?"

"అవును పోస్ట్‌మార్టం జరగడం పరువు తక్కువని మీ మామగారు తన తంటాలు తాను పడ్డాడు, లేకపోతే, యీసరికి నిజం బయటపడి వుండేది."

"........"

"ఆరోజు రాత్రి బ్లూమూన్‌లో యేదో సెలబ్రేషన్ జరిగిందట! స్నేహితుడెవరో డ్రైవరుకు కబురు చేయమని సలహా యిచ్చాడట గూడా!

మృత్యువు పిలుస్తుంటే యెవరి మాటలన్నా యినబుద్ధవుతుందా చెప్పు! కావలిస్తే యింకో సీసా ఖాళీ చేసి, ఆపైన యెంచక్కా డ్రయివ్ చేస్తానని పందెం కొశాడట మహానుభావుడు ...."

"........"

"నిజానికి యీరోజుల్లో తాగడం నేరం కాదు సాగర్! అమాటకొస్తే మనం తాగలేదూ! యెన్నిసార్లు పార్టీలు చేసుకోలేదు మనం? తాగి, డ్రయివ్ చేస్తున్న వాళ్ళంతా చచ్చిపోతున్నారా? బీచీలో కూచుని బీరు బాటిళ్ళు ఖాళీ చేసి, వొకే స్కూటరెక్కి యెన్నిసార్లు యిల్లుచేరలేదు మనం? కాస్త ఆలోచించి చూడు. కారణం నీది గాదు, చిరంజీవిదీ గాదు. అమాటకొస్తే తాగుడుదీ గాదు. తాగకుండా, డ్రైవ్‌చేస్తూ ప్రాణాలు పోగొట్టుకొన్న వాళ్ళు యెందరు లేరు?...."

"........"

"యెందుకిలా జరిగింది? దీనికి కారణమెవరు? యిలాంటివన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు. జవాబు చెప్పలేని ప్రశ్నలతో మనస్సును పాడుచేసుకోవడమెందుకు? .... "

"........"


"సాగర్ నువ్వూ ఫిలాసఫీ చదువుకున్నావు. జీవితం అంటే నీకూ తెలుసు. సిల్లీ యాటిజిట్ సెల్ఫ్‌యెనాక్సిడెంట్ ... బుద్ధిమంతుడైన వాడెవ్వడూ, ఇలాంటి కొశ్చన్స్‌తో జీవితాన్ని పాడుచేసుకోడు ...."


"మరి .... ? "

"నీకూ తెలుసు, నీతులు చెప్పడం సులభం. తనదాకా వస్తేగాని తెలియదు యెవరికయినా.... మీ సిస్టర్‌కిలా జరిగినందుకు, షాక్‌తో బెంబేలు పడి పోతున్నావు ... "

"......"

"యిక ఆపాడు ప్రశ్నల్ని వదలిపెట్టి, యికపైన యేంచేయాలో ఆలో





తొలి ఉషస్సు తూరుపును తడిపిన వేళ

సత్తిబాబు

కనుకొలకుల్లో ఓ కన్నీటి కణం తారట్లాడే వేళ
ప్రశ్నతో ముఖాన్ని స్పృశిస్తూ గాలి పెడ్తోంది ఊళ
ఆ బిందువు చెప్పేగాథ ఎవ్వరిది-
చరిత్రకెక్కని ఆ బాధ ఎక్కడిది-

ఓ అనంత నీలాకాశమా__!
అంతకంతకూ దూరమవ్వడం నీ కలవాటు
అందుతావని ఎత్తుకెక్కడం నా పొరపాటు-
ఇసుకపర్రలో నడలిన అడుగు తడబడే వేళ
హోరు జోరుగ ఊగిసలాడి పాడ్తోంది జోల
భోరు మంటోంది ఆ హోరు ఎందుకని-
గోడు మంటోంది ఈ గుండె దేనికని-

ఓ అనంత నీలి సంద్రమా__!
దాచుకున్న గుబులు కెలకడం నీ కలవాటు
దాహమేస్తే నిన్ను చేరడం నా పొరపాటు-

తొలి ఉషస్సు తూరుపును తడిపినవేళ
గుండె పట్టుకు గుమ్మంలో పడుంటినిలా
వాకిలి తెరచిన లోగిలి ఎవ్వరిది-
లోగిలి చూపిన లాలన ఎక్కడిది-

ఓ అనంత కారుణ్యమా__!
జాలిపెంచుకు ఆదరించడం నీ కలవాటు
కాని భరించక పారిపోతే నా పొరపాటు-
ఆకులదోసిళ్ళు మంచుకణాల్ని తర్పణం చేసేవేళ
ఆశలపందిళ్ళు గాలి నొరుసుకుంటే హిందోళ
చేయందించిన నేస్తం ఎక్కడికి-
చెపితే వస్తా నీతో అక్కడికి-

ఓ అనంత సహృదయమా__!
క్షణం క్షణం బ్రతికించడం నీ కలవాటు
ఆ క్షణమే నాదంటే కాదనడం పొరపాటు-

చించు ... "

"! నేనా ? ... యేంచేయాలి ? "

"ఆ సంగతి నాకు మాత్రం యెలా తెలుస్తుంది ? నీకే తెలియాలి. చనిపోయిన వాళ్ల సంగతి వదిలేయ్. బ్రతికినవాళ్లసంగతి ఆలోచించు ... "

"......"

"జీవితం యెందుకు జవాబొక్కటే ... జీవించడానికి. జీవితాన్నే ఆక్సిడెంటని అనుకొన్నప్పుడు, యిప్పుడు జరిగింది యేమంత పెద్ద ఆక్సిడెంటు కాదు. ఆక్సిడెంటయిన జీవితాన్నే అనుభూతుల్నీ, అనుభవాల్నీ సంపాదించుకునే మజిలీగా భావిస్తున్నప్పుడు, యీ చిన్న యెదురు దెబ్బని మాత్రం యెందుకు లెక్కపెట్టాలి ?... "

రాజేష్ మరో సిగరెట్టు వెలిగించుకున్నాడు

భూమిని కదిలించడం కోసమన్నట్టుగా కెరటాలు ముందుకు దుముకుతూనే వున్నాయి. బాగా దూరమై పోయిన చంద్రుడిపై పగతీర్చుకోలేక, అతడి నీడను పొడుగ్గా సాగదీస్తున్నాయి.

రోడ్డుపైన లారీ వొకటి కర్ణ కఠోరంగా శబ్దంచేస్తూ దూసుకుపోయింది.

కొసవరకూ కాలిన సిగరెట్టు చురుక్కుమని వ్రేళ్ళను ముద్దుపెట్టుకొంది.

"వెళ్దామా", అడిగాడు రాజేష్.

నేనింకాస్సేపు వుంటాను. కావలిస్తే నువ్వెళ్లు ..." అన్నాడు సాగర్.

"అదే వద్దంది. లేపైకి " అతడి చేయిపట్టుకుని బలవంతంగా లేపి కూచోబెట్టాడు.

"నీకు తెలియదు రాజూ ! యిల్లంతా వల్లకాడుగా తయారయింది. నేను భరించలేను ... "

పారిపోయి సాధించేదేమీ లేదు రాపోదాం. యీసమయంలో వాళ్ళందరినీ వోదార్చాల్సిన బాధ్యత నీపైనే వుంది. "

మోటారుబైకు స్టార్టయింది.

నగరంలో హడావుడి యింకా తగ్గలేదు.

మాకు రాత్రిపూటే బావుంది లెమ్మన్నట్టుగా బజార్లనిండా అంగళ్లు రంగు రంగుల దీపాల్ని అలంకరించు కున్నాయి.

కాలనీ వీధుల్లో మాత్రం రద్దీ తగ్గింది.

యింటి ముందు బైక్ ఆపుతూ, యేమిట్రా సాగర్ ... ఇల్లు తాళం వేసి వుందేమిటి ? అంటూ ప్రశ్నించాడు రాజేష్ కంగారుపడుతూ.

సాగర్ వెనకసీట్లోంచి కిందికి దూకాడు.

పొరుగింటి అబ్బాయి దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు.

"అక్కయ్యను హాస్పిటల్లో చేర్చారు. అంకుల్, ఆంటీ అక్కడే వున్నారు మీరు రాగానే చెప్పమన్నారు .. "

"యే హాస్పిటల్ ? రాజేష్ అడిగాడు.

"ప్రశాంతీ నర్సిగ్ హోమ్ ... "

మోటార్‌బైక్ వెనక్కు తిరిగి, నర్సింగ్ హోమ్ వైపుకు దౌడు తీసింది.

(ఇంకావుంది)

డా॥ టి. వి. జి. శాస్త్రి

వడ్డమానులో ప్రప్రథమ జైన అవశేషములు

ఆంధ్రదేశంలో 'వర్ధమాను' అను పేరుగల గ్రామము లనేకములు గలవు. ముఖ్యంగా కృష్ణాజిల్లా నూజివీడు తాలూకాలోనూ, కర్నూలునుండి 'నంది కొట్కూరు' వెళ్ళేమార్గంలోనూ, గుంటూరుజిల్లా మంగళగిరి తాలూకాలోనూ ఇదే పేరుగల గ్రామములు గలవు. ఇవికాక వర్ధమానుకోట వర్ధన్నపేట, వర్ధమాన పురము' అను పేర్లు గల గ్రామములు కూడా కలవు. పైన ఉదహరించిన పేర్లన్నియూ జైనమత వ్యవస్థాపకులలో ఆఖరు వాడైన 'తీర్థంకరుడ'ను వర్ధమానుని పేరు మీదగా ఈ గ్రామముల పేర్లు వచ్చియుండవచ్చునని ఊహించు కొనవచ్చును.

ఎక్కడో మగధదేశమునందు పుట్టి అనాటి వైదిక ధర్మమునకు విరుద్ధముగా ప్రచారముచేసి, వైదికధర్మమునకు ఆలవాలమైన ఆంధ్రదేశమునందు నూతన ధర్మమును స్థాపన చేయగల్గిన 'మహావీర వర్ధమానుని ప్రతిభ అసమానమైనదని చెప్పక తప్పదు. 'వడ్డమాను' అను గ్రామ నామమును పురస్కరించుకొని, ఇది వర్ధమానుని పేరుమీద వచ్చి యుండవచ్చునని "ఊహించి" జిల్లా పురాతత్త్వ సాంస్కృతిక పరిశోధనా సంస్థ "గుంటూరు జిల్లాలోని వడ్డమానను గ్రామమునందు 1981_85 సం॥ త్రవ్వకములు జరిపెను. ఈ త్రవ్వకములను బట్టి క్రీస్తుకు పూర్వము 200 సం॥ల నుండి ఈ గ్రామము వడ్డమానను పేరుతో పిలవబడుచున్నదని స్థిరారణ అయినది.

గుంటూరు నుండి తాడికొండ మీదగా వడ్డమానునకు బస్సులు గలవు. ఈ గ్రామమునందు రాక్షసి గుళ్ళ సమాధులున్నట్లు(మెగాలితిక్ బరియల్స్)రాబర్ట్‌సివెల్ "అమరావతితోప్" అను గ్రంథమునందు పేర్కొనెను. కాని ఇది ప్రస్తుతం కన్పించుట లేదు. ఈ గ్రామమునకు పడమరవైపున రెండు కొండలు గలవు. వాటిలో ఒకటి పెద్దది. దానిఎత్తు 105 మీటర్లు. ఈ కొండపై బలువరాతి స్తంభము ఒకటి పడి యున్నది. ఇదిగాక కొండపై భాగమునందును, పరిసర ప్రాంతములందును చిత్రవిచిత్రమైన కుండ పెంకులు నాణెములు కూడ దొరికెను. త్రవ్వకము ప్రారంభ దశలో కొండపై నైఋతి దిశగా ఉన్న రాతి బండలపై రెండు స్తూపముల రేఖాచిత్రములు కన్పించెను. మరియు కొండపై భాగమునకు పోవునపుడు దక్షిణమున నున్న కొండవాలులో 5 దోనెలు కలవు. వీటిని పరిశీలించినపుడు మొదటి దోనె పైభాగమున 10 అక్షరములు కల్గి ('బ్రాహ్మి'లిపిలో వ్రాయబడిన' శాసన' మొకటి కనిపించెను. (ఫొటో _1)దీని లిపిరూపము (పాలమోగ్రాఫీ)ను బట్టి ఈ శాసనము అశోకుని కాలమునకు గాని తరువాత కాలమునకు గాని చెందినదని చెప్పవచ్చును.

పైన ఉదహరించిన వివరములు కొండపైన, క్రీస్తుకు పూర్వము 200సం॥ల నుండి క్రీస్తుకు తరువాత 500 సం॥ల వరకూ (700సం॥) కొండ ప్రాముఖ్యతను సూచించుచున్నది. అయితే క్రీ. శ. 3వ శతాబ్దము వరకు మాత్రమే "జైన మతమునకు తదుపరి బౌద్ధమతమునకు ప్రాముఖ్యత యుండెనని అవశేషములను బట్టి తెలిసికొనవచ్చును.


బండలపైనున్న రేఖా చిత్రములలోని రెండు స్తూపములూ త్రవ్వకములలో బయల్పడినవి. ఒక స్తూపము బల్లపరుపుగా నున్న ప్రదేశములో ఈశాన్య భాగమున 76 మీ॥ ఎత్తున కొండ అంచులో నిర్మింపబడి యున్నది. రెండవది 105 మీ॥ ఎత్తున నైఋతి భాగమున కొండ శిఖరముపైన కట్టబడి యున్నది. వీనిలో మొదటిది స్తూపనిర్మాణ "వాస్తు"ను నిర్ధారించుటకు ముఖ్యమైనదని చెప్పక తప్పదు.[2] ఇది 13.6మీ వ్యాసము కల్గి బండిచక్రాకృతిలో గాక మధ్యనుండు గర్భభాగమునకు చుట్టునూ 3 వరుసలలో రాతిబండల వలయముకల్గి, వాటి కిరువైపులను 'ఇటుక రాతికట్టు' తాపడము చేయబడియున్నది. గర్భభాగము గుహ్యారముగ నుండి చుట్టునూ పెద్ద బండలమర్చబడి యున్నవి. (ఫొటో-2) దీనిని బట్టి స్తూపము రాక్షసి గుళ్ళ కాలపు (మెగాలితిక్ పిరియడ్) సాంప్రదాయములను అనుసరించి నిర్మింపబడినట్లు తేలుచున్నది.

ఈ స్తూప విశేషములన్నియూ వాస్తుపరిణామములో మొదటిమెట్టుగా పరిగణింపబడుచున్నది. ఇక శిఖరముపైనున్న రెండవ స్తూపము 11. 6మీ. వ్యాసము కల్గియున్నది. కాని దీని నిర్మాణ విశేషము లేవియు కన్పించుటలేదు. దీనిచుట్టును ఒక రాతి ప్రాకారము కలదని ఇచట దొరికిన శిలాఫలకములవలన గ్రహింపవచ్చును.

తూర్పు వైపున కొండ క్రిందనుండి శిఖరమునందున్న స్తూపము వరకును సోపానము గలదు. దీని మెట్ల అవశేషములు త్రవ్వకములో బయట పడెను. కాగా ఒకశాఖా సోపానము క్రింది స్తూపమునకు పోవుటకు నిర్మించబడెను. తూర్పువైపున 9 మీటర్ల ఎత్తున శిఖరస్తూపమునకు క్రిందిభాగమున రెండు ఇటుక కట్టడములు కలవు. ఇది మూసుకొని యున్న పెద్ద గదిని పోలియున్నది. (ఫొటో_3). మధ్య



చిత్రం : 1   వడ్డమానులో సోమక రాజు శాసనము




చిత్రం : 2
ప్రప్రథమ జైన స్తూపం

నుండు ప్రవేశద్వారము నుండి పోవు గోడలు ఇరుపైపుల వంపు తిరిగి యుండును.[3] (ఎలిప్టికల్ స్ట్రక్చర్స్) ఇట్లు కనిపించు కట్టడములు 'బీహారు' లోని 'పాట్నాకు' సమీపమున 'జీవకామ్రవనవిహార' అవశేషములను పోలియున్నవి. కాగా ఒరిస్సా లోని ఉదయగిరి కొండపైభాగము నందు కూడ కొన్ని అవశేషములిట్లు కన్పించుచున్నవి.[4] 'మగధరాజగు నందుడు' 'జీవంత స్వామి (మహావీరుడు) విగ్రహము నిచటనుండి అపహరించగా తిరిగి 'ఛేది' రాజగు ఖారవేలుడు ఆ విగ్రహము కోసం పోరాడి తీసుకువచ్చి వుంచిన ఆలయ అవశేషములని కొందరు చెప్పుచున్నారు.[5]

ఇవిగాక క్రింది స్తూపమునకు ఎదురుగా ఒక చావడివలె నుండి (పోర్టికో) దానిని ఆనుకొని శిఖరమునకు క్రింది భాగములో 5 మెట్లు గల్గిన ఒక రంగ సోపానము కలదు (గాలరీ) ఇచట సుమారు 50, 60 మంది ఆసీనులై స్తూపము వద్ద జరుగుచున్న కార్యకలాపములను తిలకించుటకు వసతి కల్పించిరి.

పైన ఉదహరించిన అవశేషములన్నియూ ఒక వ్యవస్థకు సంబంధించినవి. తరువాతి వ్యవస్థను నిర్దేశించునవి. ఎక్కువగా క్రింది స్తూపపు పైభాగమున కన్పించును. తరువాతి వారు మొదట నిర్మించిన స్తూపమును నాశనముచేసి ఒక శిలా మంటపమును విహారమును, ఉత్తరమున నున్న కొండ క్రింది భాగమునకు పోవుటకు ఒక సోపానమును ఒక బాటను నిర్మించెను. ఈ సోపానమునందున్న మెట్ల లోని కొన్ని రాతిపలకములు మొదటి వ్యవస్థకు చెందినవి. మొదటి వ్యవస్థలో

చిత్రం : 3
బీహారులోని జీవకామ్రవన విహార అవశేషములను బోలు కట్టడములు



స్తూప పైభాగమున నాటవేయుట దానికి సంబంధించిన శిలా ఫలకములు మెట్లపైన అమర్చుట, స్తూపమును నాశనము చేయుట మొదలగున వన్నియు రెండవ వ్యవస్థకు చెందినవారి వికృత చర్యల ఫలితమని త్రవ్వకములలో తేలుచున్నది. వీరి అవశేషములన్నియు బౌద్ధసంస్కృతికి నిలయమైన 'నాగార్జునకొండ' అవశేషములను పోలియుండుట వలన మొదటి వ్యవస్థకు చెందినవారు బౌద్ధులు కాక, వేరే ఇతర మతమునకు చెందిన వారని నిర్ధారణ అగుచున్నది.


ఇకపోతే మొదటి వ్యవస్థకు చెందిన స్తూపములు, ఇతర కట్టడములు జైనులకు సంబంధించినవని చెప్పుటకు కొన్ని ఆధారములున్నవి.

1) శిఖర స్తూపశిలా ప్రాకారమునకు చెందిన కొన్ని చలువరాతి ఫలకములలో కొన్ని శాసనములు దొరికెను. వాటిలో ముఖ్యమైనవి రెండు. మొదటిది, ఒక ఫలకముపై "పుతస, గడోదసథభో"అనునది. దీనినిబట్టి 'భద్రబాహు'ని శిష్యుడగు "గోదస" ఒక స్తంభము వేసినట్లు అర్థము వచ్చును. జైనకల్ప సూత్రముల ప్రకారము జైనమత ప్రబోధకుడగు 'భద్ర బాహన కు 'గోదస' అను శిష్యుడు దక్షిణదేశమునందు జైన మతమును ప్రచారము చేయుటకు పంపబడినట్లు తెలుసుకొన వచ్చును. కృష్ణానదీ ప్రాంతమున ఇతడే ప్రప్రథమముగా జైన విహారము నిర్మించినట్లు వడ్డమాను త్రవ్వకములలో తేలుచున్నది.

2) ఇక రెండవ శాసనములో 'అర' అనునది పైవరుసలోను 'అసరిర అనునది క్రింది వరుసలోను వ్రాసియున్నది. ఇవి దక్షిణదేశమునందు మధుర ప్రాంతమందున్న 'కలుగుమలయ్' కొండదోనెలపై నుండు శాసనముల యందున్న అక్షరములను పోలియున్నవి.[6] కాగా 'అసరిర' అనుపదము 'కాణనీయ' అను పదముతో చేర్చియుండుట వలన 'కలుగుమలయ్' కొండలలోని 'కాణ' శాసనమునను సరించి అసరిర కాణన అనునతడు ఒక జైనగురువై యుండవచ్చునని తోచుచున్నది. మరియు శాసనము పై వరుసలోని 'అర' అను రెండక్షరములు 'అరహంత' (ఇదిజైన పంచనమస్కారములలో మొదటిదని అన్వయించుకొన వచ్చును.) అయినచో, మహావీరుడని అర్థము చెప్పుకొన వచ్చును.

ఇకపోతే మిగిలిన స్తూపముల కాలమునాటి అవశేషములలో ముఖ్యంగా సైక్లోపియన్ రాతిగోడలు[8] ఇట్లుండు నిర్మాణములు "టాక్సిలా రాజవర్" మొదలగు చోట్ల కనిపించును. రాగి, వెండి నాణెములు (ఫోటో-4) మౌర్యులకాలమును సూచించును. కాగా పలురకముల కుండ పెంకులు ముఖ్యంగా నల్లనగిషి గల్గిన (ఎన్. బి. పి.) ఎరుపు నలుపు (బ్లాక్ ఎండ్ రెడ్) ఎరుపురంగు కల్గిన కుండపెంకులు విరివిగా దొరికినవి. వాటిలో బ్రాహ్మీలిపిలో వ్రాసిన అక్షరములు కలవు వీనిని 'వధమానపవతే' వధమ, జినోసవిహార' అని చదువవచ్చును, ఇందులో 'జినోన విహార' అను దానినిబట్టి ఇది క్రీస్తుకు 2వ శతాబ్దములకు పూర్వము కట్టిన ఒక జైన విహార మని తేలుచున్నది. కాగా వడ్డమాను అను ఇప్పటి ఊరిపేరు వర్ధమానుని పర్వతము పైద నున్న విహారమును పురస్కరించుకొని వచ్చియుండవచ్చునని ఈ కుండపెంకులు మీద నున్న వ్రాతవల్ల తెలుసుకొనవచ్చును.

ఇవిగాక మరో శాసనములో 84 అక్షరములు కలవు. ఇదియునూ బ్రాహ్మీ లిపిలో వ్రాసియున్నది. కాని పైనుదహరించిన శాసనముల అక్షరములకు వీ కొంత వ్రాతలో తేడా కన్పించుటచే ఇది ఒక వంద సంవత్సరముల తరువాత వ్రాసిన శాసనముగ తోచుచున్నది. దీనియందు "వధమాన నివాసికస దమ తి సమాతుకసపితుకస. చులదమతికసకుమార" అని వ్రాసియున్నది. దీనినిబట్టి "ధముతి" అను నతడు తనకు, తన పరివారమునకు శ్రేయస్సు కోసం జైన విహారమునకు ఏదో దానము ఇచ్చి ఉండవచ్చునని తేలుచున్నది. ఈ శాసనము మధురలోని శాసనములను పోలియున్నది.[9] కొండదక్షిణప్రాంతమున దోనెపై నున్న శాసనమునుబట్టి ఈ ప్రాంతపు చరిత్రను ఊహించుటకు వీలగుచున్నది. దీనిలో 'రాజ్ఞోసోమకస అనుబధి' అని వ్రాసియుండుటచే సోమకుడను రాజు పై దోనెలను కూడ త్రవ్వించినట్లు అర్థము వచ్చుచున్నది బహుశః స్తూపములు, సోపానములు,



చిత్రం : 4 వడ్డమానులో దొరికిన మౌర్యుల కాలమునాటి నాణెములు

మిగిలిన కట్టడములన్నింటితోపాటు దోనెలను కూడ ఈ సోమకుడే త్రవ్వించి యుండవచ్చును.

సోమకుడను వానికి 'రాజ్ఞో' అని ముందు ఉండుటవలన ఇతడొక రాజై యుండును. ఇదే కాలమునకు చెందిన కొందరు రాజుల పేర్లలో 'క' అంతమున కనిపించును. భట్టిప్రోలు త్రవ్వకములలోని ఒక పెద్ద రాతిభరిణపై 'కుబేరక' అను పేరు కనిపించును. కరీంనగర్‌లోని గోదావరి ప్రాంతమున కోటిలింగాల అనుచోట దొరికిన రాగినాణెములలో 'చిముక సెటక' అను రాజుల పేర్లు గలవు.[10] 'క' అనునది అశోకుని పేరునకు అంతమునందుండుటవలనను, వీటియందుండు అక్షరముల పోలికను బట్టి ఈ రాజులందరూ అశోకుని అనంతరం పల్లు ప్రాంతములందు స్వతంత్ర రాజులుగ రాజ్యమునేలి యుండవచ్చునని తోచుచున్నది.


కాగా పైనుదహరించిన శాసనములకు నాసిక్, నానాఘాట్ మొదలగు పడమటి కనుమల గుహలోనుండు మొదటి శాతవాహనుల శాసనములకును ఎంతో, తేడా కన్పించును. ఇవి లిపి పరిణామములో తరువాతి కాలమును సూచించుటచే సోమకుడు మొదలగు రాజులు ముందు చెప్పినట్లు మౌర్యసామ్రాజ్యాధీశులుగు, అశోకుని మరణానంతరం రాజ్య మేలిరని ఊహించు కొనవచ్చును. వీరిలో చిముకుడే పురాణములలో ప్రస్తావింపబడిన మొదటి శాతవాహన రాజు 'సిముకుడు' అయి ఉండవచ్చును.[11]

ఇందు వలన వడ్డమాను త్రవ్వకముల ఫలితములనుబట్టి ఈ క్రింది అంశములు నిర్ధారణ అగుచున్నవి.

1. ఇప్పటి వడ్డమాను అను వ్యవహారనామము క్రీ. పూ. 2వ శతాబ్దమునుండి వచ్చుచున్నది.
2. ఇచట నుండు పెద్ద కొండపై నున్న జైన విహారమును పురస్కరించుకొని ఈ గ్రామమునకు 'వడ్డమాను' అను పేరు వచ్చెను.
3. రాక్షసిగుళ్ళ సాంప్రదాయము ననుసరించి స్తూపములు కట్టబడెను. మరియూ యావద్భారతదేశమునందు కనిపించు జైన అవశేషముల కన్న వడ్డమాను జైనవిహార అవశేషములు అతి ప్రాచీనములైనవి.
4. జైన సాహిత్యములోని 8వ మత గురువగు భద్రబాహుని శిష్యుడగు 'గోడస' ఆధ్వర్యములో వడ్డమాను జైనవిహారము నిర్మింపబడెను.
5. అశోకుని మరణానంతరం, అమరావతి ప్రాంతమున బౌద్ధ మతంతో పాటు జైన మత ప్రాబల్యం ఉండేది.

అధోజ్ఞాపికలు :

1. సీవెల్, రాబర్ట్ : రిపోర్ట్ ఆన్ అమరావతి టోప్ 1880. పు 6.
2. శాస్త్రి. టి. జి.వి. : ఎక్స్‌ప్లోరేషన్ ఇన్ ది కృష్ణా వ్యాలీ
3. భుల్లవల్ల : నలంద దేవనాగరీ పాలీ సిరీస్
4. ఇండియన్ ఆర్కియాలజీ - ఎ రివ్యూ 1958 - 59. పు 18
5. సర్కార్ హెచ్ : స్టడీస్ ఇన్ ఎర్లీ బుద్ధిస్ట్ ఆర్కిటెక్చర్ ఆఫ్ ఇండియా పు 16
6. ఇం. ఆ. రి. 1954 - 55, పు 16 17,
7. ఘోష్ (ఎడ్) జైన ఆర్ట్ ఎండ్ ఆర్కిటెక్చర్ వాల్. I పు 72
8. మార్షల్, సర్ జాన్ : టాక్సిలా (కేంబ్రిడ్జ్) 1956. పు 210
9. స్మిత్ వి : జైన స్తూప ఎండ్ అదర్ ఆంటిక్విటీస్ అఫ్ మధురా 1901
10. కృష్ణశాస్త్రి ఎ.వి : ప్రొటోహిస్టారిక్ కల్చర్స్ అఫ్ ఎ.పి. 1984 పు 314
11. శాస్త్రి సి. ఎ పి. న్యూమిస్మాటిక్ డయిజెస్ట్ : జూన్ 1981 □


రైతుల పాలిటి కల్పతరువు
రామగుండం యూరియా
RAMAGUNDAM UNIT
यूरिया
UREA
NITROGEN 46%
50KG.
ఆంధ్రప్రదేశ్ లో తయారు చేయబడుతున్న
యూరియా, రామగుండం యూరియా.
అన్ని పంటలకు, అన్ని కాలములకు అనువైన ఎరువు.
వాడండి
రామగుండం యూరియా.
స్వస్తిక్ బ్రాండ్
యూరియా
FCI
ది ఫెర్టిలైజర్ కార్పొరేషన్
ఆఫ్ ఇండియా లిమిటెడ్.
అమ్మకపు విభాగము
6-2-30/C, లకిడి కా పూల్,
హైదరాబాదు-500 004.
Sobhagya

డాక్టరు చెళ్ళపిళ్ళ సోమసుందరరావు
డాక్టరు కొల్లూరు సూర్యనారాయణ

నిడుదవోలి చాళుక్యుల వంశ, కాలానుక్రమణికలు

తెలుగు సంస్కృతిని పెంచి ప్రోది చేసి తెలుగునాట అజరామరమైన కీర్తి వెలయింపజేసుకొన్న వేంగీ చాళుక్యుల అనంతరము వారి వారసులమని ప్రకటించుకొని యీ గడ్డపై పాలన నెఱపిన అనేక సామంత చాళుక్య వంశాలలో పేర్కొనదగినది నిడుదవోలి చాళుక్యశాఖ. ద్రాక్షారామము, చాళుక్య భీమవరము, జుత్తిగ, పాలకొల్లు, దెందులూరు, బెజవాడ, కొలనుపాక, కొలనుపల్లి మున్నగు ప్రాంతాలలోని అనేక శాసనములు వీరి పాలనను, యితరములైన వంశ వివరాలను పేర్కొంటున్నాయి. వీరి పాలన పదకొండవ శతాబ్ది చివర దశనుండి పదునాల్గవ శతాబ్ది తొలిపాదము వరకు అనగా సుమారు రెండున్నర శతాబ్దములపాటు కొనసాగినట్లు తెలుస్తోంది. అవిచ్ఛిన్నంగా కాకపోయినప్పటికీ వేర్వేరు సందర్భాలలో ప్రస్తుత కృష్ణా పశ్చిమగోదావరి, నల్గొండ, వరంగలు జిల్లాల్లోని ప్రాంతాలు వీరి ఏలుబడి క్రింద నుండుట జరిగినది. ఈ వంశీయులు చాలవరకు గోదావరీ తీరప్రాంతములనే తమ కనువైన కేంద్రములుగా మలచుకొనినప్పటికీ చివరి దశలో దేశమున నేర్పడిన క్లిష్ట రాజకీయములు కారణముగా తెలంగాణమునకు తరలిపోక తప్పినది కాదు. వీరి ముఖ్య నగరములుగా వేంగీ, నిడుదవోలు, తోలేరు, తడికలపూడి మున్నగునవి శాసనములలో పేర్కొనబడ్డాయి. అస్తవ్యస్తమైన సమకాలీన రాజకీయ పరిస్థితులను బట్టి సుస్థిరమైన పాలన నేర్పరుపలేకపోవుట, అంతర్గతకలహములు మున్నగునవి కారణముగా వీరు వేర్వేరు సందర్భములలో వేర్వేరు నగరములను ముఖ్యపట్టణములుగా చేసుకొనవలసివచ్చియుండవచ్చు. రాజకీయముగా తమ స్థానమును పదిలపరచుకొనుటకు కీలకసమయములలో వీరు జననాథపుర చాళుక్యుల వెలనాటి ప్రభువుల, కాకతీయుల నీడను చేరకతప్పలేదు. అయినప్పటికీ మధ్యాంధ్రయుగ చరిత్రలో వీరి పాత్ర విస్మరింప వీలుకానిది. పరిణతచెందిన రాజవంశము కావుననే వీరితో నాటి ప్రముఖ వంశములైన కోనహైహయ, కాకతీయులవంటి పాలకవంశాలు సంబంధ బాంధవ్యములు పెంచుకొనుట తటస్థించినది. ఈ వంశీయుల చరిత్ర విషయమై గతమున అనేక పరిశోధనలు జరిగాయి. శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచారి[1], శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ ఆదిత్యశర్మగారలు[2], శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం[3], శ్రీ పుచ్చా పరబ్రహ్మశాస్త్రి[4], శ్రీమతి వారణాసి యశోదాదేవి[5], శ్రీ తురగా కృష్ణమూర్తి[6], శ్రీమతి ప్రతిభామగల్[7] మున్నుగు పెక్కుమంది పండితులు వీరి వంశ చరిత్రాదులను కూలంకషంగా చర్చించారు. కాని ఎటువంటి చర్చ జరిగినను వీరి వంశకాలానుక్రమ నిర్ణయము సక్రమముగా నిర్ధారింపబడలేదు. ప్రస్తుత వ్యాసమున యీ వంశీయుల వేర్వేరు శాసనములలోని అంశములను, పై పరిశోధకుల అభిప్రాయములను ఆధారముగా చేసుకొని యీ శాఖీయుల వంశ కాలానుక్రమణికలను, చరిత్రను రూపేర్పరచుట జరుగుతుంది.

మధ్యాంధ్రయుగ రాజకీయములకు సంబంధించినంతవరకు వీరి ఆవిర్భావము క్రీ. శ. పదకొండవ శతాబ్ది ద్వితీయార్థమున మొదలైనట్లు చెప్పవచ్చును. వీరి పూర్వచరిత్ర ఎచ్చటనూ పేర్కొనబడకపోయినప్పటికీ, ఒకే ఒక్క శాసనమున లభ్యమైన యుద్ధమల్ల వంశసముద్ధరణ' అనే బిరుదమునుబట్టి[8], వీరు వేంగీ చాళుక్య వంశమున తాళరాజు పుత్రుడైన రెండవ యుద్ధమల్లుని సంతతియై వుండవచ్చునని శ్రీయుతులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మగారలు ఊహిస్తున్నారు.[9] నిర్ధారించే యితరాధారములు లభ్యముకానప్పటికీ దీనిని చాలవరకు ఆమోదించవచ్చు. సమకాలీనులైన జననాథపుర చాళుక్యులవంటి వారివలె వీరెచ్చటను తమ పూర్వీకుల విషయమై స్పష్టముగా తెలుపలేదు.

వీరి వంశ, కాలానుక్రమణికలను చర్చించటానికి ముందు వేర్వేరు శాసనాలలో వీరిని గూర్చి పేర్కొనబడిన అంశములను సూక్ష్మముగా పరిశీలించుట చాల అవసరము.

ఈశాఖ చాళుక్యుల వంశ వివరములనిచ్చు శాసనములన్నింటిలో క్రీ॥ శ॥ 1233లో బెజవాడ యందు మహాదేవు డొసంగిన శాసనము ప్రాచీనమైనది. మానవ్యస గోత్రులని తెలుపబడిన వీరి నాలుగు తరముల రాజులిందు పేర్కొనబడ్డారు.[10]

వేంగిశ్వర
|
మల్ల
|
గొంక
|
మహాదేవ

వీరిలో మొదటివానిగా చెప్పబడిన వేంగీశ్వరుని పుత్రిక యొకతె క్రీ॥ శ॥ 1078లో జుత్తిగయందు తన దాన శాసనమును ప్రకటించినది.[11]


బెజవాడనందే క్రీ.శ. 1237లోని మఱియొక శాసనము గొంకని అర్వాచీనులైన మూడు తరముల రాజులను పేర్కొనుచున్నది [12] (ఈ గొంకరాజు బహుశః పై శాసనమున పేర్కొనబడిన మహాదేవుని తండ్రియైన గొంకదే కావచ్చును.)

గొంక
|
అయ్యపదేవ
|
గణపతి
|
అయ్యపదేవ


చాళుక్య వీరభద్రుని తల్లియైన ఉదయాంబిక క్రీ. శ. 1266లో నొసగిన పాలకొల్లు నందలి ఒక శాసనమున సూక్ష్మముగా వీరి వంశమును పురాణ పురుషులకు ముడిపెట్టి చెప్పుచు మరియొక మూడు తరములను పేర్కొనినది.[13]

విష్ణువర్ధనుడు
|
ఇందుశేఖరుడు
|
వీరభద్రుడు

తరువాత పేర్కొనదగినది ఉత్తరేశ్వర తామ్రశాసనము.[14] ఇది క్రీ॥ శ॥ 1290లో చాళుక్య ఇందుశేఖరునిచే విద్దన దీక్షితులవారికి గౌరవ పురస్సరముగా వొసగబడిన దానశాసనము. దీనియందు ఇందుశేఖరునితో కలిసి నాలుగు తరములు పేర్కొనబడినవి.



ఇక వీరి వంశీయులలో చివరివారిని గూర్చి పేర్కొనునది కొలనుపల్లి శాసనము.[15] క్రీ॥శ॥ 1311లో యివ్వబడిన యీ శాసనమునందు అయిదు తరముల రాజులు పేర్కొనబడ్డారు.




ఈ శాసనమున చెప్పబడిన మొదటి మూడు తరములను ఉత్తరేశ్వర తామ్రశాసనము నందలి తొలి మూడు తరములను పోలియున్నది. కనుక యిందలి వీరయదేవుని ఉత్తరేశ్వర తామ్ర శాసనము నందలి ఇందుశేఖరుని సోదరునిగా గ్రహింపవచ్చును.

పై వంశ వివరములకు తోడుగా వీరి శాసనములలో కేవలము దానకర్త తల్లి దండ్రులను మాత్రమే పేర్కొనినవి కొన్ని కలవు. వీనిలో వేంగీశ్వరుని పుత్రుడైన మల్లుని శాసనము,[16] మల్లుని పుత్రుడైన గొంకని శాసనము,[17] మహాదేవుని పుత్రుడైన వేంగీశ్వరుని శాసనము[18], ఇందుశేఖరుని తనయుడైన వీరభద్రుని శాసనములు,[19] మహాదేవుని పుత్రుడైన పృథ్వీవల్లభుని శాసనము[20] ముఖ్యమైనవి. ఇవికాక అంతఃపుర స్త్రీలైన వీరభద్రుని సోదరియైన అన్యమదేవి శాసనములు,[21] మహాదేవుని పుత్రికయైన ఒదయ మహాదేవి శాసనములు[22] కూడ యీ సందర్భమున కెంతయో ఉపకరించును.

ఈ శాసనములందెచ్చటను కానరాని మరికొందరు రాజులు కూడ తాము యీ వంశమునకు చెందినట్లు ప్రకటించుకొని యున్నారు. అట్టివారిలో అయ్యపదేవ,[23] మనుమగొంకలు[24] పేర్కొనదగినవారు. వీరు పాలించిన ప్రాంత, కాలము లనుబట్టియు, పై వంశమున వీరి నామములను బోలిన యితర రాజులుండుటను బట్టియు వారు పేర్కొనిన విషయ ప్రామాణ్యాన్ని అంగీకరించవలసివుంది.

పై శాసనస్థ విషయాలనన్నింటిని పరిగణనకు తీసుకొని పరిశీలిస్తే ముదిగొండ చాళుక్యుల వంశానుక్రమణికను యీ దిగువ విధముగా ఏర్పరచుట సాధ్యమౌతుంది. గమనించండి.



— ఈ వంశానుక్రమణికలో శాసనస్థ విషయాలన్నింటిని యథాతథాస్వీకరించుట జరిగినప్పటికీ యిది పూర్తిగా నిరాక్షేపణీయమైనది కాదు కొన్ని పరిమితులకు లోబడే దీని నేర్పరచుట జరిగినది. కనుక దీని నామోదించుటకు ముందు యీ క్రింది అంశములను పరిగణనకు తీసుకొనుట చాల అవసరము.

i) మొదటి వేంగి అయ్యపదేవుడు వేంగీశ్వరుని పుత్రునిగా ఎచ్చటనూ పేర్కొనబడకపోయి నప్పటికీ అదే ప్రాంతములను తదనంతర కాలమున పాలించుటవలన, యీ వంశమున తర్వాతి కాలమున అదే నామముతో పాలకులుండుటనుబట్టి, వేంగీశ్వరుని పుత్రునిగనే పేర్కొనుట జరిగినది.

ii) వేర్వేరు శాసనాలలోని అంశములను సమీక్షించి, అందు కొన్నింటిలో మహాదేవునిగా (I) పేర్కొనబడిన వాడే తరువాతి వారి శాసనములలో విష్ణువర్ధనుడని ప్రస్తావింపబడినట్లు గుర్తించుట జరిగినది.

iii) ఇదే కాలములో యిదే ప్రాంతములను పాలించుటనుబట్టి రెండవ మనుమగొంక, రెండవ వేంగీశ్వరులకు యిందు స్థానము కల్పింపబడినది.

iv) గతమున శ్రీయుతులు ఖండవల్లి లక్ష్మీరంజనం,[25] తురగా కృష్ణమూర్తి[26] గారలు రెండవ మహాదేవుని వీరభద్రుని కనిష్ఠ సోదరునిగా భావించుట జరిగినది. కొలనుపాక శాసనమునందలి "జ్యేష్ఠశ్చాలుక్యవంశార్ణవ....." అనే అంశమును బట్టి[27] వారట్లు భావించుట జరిగియుండును. కాని ఆ శాసనమున

ఆచటి భాగము శిథిలమగుటనుబట్టి విషయమును స్పష్టముగా గ్రహించుటకు సాధ్యము కాదు. కనుకనే యీ వంశానుక్రమణికలో శ్రీయుతులు శ్రీనివాసాచారి[28], సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మ,[29] ప్రతిలామగల్[30] మున్నగువారు చేసిన పరిగణన సక్రమమైనదేనని అంగీకరింపబడి, రెండవ మహాదేవుని వీరభద్రుని కన్న జ్యేష్ఠునిగనే గుర్తించుట జరిగినది. వీరివీరి శాసనములీయబడిన కాలక్రమము కూడ ఈ విషయమును రూఢి పఱచును.

V చివరిగా యీ వంశక్రమమున రెండవ మహాదేవుని పుత్రులుగా పృథ్వీవల్లభుని, మూడవ ఇందుశేఖరుని కూడ చేర్చుట జరిగినది. వారి పాలనా కాలములు యీ సమయము నందే కలసివచ్చుట, వారి శాసనములందు వారి తండ్రి నామధేయము మహాదేవుడని పేర్కొనబడుట యిందుకు కారణము.

ఇక వీరి కాలనిర్ణయ విషయాన్ని పరిశీలించవలసి వుంది. వీరి శాసనాలు చాల వరకు దత్తకాలములను పేర్కొనినవే కనుక వీరి పాలనా కాలముల నిర్ధారణ మరీ జటిలమైన విషయము కాదు. కాని గణపతి, మొదటి ఇందుశేఖర, వీరయ దేవుని వంటి కొందరు రాజుల శాసనములు లభ్యముకాక పోవుటను బట్టి వారి పరిపాలనా కాలములను సందర్భానుసారముగా వారి ముందు వెనుకలలో పాలించిన రాజుల శాసనము లాధారముగా పరిగణించుట జరిగినది. వేర్వేరు శాసనాలలో పేర్కొనబడిన శకవత్సరములు, విజయరాజ్య సంవత్సరములనుబట్టి సుమారుగా వీరి పాలనా కాలములను యీ దిగువ విధముగా నేర్పరచుట జరిగినది.

		క్రీ॥ శ॥
(మొదటి) వేంగీశ్వరుడు	—	1078 - 11 9
మల్ల	—	1129 - 1150
(మొదటి) వేంగి అయ్యపదేవుడు	—	1141 - 1150
(మొదటి) వేంగి గొంకడు	—	1160 - 1196
(రెండవ) అయ్యపదేవుడు	—	1193.
గణపతి	—	1198 - 1212
(మొదటి) మహాదేవుడు	—	1196 - 1233
(రెండవ) మనుమగొంకడు	—	1212 - 1230
(మూడవ) మనుమ అయ్యపదేవుడు	—	1230 - 1237
(రెండవ) వేంగీశ్వరుడు	—	1233 - 1250
(మొదటి) ఇందుశేఖరుడు	—	1238 - 1255
వీరభద్రుడు	—	1250 - 1266
(రెండవ) మహాదేవుడు	—	1255
వీరయదేవుడు	—	1266 - 1279
రెండవ ఇందుశేఖరుడు	—	1279 - 1297
పృథ్వీవల్లభుడు	—	1297 - 1299
రుద్రదేవుడు	—	1299 - 1311
(మూడవ) ఇందుశేఖరుడు	—	1300

—ఈ పరిగణనకు ఆధారభూతములైన విషయములివి.

i) మొదటివాడైన వేంగీశ్వరుని శాసనములు లభ్యము కాకపోవుటచే ఆతని పుత్రిక యొక్క శాసనకాలమైన క్రీ. శ. 1078ని సుమారుగా యీతని రాజ్యారంభకాలముగా పరిగణించి, యీతని తరువాతివాడైన మల్లని తొలిశాసన కాలమైన క్రీ. శ. 1129 వరకును రమారమి 50 సంవత్సరములు పాలనాకాలముగా చెప్పుట జరిగినది. ఇట్టి సుదీర్ఘపాలనాకాలముల పరిగణన చరిత్రపరిశోధనలో సంప్రదాయకమైనది కాకపోయినను, యీ సందర్భమున సహేతుకమగుటచే అట్లు గుర్తించుట జరిగినది. శ్రీమతి యశోదాదేవి కూడ యీతని పాలన క్రీ. శ. 1100 ప్రాంతమున నున్నట్లు పరిగణించిరి.[32]

ii) రెండవవాడైన మల్లని ద్రాక్షారామ శాసనములు రెండు క్రీ.శ.1129,[33] 1149[34] సంవత్సరములను దత్తకాలములుగా తెలుపుటవలన, మల్లనిపాలన క్రీ.శ. 1150 వరకు సాగినట్లు చెప్పబడినది. (ఈతని తొలి శాసనమున దత్త కాలమును సూచించు భాగము కొద్దిగా శిథిలమైనను, అందు పేర్కొనబడినది సౌమ్య నామ సంవత్సరమగుటచే శ్రీసోమశేఖరశర్మ, ఆదిత్య శర్మగారల నిర్ణయ మంగీకరింపబడి దానిని క్రీ. శ. 1129గనే గుర్తించుట జరిగినది.)

iii) మూడవవాడైన అయ్యపదేవుడు మహారాజ, మహామండలేశ్వర బిరుదములతో యీ ప్రాంతములనేలుచున్నట్లు తెలియుటచే క్రీ. శ. 1141లో యివ్వబడిన తడికలపూడి శాసనమును,[35] క్రీ. శ. 1150లో యీయబడిన బెజవాడ శాసనమును బట్టి,[36] వాటి మధ్యస్థ కాలమును యీతని పాలనా కాలముగా పరిగణించుట జరిగినది.

iv) నాలుగవవాడైన వేంగిగొంకడు వరుసగా క్రీ. శ. 1174లో గణపవరమునందు,[37] క్రీ. శ. 1177లో ద్రాక్షారామమునందును,[38] క్రీ. శ. 1180లో రాజమండ్రి యందును,[39] చివరగా క్రీ. శ. 1196లో ద్రాక్షారామమునందును,[40] శాసనము లిచ్చుట జరిగినది. చివరి శాసనకాలము నీతని రాజ్యాంత కాలముగా భావించి, యీతడు తన తండ్రియనంతరము క్రీ. శ. 1160లో రాజ్యమునకు వచ్చి 1196 వరకు పాలించినట్లు గుర్తించుట జరిగినది.

v) రెండవ అయ్యపదేవుడు క్రీ. శ. 1198లో తెలికి చెర్ల శాసనము[41] నందు పాలకుడుగా చెప్పబడుటను బట్టి దానిని పరిగణించుట జరిగినది. బహుశః యీతడును, యీతని సంతతియు మూల రాజ్యమును విడిచిపోయి కొన్ని ప్రాంతములనాక్రమించి పాలన సాగించి యుందురు.

vi) తరువాత వాడైన గణపతి శాసనములు లభింపక పోయినను అతని పుత్రుడైన మనుమ అయ్యప దేవుని క్రీ. శ. 1237 నాటి బెజవాడ శాసనమున[42] గణపతి సమర్థుడైన పాలకుడని స్తుతింపబడుటను బట్టి, అతని తమ్ముడైన మనుమ గొంకని రాజ్యాంత కాలమైన క్రీ. శ. 1230 వరకును గల 30 సంవత్సరములను గణపతికిని, మనుమ గొంకనికి సమముగా భాగించి, సుమారుగా క్రీ. శ. 1212 వరకు గణపతి పాలన సాగియుండినట్లు ఊహింపబడినది.

vii) తరువాతవాడైన మహాదేవుడు తన తండ్రి వేంగి గొంకని యనంతరము క్రీ. శ. 1196లో మూలసింహాసనమునధిష్ఠించి, తన చివరి శాసనమైన[43] బెజవాడ శాసన మొసగబడిన క్రీ. శ. 1233 వరకును పాలించినట్లు గ్రహింపబడినది.

viii) రెండవ మనుమ గొంకనికి సంబంధించినంతవరకు అతని క్రీ.శ. 1230లో యీయబడిన తెలికి చెర్ల శాసనము[44] అతని రాజ్యాంత కాలమున నీయబడినట్లు భావింపబడినది. అతని పాలన గణపతి రాజ్యాంతకాలమని ఊహింపబడిన క్రీ. శ. 1212 నుండి ప్రారంభమైయుండును.

ix) పై విధముగనే మనుమ అయ్యపదేవుని క్రీ. శ. 1237 నాటి బెజవాడ శాసనము[45] కూడ అతని రాజ్యాంత కాలము నాటిదని భావింపబడి, అతని తండ్రియైన గణపతి యనంతరము క్రీ శ. 1230 నుండి ప్రారంభమైనట్లు చెప్పబడినది.

x) రెండవ వేంగీశ్వరుని శాసనములు రెండు క్రీ. శ. 1238,[46] 1250[47] సంవత్సరములలో దత్త పరుపబడుటనుబట్టి, అతని తండ్రియైన మొదటి మహాదేవుని శాసనములు క్రీ. శ. 1238 తరువాత లభ్యము కాకపోవుటచే వేంగీశ్వరుని పాలన క్రీ. శ. 1233 నందే ప్రారంభమైనట్లు గ్రహింపబడినది. (శ్రీయుతులు సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మగారలు అదంటకోని క్రీ. శ. 1255లోని ఒక శాసనము[48]నందలి 'వేంగీశ్వర' బిరుదమును బట్టి దాని నీతనిదిగనే గుర్తించినారు:

కాని ఆ బిరుదము అదేశాసనములోని పినలక్ష్మిరాజు యొక్క బిరుదముగనే గుర్తించుట యోగ్యము.)

xi) మొదటి ఇందు శేఖరుని శాసనములేమియు లభ్యము కాకపోయినను అతని సంతతి యొక్క అనేక శాసనములలో నీతని కీయబడిన స్థానమును బట్టి యీతని క్రి. శ. 1238 - 1255 ల మధ్య పాలకునిగా గుర్తించుట జరిగినది. కాని అదే కాలమున యితరుల శాసనములు లభించుటనుబట్టి, కాలక్రమము ననుసరించుట జరిగి, స్వీయపాలనము చూపబడక సోదరుడైన రెండవ వేంగీశ్వరుని తోడను, పుత్రులైన రెండవ మహాదేవ, వీరభద్రుల తోడను యీతడు సంయుక్త పాలన నెరపినట్లు సూచింపబడినది. కాలనిర్ణయమునకు సంబంధించినంతవరకు వేర్వేరు శాసనములలో విరుద్ధమైన అంశాలు ప్రస్తావింపబడటాన్నిబట్టి యింతకన్నా మరో విధంగా గుర్తించుట సాధ్యంకాదు.

xii) వీరభద్రుని గూర్చి తెలుపు శాసనములలో క్రి. శ. 1259లో జాత్రిగయందు ఆయన మంత్రిచే నొసగబడిన శాసనమే[49] తొలిదైనను, అతడు క్రి. శ. 1250 ప్రాంతములనుండి రాజరికపు బాధ్యతలు వహించినట్లు పరిగణింపబడినది. చాళుక్య వీరభద్రుని పేరిట నీయబడిన నరసాపుర శాసనమొకదానియందు 26వ విజయ రాజ్యవత్సరము సూచింపబడుట.[50] అతని తల్లియైన ఉదయాంబిక క్రి. శ. 1286లో పాలకొల్లునందు యీతని 'పుణ్యసంప్రాప్తి'కై దానమొసగుటనుబట్టి[51] దాని నీతనికడ సంవత్సరముగా భావించుటయు నీతని రాజ్యారంభ కాలమును క్రి. శ. 1260గా నిర్ధారించుచున్నవి. అందువలన యీతని పాలనా కాలము క్రి. శ. 1260-1286 సంవత్సరముల మధ్య గుర్తించుట జరిగినది.

xiii) రెండవ మహాదేవునికి సంబంధించినంతవరకు క్రి. శ. 1256లో జాత్రిగయందు శాసనమొకటి లభ్యమైనది.[52] దీనిని బట్టి యీతడు తన తండ్రి మరణానంతరము కొద్ది కాలము పాలనసాగించినట్లు ఊహింపవీలగుచున్నది. కాని క్రి. శ. 1260 నుండి యీతని తమ్ముడైన వీరభద్రుని పాలన గుర్తింపబడుటవలన బట్టి యీతడు వీరభద్రునితో సంయుక్త పాలన నెఱపియుండును.

xiv) వీరయదేవుని శాసనము లేమియు లభ్యము కానప్పటికి. అతని జ్యేష్ఠపుత్రుడైన రుద్రదేవుని కొలనుపల్లి శాసనమాధారముగా,[53] యీతడు వీరభద్రుని యనంతరము క్రి. శ. 1286లో పాలన మొదలిడినట్లును, తన సోదరుడైన రెండవ ఇందు శేఖరుని తొలిశాసన[54] కాలమైన క్రి. శ. 1279 వరకును పాలించినట్లు చెప్పబడినది.

xv) రెండవ ఇందు శేఖరుని పాలన అతని కొలనువాక శాసనకాలమైన క్రి. శ. 1279 నుండి, అతని సోదరుడైన పృథ్వీవల్లభుని మల్లిపూడి శాసనకాలమైన[56] క్రి.శ.1297 వరకును సాగినట్లు గుర్తింపబడినది. వాస్తవమునకు క్రి.శ. 1292 తరువాత యీతని శాసనములు లభ్యము కానప్పటికీ, వీరి వంశ చరిత్రలో నీతని ప్రాముఖ్యతనుబట్టి. యీతని పాలన క్రి. శ. 1297 వరకును చూపబడినది.

xvi) పృథ్వీవల్లభుని శాసనమొకే ఒక్కటి క్రి. శ. 1297 దత్తకాలముతో మల్లిపూడిలో లభించుటను బట్టి[57] రెండవ ఇందుశేఖరుని అనంతరము యీతడు కొద్ది కాలము పాలన సాగించినట్లు చూపబడినది.

xvii) చాళుక్య రుద్రదేవుని పసువేముల,[58] కొలనుపల్లి శాసనము[59] లను బట్టి రుద్రదేవుడు క్రి. శ. 1299 నుండి క్రి. శ. 1311 వరకును పాలించినట్లు పేర్కొనబడినది.

xviii) సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన బిరుదములతో మూడవ ఇందు శేఖరుని శాసనమొకటి క్రి. శ. 1300 దత్తకాలములో పాలకొల్లునందు లభించుటను బట్టి తత్సమయమునవాతడు ప్రస్తుత పశ్చిమగోదావరిజిల్లా. భీమవరముతాలూకాలోని తోలేర్ప్రాంతముల నాక్రమించుకొని స్వల్పకాలము పాలనసాగించినట్లు తెలియుచున్నది. శ్రీమతి యశోదాదేవి పొరబడి యీతనిని రెండవ ఇందు శేఖరునిగా గుర్తించిరి, గాని యిరువురు ఇందుశేఖరుల తల్లుల యొక్క నామభేదమునుబట్టి వీరిని వేర్వేరుగా గుర్తించుట జరిగినది.

పూర్వచరిత్ర :

పదకొండవ శతాబ్దికి పూర్వపు వీరి వంశవివరములు తెలియవు. వీరు పేర్కొనిన 'యుద్ధమల్లవంశసముద్ధరణ' బిరుదమును బట్టి, కొందరూహించినట్లు వీరువేంగి చాళుక్య యుద్ధమల్లుని వంశీయులని గుర్తించుట తప్ప వీరి మధ్యనున్న రాజుల వివరములుగాని, మరే విషయములుగాని తెలియవు. తెలిసినంతలో వీరిలో వేంగీశ్వరుడే మొదటివాడు. నిజమునకు 'వేంగీశ్వర' అనునది యీ వంశీయులు తరచుగా ధరించు 'వేంగిమహేశ్వర' 'వేంగిమహీతలేశ్వర' మున్నగు బిరుదావళిని పోలియున్నను. యీ వంశమునందే 'వేంగీశ్వర' నామముతో మరియొక రాజు కూడ కానవచ్చుచున్నందునను, అతని పుత్రుడైన మల్లని శాసనమునందును, పుత్రిక శాసనమందును. మునిమనుమడైన మహాదేవుని శాసనమందును. కూడ యీతడు 'వేంగీశ్వరుని'గనే పేర్కొనబడుటను బట్టి యీ వంశీయులలోనిది బిరుదము కన్నబిన్నముగకూడ వాడబడుచుండినట్లు గ్రహింపవలసియున్నది.

వేంగీశ్వరుని పుత్రుడు మల్లపు. ఈ మల్లడొక మన్నాటి పెర్మడినాయకుని కుమార్తెను పరిణయమాడినట్లు క్రి. శ. 1129లో యీతడు ద్రాక్షారామము నందొసగిన శాసనమున సూచింపబడినది. ఈతని అనంతరము యీతని పుత్రుడైన వేంగిగొంక రాజ్యమునకు వచ్చుట జరిగినది. కాని యీ సందర్భమున శ్రీయుతులు సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మగారలు పొరబడి ఒక వీరనరేంద్రుని తండ్రియైన విజయాదిత్యుని మల్లని స్నానునిగా పేర్కొని, అతడే తండ్రి యనంతరము రాజ్యమునకు వచ్చినట్లు పేర్కొనిరి. ఆ విజయాదిత్య. వీరనరేంద్రులు చాళుక్య వంశము వారగుట నిస్సందేహమే: కాని వారు సమకాలీనులై యిదే ప్రాంతములను పాలించుచున్న జననాథపురశాఖకు[61] చెందినవారు తప్ప, వారికి యీ శాఖతోనెట్టి సంబంధమును లేదు.

వేంగిగొంకడే యీ వంశీయులలో ప్రప్రథమముగా శాసనములందు ప్రశస్తిని పేర్కొనుట కుద్యమించినవాడు. ఈతడు తమ వంశీయుల బిరుదావళిని వర్ణించుచు తన గణపవర శాసనమున 'మహామండలేశ్వర', 'భట్టిపుర వరాధీశ్వర', 'మానవ్యస గోత్ర','హారీతీపుత్ర', 'సోమవంశాన్వయ, 'యుద్ధమల్లవంశసముద్ధరణ', 'బెజవాడ మల్లేశ్వర మహాదేవ పాద పద్మారాధక', మున్నగునవి పేర్కొనెను. ఈ శాసనమునందలి యీ బిరుదావళిని బట్టియే యీ శాఖ యందలి యీ తొలి పాలకులను చాళుక్యులుగా గుర్తించుట జరుగుచున్నది. వేంగిగొంకని యీ ప్రశస్తి యీతడు ధరించిన 'మన్యసింహ', 'షట్సహస్రావనీపాలక' మున్నగు బిరుదములను బట్టియు తమ వంశమున రాజ్యమును సుస్థిర పరచిన ఖ్యాతి యీతనిదే అని చెప్పవచ్చును. ఈ కృషిలో నీతనికి అనాటికే ప్రాచుర్యము వహించిన జననాథపుర చాళుక్యులు సహాయమందించినట్లు యీతడు వారికి విధేయత ప్రకటించి సార్వభౌమత నంగీకరించుటను బట్టి తెలియుచున్నది. శ్రీయుతులు సోమశేఖర శర్మ, ఆదిత్య శర్మగారలు యీ శాఖీయులు వెలనాటి ప్రభువుల నేతృత్వము నంగీకరించి వారికి సహాయముగా కాకతీయులపై దాడి కూడ వెడలియుందురని అభిప్రాయపడినారు. కాని వీరు వెలనాటి వారి సార్వభౌమత నంగీకరించినట్లు సరియగు ఆధారమేదియును లేదు. అంతేకాక వేంగిగొంకని మంత్రియైన త్రిపురాంతక ప్రెగ్గడ ద్రాక్షారామమున క్రి. శ. 1177 లో యిచ్చిన శాసనమున జననాథపుర చాళుక్యవంశము నందలి సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మల్లపుని విజయ రాజ్య సంవత్సరములను పేర్కొనుట జరిగినది. దీనిని బట్టి వీరు జననాథపుర చాళుక్యుల సార్వభౌమత నంగీకరించినట్లు మాత్రమే చెప్పగలము. శ్రీమతి యశోదాదేవి కూడ వీరిని జననాథపుర చాళుక్యుల సామంతులుగనే గుర్తించిరి.

వేంగిగొంకని పాలనకు ముందుగా, మల్లని పాలనకు సమకాలికముగా

'మహా మండలేశ్వర', 'మహారాజ' బిరుదములతో మొదటి అయ్యపదేవుడు పాలించుచున్నట్లు శాసనములు తెలుపుచున్నవి. అయినచో నీతడు మల్లనితో సంయుక్త పాలన సాగించెనో, లేక కలహించి కొద్ది ప్రాంతముల నాక్రమించుకొనెనో అనునది స్పష్టముగా తెలియదు.

వేంగిగొంకనికి రెండవ అయ్యపదేవుడును, మహాదేవుడును పుత్రులు. వీరిలో రెండవ అయ్యపుని భార్య ముప్పమహాదేవి. ఆమెవలన అయ్యపునికి గణపతియు, మనుమగొంకడును కల్గిరి. ఆ గణపతి పుత్రుడే మనుమ అయ్యపదేవుడు. ఈతడు క్రీ॥ శ॥ 1287లో బెజవాడలోని మల్లేశ్వరమహాదేవునికి ఏలూరిలోని కొంతభూమిని సమర్పించెను ప్రస్తుత పశ్చిమగోదావరీ జిల్లాలోని తడికలపూడి 'వేంగి వే యింటికిని రాజధాని' యని యొక శాసనమున [62] పేర్కొనబడుటను బట్టి, మూలరాజ్యమును విడిచి స్వతంత్రించిన కొందరు రాజవంశీయులకది కేంద్రస్థానమైనట్లు గ్రహింపగలము. కాని శాసనములందు కేవలము వీరి నామములు వీరు సమర్పించిన దానములు తప్ప వారి ప్రయోజకత్వమేదియు ప్రకటింపబడలేదు.

క్రీ॥ శ॥ పదకొండు, పన్నెండు శతాబ్దులలో ఎటువంటి పరిస్థితులు వీరిని తీర్చిదిద్ది యొక రాజకీయశక్తిగా అవిర్భవించుటకు దోహదపడినవో స్పష్టముగా చెప్పలేము. మధ్యాంధ్రయుగ రాజకీయమున చాళుక్య చోళులకు కల్యాణచాళుక్యులకు నడుమనేర్పడిన సంఘర్షణ అనేక మాండలిక వంశముల స్థాపన కనువుకల్పించినది. ఆ సందర్భముననే యీ వంశీయుల తొలిరాజులు కృష్ణా గోదావరీ నదులనడుమ చిన్నప్రాంతము నాక్రమించుకుని పాలింప మొదలిడియుందురు. వారి వారసులైన తరవాతి పాలకులు వీరినిగూర్చి ఏమియు తెలుపకపోవుటనుబట్టి వీరి వివరములన్నియు అస్పష్టములే. వేంగిగొంకని రెండవ పుత్రుడైన విష్ణువర్ధన మహాదేవుని తోడనే వాస్తవమునకు నిడుదవోలి చాళుక్యులచరిత్ర అరంభమైన దనవచ్చును

నిడుదవోలి చాళుక్యులు

నిడుదవోలి చాళుక్య శాఖలో తొలుతగా ప్రాముఖ్యత సంతరించుకొన్న పాలకుడు వేంగిగొంకని చిన్న కుమారుడైన మహాదేవుడు. వీరి వంశీయుల శాసనములేమియు మహాదేవుని ముందున్న పాలకుల విషయము ప్రస్తావింపలేదు. మహాదేవుని ఒకే ఒక్క శాసనమున మాత్రము అతడు వేంగిగొంకని పుత్రుడని పేర్కొనబడినది. స్వీయ శాసనములందీతడు తన నామమును మహాదేవ, వేంగి మహాదేవ, అని ప్రకటించుకొనినను అతని సంతతి వారొసగిన శాసనములలో నీతడు కేవలము 'విష్ణువర్ధన' బిరుదముతో మాత్రమే పేర్కొనుట గమనింపదగినది. శాసనము లందలి వంశ వివరములను బట్టి యీ విష్ణువర్ధన, మహాదేవుల నొక్కరిగనే గుర్తింపవీలగుచున్నది. అట్లు గుర్తించుటను బట్టి మాత్రమే యీ వంశీయులకు ముందు గడచిన పాలకుల పైనము తెలియుచున్నది. సమకాలీన రాజకీయ రంగమున వీరి స్థాయిని పెంచినది నిస్సంశయముగా యీ విష్ణువర్ధన మహాదేవుడే. ఈతడు సముపార్జించిన ఖ్యాతికారణముగనే, యీతని తరువాతి వారొసంగిన ఉత్తరేశ్వర తామ్రశాసనమందును, కొలనుపల్లి శాసనమందును వీరి వంశవర్ణన యీతని తోడనే ప్రారంభింపబడినదనవచ్చును.

మహాదేవుని శాసనములలోని ప్రశస్తినిబట్టి వీరు మహా మండలేశ్వరులనియు, సిద్ధిపుర వరాధీశ్వరులనియు, మానవ్యస గోత్రులనియు, హారీతీ పుత్రులనియు, సోమ వంశాన్వయులనియు, మల్లవంశ సముద్ధరణులనియు, షట్సహస్రావనీ పాలకులనియు, బెజవాడ మల్లేశ్వరుని పాదపద్మారాధకులనియు తెలియుచున్నది. [63] ఈ ప్రశస్తి చాలవరకు యీతని తండ్రియైన వేంగి గొంకని గణపవరపు శాసనమునందలి ప్రశస్తిని పోలియున్నది. [64] వీరి పూర్వీకులను పురాణ పురుషులకు ముడిపెట్టు సంప్రదాయము నెలకొల్పినదికూడ యీ మహాదేవుని శాసనములే. ఈ లేని బిరుదావళిలోని 'దళితరిపుదర్ప', పరబల సాధక', మున్నగునవి అనుశ్రుతములును, సాంప్రదాయకమైనవియు కావచ్చును; కాని 'షట్సహస్రావనీ వల్లభ' బిరుదము మాత్రము వీరు అరువేల మండలములోనికి సల్పిన దాడులను సూచించుననవచ్చును. ఈ అభిప్రాయము తోడనే వీరు యీకాలమునకు రాజకీయ ప్రాబల్యము పలచబడిన వెలనాటి ప్రభువుల నుక్కడగించియుండినట్లు శ్రీమతి యశోదాదేవి పేర్కొనియున్నారు.[65] మహాదేవుని శాసనములు బెజవాడలోనే లభ్యమగుటనుబట్టి, యీతడు గుంటూరు తెలుగు పల్లవులపైనను, కొణిదెన తెలుగు చోళులపైనను కూడ దాడులు సాగించినట్లు ఆమె భావించినారు. ప్రతిఘటించుటకు ఆయా రాజ్యములలో తత్కాలమున సమర్థులైన పాలకులు లేనిమాట యదార్థమే అయినను, మహాదేవుడు కృష్ణానదీ తీర ప్రాంతపు రాజులను జయించెనా అనునది సందేహమే. ఈ వంశీయుల శాసనములు మహాదేవుని కాలముకన్న ముందునుండియు బెజవాడలో కన్పించుటనుబట్టి, బెజవాడలో మహాదేవుని శాసనములున్నవను నెపమున యిట్టి విషయములు నిర్ధారించుట కవకాశము లేదు. కృష్ణాతీరమున మహాదేవుని జైత్ర యాత్రను రూఢిపరచుటకు ప్రస్తుతాధారములు చాలవు. బిరుదావళిలో 'సిద్ధిపురవరాధీశ్వర' అనికూడా చెప్పుకొనుటనుబట్టి యీతడో, యీతని తండ్రియో దానిని జైత్రయాత్రలో ఆక్రమించియుండిరనుటకు మాత్రము సావకాశమున్నది. శ్రీ కొత్త భావయ్య చౌదరిగారు యీ సిద్ధిపురమును ప్రస్తుత గుంటూరుజిల్లా తెనాలి దాపునగల 'సుద్దపల్లి'గా గుర్తించిరి.[66] శ్రీమతి యశోదాదేవి అభిప్రాయమున యిది ప్రస్తుత పశ్చిమ గోదావరీ జిల్లా తాడేపల్లిగూడెము తాలూకాలోని 'సిద్ధపురమే' కాదగును.[67] మహాదేవుని ముందున్న పాలకుల శాసనములు లభ్యమైన ప్రదేశమగుటను బట్టి శ్రీమతి యశోదాదేవి గుర్తించిన సిద్ధపురమే సిద్ధిపురమని భావించుటకు హెచ్చు అవకాశములు కన్పించుచున్నవి. ఈపాలకులు 'భట్టిపురవరాధీశ్వరుల' మని కూడ చెప్పుకొనుటనుబట్టి, వారు రాజరికమున కెదుగుటకుపూర్వము గుంటూరుజిల్లాలోని భట్టిప్రోలు తొలి నివాసముగా కలిగి యుందురని శ్రీ సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మ గారల అభిప్రాయము.[68] ఈ మహాదేవుని పూర్తి రాజకీయ వివరములు తెలియవు గాని యీతడు తన పూర్వులవలెనే జననాథపుర చాళుక్యులతో సత్సంబంధములు నెలకొల్పుకొనియుండును. కాని క్రీ. శ. పదమూడవ శతాబ్ది తొలిదశలో కాకతి గణపతి దేవుని సేనానులైన రేచర్లరుద్రిరెడ్డి, రాజానాయకులు తీరాంధ్రముపైదండు వెడలి అచటి రాజకీయములపై తమప్రభావము చూపుటనుబట్టి యీ ప్రాంతపు పాలకులు కొందరు కాకతీయులకు విధేయత ప్రకటించి యుండవచ్చును

ఈ మహాదేవుని యనంతరము నీతనికి రాణియైన శ్రీదేవి వలన కల్గిన వేంగీశ్వరుడును, ఇందుశేఖరుడును వరుసగా పాలనసలిపిరి. కాల నిర్ణయమున సూచించినట్లు శాసనకాలములను బట్టి ఇందుశేఖరుడు వేంగీశ్వరుని అంత్య దశలో సంయుక్త పాలన నిర్వహించియుండును.

ఇందుశేఖరుని కాలమునుండియే వీరిశాఖ మరింత రాజకీయ ప్రాబల్యము సంతరించుకొనినట్లు తోచును. ఈతని కాలముననందే సుప్రసిద్ధ పాలకవంశములతో వీరికి వైవాహిక సంబంధము లేర్పడినవి. ఈతనికి దేవేరియైన ఉదయాంబిక వలన మహాదేవుడు, వీరభద్రుడు అను నిర్వురుపుత్రులును, అన్నమాంబయనుపుత్రియు కల్గిరి అన్నమాంబను కోనహైహయ వంశమున సుప్రసిద్ధుడును, మహామండలేశ్వరుడును అగు భీమునకిచ్చి పరిణయమొనరించుట వలనను, చిన్నపుత్రుడైన వీరభద్రుడు కాకతీయాంధ్ర ప్రభువైన గణపతిదేవుని గారాబుపట్టియైన రుద్రమదేవిని చేపట్టుట వలనను, సమకాలీన పాలకవంశములలో వీరు సముపార్జించుకొనిన స్థానము స్పష్టముగా తెలియుచున్నది. నాటిదనుక వీరికి ప్రాపుగానిల్చి కాచిన సాటి చాళుక్య వంశీయులైన జననాథపుర చాళుక్యులు రాజకీయప్రాబల్యము కోల్పోవుటచే తమస్థానము పదిలపరచుకొనుటకు వీరు హైహయుల, కాకతీయుల వంటి ప్రముఖ పాలక వంశములతో వైవాహిక సంబంధములు కలుపుకొని యుండి యుందురు. ఇట్టి సంబంధము లేర్పరచుటలో ఇందుశేఖరుని దూరదృష్టి. విజ్ఞతలే వీరిపాలన మరొక శతాబ్ది కాలముపాటు కొనసాగుటకు దోహదపడినవి.

ఇందుశేఖరుని పుత్రులైన మహాదేవ, వీరభద్రుల యొక్క జ్యేష్ఠ, కనిష్ఠతలను గూర్చి వివాదమున్నది. శ్రీయుతులు ఖండవల్లి లక్ష్మీరంజనం,[69] తురగా

కృష్ణమూర్తి[70] మున్నగువారు మహాదేవుని, ఇందుశేఖరుని యొక్క చిన్న కుమారునిగా గుర్తించిరి. క్రీ. శ. 1279లో రెండవ ఇందుశేఖరునిచే నీయబడిన కొలనుపాక శాసనమున[71] చాళుక్య వీరభద్రుని గూర్చి చెప్పుసందర్భమున "జ్యేష్ఠ చాళుక్యవంశార్ణవ........" అని చెప్పబడుటయే వారట్లుభావించుట కాస్కారము కల్గించి యుండవచ్చును.కాని శాసనమున అచ్చటి భాగము శిథిలమగుటచే స్పష్టముగా విషయమును గ్రహించుటకు సాధ్యము కాదు. శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచారిగారు,[72] శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మగారలు,[73] శ్రీమతి ప్రతిభామగల్[74] వంటి పరిశోధకులు మహాదేవుని, ఇందుశేఖరుని యొక్క జ్యేష్ఠ పుత్రునిగా గుర్తించి, వీరభద్రుని కనిష్ఠకుమారునిగా చెప్పిరి. మహాదేవ వీరభద్రుల శాసన కాలములను, మహాదేవుని పుత్రుల యొక్క శాసనకాలములను పరిశీలించినచో అందలి క్రమమునుబట్టి మహాదేవుని వీరభద్రునికన్న జ్యేష్ఠునిగనే గుర్తించుటకు వీలుకల్పించుచున్నది. కనుక కాకతిగణపతిదేవుని జామాతయైన చాళుక్య వీరభద్రునికన్న, మహాదేవుడే జ్యేష్ఠుడని గ్రహించుట యోగ్యము. ఈ సందర్భమున శ్రీమతి యశోదాదేవి యింతనూ పొరబడి యీ మహాదేవుని ముమ్మడాంబ భర్తయనిగుర్తించి,[75] నిడుదవోలి చాళుక్య వంశమున నీతడే చివరివాడై యుండునని భావించినారు.

సమకాలీన చరిత్రలో నిడుదవోలిచాళుక్యప్రభువుల కీర్తి ప్రతిష్ఠలు నిగిడించిన వారిలో వీరభద్రుడు ముఖ్యుడు. యావదాంధ్ర దేశమును మొక్కవోని మగటిమితో తన పతాక నీడలో కప్పుచున్న కాకతి గణపతిదేవుని పుత్రికయైన రుద్రమ, వీరభద్రుని పరిణయమాడుట యీ చాళుక్యుల చరిత్రలో నొక అద్భుతఘట్టము. ఇది వీరి ఖ్యాతిని ముమ్మడింపచేయుటయే కాక, తర్వాతి కాలమున తెలంగాణపు రాజకీయమున వీరికొక స్థానము కల్గించుటకు కూడ కారణభూతమైనది. క్రీ. శ. 1269లో జుత్తిగ యందలి వాసుకి రవిసోమేశ్వరాలయమున వీరభద్రుని మంత్రియైన విష్ణుదసునాతడు, తన ప్రభువైన వీరభద్రుడు ఆంధ్ర రాణియైన కాకతి రుద్రమనుద్వాహమొనరించుకొనినట్లును, అనేక యుద్ధ రంగములయందు శత్రుల నిర్జించినట్లును పేర్కొనెను.[76] రెండవ ఇందుశేఖరుని కొలనుపాక శాసనము కూడ వీరభద్రుని వేనోళ్ళ ప్రస్తుతించుచున్నది.[77] కాకతీయుల శాసనములందుగాని, సాహిత్యాది యితరాధారములందుగాని వీరభద్రుని విషయము అంతస్పష్టంగా లేదు. చాళుక్యరాణియైన రుద్రమదేవి కాకతీయ చక్రవర్తినియై ఓరుగంటి పీఠి పాలన మొనర్చునాటికి వీరభద్రుడేమయ్యెనో, నామెయే పాలనా బాధ్యతలనేల స్వీకరింప వలసివచ్చెనో వివరములు తెలియవు. రుద్రమదేవి పట్టాభిషిక్తయగునాటికి అసలు వీరభద్రుడు జీవించియుండెనా యనునది కూడ సందేహమే. క్రీ. శ. 1268లో శ్రీరామేశ్వరాలయమున ఉదయాంబిక తన పుత్రుడైన వీరభద్రుని "పుణ్య సంప్రాప్తి"కై దానమొసగబడిన విషయమునుబట్టి,[78] అతడా సమయమునకు మరణించియుండినట్లు గ్రహించవచ్చును.

రుద్రమ వీరభద్రులకు పురుషసంతతిలేదు. ముమ్మడమ్మ, రుయ్యమ్మ, రుద్రమ్మ అనుముగ్గురు పుత్రికలు మాత్రము కలరు.[79] ముమ్మడాంబను మహాదేవునకును (చాళుక్యమహాదేవుడు కాదు). రుయ్యమ్మను ఇందులూరి అన్నయ దేవునకును, రుద్రమ్మను ఎల్లణ దేవునకునునిచ్చి పరిణయములు చేసిరి.[80]

మహాదేవ, వీరభద్రుల యనంతరము రాజరికపు బాధ్యతలు మహాదేవుని పుత్రులు స్వీకరించిరి. కాని యీతని సంతతివిషయమై ఏ శాసనమునందును పూర్తి వివరములేదు. శ్రీ సోమశేఖరశర్మ, ఆదిత్యశర్మగారలు యీతనికి వీరయదేవ, ఇందు శేఖరులను యిరువురు పుత్రులను ఒదయమహాదేవియను పుత్రికయున్నట్లు గుర్తించిరి.[81] కాని శాసనములందీతని సంతతియని ప్రకటించుకొనిన వారింకనూ కలరు. ఉత్తరేశ్వర[82], ఓనపల్లి తామ్రశాసనములు[83] కొలనుపాక శాసనము[84] ఒక ఇందుశేఖరుని (తల్లి : లక్కాంబ) క్రీ॥ శ॥ 1300 నాటి ఒక పాలకొల్లు శాసనము[85] మరియొక ఇందుశేఖరుని (తల్లి : భీమిందేవి) క్రీ॥ శ॥ 1297లోని మల్లిపూడి శాసనము[86] పృథ్వీవల్లభుని; క్రీ॥ శ॥ 1311లో నీయబడిన కొలనుపల్లి శాసనము[87] వీరయదేవుని; మహాదేవుని పుత్రులుగా పేర్కొనుచుండగా పాలకొల్లు నందలి మరి మూడు శాసనములు[88] యీతని పుత్రికయైన ఒదయమహాదేవుని పేర్కొనుచున్నవి. వీనినిబట్టి మహాదేవునికి లక్కాంబ, భీమిందేవులు రాణులనియు వారివలన పై నలుగురుపుత్రులు నొక పుత్రికయు కల్గిరని తెలియుచున్నది. ఈ ఒదయ మహాదేవిని హైహయవంశజుడైన కోన గణపతిదేవుడు పరిణయమాడెను.

వీరభద్రుని కారణముగా నేర్పడిన సంబంధమును బట్టి కాకతీయులు వీరి అంతరంగిక రాజకీయములనంతగా పట్టించుకొనినట్లు తోచదు. వీరభద్రుని యనంతరము వీరయదేవుడును, అతని తరువాత ఇందుశేఖరుడును వరుసగా రాజ్యమునకు వచ్చిరి. ఇందుశేఖరుడొసగిన కొలనుపాక శిలాశాసనమును, ఉత్తరేశ్వర, ఓనపల్లి తామ్రశాసనములనుబట్టియే యీ వంశీయుల వివరములు చాల వరకు తెలియుచున్నవి. సంప్రదాయమునకు విరుద్ధముగా, పరభటి తామ్రశాసనమున వేములవాడ చాళుక్యులవలె, వీరు కూడ ఉత్తరేశ్వర తామ్రశాసనమున సూర్యవంశీయులమని ప్రకటించుకొనబూనుట విచిత్రము! కొలనుపాక శాసనము క్రీ. శ. 1279లో ఇందుశేఖరుని మంత్రియైన పోతినాయకుడు 'వంశవర్ధన'మను కాలువను నిర్మించిన సందర్భమును తెలుపునది.[89] ఈ శాసనము కాకతీయ వంశమును రెండవ ప్రోలుని నుండి రుద్రమదేవి వరకును వర్ణించినది. సామంతులు ప్రభువంశములను పేర్కొనుట విచిత్రము కాకపోయినను, శాసనమందెచ్చటను తమ వంశీయుడును, చక్రవర్తిని భర్తయునైన వీరభద్రుని మరణ విషయము మాత్రము ప్రస్తావింపబడకపోవుటకు కారణము తెలియదు. క్రీ॥ శ॥ 1290, 1292 లలో నీయబడిన ఉత్తరేశ్వర, ఓనపల్లి తామ్రశాసనములు[90] ఇందుశేఖరుడు విద్వనాచార్యుని కొసగిన దానములను పేర్కొనుచున్నవి సమకాలీన మత, సాంస్కృతిక చరిత్రలు తెలుసుకొనుటకు యీ తామ్రశాసనములు అత్యంత ప్రయోజకములు.

ఇందుశేఖరుని తరువాత రాజ్యమునకు వచ్చిన అతని సోదరు లెవ్వరును అంత చెప్పుకొనదగిన సమర్థతగల పాలకులుగా కన్పట్టరు. వీరిలో కొందరు మూల రాజ్యమును విడచిపెట్టిపోయి ప్రస్తుత భీమవరము తాలూకాలోని తోలేరు ప్రాంతము నాక్రమించుకొనినట్లు తెలియుచున్నది.

నిడుదవోలి చాళుక్య పాలకుల స్థితిగతులిట్లు కుంటుపడుచున్న సమయమునన ఆంధ్రదేశ రాజకీయముల నొక్కుమ్మడి కదలించిన మహావిపత్తు సంభవించినది. అది నాటి హిందూరాజుల కందరకును తీవ్రమైన సంకటస్థితిగా పరిణమించినది. దారుణమైన రాజ్యకాంక్షతో దక్షిణమున కెగబ్రాకనుంకించుచున్న ఉత్తరభారతములోని తురుష్కుల పోరాటములే యీ దుస్థితికి కారణము. క్రీ. శ. 1296లో అల్లావుద్దీన్ జరిపిన పోరాట పరంపరలో నలిగి శేవుణుల రాజధానియైన దేవగిరి పట్టణము తురుష్కుల పాలైనది. నాటి కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్రుడు యీ స్థితిని ముందే పసికట్టినాడు. ఓరుగల్లునకేకాక; యావదాంధ్రావనికి తురుష్కుల పాశవిక చర్యలు చేటు కల్పింపక మానవన్నిగ్రహించి. ప్రతిఘటన కుద్యమించి రాజ్యరక్షణకై సర్వవిధముల సమాయత్తమైనాడు. సమర్థులు, నమ్మకస్తులునైన సామంతులను, రాజబంధువులను ఎక్కడెక్కడి వారలను వారి వారి బలములతో నొక్కుమ్మడిని ఓరుగంటివీటికి రప్పించుయత్నమున దిగెను. తమ ఏలిక యను గౌరవముననో, తమ పినతండ్రియైన వీరభద్రుని మనుమడను అభిమానమువలననో పరమత పాలనము సహింపనొల్లని కారణమువలననో తమ తమ బలములతో నిడుదవోలి పాలకులు కూడ తెలంగాణమునకు తరలిపోక తప్పినదికాదు. ఈ కారణమున తెలంగాణమునకు మరలుట వలననే, యీ సమయమునుండి వీరి స్వస్థానమైన గోదావరీ ప్రాంతమందెచ్చటను వీరి శాసనములు లభించుటలేదని భావింపవచ్చును. వీరి శాసనములేకాదు, కాకతీయ ప్రభువులకు విశ్వాసపాత్రులైన కొలనిపాలకుల శాసనములు కూడ సరిగా యిదే కాలమునుండి యీ ప్రాంతమున కానవచ్చుట లేదు. కనుక ఆంధ్ర రాజధాని

పరిరక్షణకై వీరందరును తెలంగాణమునకు వెడలియుందు రనుకొనుట నిరాధార మగు నూహకానేరదు. ఇంతేకాదు, వీరయదేవుని జ్యేష్ఠపుత్రుడైన రుద్రదేవుడు కాకతి ప్రతాపరుద్రుని సామంతునిగా తెలంగాణములోని కొన్ని ప్రాంతములను పాలించుచున్నట్లు క్రీ.శ. 1311 నాటి అతని కొలనుపల్లి శాసనము పేర్కొను చున్నది.[91] కనుక ఈ వంశీయులు ఏ కారణమువలననో శాశ్వతముగా నిడుదవోలి ప్రాంతములను విడిచిపెట్టి, తెలంగాణమునకుపోయి స్థిరపడినట్లు గ్రహింపవచ్చును.

ఓరుగల్లు నగరముపై తొలిసారిగా తురుష్కుల దాడి క్రీ.శ. 1303లో మాలిక్ ఫక్రుద్దీన్ నాయకత్వమున జరిగినది. కాని కాకతీయ సేనావాహిని తురుష్కులకు శృంగ భంగము కావించినట్లు 'వెలుగోటివారి వంశావళి' చాటు చున్నది.[92] కాని యీ అవమాన భారమునుండి తప్పుకొనుటకు అల్లాఉద్దీన్ వరుసగా పంపిన దాడులలో, రెండు దశాబ్దముల సుదీర్ఘపోరాటములలో, ఓరుగల్లు దుర్గము బలహీనబడుటయు, ప్రతాపరుద్రుడు బందీకృతుడగుటయు సంభవించినది. ఫలితమే, తెలుగువారి కోటలో తురుష్కుల చంద్రధ్వజ మెగురుట!

ఆంధ్రపాలకుల కొడగూడిన యీ ఘోరపరాజయానంతరము నిడుదవోలి చాళుక్య కుటుంబమువారి వివరములను తెల్పు ఆధారములులేవు. రాజరికము హటాత్తుగా భిన్నజాతి, భిన్నమతముసైన వారిచేతికి మారుటచే, తాత్కాలికముగా నైనను దాసోహమనుట తప్ప వీరికి మార్గాంతరము లేకపోయివుండును. కాని అచిరకాలముననే తెలంగాణములోని జల్లిపల్లి ప్రాంతములు కేంద్రస్థానములుగా చిన్న చిన్న రాజ్యములేర్పరచుకొని స్వతంత్రముగా పాలింపమొదలిడిరి.[93] చాళుక్య రుద్రదేవుడు శాసన మొసగిన కొలనుపల్లి, జల్లిపల్లికి మిక్కిలి సమీపముననే వుండుటచే యీ చాళుక్యులు రుద్రదేవుని కుటుంబమునకు చెందినవారే అని గుర్తించుటకు చాల అవకాశమున్నది. అట్లైన యీ వంశీయుల రాజకీయ జీవితమున నీ జల్లిపల్లి రంగమే తుదిఘట్ట మనదగును. ఇది ఫలించిన ప్రయత్నమే అయినను, ఇది వీరికి కేవలము నిలువనీడ కల్పించి యుండవచ్చును తప్ప, సుస్థిరమైన అధికార మును మాత్రము కల్గింపలేదు.

క్రీ॥శ॥ పదునాల్గవ శతాబ్దపు ద్వితీయార్ధమున వెలమపాలకులైన మొదటి సింగడును, అతని పుత్రులైన మొదటి అనపోతడును, మొదటి మాదానేనియు జల్లిపల్లి దుర్గమును జయించి ఆక్రమించినట్లు వారి వంశచరిత్రను వర్ణించు 'వెలుగోటి వారి వంశావళి' పేర్కొనుచున్నది.[94] కాని జల్లిపల్లి చాళుక్య దుర్గము వీరికంత సులభముగా హస్తగతము కాలేదు. చాళుక్య రాజులతోడి పోరాటమున మొదటి సింగడు రణరంగమున నేలకూలెను. సింగని యీ మరణమునకు ప్రతీకారముగా అతని పుత్రులు చాళుక్యులను దారుణముగా వధించి, 'సోమకులపరశురామ', 'సోమవంశగ్రహణ 'సోమకులరాజవర్గనిర్ధూమధామ', 'చాళుక్యభూపాలవిదళిత' మున్నగు బిరుదములు ధరించినారు.[95] సమకాలీన చరిత్రలో తెలంగాణమున రుద్రదేవుని వారసులు తప్ప మరే చాళుక్యవంశమువారును లేకపోవుటనుబట్టి, యీ వెలమవీరుల చేతిలో మడిసినది నిడుదవోలి చాళుక్యవంశమునందలి చివరి తరము వారై యుందురని గ్రహింపవలసివచ్చుచున్నది. ఈ చాళుక్య వంశీయుల రక్తముతో వెలమపాలకులు తమ పితరులకు తర్పణము విడచిరనినచో, వారివారి మధ్య నేర్పడిన దారుణ కక్షలెట్టివో తెలియగలవు. ఈ విధముగా నిడుదవోలి చాళుక్యవంశీయుల చివరిదశ తెలంగాణమున జల్లిపల్లి ప్రాంతములలో, వెలమవీరుల దారుణ ప్రతీకార చర్యలకు గురియై పూర్తిగా నశించినది.

ఆధోజ్ఞాపికలు :

1) సి. టి. ఐ., సం. 1. నెం. 25, 2) జె. ఎ. హెచ్. ఆర్. యస్., సం. 35, పే. 421, 3) భారతి, అక్టోబరు, 1970, పే.34, 4) ది కాకతీయాన్ ఆఫ్ వరంగల్, పే. 166. 5) జె. ఎ. హెచ్. ఆర్. యస్., సం. 21, పే. 66, 6) భారతి, ఫిబ్రవరి, 1971, పే. 33, 7) భారతి, జూన్, 1976, పే. 20, 8) యస్. ఐ. ఐ., సం. 10, నెం. 191, 9) జె. ఎ. హెచ్. ఆర్. యస్. సం. 35, పే. 421, 10) యస్. ఐ. ఐ., సం. 4, నెం. 786, 11) ఏ ఆర్., సం. 2. నెం. 345, 12) యస్. ఐ, ఐ., సం. 4, నెం. 96 13) యస్. ఐ. ఐ., సం. 5, నెం. 122, 14) భారతి జూన్, 1976, పే. 20 15) ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్; వరంగల్ డిస్ట్రిక్టు, నెం. 37, 16) యస్. ఐ. ఐ., సం. 4, నెం. 1076, 1118, 17) యస్. ఐ. ఐ., నెం. 1168, 1218, 18) యస్. ఐ. ఐ., సం. 7, నెం. 787, 19) యస్. ఐ. ఐ., సం. 5, నెం. 122, సం. 10, నెం. 360, 20) యస్. ఐ. ఐ., సం. 10, నెం. 491, 21) యస్. ఐ. ఐ. సం. 5, నెం. 123, 22) యస్. ఐ. ఐ. సం. 5 నెం. 123. 22) యస్. ఐ. ఐ. సం. నెం. 124 125, 127. 23) యస్. ఐ. ఐ. సం. 5 నెం. 207. 24) ఎ. ఆర్. ఇ. నెం. 275 ఆఫ్ 1930-31. 25) మూడువలె 26) ఆరువలె. 27) జె. ఎ. హెచ్. ఆర్. ఎస్., సం. 7, పే. 122. 28) ఒకటివలె 29) రెండువలె. 30) ఏడువలె. 31) పదకొండువలె. 32) జె. ఎ. హెచ్. ఆర్. యస్. 21 పే 66. 33) యస్. ఐ. ఐ. సం. 4, నెం. 1076. 34) యస్. ఐ. ఐ. సం. 4 నెం. 1116. 35) యస్. ఐ. ఐ. సం. 5, నెం. 207. 36) యస్. ఐ. ఐ. సం. 4, నెం. 771. 37) యస్. ఐ. ఐ. సం. 10, నెం. 191 38) యస్. ఐ. ఐ. సం. 4, నెం 1168. 39) ఎ. ఆర్. ఇ. నెం. 86 ఆఫ్ 1912. 40) యస్. ఐ. ఐ., సం. 4. నెం. 1218. 41) ఎ. ఆర్. ఇ., నెం. 280 ఆఫ్ 1930-31. 42) యస్. ఐ. ఐ., సం. 6. నెం. 96. 43) యస్. ఐ. ఐ. సం. 4, నెం. 786. 44) ఎ. ఆర్. ఇ. నెం. 275 ఆఫ్1930-31. 45) యస్. ఐ. ఐ. సం. 6, నెం. 96. 46) యస్. ఐ. ఐ. సం. 7 నెం. 787. 47) ఎ. ఆర్. ఇ. నెం. 250 ఆఫ్ 1935-36. 48) యస్. ఐ. ఐ. సం. 10, నెం. 349. 49) యస్. ఐ. ఐ. సం. 10, నెం. 360. 50) ఎ. ఆర్. ఇ. నెం. 6 ఆఫ్ 1966-67. 51) యస్. ఐ. ఐ. సం. 5 నెం. 122. 52) యస్. ఐ. ఐ. సం. 10, నెం. 348. శ్రీ సోమశేఖరశర్మగారును ఆదిత్యశర్మగారును దీని దత్తకాలమును శక సం॥ 1117గా భావించి దీనిని మొదటి మహాదేవునిదిగా పరిగణించినారు. కాని శాసనమున శక సం॥ 1177 వుండుటను బట్టి దీనిని రెండవ మహాదేవునిదిగా గుర్తించుట జరిగినది. 53) పదిహేనువలె. 54) ఇరువదిఏడువలె 55) ఇరువదిఏడువలె 56) యస్. ఐ. ఐ. సం. 10 నెం. 481. 57) యస్. ఐ. ఐ. సం. 10, నెం. 481. 58) ఎ. ఆర్. ఇ. నెం. 312 ఆఫ్ 1930-31 59) పదిహేనువలె. 60) యస్. ఐ. ఐ. సం. 5 నెం. 147 61) భారతి, జనవరి, 1984, పే. 20. 62) యస్. ఐ. ఐ. సం. 5 నెం. 195. 63) యస్. ఐ. ఐ. సం. 4, నెం. 785. 64) యస్. ఐ. ఐ. సం. 10, నెం. 191. 65) ఐదువలె. 66) కమ్మవారి చరిత్ర, పే. 114. 67) ఐదువలె. 68) రెండువలె. 69) భారతి, అక్టోబరు, 1970, పే 34. 70) భారతి, ఫిబ్రవరి, 1971, పే 33. 71) ఇరువదిఏడువలె 72) ఒకటివలె, 73) రెండువలె, 74) భారతి, జూన్, 1976, పే. 20, 75) ఐదువలె, 76) యస్. ఐ. ఐ., సం. 10, నెం. 360, 77) ఇరువదిఏడువలె 78) యస్. ఐ. ఐ., సం. 5, నెం. 122, 79) దికాకతీయాన్ఆఫ్‌వరంగల్ 80), కాపర్‌ప్లేట్ ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటుమ్యూజియమ్, సం. 1, పే. 109, 81) రెండువలె, 82) భారతి, జూన్, 1976, పే. 20, 83) ఎపిగ్రాఫియ ఆంధ్రిక, సం. 4, పే. 110, 84) ఇరువదిఏడువలె, 85 యస్. ఐ. ఐ., సం. 5, నెం. 147, 86) యస్. ఐ. ఐ., సం. 10, నెం. 481, 87) పదిహేనువలె, 88) యస్. ఐ. ఐ., సం. 5, నెం. 124, 125, 127, 89) ఇరువదిఏడువలె, 90) భారతి, జూన్, 1976, పే. 20; ఎపిగ్రాఫియ ఆంధ్రిక, సం. 4, పే. 110, 91) పదిహేనువలె, 92) వెలుగోటివారి వంశావళి, ప. 25, 93) పదిహేనువలె, ఉపోద్ఘాతము, పే. 25, 94) వెలుగోటి వారి వంశావళి, ప. 59, 65, 95) వెలుగోటివారి వంశావళి, ప. 6●

అత్యాశ

శ్రీ యాదగిరి

నేను అత్యాశపరుణ్ణి
పగిలిన అద్దంముక్కలో
సమున్నత హిమాలయ శిఖరాలను
పట్టి చూపాలనుకుంటాను
సముద్రపు గవ్వలో
సముద్రపు హోరు వినాలనుకుంటాను

నక్షత్రాలతో స్నేహంచేసి
విశ్వ రహస్యాలను తెలియాలనుకుంటాను
'అసాధ్యపు' కొండను తొలచి
సాధ్యమయిన సొరంగమార్గాలు తీయాలనుకుంటాను

గర్భం ధరించిన నాప్రశ్నలు
ఎన్ని నిర్లక్ష్యపు, దౌర్జన్యపు కాళ్ళక్రింద చితికినా
ప్రశ్నించడం మానను
నా ప్రశ్నల గాలాలకు
జవాబు చేపలు దొరక్కపోయినా
ఒడ్డున నిరీక్షించడం మానను
నేను అత్యాశపరుణ్ణి

ఒక్క జీవితంలోనే
వేల జీవితాలు జీవించాలనుకుంటాను
ఒక్క గొంతులోనే
వేల నాదాలను పలికించాలనుకుంటాను
నేను వెళ్ళిపోతున్నాను
సుందర సురుచిర స్వప్నాల రత్నాలు పొదిగిన
వసంత కిరీటపు ధగధగలు విడిచి
కన్నుల వెన్నెలపరిచి
ఆత్మీయతా పెన్నిధిని పంచియిచ్చిన
మల్లెల సాంగత్యం మరిచి
నేను వెళ్ళిపోతున్నాను

కణకణమండే
వేల లక్షల, కోట్ల ఆర్తజనావళిలోకి
నిన్న-నేడు-రేపు భేదంలేక
ఇనుపచక్రాలకింద పర్చుకున్న
అభాగ్యజీవన మైదానాలలోకి
నేను వెళ్ళిపోతున్నాను

నా శరీరాన్ని
కోట్ల అణువుల క్రిందికి విడగొట్టి
అణువణువుకు స్పందించే గుండెను సంధించి
చీకటి కమ్ముకున్న బతుకుల్లోకి వెలిగిస్తాను

నేను
మిమ్మల్ని
అక్కడ పలుకరిస్తాను

రామయ్య దుర్భర జీవితము

కీ.శే. కొమాండూరి వేంకటాచార్యులు

మా వూరిలో రామయ్యను యెరగనివాళ్లంటూలేరు. ఎందుచేతని అడుగుతారేమో చెప్తాను వినండి : మొట్టమొదటి కారణం- అతడు వయస్సుమీరిన వాడవటం ; రెండవది - పిల్లాజెల్లలతోటి గుట్టుమట్టుగా సంసారం చేసుకోవటం. ఈ రోజులలో సామాన్యగృహస్థు సంసారము గడపట మనేది బ్రహ్మరథం యెక్కటంతో సమానమంటారు.

సాయంకాలము 6 గంటలయింది. రామయ్య ఆఫీసు వదలి ఇంటికి వచ్చాడు. రావటంతోటే పిల్లలందరూ తనచుట్టూ చేరి వెఱ్ఱి సంతోషముతోటి అరదను మొదలుపెట్టారు. రామయ్యకు దీని అర్థ మేమీ తెలియక దిగ్భ్రమతో పిల్లలకేసి తేరిపార చూసాడు. ఇదివరకెన్నడూ లేనిసంతోషము ఈరోజున పిల్లల్లో ఆవిర్భూత మైనందుకు రామయ్యకు ఆశ్చర్యముగా వుంది. ఈసంతోష మెందుకో పిల్లల్ని అడుగుదా మనుకుంటుండగానే ఏడేళ్ల వయసుగల తనకూతురు దగ్గరకువచ్చి "నాన్నా ! రత్తమ్మ పిన్నొచ్చింది" అంది. రత్తమ్మ రామయ్యకు మరదలవుతుంది.

రామయ్య ముఖము చిట్లించుకుంటూ "అల్లానా" అన్నాడు. ఇంతల్లోకే ఇతని భార్యసీతమ్మ—పక్కా తెలివితేటలుగలది—చిరునవ్వు నవ్వుకుంటూ వచ్చి భర్తతో "ఇటుచూడండి, రత్తమ్మ వచ్చిందండోయి" అని అంది. ఒక్క నిట్టూర్పు విడిచి "బాగానేవుందని" అన్నాడు రామయ్య. ఈమారు నవ్వటానికి ప్రయత్నించాడు కాని మబ్బురోజున వెలుతురులాగున నవ్వు మాయమయింది. "ఇవాళ మీరు చాలా ఆలస్యంగా వచ్చారేం ? వగరుస్తున్నారు కూడాను" అని ప్రేమ వుట్టిపడుతున్నట్టు జాలి గదుర ప్రశ్నించింది సీతమ్మ. - "మరేమీ లేదు. ఇవాళ ఆఫీసులో పని యెక్కువగా వుంది" అంటూ తానుతొడుగుకున్న వదులు కోటును వంటి



మండి విప్పాడు.

మరదలియొక్క ఆగమనానికి సంతోషపడుట ఒకలెక్కలోనిది కాదు. కాని రామయ్యకు అప్పటిస్థితి గతులను పట్టి రవంత కష్టం కలిగినమాట మాత్రం వాస్తవము. రామయ్య మావూరి యూనియను ఆఫీసులో గుమాస్తా. ఇతనికిచ్చే జీతం బహుస్వల్పము. ఆ జీతం తెచ్చుకుని 15 రోజులయిందో లేదో అప్పుడే ఖజానా నిండుకుంది. జీతం పేరుచెప్పి ఏమి సంపాదిస్తేనేం రెండు పెద్దపద్దులు మింగేస్తున్నాయి. అందులో ఒకటి ఇంటద్దె; రెండవది కిరాణాకొట్టులో కాతా. ఇక ప్రతినెలా మూడవరోజుకి గృహయజమాని ఇంటద్దికి గడపమీద కూర్చుంటాడు. మనిషిదగ్గర ఖచిత మెక్కువ. అంటువ్యాధి ఎల్లాగయితే పట్టుకుని వదలదో అల్లా పట్టుకుని అద్దె యిచ్చేదాకా వదలడు. ఇందువిషయమై పాపము రామయ్య అప్రయత్నంగా కంగారు పడేవాడు. ఇంక కోమటాయన ప్రతాపం చెప్పనే అక్కరలేదు

ఈసంగతిల్లా వుండగా పాల కయ్యేడబ్బుకి మితి లేదు. పాలని పైకి పేరే కాని అవి తెలుపురంగులో వుండే నీళ్లు. ఈఖర్చులంతా యెందుకంటె పిల్లలు పాలు లేకుండా వుండలేరు. ఇవి గాక పిల్లలకు బడిజీతాలంటే, సంతఖర్చులంటే; ఇటువంటి వెన్నో వున్నాయి. ఈలాగ ప్రతినెలా రామయ్య పాతబాకీలు తీర్చటమూ కావలసిన సరుకులకు కొత్తబాకీలు చెయ్యటమూ అలవాటైపోయింది.

వీటి నన్నిటివి బట్టి రామయ్యకు మనస్సులో మరదలు వచ్చిందని ఉల్లాస మేమీ లేకపోయింది. 'మళ్లీ అదనపుఖర్చులు ఈమె రాకవల్ల కలుగుతున్నయిరా. భగవంతుడా' అని గుండె గుభిల్లుమంది. ఆయన హృదయంలో వుండే ఉత్సాహ మంతాపోయి ఒక్క నిట్టూర్పు వదిలాడు. సీతమ్మ దానిని కనిపెట్టి చిఱచిఱలాడింది. ఇటువంటి ఆత్మవిచారణ సమయంలో, అతిథ్యమునకును, ఉత్సాహహీనమైన దారిద్ర్యమునకును మనస్సునందు జరుగుచున్న శాంతిసమర సమయమందు ఘనత వహించిన మరదలుగారు గదిప్రవేశించి మందస్మితముతో బావగారిని కుశలప్రశ్న వేసింది. దానికి రామయ్య లేనిసంతోషము తెచ్చిపెట్టుకుని ఆమెను ఆహ్వానించాడు.

"ఓహో; రత్తమ్మమరదలుగారా ? ఎంతదయ వచ్చింది. పిల్లా జెల్లా కులాసాగా వున్నారుకదా ? వెంకటపతి (భర్త) నిన్ను ఒకక్షణమైనా యెడబాసి వుండలేడు కదా. ఒక్కదానవు యెల్లా రాగలిగావు ?

వయస్సులో వుండేమో. రత్తమ్మ; ఈ మాటలకు కొంచెం సిగ్గుపడింది సీతమ్మ కనుబొమలు ముడిచింది. ఆయనమాటలు మన్మథుని బాణా లనిపించాయి. రామయ్య హాస్యం చెయ్యటంలో గట్టివాడని ఇదివరలోనే పేరు పొందాడు. రత్తమ్మ తన కొడుకు వళ్లు బాగుచేసుకుందా మని వచ్చానని చెప్పింది. ఈ ముక్కలు విని వినడంతోటే రామయ్యకు నడుము విరిగినట్టయింది. ఇది వరదాకా ఆమె కులాసాకి వచ్చి ఒకటిరెండురోజులుండిపోతుందనుకున్నాడు. ఇప్పుడావిడ అర్ధమపక్షం రెండు నెలలయినా వుండాలి. ఈఖర్చంతా తననెత్తిమీద విరుచుకుపడుతుందనే విచారంలో మునిగిపోయాడు. ఇట్టి వ్యాకులతతో చేరిన ఆలోచనలు అలలవలె తొందరగా వచ్చి పడ్డాయి. కళ్లల్లో నున్న కాంతి తరిగింది. ముఖము నల్లపడింది. రామయ్యగారి సాహసము పరిక్షించటానికి వచ్చిన రోజుల్లా కనపడ్డాయి.

"పిల్లవానికి జ్వరము వస్తోందట. వెంకటపతికి శలవు దొరికింది కాదు. అతడు మందుకయ్యే ఖర్చు పెట్టుకుంటాడు గాని శ్రద్ధ తీసుకునేవాళ్ళెవరూ లేరని మీవద్దకు రత్తమ్మను పంపాడు" అని అంది సీతమ్మ.

"ఓహో, ఇక్కడనుంచి రెండు సంసారాలని పోషించాలి కాబోలు? నేనే వెయ్యిళ్ళ పూజారిని" అని నవ్వాడు రామయ్య.

"మీయిష్టము వచ్చినట్టు తిరగండి, యెవరు వద్దన్నారు? మనుష్యులకు మంచీ మర్యాదా వుండాలి" అని కోపముతో ఒక్క ఉరుము ఉరిమింది సీతమ్మ ఈ పరిహాసాలకి నవ్వుతూ నిలబడింది రత్తమ్మ.

"ముందుగానే ఖర్చుకి వెంకటపతి రు. 50 రత్తితో పంపాడు. తర్వాత మీ రేమయినా చేసుకోండి" అని విసవిస లాడుతో రూపాయిలు చేతిలో పోసింది సీతమ్మ. దానికి రామయ్య భార్యకేసి కృతజ్ఞతాపూర్వకమైన చూపుచూసాడు. కృతజ్ఞత లెందుకంటారేమో? ఆమర్నాడే ఒక అర్జెంటుబాకీ తీర్చాలిసివుంది. తలవనితలంపుగా డబ్బు చేతిలోటడినందుకు రామయ్యకు కొంచెము ఒడుదొడుకు శాంతించింది.

భోజనా లయింతర్వాత అతిథులకు పడుకుంటానికి చోటు చూపెట్టేటప్పుడు వచ్చింది గొప్ప చిక్కు. గొప్ప గొప్ప వాళ్ళంతా సౌధాల్లోనూ, హంసతూలికా తల్పాల్లోనూ గడుపుతారు రోజులు. ఇందుకు వాళ్ళు ఏనాడో పెట్టిపుట్టారు. రామయ్యలోటి కష్టజీవి జీవనం గాలి వెలుతురు లేని ఇరుకైన అద్దె కొంపల్లో చెయ్యక ఇంకెక్కడ చేస్తారు చెప్పండి! వాళ్ళు కష్టపడాలి. కష్టాలన్ని బీదవాళ్ళకి కాకపోతే భాగ్యవంతులకుంటాయా బాబు! ఈ ప్రకారంగానే రామయ్యమనస్సునకు సమాధానం చేసుకున్నాడు. భర్తలు ఎంతసేపూ తీసుకొచ్చి పడేసారుకారనే గోలగాని, ఇంట్లో ఇదివుంది అదిలేదనే వివక్షత మన ఆడవాళ్ళకు లేదు. ఇరుకు కొంప డబ్బుకు లోభించి తీసుకొన్నందుకు సీతమ్మ భర్తను ఊంపపుకోత కోసిందంటే నమ్మండి.

కష్ట మనుకున్న దానికల్లా ఏదో ఒకదారి ఉండనేవుంది. పిల్లలగుంపు నంతటిని ఒక గదిలోకి తోసారు. వాళ్ల నిద్రట్లోకూడా మిఠాయికోసము కలవరించటం మొదలుపెట్టారు. రామయ్య పడకగది భార్యామరదళ్లాక్రమించారు. రామయ్య బిఛాణాసామాను కొట్టుదగ్గరకు మార్చారు. మంచముమీద కూర్చుని రామయ్య ఒక్కనిట్టూర్పు వదిలాడు. ఊదరిదాపులేని ప్రపంచములో తన సోస్నేహితులై నిలిచియున్న చుట్టను గొప్ప ఆసక్తితో కాల్చటము మొదలుపెట్టాడు. దోమలు, చిమ్మటలు పెద్దధ్వనితో ఆటపాటలకు ప్రారంభించాయి. అనిద్రలేనికళ్లకి మధ్య మధ్య పెద్దపెద్ద మొత్తములతో అదనపు ఖర్చులు కళ్లకి కట్టడము మొదలుపెట్టాయి.

(ఈ కథ 1937 ఫిబ్రవరి భారతిలో మొదటిసారిగా ప్రచురింపబడింది)



'నమో ఆరుద్రాయ'

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

నన్నయ్య మొదలుకొని
నగ్నముని వరకూ
ఎల్ల కవుల నాడీ
ఎఱిగిన దోషజ్ఞుడు!
కొత్తపాతల విలువలు
పసిగట్టగల
వినయశీల కాళిదాసుడు!
కొండగాలి "చల్లను"
కోకోకోలా మత్తును
అబాల గోపాలానికి
రుచిచూపిన
కుశలుడు!


గళ్ళ నుడికట్ల కిటుకులేకాదు
గారడీల మర్మాలన్నీ
"అఱచేతి డమరుకములుగా"
మలచుకొన్న చతురుడు!
చతురంగంలోనేకాదు - కాలూనిన
ప్రతి రంగంలోనూ
ఎదుటివారల
కోసిరాజులనిపించి
మెప్పులు పొందెడి మహానటుడు!
ఎపుడూ
"చదువుల కూనలమ్మ"
స్తనదుగ్ధ ధారల్ని అనుచుండు
"అభినవ పిన వీరభద్రుడు"!
బవిరిగడ్డం వాడే కాదు - జ్ఞానం
"పొంగిన జీవగడ్డ వాడు"!
నవ్య నవనీత సమానమయిన
మనసుగలవాడే కాదు
నవ్వు మొగంవాడు!
మానవుడే మహనీయుడని
"విమోహనం" పూరించినవాడు!
మార్క్సిస్టేగాని
"మూర్ఖిస్టు" గానివాడు!
గరగరనివాడు!
ఆద్దురా పడనివాడు - "అరుద్రుడు"
"తాపీ స్వభావం" పుడికి పుచ్చుకొన్న ఋషీంద్రుడు!
"సర్వజ్ఞుడు"!
"ఆరుపదుల వటపత్రంపై"
పవ్వళిస్తూ
అలరయిన నిగ్గు లెగజిమ్ముతూ
సాహితీ జగత్తును
ఆనందింప జేస్తున్న చిన్ని కృష్ణుడు!
అతనికివే అభినందనలు!
అయిదు పదులు!
చల్లని గిడిగిళ్ళు!

త్రైగుణం

శ్రీ ఎస్. టి. పి. ఏ. రామానుజాచార్యులు

నేనంటే స్వార్థం
నీవంటే భేదం
మనమంటే అభిన్నం
ఇదే త్రైగుణం

ఇప్పుడు... గోద్రెజ్ రూపొందించిందొక కొత్త సబ్బు.
ఇది మీ అంత శ్రద్ధగా మీ చర్మాన్ని కాపాడుతుంది.



Godrej నిమిన్

శుద్ధమైన వేపనూనె యొక్క సహజ సద్గుణాలు కలిగినది.

నీమ్, మర్గోసా అన్న పేర్లతో పిలువబడే వేపచెట్టు, చర్మ సంబంధ సమస్యలకై
మానవజాతికి ప్రకృతి ప్రసాదించిన వరాలలో ఒకటి. వేపనూనెను క్రమం తప్పకుండా వాడితే,
అది మీ చర్మం నునుపుగా, తేటగా ఉండడానికి తోడ్పడుతుంది.

గోద్రెజ్, శుద్ధమైన వేపనూనెను చేర్చి రూపొందించిన సబ్బు, నిమిన్ — మీ చర్మ
సమస్యలను కడిగి పారవేసే లగ్జరీ టాయిలెట్ సోపు. ఈ గోద్రెజ్ నిమిన్ మరింతకాలం మన్నుతుంది.
ఎందుకంటే ఇది ఇతర కొన్ని మర్గోసా సబ్బులవలె మెత్తబడిపోదు.

మీ చర్మ సమస్యలను కడిగి పారవెయ్యండి...
మీ చర్మానికి శుభ్రమైన, ఆరోగ్యవంతమైన నిగనిగ ఇవ్వండి.

సీరియల్

సమిధలు

దిలావర్

(గత సంచిక తరువాయి)

9

ఎలక్షన్లో ఓడిపోయిం దగ్గర్నుంచి శేఖర్ లోలోన ఉడికిపోతున్నారు. అవమానంతో దహించుకు పోతున్నాడు. గుండెలో ప్రతీకార జ్వాలలు రేగుతున్నాయి. ఓటమి అనేది ఎరగని తాను ఆ చేదు అనుభవం రుచి చూడ వలసి వచ్చేసరికి తట్టుకోలేక పోతున్నాడు.

గెలుపు కోసం విశ్వప్రయత్నం చేశాడు. పకడ్బందీగా ఆర్గనైజ్ చేశాడు ప్రత్యర్థులను బెదిరించాడు. బెల్లించాడు. కాని.... వాడు.... ఆ రోగ్....రమణ.... ఏ ప్రలోభానికి లొంగకపోగా తనకే ఎసరు పెట్టాడు. బంపర్ మెజారిటీతో గెలిచాడు.

ఆడపిల్లలంతా వాణ్ని అభినందిస్తుంటే, ఆకాశాని కెత్తేస్తుంటే పెద్ద హీరో అయినట్టు ఫోజు పెడుతున్నాడు రమణ. ఎంత పొగరుగా, ఎంత గర్వంగా వాళ్లముందు కాలరెత్తుకొని తిరుగుతున్నాడు ! వాడి కోతలు చేతలు తనకు పుండు మీద కారం జల్లినట్టవుతున్నాయి. రమణ తనను ఓడిస్తాడని కలలో కూడా వూహించలేదు.

'ఏంచేయాలి ? ఈ పరాభవాన్ని ఎట్లా సహించాలి ? రమణ మీద ప్రతీకారం ఎలా తీర్చుకోవాలి' అన్న ప్రశ్నలు గుండెల్లో కత్తుల్లా దిగబడుతున్నాయి.

అవమానాగ్నిలో గుండెలు కాలిపోతుండే నిప్పులు తొక్కిన కోతిలా గదిలో అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు శేఖర్.

"ఏదో కొంపలంటుకున్నట్టు ఏమిట్రా అలా సీరియస్‌గా పచార్లు చేస్తున్నావ్.... ? " అంటూ లోపలికొచ్చాడు రంజిత్.

"అదేరా.... ఆ రమణగాడు .... "గుండెల్లో పేరుకున్న కసి గొంతులోంచి జారిపోతుండగా రంజిత్ మొహం చూసి టక్కున ఆగిపోయాడు శేఖర్

"నేనూ వాడి విషయమే మాట్లాడదామని వచ్చాను. అయితే నువ్వూ వాడి గురించే ఆలోచిస్తున్నావన్న మాట."

"ఏమిట్రా రమణ గురించి మాట్లాడేది ? " అసక్తిగా అన్నాడు శేఖర్.

"వాడీమధ్య మరీ పేట్రేగి పోతున్నాడ్రా. ఎక్కడ విన్నా వాడి పేరే. ఎక్కడచూచినా వాడి కార్యకలాపాలే. ప్రిన్సిపాల్ కూడా వాణ్ని సంప్రదించంది ఏ పనీ చేయడం లేదట."

రంజిత్ మాటలు మంటలో నెయ్యి పోసినట్టున్నాయి.

"ఐసీ అంతవరకొచ్చిందన్న మాట వ్యవహారం " పళ్లు పట పట కొరికాడు శేఖర్.

"అంతేకాదు. యీ మధ్య రాత్రుల్లో రహస్య సమావేశాలు నిర్వహిస్తూ తమ యూనియన్ వారికి ఏవేవో తర్ఫీదు లిస్తున్నాడట."

మంట మరికొంచెం ఎగదోయబడింది.

"వాడికి రోజులు దగ్గర పడ్డట్టున్నాయిరా" క్రోధంతో శేఖర్ కళ్లు నెత్తురు ముద్దలయ్యాయి.

"అంతటితో ఆగినా బాగుండేది. మనవాళ్లు ఎక్కడ కనబడ్డా బనాయిస్తూ కయ్యానికి కాలుదువ్వుతున్నాడట. ఆడపిల్లల ముందైతే యిక తానొక అమితాబ్ బచ్చనే అని కోస్తున్నాడట. "

"రంజిత్! వాడి అంతు చూడందే యిక నేను నిద్రపోను. ఈ సింహం తోనే వాడు చెలగాట మాడుతున్నాడు. పంజా విసిరానంటే........ నెత్తురు మడుగులో గిలగిలా తన్నుకొని చావాలి నా కొడుకు........" కట్టలు తెంచుకుంటున్న వుద్రేకంలో శేఖర్ ముఖం అతిభయంకరంగా క్రూరంగా మారిపోయింది.

ఎప్పుడూ శేఖర్ వెంబడి తిరిగే స్నేహితుడు రంజిత్ కే శేఖర్‌ను చూస్తే భయమేసింది.

"కమాన్. చెబుతాగా...." గదికి తాళం వేసి హాస్టల్‌కు దారితీశాడు శేఖర్. రంజిత్ మౌనంగా అతణ్ని ఫాలో అయ్యాడు.

రోడ్డుమీద వాహనాలు శేఖర్ ఆలోచనల్లాగే సుడిగాలిలా దూసుకు పోతున్నాయి. మోటారు వాహనాల రణగొణధ్వని కూడా శేఖర్ బుర్రలోని ఆలోచనల రొదను డిస్టర్బ్ చేయలేక పోతున్నాయి.

రోడ్డుక్రాసుచేసి హాస్టలు చేరుకున్నారిద్దరూ.

హాస్టల్లో వున్న ఓ నలుగురు అనుచరులకు విషయం చెప్పి తనను ఫాలో కమ్మన్నాడు శేఖర్. అంతా సైకిళ్ళమీద రమణ యింటికి బయలుదేరారు బసాపైసా తేల్చుకుందామని.

తలుపు దబదబా చప్పుడు చేస్తూ "రమణా! రమణా!" అంటూ పిల్చాడు శేఖర్.

"ఎవరూ?" అంటూ రమణ తల్లి వచ్చి తలుపు తీసింది.

ఎదురుగా శేఖర్, మరికొందరు కాలేజి కుర్రాళ్ళు కనిపించారు.

శేఖర్ కనిపిస్తే చాలు ఆ తల్లిగుండెలు కృతజ్ఞతతో నిండిపోతాయి.

"నువ్వా నాయనా! రా! కూచుందువుగాని...." సాదరంగా ఆహ్వానించింది

ఆమె చూపిస్తున్న ఆప్యాయతకు తన గుండెలు జారిపోతున్నా గంభీరంగా "రమణ లేడా?" అన్నాడు శేఖర్.

"లేదు బాబూ! వూరెళ్ళాడు"

"ఎప్పుడొస్తాడు?"

"ఇవాళ రాత్రికి మెయిలుకి వస్తాడు.... అదేంటి శేఖర్‌బాబూ ! అలాగే నిలుచుండి పోయారేం. రమణ లేకపోతే మా యింట్లో కూచోకూడదా నాయనా ? రండి కాస్తటిఫిన్ చేసి వెళుదుగాని" అంది రమణ తల్లి.

ఆ తల్లి మంచితనం ఓ పక్క చల్లగా గుండెను కోస్తుంటే రమణ మీది కసి ఓ పక్క గుండెల్ని మండిస్తున్నది.

"మళ్ళీ వస్తాం లెండి" అంటూ వెనుదిరిగాడు శేఖర్. మిగిలిన సైకిళు కూడా కదిలాయి.

"ఏం చేద్దాంరా?" చికాకుగా అన్నాడొకడు.

"తర్వాత ఆలోచిద్దాం పదండి" అన్నాడు శేఖర్.

"ఇంకా ఆలస్యం యెందుకు గురూ! పైనుండికూడా మనకు యినస్ట్రక్షన్సు వున్నాయి. రమణను ఇలాగే విడిచిపెడితే మనకు ముందు ముందు కాలేజిలో పుట్ట గతులుండవు. ఇది మనకూ మన పార్టీకి ప్రెస్టిజ్ కొశ్చన్. పర్యవసానం ఎంత తీవ్రంగా వున్నా సరే ఎదుర్కొనడానికి అంతా సిద్ధంగా వుండాలని ఆదేశాలు వచ్చాయి. పై వాళ్ళుండగా మనకు భయమేంటి గురూ ?" శేఖర్ వేపు తీక్షణంగా చూస్తూ అన్నాడొక మిత్రుడు.

"మెయిలు ఎన్నింటికి ?" సీరియస్‌గా అడిగాడు శేఖర్.

"రాత్రి పదింటికి. పదింటికి వద్దామంటావా ?"

"మీరంతా ఎందుకురా ? నేనొక్కడ్నిచాలు. చడీ చప్పుడు లేకుండా సఫా చేసి వస్తా. ఖబర్దార్ యీ విషయం మూడో కంటికి తెలియకూడదు. వెళ్ళిపొండి." అన్నాడు శేఖర్.

అంతా హాస్టలుకు వెళ్ళిపోయారు



రాత్రి పదిగంటలు.

ఎన్నడూ వేళకు సరిగా రాని మెయిలు ఆనాడు సరిగ్గా పది గంటలకొచ్చింది రమణ రైలుగిది యిందిదారి పట్టాడు.

ఎప్పుడూ నడిచేదారే. దాని కలవాటు పడ్డ కాళ్లు. మసక మసకగా వున్నా తడబడకుండా పడుతున్నాయి అడుగులు. సన్నగా యీల వేసుకుంటూ హుషారుగా ముందుకు నడుస్తున్నాడు రమణ.

మెయిన్ రోడ్డు దాటి సందు మలుపు తిరిగాడు.

మున్సిపాలిటీలకు వున్న నామమాత్రపు అధికారంలా గుడ్డిగుడ్డిగా వెలుగుతున్నాయి. వీధి దీపాలు.

అక్కడ మొరిగే వూరకుక్కలు నిశ్శబ్దాన్ని భంగ పరుస్తున్నాయి.

షాపులు కట్టేసి చాలా సేపయింది. ఫస్టుషో సినిమా చూసిన జనం కూడా యిళ్లు చేరుకున్నారు. వీధులు దాదాపు నిర్మానుష్యంగా వున్నాయి.

లైటు తనకు ముందున్నప్పుడు నీడ వెనకగా, లైటు వెనక వున్నప్పుడు నీడ తనకు ముందుగా వస్తూ తమాషాగా అనిపిస్తున్నది రమణకు.

కొంచెం సేపు అలా నడిచాక – తన నీడ కాక మరో నీడ తనను వెంటాడ్డం గమనించాడు రమణ

ఓ సారి ఆగి అటూ యిటూ పరిసరాల్ని గమనించి చూశాడు. ఎవరి అలికిడి లేదు.

దూరదూరంగా వున్న యిండ్లు మసక చీకట్లో కునుకు తీస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి.

నీడల్తో ఆడుకుంటూ వస్తున్నాడు కాబట్టి తనకలా మరో నీడ కనిపించింది గానీ నిజానికి తనను వెంటాడే అవసరం ఎవరికైనా ఎందుకుంటుంది అనుకొని వడివడిగా అడుగులు వేస్తున్నాడు రమణ.

ఈ సారి ఆ నీడ స్పష్టంగా తనకు మరీ దగ్గరగా కనిపించింది.

నిస్సందేహంగా తననెవరో ఫాలో అవుతున్నారు. ఎవరై వుంటారా అని గిరుక్కున వెనక్కు తిరిగే లోపలే బలమైన చేతులు తన చేతుల్ని వెనక్కు విరిచి పట్టుకున్నాయి.

మరుక్షణం "అమ్మా...." అన్న రమణ భయంకరమైన కేక అలలు అలలుగా చిక్కటి చీకటిలో కలిసిపోయింది.

* * *

తూరుపు గర్భం చీల్చుకొని ఎర్రని నెత్తురు ముద్దలా వుదయించాడు సూర్యుడు.

రెక్కలు టపటపలాడిస్తూ గోలగోలగా అరుస్తూ బెట్లమించి ఎగిరిపోతున్నాయి పక్షులు.

తెలతెలవారకముందే రమణ హత్యా వార్త దావానలం వూరంతా వ్యాపించింది.

అశనిపాతం లాంటి ఆ వార్తకు వూరంతా చలించింది.

విద్యార్థులు, లెక్చరర్లు, వూరివాళ్లు గుంపులు గుంపులుగా శవాన్ని చూసేందుకు తరలి వస్తున్నారు.

పోలీసు బలగం లాంఛనంగా హడావుడిచేస్తూనే వున్నది.

రమణ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చుకుంటూ వచ్చారు. రమణ తల్లి కొడుకు శవం మీదపడి గుండెలు బాదుకుంటూ వల వలా ఏడుస్తున్నది. రమణ తండ్రి ఆ షాక్ కు తట్టుకోలేక దేష్టలుడిగి అయోమయంగా పిచ్చిగా చూస్తున్నాడు.

"బాబూ ! ఒక్కగా నొక్క నలుసువని నిన్ను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటున్నామురా ! మేము నీకు భారమవుతామని మమ్మల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయావా బాబూ ! అన్నంపున్నెం ఎరగని నీకు అప్పుడే నూరేళ్ళు నిండాయా నాయనా ! ఆ పాపిష్టివాడు ఎందుకూ పనికిరాని యీ ముసలివాళ్లను చంపి నిన్ను వదిలిపెట్టినా బాగుండేది రమణా ! నాయనా రమణా ! నిన్ను చూసేందుకు నీ కాలేజి స్నేహితులు వచ్చార్రా ! నీ గురువులు వచ్చార్రా ! ఒక్కసారి చూడు నా తండ్రీ ! ఒక్కసారి మాట్లాడు బాబూ!" అంటూ ఆ వృద్ధురాలు కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నది.

ఆ దృశ్యం అక్కడి జనాల గుండెల్ని పిండుతున్నది. అప్రయత్నంగానే కళ్లలో అశ్రువులు నిలుస్తున్నాయి.

అంతులేని ఆ శోకాన్ని ఈ ప్రపంచంలో ఏ శక్తి ఓదార్చగలుగుతుంది ? పైశాచికంగా ఎన్ని ప్రాణాలనైనా కబళించవచ్చు, కానీ ఒక చిన్న ప్రాణికి వూపిరి పోయగలరా ఎవరైనా ? చంపేవాడికి యీ ఆలోచనలన్నీ వుంటాయా ? అలా ఆలోచిస్తే యీ ప్రపంచంలో ఈ హత్యలూ మారణకాండలూ వుంటాయా ఏదో అలా పిచ్చిగా మనం అనుకోవడమే గాని.... ఇలా సాగుతున్నాయి చూడవచ్చిన వారి ఆలోచనలు.

అన్ని తతంగాలూ పూర్తిఅయ్యాక, శవాన్ని పోస్టుమార్టం చేయించి తల్లి దండ్రులకప్పగించారు.

చితిలో కొడుకుతోబాటే ఆశలన్నీ మంటలకు ఆహుతయి చివరకు మిగిలిన బూడిదను పిడికిలిలోకి తీసుకొని తెరలు తెరలుగా, శరీరంలో శక్తి నశించే వరకూ! గుండెల్లోని మంటలు చల్లారే వరకు నిస్త్రాణగా కుప్పకూలిపోయే వరకు ఏడుస్తూనే వున్నారు రమణ తల్లిదండ్రులు.

భవిష్యత్తంతా అంధకార బంధురమై ఏ దిక్కూలేని ఆ ముసలి మోడులు అంతకన్నా ఏం చేయగలరు గనక ?

కేసును టీ సంగానే దర్యాప్తుచేశారు పోలీసులు. ప్రిన్సిపాలును, లెక్చరర్లను. విద్యార్థులను ప్రశ్నించారు. చూచాయగా లభించిన క్లూ ఆధారంగా శేఖర్‌ను ఇంటరాగేట్ చేశారు. శేఖర్ తప్పు ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయాడు.

శేఖరే తమ కుమారుడ్ని హత్యచేశాడన్న వాస్తవాన్ని భరించ లేకపోయారు రమణ తల్లిదండ్రులు. రమణ మరణించాడన్న బాధకంటే రమణను చంపింది శేఖరే నన్న సత్యం వారి గుండెల్ని రంపపు కోతకోస్తున్నది.

శేఖర్‌ను చూసేందుకు రమణ తల్లిదండ్రులు బయలు దేరారు.

చేతులకు బేడీలతో లాకప్‌లో వున్నాడు శేఖర్.

అల్లంత దూరంలో వుండగానే రమణ తల్లి కళ్లలో ధారగా కన్నీరు చిమ్మింది.

ఉద్వేగ్నంతో వివశమవుతున్న శరీరాల్ని అదుపు చేసుకుంటూ శేఖర్‌ను సమీపించారు.

"నువ్వేనా బాబూ రమణను హత్యచేసింది...మంచి పనే చేశావు నాయనా! అయినా నీకా హక్కు ఎప్పుడూ వుండనే వుంది కదా ! వాడి శరీరంలో ప్రవహిస్తున్న ప్రతిరక్తపు బొట్టూ నీదేకదా ! ఎప్పుడు కోరితే అప్పుడు నీ రక్తాన్ని నువ్వు తీసుకునే అధికారాన్ని ఎవరు కాదంటారు బాబూ ? కానీ....కానీ....వాడి ప్రాణాపాయస్థితిలో నువ్వు నీ రక్తం దానం చేసి వాడికి ప్రాణభిక్ష పెట్టకుండా వుంటే యీ ముసలి వాళ్ళం యిన్నాళ్ళుగా మా ఆశలకు వూపిరిపోసి పెంచుకునే వాళ్ళం కాదు. నాయనా ! ఆనాడే ....మా రమణ సహజమైన చావు చచ్చివుంటే యీ దుర్భరమైన కడుపు కోత వుండేది కాదు కదా....బాబూ ! శేఖర్....ఆనాడు నేమనుకున్నానో తెలుసా.... ? నాకు....నాకు....ఒక్కడు కాదు....యిద్దరు కన్న కొడుకులున్నారనుకున్నా....చంపితే చంపావు... కానీ....కానీ ఈ హత్య నువ్వే చేసినట్టు ఎందుకొప్పుకున్నావయ్యా... యిప్పుడు వాడూ లేక....నువ్వూ లేక...రెక్కలు తెగిన పక్షుల్లా ...ఎలా విలపించవలసి వస్తున్నదో చూడు...." రెండు చేతులతో తల కొట్టుకొంటూ కుప్పకూలిపోయింది రమణ తల్లి.

"అమ్మా ! నేను నీ కొడుకుని హత్య చేసిన కిరాతకుడ్ని. నన్ను .... నన్ను యింకా నీ 'కొడుకు' అని ఆ పదాన్ని కళంకితం చెయ్యకు ఆ నోటితో నా మొహం మీద ఉమ్మెయ్యి నీ చేతులతో నా గుడ్లు పెరికి వెయ్యి, కత్తితో నన్ను ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెట్టు... కానీ... నీకు దండం పెడతాను. నన్ను మాత్రం కొడుకనిపిలవకు... నేను భరించలేను ఆ పిలుపు... నేను భరించ లేను...." గుండెలు బాదుకుంటూ భోరున ఏడుస్తున్నాడు శేఖర్.

గుండెలు పిండే ఆ దృశ్యానికి సాక్షిగా మెల్లగా అక్కడికి వచ్చారు ప్రకాశం మాస్టారు.

'మాస్టారూ... మీకు దండం పెడతాను. వీళ్ళను యిక్కడ్నించి తీసు కెళ్ళండి. నా మొహం ఎవరికీ చూపించలేను. దయచేసి నా దగ్గరకు ఎవరూ రాకండి. యింత మంది బాళ్ళ కడుపు కాల్చిన నాకు బ్రతికే అర్హత లేదు. 'నన్ను వురితీయసీయండి. అదే నాకు సరియైన శిక్ష. అప్పుడే నా పాపానికి నిష్కృతి ...." భావోద్వేగంతో కేకలు వేస్తున్నట్టు పిచ్చిగా అరుస్తున్నాడు శేఖర్.

మాస్టారి గుండె కర్కశమైన ఇనుప పిడికిలిలో నలిగిపోతున్నట్టనిపించింది. స్వతహాగా ఏ మనిషీ కావాలని మృగంగా మారడు. అలా మారుస్తున్నదీ వ్యవస్థ. అందరం కలసి చావడంకాదు నేర్పవలసింది. అందరం కలిసి బ్రతికేందుకే శిక్షణ కావాలి

మల్లెపూవులా సుకుమారంగా స్ఫటికంలా ఎంత స్వచ్ఛంగా వుండీ శేఖర్ మనసు ! ఏ రాక్షస క్షణం ఈ లేతమనసును వశం చేసుకొని యీ పైశాచికాన్ని చేయించిందో ! ఏ ఆటవికత్వం యితడ్ని లోబరుచుకుని శాసించిందో ! తాను ప్రాణభిక్ష పెట్టి పునర్జీవితుడ్ని చేసిన వాడ్నే అవసరమైతే ప్రాణాలు కూడా తీయ గలిగేట్టు చేయగలిగే దౌర్బల్యం ఎంత చిత్రమైనది ! రక్తదానం చేయగలిగిన సంస్కారం రక్తదాహం తీర్చుకోగల క్రౌర్యంగా మారడం యెంత దారుణం !

ఆలోచించండి.... ప్రాణాలు నిలపడం తెలిసిన యీ త్యాగమూర్తులను... పూలవంటి మనసున్న యీ యువకులను ప్రాణాలు తీసే హంతకులుగా మార్చే తసాయిశక్తుల్లారా....! ఒక్కసారి ఆలోచించండి... మనుష్యుల్ని వేటాడే యీ విద్య నేర్పి ఏ శ్మశాన భూముల్ని ఏలుతారు ? ఏ నూతన వ్యవస్థను నిర్మిస్తారు?

మౌనంగా తనలో తానే ఆక్రోశిస్తున్నారు మాస్టారు.

10

రవి మనసు చీల్చుకొని వస్తున్నాయి ఆలోచనలు.

స్వాతంత్ర్యం వచ్చి ముప్పై ఆరు సంవత్సరాలు దాటినా కూడు లేక గుడ్డ లేక, గుడిసె లేక దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోయిన కోట్లాది కష్టజీవులకు యింకా దారీ తెన్నూ కనిపించడం లేదు.

యీ పెట్టుబడిదారీ వ్యవస్థలో చదువులు, ఎన్నికలు, మతాలు ఆఖరికి దేవుళ్లుకూడా వ్యాపార వస్తువులే ! ఈ వ్యాపారం వున్నవాళ్ళను మరింత వున్న వాళ్ళుగా చేసి లేనివాళ్ళను నిలువు దోపిడీ చేసి అజ్ఞానాన్ని మిగుల్చుతున్నది.

ఈ దారిద్ర్యాన్ని, అజ్ఞానాన్ని, బానిసత్వాన్ని నిర్మూలించే నూతన శక్తి ఆవిర్భవించాలి. పీడిత ప్రజలను ప్రజా పోరాటాలకు సిద్ధం చేయాలి. అప్పుడే ఈ జాతికి విముక్తి. యీ కష్టాలు కన్నీళ్లు, ఆర్తి ఆక్రందనలు సమసమాజ సౌధ నిర్మాణంలో పునాదిరాళ్లు కావాలి.

ఒక కొత్త ఉత్సాహం, కొత్త ఉత్తేజం, ఏదో అద్భుత శక్తి రవి నరనరాల్లో ప్రవహిస్తున్నది. ప్రతి ఆలోచనా ఉత్తుంగ కెరటంలా విరుచుకుపడుతున్నది. ప్రతి భావం అతడ్ని కుదిపివేస్తున్నది. అతని శరీరమంతా ఏదో తేజస్సుతో వెలిగి పోతున్నది.

చెల్లాచెదురుగా ముసురుకుంటున్న ఆలోచనలకు ఒక ఆకృతి కల్పించే ప్రయత్నం చేస్తున్నాడు. అతని ఆశయాలు అల్లుకుందుకు ఏదో ఆధారం దొరికి నట్టే అనిపిస్తున్నది.

ఆకాశంలో స్వేచ్ఛగా యెగురుతున్న పక్షులను తదేకంగా చూస్తూ అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు.

చేతిలో పుస్తకాలు పట్టుకొని వచ్చింది రేవతి. ఇంటి ముందు సీరియస్‌గా అటూ యిటూ తిరుగుతున్న రవిని చూచి ఆశ్చర్యపడింది.

తలెత్తి రేవతివేపు చూశాడు. ఇంతకు ముందు రేవతిని ఎన్నోసార్లు చూశాడు. పక్షుల్ని చూశాడు. ఆకాశాన్ని చూశాడు. చెట్లను చూశాడు. కాని.... తాను చూస్తున్న ప్రతి వస్తువులో ఏదో నూతనత్వం .... చైతన్యం.... ఏదో సౌందర్యం.... ఏవేవో కొత్త అర్థాలను దర్శించ గలుగుతున్నాడు.

రేవతి మరీ ఆకర్షణీయంగా.... కాదు.... అందంగా.... ఉహుఁ... వ్యక్తం చేయలేని గొప్పకాంతితో నయగార జలపాతంలోని చైతన్య.... సప్తవర్ణ యింద్రధనుస్సులోని లావణ్యం.... మంచులో తడిసిన గులాబిలోని సౌకుమార్యం- అన్నీ కలిసి మూర్తీభవించిన దివ్యశిల్పంలా కనిపిస్తున్నది.

రేవతి మామూలుగానే వున్నది. అవే కాటుక కళ్ళు. అవే గులాబి చెక్కిళ్లు పొగరుగా నిటారుగా కొనదేలిన ముక్కు. అదే వాలుజడ. అవే నవ్వులు... కాని ఆ కళ్లలో.... ఆ నవ్వులో.... ఆ రూపంలో ఏదో విద్యుత్తు.... ఏదో మెరుపు.... ఏదో అయస్కాంతం ..

"ఏంటీ అలా చూస్తున్నారు ... " గదిలోకి దారితీస్తూ అన్నది రేవతి.

"అదే నాకూ అర్థం కావడం లేదు" రేవతి వెంట లోనికెళుతూ అన్నాడు రవి.

"ఇందులో అర్థం కాకపోవడానికేమున్నదని ? " రవిని పరిశీలనగా చూస్తూ అన్నది రేవతి. రవి ఈనాడెందుకో కొత్తగా కనిపిస్తున్నాడనుకుంది. తానిది వరకు రవిని ఎన్నిమార్లో చూసింది. కాని ఈ రవి ఆ రవి మాత్రం కాదు.

ఏదో ఉద్విగ్నత ఏవో వుత్సాహం ఏదో తన్మయత్వం ఏదో వివశత్వం అతడిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

"రేవతిగారూ ! మీరు నాస్నేహితురాలు కావటం నాకు గర్వకారణం. మీలో నేను ఎవర్ని చూస్తానో తెలుసా ? ఒక సామాన్య ఆడపిల్ల కాక ఒక ఉద్యమానికి నాయకురాలు కనిపిస్తూ వుంటుంది నాకు. కాని.... మీ ఆలోచనా పరిధిని యింకా విస్తృతం చేసి చూడండి.... స్త్రీలా పురుషులా కాదండి వర్గాలు... హేవ్స్ అండ్ హేవ్ నాట్స్... ఇవే.... ఇవేనండి ... ప్రపంచంలో వున్న రెండు వర్గాలు... " రేవతి కళ్లలోకి సూటిగా చూస్తూ అన్నాడు రవి

కట్టలు తెంచుకుంటున్న రవి ఆవేశాన్ని గమనిస్తున్నది రేవతి. అతని తీరు చూస్తుంటే ఏదో కొత్త విషయం తనతో చెప్పాలని ఆరాట పడుతున్నట్టుగా వుంది. అనిపించింది రేవతికి.

రవి తన ధోరణిలో వాక్ప్రవాహంలో కొట్టుకు పోతూనే వున్నాడు.

"అపౌష్టికాహారం .... క్రిములు .... వ్యాధులు .... అధిక పరిశ్రమ మానసిక భారం... యివన్నీ దరిద్రం వలన కలుగుతున్న దుష్ఫలితాలు. ఈ దారిద్ర్యం నిజానికి కర్మ వల్లనో శాపం వల్లనో కలగడం లేదు. క్రిములకన్నా- వ్యాధులకన్నా- మృత్యువు కన్నా భయంకరమైన ఒక వర్గం సృష్టిస్తున్నది..."

రవి కళ్లలో అలుముకుంటున్న ఎర్రని జీర ముఖంలో బిగుసు కుంటున్న కండరాలు- భయంకరమైన గంభీరం రేవతిని కలవర పరచాయి.

"ఏమయింది.... మీకేమయింది మిస్టర్ రవి ? " రవి భుజాలు పట్టుకుని కుదుపుతూ అన్నది రేవతి.

వందేవనము

శ్రీ యస్వీ జోగారావు

ఉన్నటులుండి యుప్పరమునుండి హఠాత్తుగ గర్జ లేల కా
ర్కొన్నవి? మబ్బుగ్రద్ద వడికొప్పులపై నడయాడునేల! వి
ద్యున్నటి యేల దిస్సమొల నూపుచు గంతులునున్న దింక నే
మున్నది నెత్తిమీద పిడుగొక్కటియే తరువాయి సుమ్మికన్.

అదియును పడ్డ దక్కటకటా! భరతావని గుండెకాయపై
భిదుర దిగంతదంతుర దభిధ్వనితోరణ దారుణమ్ముగా
ప్రిదిలెను భారతీయ విభవేందిర కాయము తూట్లు తూట్లుగా
చెదరిన గుండె ఘూర్ణిలుచు చేష్టడి మ్రాన్పడె సర్వధాత్రియున్

పిలక్క్రశు శిఖావళంబు లోక రెండేరెండు నీ వంత ప్రా
ణాలన్ నిల్వున తోడివేసెను మతోన్మాదంబుతో ఘోర హిం
సాలోలంబులు; విశ్వశాంతి సమతా సంధాత్రికా భారతీ
యేలాభాగ్యవిధాత్రికా కటకటా యీపాటు వాటిల్లుటల్!

కంచెయె కాలుని కచ్చై
కంచమ్మై కపాలకమయి, కంకటి ఖటిత్రై,
కంచుకమే ముల్పొదయై
పంచెయె పామైన పగిది పాపము పరగెన్.

అంగరక్షకులా వారు! అక్కటకట
పాదరక్షకులైనను పనికిరారు
కటికమృగయులువారు, రాక్షసులు వారు
మిడిసి పడిరేల? వాళ్ళమ్మకడుపుకాల!

అందొకడె యిల్లు వల్లకాడనగ జేయు
నిరువురైనచో నిక దేశమే యెడారి
నీ యునురు పోసుకొని యొకండేగ నరక
వాటిక కొకండు చోటు చొప్పడక యాగె.

అమ్మా! అవు దాక్షిణమున
నెమ్మోయి కటకట పడితివా! ఎంతేడ్చితివో!
* అమ్మాట కిమ్మహీవల
యమ్మెల్లను సొమ్మసిల్లి యడలెత్తెగదే!

గాంధీపేరున్నందుకు
గాంధీవలె బ్రదికి మ్రందుఘనతలు నీవే
ఇందిర! బ్రదుకున మెచ్చిరి
మ్రందిన నొచ్చిరి జగత్సమస్తజనమ్ముల్.

బ్రతికి చచ్చిన దేశమీ భరతదేశ
మందు చచ్చిబ్రదికితివి ఇందిరమ్మ!
అవ్యవస్థాక దేశసమైక్యము స్థిర
మారజేసి నీ యసువులు ధారవోసి.

తన బ్రతుకును మహత్తర చరిత్రగ మల్చి
తాన యొక కృతియై తనరు నదియు
తన రాజనీతిజ్ఞతా చతురత నింట
గెలిచి రచ్చగెలిచి యలరునదియు
తనయాడు తన మద్దుగొనకుండ పెరయుక్తి
మంచుల నాటలాడించినదియు
తన శక్తియుక్తులం దన కాలమును మన
మంచికై ముడుపు చెల్లించినదియు

నూటికో కోటికో మహా నొప్పునేమొ
తాదృశాద్భుత వ్యక్తి నా దనరు నదియు
ఇందిరాగాంధి తల్లి యింకేది మనకు?

కన్నతల్లి మరణ మేరికైన బాధ
తల్లితో చచ్చి రెవ్వారు? త్వన్మరణపు
గోడు విని చచ్చిరెందరో గుండె పగిలి
** దేశమాతవమ్మా! నీవ దేవతవును

---

* అమ్మాటను విని జగమేయమ్మలికను సొమ్మసిల్లియుడు

** 1. తల్లీ! దేశమాతవును నీవ కత్తెగదే

2. నీవ దేశమాతవు నీవ దేవతవును.

వెలిస

కాలువశ్రీ



తల పైకెత్తి ఆకాశం దిక్కు చూశాడు పోచయ్య ... అక్కడక్కడ మబ్బు తెరలు కమ్ముకొనున్నాయి. చల్లగా గాలి వీస్తుంది ... గాలికి మేఘాలు విడిపోతున్నాయి. మరి కొంత సేపట్లో ఆకాశం నిర్మలంగా తయారయింది ... 'ఇగ పరువలేదు. వానేం రాదు. మందెయ్యాలె' అనుకున్నాడు. గంపలో వున్న యూరియాను చిన్న గమాల్లోకి తోడాడు. గమాల చేతిలో పట్టుకొని పొలంలోకి దిగాడు ... రోగం తగిలి పొలమంతా ఎర్రగా వుంది ... 'ఈ మందేత్తె పొలం పచ్చగైతది ... దేవుడు మన్నిత్తె పుట్టెడన్ని వడ్లు మా రాల్తయి ...' తనలో తాననుకుంటూ పొలంలో తిరుగుతూ మందు చల్లుతున్నాడు ... గమాల్లోని మందయి పోగానే గంపలోని మందు మరింత తెచ్చి చల్లుతున్నాడు ... పొలం మోకాలు కింది వరకు దిగబడుతుంది ... బలవంతంగా కాలు పైకి లేపుతూ ఆయాసంగా అడుగులేస్తూ తన పని కానిస్తున్నాడు. సగం వరకు చల్లడం పూర్తయింది ... ఒడ్డుపై కూర్చున్నాడు పోచయ్య ... సాయంత్రం దాదాపు ఐదుగంటల టైమవుతుంది ... 'పొద్దు పోతంది ... జెప్పున మందేసి పోవాలె' అనుకుంటూ లేచి నిల్చున్నాడు. ఆకాశం దిక్కు చూశాడు. అంత వరకూ నిర్మలంగా వున్న ఆకాశంలో ఇపుడు మేఘాలు అటూ ఇటూ పరుగిడుతున్నాయి. కొంచెం జంకాడు పోచయ్య. 'వానత్తె మందంత నట్టమయితది ... ఏం జెయ్యాలె' అనుకుంటూ పైకే చూస్తున్నాడు. మళ్ళీ మేఘాలు విడిపోతున్నాయి. 'ఇగ వానేం రాదు ... అనుకొని గమాల్లోకి మందు తీసుకొని పొలంలోకి దిగాడు ... పొలమంతా తిరుగుతూ మందు చల్లడం పూర్తిచేశాడు ... ఒడ్డుకొచ్చి నిల్చున్నాడు ... తృప్తిగా పొలం దిక్కు చూశాడు .. ఆకాశం దిక్కు మళ్ళీ చూశాడు. ఆకాశం నిండా

నల్లని మేఘాలు ... కొంచెం వణికాడు పోచయ్య ... 'మబ్బు కమ్ముకత్తంది... వానచ్చేటట్టే వుంది ... ఏమయిద్దో ...' అనుకుంటూ కాలువలో కాళ్ళు చేతులు కడుక్కున్నాడు ... 'టప్' మని ఓ చినుకు మీద పడింది .. గబగబా పొలమంతా తిరిగి ఓ మడిలో నీరు మరో మళ్ళోకి పోకుండా మన్ను వేసిన చోట్లలో మరింత మట్టేశాడు. చేతులు కడుక్కున్నాడు.

"టప్ టప్" అంటూ చినుకులు రాలడం ప్రారంభమయింది .. ఆకాశం దిక్కు చూసిన పోచయ్య ఇక వాన రావడం తప్పదని నిర్ధారించుకున్నాడు. "నీ యవ్వ ... వాన రాదనుకొని మందేత్తి ... వాన రాకడ పానం బోకడెవ్వలకు తెలువది ... మందు దండగయినట్టే ...' తనలో తానే గొణుక్కున్నాడు.

"టప్ ... టప్ ... టప్ ..." చినుకులు రాలుతున్నాయి. గమాల గంపలో పడేశాడు. గొంగడి కోలాట మేసుకొని తలపై నుండి వేసుకున్నాడు. గంప తలపై పెట్టుకొని పొలాల ఒడ్లపై నుండి నడుస్తున్నాడు ... "టప్ టప్... టప్ టప్ ..." చినుకులు పడటం ఎక్కువయింది. "మూడు గుంచాల మందు తొంభై రుపాయలు పెట్టి తెత్తి సావుకారియ్యనన్నా బతిలాడి తీసుకత్తి ... మందంత మంట్లె గలిసి పోతదిగ ...' అనుకున్నాడు. "ఛర్ ... ఛర్" మంటూ ఉరుము ... "ఛక్ ... ఛక్ ... " అని మెరుపు ... "అర్జెనా ... అర్జెనా ... అర్జెనా ..." మూడుసార్లు అన్నాడు పోచయ్య ... బురదగా వున్న ఒడ్లపై నుండి కాళ్ళు జారుతున్నాయి. జారకుండా నిలదొక్కుకుంటూ మెల్ల మెల్లగా నడుస్తున్నాడు ... చినుకులుగా ప్రారంభమయిన వాన కురుస్తుందిప్పుడు ... 'ఎంత పాడు గడియల కోమటయినె దగ్గెర మంది దెచ్చినో ... ఇదువరకే బాకున్నదని ఏడ్సుకుంటనే ఇచ్చిండు ... అటు పొలం లేసు దాల్సొంలేదు ... వాన మొదలయిపాయె ... ఒక్క రెండు మూడు గంటలాగినా కొంత మందన్న వంకకి పట్టేది ... న సీవ పాడుగాను...' విచారిస్తూ నడుస్తున్నాడు పోచయ్య...ప్రక్కలకు చూశాడు ... పచ్చగా పొలాలు మరికొన్ని రోగాలు తగిలి ఎర్రబడుతున్నాయి ఆకులు మాడిపోయి వెలవెల బోతున్నాయి ... "యాల్లకు మందెయ్యకుంటె గట్లుంటయి పొలాలు ... మంచిగుందన్నని మందేత్తెనేమొ గట్ల మన్నుపాలు గావట్టె ... ఎన్నకుంటేంది ...? ఆ నారాయణమూర్తెత్తు కోందేం గాదు ... అయినె ముందు మన మెంత బోళ్ళం ..." ఆలోచిస్తూ నడుస్తున్న పోచయ్య కాలూరింది ... పొలంలో అడుగు పడింది ... కాలుపైకి తీసి ఒడ్డుపై నుండి నడుస్తున్నాడు ... "ఛర్ ... ఛర్ .. ఛర్ ... ఛర్" అంటూ పెద్ద ఉరుము ఎక్కడో పిడుగు పడ్డ ధ్వని ... "అర్జెనా ... అర్జెనా ... అర్జెనా ..." అని మూడుసార్లు గట్టిగా అన్నాడు.

'ఏం వానలో ఏమో ...? అత్త యనుకున్నప్పుడు రావు ... రావనుకుంటత్తయి... ఓ సారోసారి అర్ద్ర సొచ్చినా ఒక్క సినుకన్న వడది. ఒక్కొక్కసారేమో రోండ్లనే మునిగిపోయినట్టు పెద్ద పెద్ద ఆనలు వడుతయి. ఒక్క సినుకోసం, వెయ్యి కండ్లతో నెన్నిసార్లు ఎదురు సూల్లే ... సినుకు వడ్డ దంటెంత పొంగిపోతె ... ?ఆయుటి పూనిందంటె ఎద్దులో నాగలి గట్టుకొని ఉరికురికి దున్నలే ... ?' తనలోతానే అనుకుంటున్నాడు పోచయ్య. వాన ... జోరెక్కువైంది. గొంగట్లోనుంచి నీళ్లు కారుతున్నాయి. గంప తలపై నుండి బోర్లించుకొని గమాల చేతిలో పట్టుకొని నడుస్తున్నాడు ... గొంగళి రెండంచులు కలిపి దగ్గరికి పట్టుకున్నాడు ... పొలాలు దాటి తోవలో కొచ్చాడు ... తోవనిండా బురద ... నీళ్లు ... రాళ్లు ... కంప ... నీళ్ళలో నుండి మెల్ల మెల్లగా నడుస్తున్నాడు. ముందు పశువులు నడుస్తున్నాయి. "ఔ ఔ" అంటూ వాటి వెనుక పశువులుగాచే పిల్లలు పరుగెడుతున్నారు. పిల్లలదిలించగానే తోకలు పైకెత్తి పరుగిడుతున్నాయి. వెనుక గబగబా నడుస్తూ మరో పశువుల మంద. ప్రక్కకు జరిగాడు పోచయ్య ... వాటి కాళ్ళ తొక్కిడిలో చిమ్మిన నీళ్లు అతనిపై పడుతున్నాయి. గొంగళి పూర్తిగా తడిచి ఒంటికంటుకుంటుంది. తలపైవున్న రుమాలు కూడా తడయింది. చల్లగా చలి ... దురదగా వుంటే తలనోసారి గోక్కున్నాడు. "వానా వానా వల్లప్పా ... చేతులు చాపూ బెల్లప్పా ..." పాడుతూ పరిగిడుతున్నారు పిల్లలు. వానలు కురవడం ఆలస్యమయితే కప్పల పెళ్ళిళ్లు చేయడం ... హరికథ అయ్యగారితో విరాటపర్వం కథ చెప్పించడం పోచయ్య కళ్ళముందు కదలాడుతున్నాయి. విరాటపర్వ కథలో అర్జునుడు విరాట రాజు గోవుల మలిపే ఘట్టం ... భీముడు కీచకున్ని చంపిన ఘట్టం ... పోచయ్యకు జ్ఞాపకమొచ్చాయి. "పుణ్యాత్ములు ... పాండవులేడుంటె ఆడ వానలు మస్తుగ పడతయిట ... మంచిగ పంటలు పండుతయిట ... కరువన్నదే ఉండదట ..." మనసులోనే వాళ్ళకు దండం బెట్టుకున్నాడు. 'అంబా' అని అంకె వేసి తోక పైకెత్తి కొమ్ములతో ఫుట్టను చిమ్ముతుంది కైలి కోడె. దాని కాపరి వచ్చి కట్టెతో కొట్టాడు. అది పొగరుగా వెనుకకు చూసి పరుగెడుతుంది.

'అసలేట్లె (ఆశ్లేషకార్తె) ముసలెడ్లు రంకెలేత్తయంటరు. పచ్చగడ్డి బాగ తింటన్నయి. ఉరుకులాడుతున్నయి కోళ్ళాగెలు ...' అనుకున్నాడు పోచయ్య. ఓ కాలువడ్డమొచ్చింది. అందులోకి దిగి నడుస్తున్నాడు. ఎడ్లమంద, బర్లమంద దాటిపోయింది. చిల్లర పశువు లొక్కొక్కటి వస్తున్నాయి. మామూలు సమయంలో జానెడు లోతుండే ఆ కాలువిప్పుడు మోకాళ్లుదాటి పారుతుంది. ఒకచేత్తో తలపైవున్న గంపను, మరో చేత్తో ధోతీని, గొంగన్ని పైకి మలిచి గమాలతో నడవడానికి సతమతమవుతున్నాడు.

"ఏంది తాత గీ వానలెటో పొయినవు ...?" పదిహేనేళ్ల పశువుల కుర్రాడు దగ్గరికొస్తూ అడిగాడు

"పొలానికి మందేత్తనని పొయిన. నేనచ్చినపుడు మొగులసలే లేదు. పొలంల మంచు వడ్డంక కుండపోత గురువ వట్టె ..." అన్నాడు పోచయ్య.

ఆ వయసులో అంత దూరం నడుస్తూ పోవడం - వ్యవసాయప్పని చేయడం చూస్తున్న ఆ కుర్రాడికి పోచయ్యపై జాలి కలిగింది.

"మందు దండుగవుద్దేమొ తాత ...? మనకి బాకి లేదనుకోవాలె పంట" వేదాంతిలా అన్నాడా కుర్రాడు.

"పొలాలోడ్లమీదికెళ్ళి నీళ్లు వారుతున్నయిగ దండుగ్గాకుంటేమ యిద్ది ...? ఇగ సేసేదేముంది ...?" అన్నాడు పోచయ్య.

ఆ కుర్రానితో సమానంగా నడవడాని కాయాసపడుతున్నాడు పోచయ్య. అది గమనించాడా కుర్రాడు.

"నేం బోత తాత, మెల్లెగ రా." అని "ఔ ఔ" అంటూ పశువుల తోలుకొని వెళ్ళిపోయాడు.

పూర్తిగా తడిచిపోయిన పోచయ్య శరీరంలోనుండి సన్నగా వణుకొస్తుంది. పైనుండి ప్రవాహపు మోత హోరుగా వినబడుతుంది. వర్షం ధారాపాతంగా కురుస్తూనే వుంది. పోచయ్యలో ఎన్నో ఆలోచనలు ...

"నాయిన్న పోంగ నాలుగెకరాలు పంచిచ్చె. మంట్లె మన్నై దుబ్బల దుబ్బై బొర్లి ఎవుసాయం జేత్తి ... ఎవుసంలేముంది దుబ్బా ...? కూలన్న గిట్టకపాయె. ఎంత కట్టమచ్చినా భూమి నమ్మద్దనుకుంటి ... దాన్ని నిలుపుకుంటానికి గొడ్డోలె సాకిరి సేత్తి ... రాత్రి లేపాయె ... పగల్లేపాయె. అయినా గని ఇద్దరాడి పొల్లగండ్ల లగ్గాలకు ఓ ఎకరం పోనే పాయె. కొడుకెదిగచ్చిండు. ఇగ నాకు ఢోక లేదనుకుంటి ... అనిగ్గూడ లగ్గం జేత్తి. సిన్నప్పుడాన్ని ఓళ్ళెవెట్టుకొని సాత్తి. కాకి గద్ద గొట్టకుంట కండ్లకి రెప్పోలె కాపాడుకుంటి. ఎదిగిన కొడుకు మీన ఆసెలు పెట్టుకొని బతికితి. నా కిట్టాలు గట్టెక్కుతయనుకుంటి .. కాని ఏమాయె ...? నా రాత పాడుగాను, బట్టుకాతదుక చ్చుకుంటి. నా కొడుకు ... నాకంటెత్తున్న కొడుకు నన్ను నటేట్లె ముంచిపాయె. కడుపుల పెట్టుకొని సాకిన కొడుకు మంట్లె గలసిపాయె. నా సేతులల్ల పెంచుకున్న కొడుకును దుబ్బపాల్జేత్తి. ఆ రాత్రి ... ఆ బట్టురాత్రి ... అద్దువరాత్రి పొయ్యి పొయ్యచ్చి పండుకున్న కొడుకును లేపకున్న మంచిగుండు. ఎడ్లకు మాతెయ్యన్నని నాకు గడ్డివాము గుంజ సాతగాదని కొడుకును లేపి తోల్తి... ఎడ్లకు మాతేసచ్చిన కొడుకు కాలుకేదో కుట్టినట్టనిపిచ్చిందే నాయిన్నా అన్నడు. దీపం ముట్టిచ్చి కాలు జూత్తి. చిన్న కాటుంది పాము గుట్టిందని మొత్తుకుంటి... కొడుకు నోట్లెనుంచి నురుగులు రానే వట్టె... ముసల్ది లబడిబ మొత్తుకోవట్టె మందు రాయివెత్తి ఏం గాపాయె. రాల్లు ముడేసి -- దగ్గరి కత్తనని మొక్కితి తగ్గకపాయె... మంత్రమేపిత్తి, నురుగులెక్కునే కావట్టె, ఆఖరుకు డాకటరునుగూడ పిలిపిచ్చి సూదేపిత్తి...తగ్గకపాయె ... నోట్లెనుంచి నురుగులు కుప్పలోతె ...రావట్టె "నాయిన్నా నేం చచ్చిపోతన్ననే" అని పానమిడిసె కొడుకు సెట్టంత కొడుకును పోగొట్టుకొని ముసల్ది నేను ఒర్రొర్రి సత్తిమి, ఇద్దరం నాలె వడ్డిమి, ఆర్నెల్లదాంక ఏందిన్నమో లేదో తెలవది. యాడాదాగి నంక కోడలు పోరి బిడేండ్ల పొల్లగాడుండంగ గూడ ఇంకొగన్ని సేసుకునె..." పోచయ్య కళ్ళముందు కన్న కొడుకును తన స్వహస్తాలతో మట్టిలో కలిపిన దృశ్యాలు... కళ్ళవెంట కుంభ

వృష్టిని మించిన నీరు .. కడుపులో ఉరుమును మించిన కల్లోలం...

కొడుకును కోల్పోయి, ఐదేళ్ళెలా గడిపాడో తెలియదతనికి. "పాపిష్టి బతుకు బతుకవట్టి. నన్ను గొంచపొయ్యి బతికే పొల్లగాన్నుంచకపాయె బగవంతుడు. ఆ దేవునిగ్గూడ గురి మరియాదలేదు. కాట్లెకు పోయెటోన్నేమొ ఉంచుతడు. నాల్గుదినాలు బతికెటోన్నేమొ కొంచపోతడు. ఏం దేవుడో ఏందో? పాపపు ముండకొడుకుల నుంచవట్టె నా కొడుకు పుట్టి బుద్దెరిగినప్పట్నుంచి ఎవ్వల జోలి కన్న పోయిండా? తన పనేందో తనేందో! నన్ను బంగారమోలె సూసుకునె పని ఎక్కువ జెయ్యనియ్యకపాయె... మంచోల్లనే జెప్పున గొంచవోతడు దేవుడు. ఆళ్ళంటె ఎక్కో ప్రేముండదేమొ నాకు కొరివి పెడుతడనుకుంటె అన్నే మాడిదీ సెయ్య వల్సచ్చె నాకు..." తనలో తానే గొణుక్కున్నాడు పోచయ్య. కళ్ళవెంట కారే నీటిని తుడుసుకున్నాడు.

వర్షమింకా కురుస్తూనే వుంది. ఊళ్ళోకి ప్రవేశించాడు. చిమ్మ చీకటిగా వుంది. వణుకుతూ కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. భర్తకొరకెదిరి చూస్తున్న పోచయ్య భార్య

"ఏంది గింతసేపాయె ఆడే పోతివి, మంచి నాశిన మయినట్టేనా?" అంది.

"పోంగ మొగులన్నదే లేపాయె. గింత వానగొట్టవట్టె మనదృష్ట మెట్లుంటె గట్లైతది." అని గంప, గమేల అరుగుమీద పెట్టాడు పోచయ్య. గొంగడి తీశాడు కోలాటం విప్పి జాడించాడు. చిలుక్కొయ్యకి కారేశాడు రుమాలు, అంగీ తీసి పిండి అరుగుపైవున్న దండెం బొంగుపై ఆరేశాడు. ధోతి కూడా పిండి ఆరేశాడు. పొడి ధోతి కట్టుకున్నాడు. రాత్రి కప్పుకోవడాని కుపయోగించే ధోతీ కట్టుకోవడం వల్ల రాత్రికేం గప్పుకోవాలె అనుకున్నాడు.

"పొయ్యిల అగ్గున్నాదె, సలి వెడుతంది." వణుకుతూ అన్నాడు.

"ఇప్పుడే బువ్వదించిన సెగ మా వుంది రా" అని భర్తను లోపలికి తీసుకెళ్ళింది.

పొయ్యిముందు కూచొని అరికాళ్ళు, చేతులు పొయ్యి పైకి చాపాడు.

'ఆయ్ వెచ్చగుంది ..' అనుకుంటూ వేడయిన చేతుల్తో శరీరంపై రాచుకున్నాడు. వాన ఇంకా కురుస్తూనేవుంది. 'టన్ టన్' అంటూ చినుకులు గిన్నెలో పడ్త దప్పుడు... వెనక్కు తిరిగి చూశాడు. పైనుండి ఉరుస్తున్న నీరు క్రింద పెట్టిన గిన్నెలో బొట్టుబొట్టుగా పడుతుంది. "టప్" మంటూ ఓ చినుకు తలపై పడింది. కొంచెం పక్కకు జరిగాడు "టప్ టప్" ఉరుస్తుంది

"ఓ గంజు దెచ్చి గిక్కడ పెట్టు ఉరుత్తంది" అన్నాడు ప్రక్కనే కూర్చున్న భార్యతో.

"ఎన్ని ఔగల్లని గిన్నెలు పెట్టాలె? ఇల్లంత ఉరుసుడేనాయె? ఎండ కాలం ఇల్లు గప్పియ్యమంటె కప్పియ్యక పోతివి." అని ఓ కంచు తలె తీసుకొచ్చి పోచయ్య ప్రక్కన బెట్టిందతని భార్య.

"కప్పియ్యన్ననుకుంటిగని గూనపెంకకు, సుతారోనికి గలిసి ఇన్నూరుపాయలయిత యన్నమోలె పైసల్లెవ్వని ఊకుంటి. మల్ల అలోసించి కప్పిత్తామనెవారకు ఆనకాలమచ్చె... ఆనలు గొట్టనే వట్టె... ఎవుసప్పని తీరక పాయె... ఏం బతుకులోనే..." అన్నాడు పోచయ్య.

పొయ్యి చల్లారింది. ఇక లాభం లేదని లేచాడు. చినిగిన షోలాపూర్ ఛద్దరు కప్పుకున్నాడు. అరుగుమీది కొచ్చాడు. నులకమంచం వాల్చుకొని కూర్చున్నాడు

"మా తాత ముత్తాతలు ఎవుసం సేసుకుంటనే బతికిండ్రు ... మా నాయన్న గూడ మన్నుల మన్నయే బతికిండు. పుట్టి బుద్ధెరిగి నప్పట్నుంచి నేం గూడ ఎద్దు ముడ్డి పొడుసుకుంటనే బతుకుతున్న ... ఒక్కడే కొడుకు నా వంశం ఉద్ధరిత్త డనుకుంటే నడు మంత్రాన వాయె... అరువయేండ్లయినా పని దప్పపాయె ... మట్లె గలసి పోయె దాక గిట్లనే బతుకుడయితది..." పోచయ్యకు జీవితమంతా గాడాంధకారంగా అగుపడుతుంది... బయటున్న చిమ్మ చీకటికీ తన జీవితానికేం తేడా కనబడటం లేదు... జీవితం గూర్చి ఆలోచిస్తున్న పోచయ్యకు పదేళ్ళ మనమడు జ్ఞాపక మొచ్చాడు. కొడుకు జ్ఞాపకార్థకంగా మిగిలిన ఆ పసివాడిపై అతనికి అంతులేని మమకారం.

"పొల్లగాడు పడుకున్నాడె...? కనవడుత లేదు." అన్నాడు భార్యతో.

"నువ్వు రాంగనే అడుగుదామనుకున్న మర్సి పొయిన. పొద్దు గూకినా నువ్వు రాకుంటే నేనద్దన్నా ఇనక చెత్తిరి పట్టుకొని నిన్ను తీసుకత్తనని ఉరికిండు."

"మంచిదానివే... గీ వానలెందుకు అవుతలికి పోనిచ్చినవ్... పసి పొల్లగాడు." అని భార్యను కసిరాడు పోచయ్య.

"నే నద్దంటె ఇన్నడా? తాతందీసుకత్తనని చెత్తిరందుకొని వెంగో ట్లిల్లినడు." అందామె.


పోచయ్య హృదయం ఆనందంతో ఉప్పొంగింది. తన కోసము పదేళ మనవడు పడే ఆరాటం అతన్ని కదిలించింది. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. మాటి మాటికీ బజార్లోకి చూస్తూ మనుమని రాక కెదిరి చూస్తూన్నాడు. 'మనుమడు చదువుకోని పేరు కొస్తే...' అతన్లో ఎన్నో ఆలోచనలు. ఆలస్యమవుతున్న కొద్ది అతన్లో ఆందోళన పెరుగుతుంది.

"జెప్పనత్తె మంచిగుడు పొల్లగాడు." అనుకొని "తీసుకనన్నత్త పడున్నం" అని ఎదురు సెల్చున్నాడు పోచయ్య.

"ఆని కొరకు నువ్వు నీ కొరకాడు...మంచిగనే వుంది. కొద్దిగాగాడే అత్తడు." అందామె.

"మంచిదానివే ఈ వాన లెక్కడ లిరుగుతండో." అని గొంగళి కప్పుకొని అరుగు దిగబోయాడు "ఛర్ ఛర్" మంటూ ఉరుము. "ఛక్ ఛక్" మని మెరుపు. ఆ మెరుపు వెలుతుర్లో బజార్లోనుంచి గొడుగు పట్టుకుని వస్తున్న మనవడు కనబడ్డాడు పోచయ్యకు. అతని కళ్ళలో వెలుగు గబగబా వచ్చి అరుగెక్కిన మనవన్ని ఆప్యాయంగా హృదయాని కత్తుకున్నాడు పోచయ్య.

□



వృష్టిని మించిన నీరు .. కడుపులో ఉరుమును మించిన కల్లోలం...

కొడుకును కోల్పోయి, ఐదేళ్ళెలా గడిపాడో తెలియదతనికి. "పాపిష్టి బతుకు బతుకవట్టి. నన్ను గొంచపొయ్యి బతికే పొల్లగాన్నుంచకపాయె బగవంతుడు. ఆ దేవునిగ్గూడ గురి మరియాదలేదు. కాల్లెకు పోయెటోన్నేమొ ఉంచుతడు. నాల్గుదినాలు బతికెటోన్నేమొ కొంచపోతడు. ఏం దేవుడో ఏందో? పాపపు ముండకొడుకుల నుంచవట్టె నా కొడుకు పుట్టి బుద్ధెరిగినప్పట్నుంచి ఎవ్వల జోలి కన్న పొయిండా? తన పనేందో తనేందో! నన్ను బంగారమోలె సూసుకునె పని ఎక్కువ జెయ్యనియ్యకపాయె... మంచోల్లనే జెప్పున గొంచవోతడు దేవుడు. ఆళ్ళంటె ఎక్కో ప్రేముండదేమొ నాకు కొరివి పెడుతడనుకుంటె ఆన్నే బూడిది సెయ్య వల్సొచ్చె నాకు..." తనలో తానే గొణుక్కున్నాడు పోచయ్య. కళ్ళవెంట కారే నీటిని తుడుసుకున్నాడు.

వర్షమింకా కురుస్తూనే వుంది. ఊళ్ళోకి ప్రవేశించాడు. చిమ్మ చీకటిగా వుంది. వణుకుతూ కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. భర్తకొరకెదిరి చూస్తున్న పోచయ్య భార్య

"ఏంది గింతసేపాయె అటే పోతివి, మంద నాశిన మయినట్టేనా?" అంది.

"పొంగ మొగులన్నదే లేపాయె. గింత వానగొట్టవట్టె మనదృష్ట మెట్లుంటె గట్లయితది." అని గంప, గమ్మాల అరుగుమీద పెట్టాడు పోచయ్య. గొంగడి తీశాడు కోలాటం విప్పి జాడించాడు. ఓలుకొక్కయ్య కారేశాడు రుమాలు, అంగీ తీసి పిండి అరుగుపైవున్న దండెం బొంగుపై ఆరేశాడు. ధోతి కూడా పిండి ఆరేశాడు. పొడి ధోతీ కట్టుకున్నాడు. రాత్రి కప్పుకోవడాని కుపయోగించే ధోతీ కట్టుకోవడం వల్ల రాత్రికేం గప్పుకోవాలె అనుకున్నాడు.

"పొయ్యిల అగ్గున్నాదె, సలివెడుతంది." వణుకుతూ అన్నాడు.

"ఇప్పుడే బువ్వదించిన సెగ మా వుంది రా" అని భర్తను లోపలికి తీసుకెళ్ళింది.

పొయ్యిముందు కూచొని అరికాళ్ళు, చేతులు పొయ్యి పైకి చాపాడు.

'అయ్ వెచ్చగుంది ..' అనుకుంటూ వేడయిన చేతుల్తో శరీరంపై రాచుకున్నాడు. వాన ఇంకా కురుస్తూనేవుంది. 'టన్ టన్' అంటూ చినుకులు గిన్నెలో పడ్డ చప్పుడు... వెనకకు తిరిగి చూశాడు. పైనుండి ఉరుస్తున్న నీరు క్రింద పెట్టిన గిన్నెలో బొట్లుబొట్లుగా పడుతుంది. "టప్" మంటూ ఓ చినుకు తలపై పడింది. కొంచెం పక్కకు జరిగాడు "టప్ టప్" ఉరుస్తుంది

"ఓ గంజు దెచ్చి గిక్కడ పెట్టు ఉరుత్తంది" అన్నాడు ప్రక్కనే కూర్చున్న భార్యతో.

"ఎన్ని ఔగల్లని గిన్నెలు పెట్టాలె? ఇల్లంత ఉరుసుడేనాయె? ఎండకాలం ఇల్లు గప్పియ్యమంటె కప్పియ్యక పోతివి." అని ఓ కంచు తలె తీసుకొచ్చి పోచయ్య ప్రక్కన బెట్టిందతని భార్య.

"కప్పియ్యన్ననుకుంటిగని గూనపెంకకు, సుతారోనికి గలిసి ఇన్నూరుపాయలయిత యన్నమోలె పైసల్లేవ్వని ఊకుంటి. మల్ల ఆలోసించి కప్పిత్తామనెవారకు ఆనకాలమచ్చె... ఆనలు గొట్టనే వట్టె... ఎవుసప్పుని తీరక పాయె... ఏం బతుకులోనే..." అన్నాడు పోచయ్య.

పొయ్యి చల్లారింది. ఇక లాభం లేదని లేచాడు. చినిగిన షోలాపూర్ ఛద్దరు కప్పుకున్నాడు. అరుగుమీది కొచ్చాడు. నులకమంచం వాల్చుకొని కూర్చున్నాడు

"మా తాత ముత్తాతలు ఎవుసం సేసుకుంటనే బతికిండ్రు ... మా నాయన్న గూడ మన్నుల మన్నయే బతికిండు. పుట్టి బుద్ధెరిగి నప్పట్నుంచి నేం గూడ ఎద్దు ముద్ది పొడుసుకుంటనే బతుకుతున్న ... ఒక్కడే కొడుకు నా వంశెం ఉద్దరిత్త దనుకుంటే నడు మంత్రాన వాయె... ఆరువయేండ్లయినా పని దప్పపాయె ... మట్టె గలిసి పోయ దాక గిట్లనే బతుకుడయితది..." పోచయ్యకు జీవితమంతా గాడాంధకారంగా అగుపడుతుంది... బయటున్న చిమ్మ చీకటికీ తన జీవితానికేం తేడా కనబడటం లేదు... జీవితం గూర్చి ఆలోచిస్తున్న పోచయ్యకు పదేళ్ళ మనమడు జ్ఞాపక మొచ్చాడు. కొడుకు జ్ఞాపకార్థకంగా మిగిలిన ఆ పసివానిపై అతనికి అంతులేని మమకారం.

"పొల్లగాడు పడుకున్నాడె...? కనవడుత లేదు." అన్నాడు భార్యతో.

"నువ్వు రాంగనే అడుగుదామనుకున్న మర్సి పొయిన. పొద్దు గూకినా నువ్వు రాకుంటే నేనద్దన్నా ఇనక చెత్తిరి పట్టుకొని నిన్ను తీసుకత్తనని ఉరికిండు."

"మంచిదానివే... గీ వానలెందుకు అవుతలికి పోనిచ్చినవ్... పసి పొల్లగాడు." అని భార్యను కసిరాడు పోచయ్య.

"నే నద్దంటె ఇన్నడా? తాతందీసుకత్తనని చెత్తిరందుకొని వెంగో బిల్లున్నడు." అందామె.


పోచయ్య హృదయం ఆనందంతో ఉప్పొంగింది. తన కోసమని పదేళ్ళ మనవడు పడే ఆరాటం అతన్ని కదలించింది. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. మాటి మాటికీ బజార్లోకి చూస్తూ మనుమని రాక కెదిరి చూస్తూన్నాడు. 'మనుమడు చదువుకోని పేరు కొస్తే...' అతన్లో ఎన్నో ఆలోచనలు. ఆలస్యమవుతున్న కొద్దీ అతన్లో ఆందోళన పెరుగుతుంది.

"జెప్పనత్తె మంచిగుడు పొల్లగాడు." అనుకొని "తీసుకనన్నత్త ఏడున్నడో" అని లేచి నిల్చున్నాడు పోచయ్య.

"ఆని కొరకు నువ్వు నీ కొరకాడు...మంచిగనే వుంది. కొద్దిగాగాదే అత్తడు." అందామె.

"మంచిదానివే ఈ వాన లెక్కడ తిరుగుతండో." అని గొంగళి కప్పుకొని అరుగు దిగబోయాడు. "ఛర్ ఛర్" మంటూ ఉరుము. "ఛక్ ఛక్" మని మెరుపు. ఆ మెరుపు వెలుతుర్లో బజార్లోనుంచి గొడుగు పట్టుకుని వస్తున్న మనవడు కనబడ్డాడు పోచయ్యకు. అతని కళ్ళలో వెలుగు గబగబా వచ్చి అరుగెక్కిన మనవన్ని ఆప్యాయంగా హృదయాని కత్తుకున్నాడు పోచయ్య.

□



కలగూరగంప

ముదిగొండ బుచ్చయలింగ శాస్త్రిగారి 'కుమారగీత'

మా తాతగారు ముదిగొండ బుచ్చయలింగ శాస్త్రిగారు. సమకాలీనులలో గొప్పపండితులుగా, వక్తలుగా పేరు పొందారు. ఆయన ఉపన్యసిస్తూవుంటే సభ యావత్తూ విజు మాకిడినట్లుగా ఉండేదట. 'భారతాంభోధి కుంభసంభవ,' 'భారత ధర్మోపన్యాస విశారద' ఆయన బిరుదులు.

ఆయన ఈశ్వర కార్తీక శుద్ధ ద్వాదశీ శనివారం నాడు హైదరాబాదులో జన్మించారు. లింగధారి బ్రాహ్మణులు. ఆంధ్రదేశంలో మాత్రమే బాగా ప్రచారంలో ఉన్న ఈ సంప్రదాయంవారిని ఆరాధ్యులు అంటారు. భారద్వాజస గోత్రీకులు. ఉద్భటారాధ్య వంశస్థులు. ఇంటి పేరు ముదిగొండ వారు.

రాజమాంబాదేవి తల్లి, 'ఆయుర్వేదవైద్య కళావిశారద' బిరుదం కల మల్లనారాధ్యుల వారు తండ్రి. వీరు వ్రాసిన 'వైద్యసారసంగ్రహం' ఆ రోజుల్లో బాగా ప్రచారం పొంది 1982 నాటికే ద్వితీయ ముద్రణం పొందింది.

తాతగారికి ముగ్గురు కుమారులు. ఒక కుమార్తె, రెండవ కుమారుడు, కుమార్తె మరీ చిన్నవయసులో చనిపోయి ఆయనకు 'దుఃఖపురుచి'ని చూపించారు. పెద్దకుమారుడు మల్లికార్జున చరణుడు. గాయత్రీ మంత్రోపాసకుడు. తాతగారి వైద్య విజ్ఞానానికి తన మంత్రోపాసన తోడు కాగా చాతనైనంతలో ప్రజాసేవ చేస్తూ 40 సంవత్సరాల వయసులోనే శివలోకం చేరుకొన్నాడు. వీరి కుమారుడు అంగీరస శర్మగారు కవి, పండితుడు. మూడవ కుమారుడు నందికేశ్వర చరణ్ తండ్రిగారి అడుగుజాడల్లో సంస్కృతాంధ్రాలలో గాఢ పరిశ్రమ చేసి 'శివ భక్తి విజయం' మొదలైన గద్యకృతులు వ్రాసిన వీరు ఈ వ్యాసకర్త జనకులు.

తాతగారికి 7-8 సంవత్సరాల వయసులో మాతృవియోగం 19 సం రాల వయసులో పితృవియోగం కలిగింది. ఆయన విద్యా గురువులు శ్రీ భగవచ్ఛాస్త్రిగారు. తాతగారికి తల్లీ తండ్రీ గురువూ సమస్తమూ తానేయై కంటికి రెప్పలా కాపాడారు.

భగవచ్ఛాస్త్రిగారికి మహాభారతం అంటే చాలా అభిమానం.ఎక్కడ,ఎప్పుడు ప్రసంగించవలసి వచ్చినా భారతాన్ని గూర్చే ప్రసంగిస్తూ ఉండేవారు. భారత విషయికమైన అభిమానాన్ని గురువుగారినుండి పుణికి పుచ్చుకొన్నారు తాతగారు. ఆ అభిమానమే తరువాతి జీవితకాలంలో ఆయనకు కీర్తి ప్రతిష్ఠలను గౌరవ సన్మానాలను ఆర్జించి పెట్టింది.

తాతగారు వ్రాసి ప్రకటించిన ఒకే ఒక గ్రంథం 'శ్రీ కుమారగీత' భగవద్గీతకు వ్యాఖ్యానం - అనాటి జగద్గురువులనుండి ఈనాటి వీధి గురువుల దాకా ఎందరో మహానుభావులు భగవద్గీతను వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. ఇంకా ఎందరు వ్యాఖ్యానిస్తారో చెప్పలేం! తాతగారి మాటల్లో అది "కుబేరుని సంపదవలె తరుగుదల లేనిదై యింకను క్రొంగొత్త యభిప్రాయములను వెలువుచునే యున్నది!" అయితే పైన చెప్పుకొన్న వ్యాఖ్యానాలు ఒక సంప్రదాయాన్ని, ఒక సిద్ధాంతాన్ని బలపరచడానికో, స్థాపించడానికి ఉద్దేశించినవి. ఆ విషయాల్లో అవి విశిష్టమైనవి కాని, తాతగారి వ్యాఖ్యానం విలక్షణమైంది. దానికి సంప్రదాయాలతో,సిద్ధాంతాలతో ఎలాంటి సంబంధం లేదు, "మహాభారతము గీతకు విస్తృత వ్యాఖ్యానము" అన్న తిలకుగారి వాక్యం దానికి ఊపిరి. గీతాశ్లోకాలలో చెప్పబడ్డ ధర్మాలు. విశేషాలు మహాభారతంలోని తక్కిన పర్వాలలో, కథలలో వివరించబడ్డ విసరాలను ఎత్తిచూపి సమన్వయించడం తాతగారి లక్ష్యం. ఒకరకంగా అది పరిశోధనా గ్రంథం. ఈనాటి పి. హెచ్‌డి. కై వ్రాయబడే సిద్ధాంత వ్యాసం లాంటిది.

శుక్లనామ సంవత్సరంలో (1929-30)తాతగారి రెండవ కుమారుడు కుమార చరణ్ అస్వస్థుడు కాగా గాలి మార్పు కోసం బందరు తీసుకొని వెళ్ళారు. బందరు తాతగారికి పుట్టినిల్లు లాంటిది. ధనాఢ్యులు, ప్రముఖులు అయిన తాడేపల్లివారు ఆయనకు ప్రియమైన శిష్యులు. వారి ఆదరణలో తాతగారు అక్కడ నెలంతరబడి ఉండేవారట. గాలిమార్పు వల్ల కొడుకు ఆరోగ్యవంతుడౌతాడనే వారి ఆశలకు భంగం కలిగిస్తూ కుమార చరణులు శివలోకం చేరుకొన్నారు. శిష్యుల తోడ్పాటు. సన్మిత్రుల సహకారం వల్ల ఆయన త్వరలోనే పుత్రశోకంనుండి విముక్తుడై పుస్తక వ్యాసంగంలో కాలక్షేపం చేయసాగారు. అక్కడే ఆయనకు తిలక్‌గారి గీతా రహస్యం ఆంధ్రానువాదం లభించింది. అందులో పరిశిష్టప్రకరణంలో తిలక్‌గారి పై వాక్యం చూచి ఉత్తేజితులై గీతా భారత సమన్వయం వ్రాసి చనిపోయిన కుమారుడి పేర 'కుమారగీత' అనే పేరుతో "శ్రీమదాంగీరస ఆశ్వీజ శుద్ధ విజయదశమి ఆదివారం "(1932-33) నాడు హైద్రాబాద్ చౌట్ల మహరాజ్ గంజ్ లోని తమ స్వంత ముద్రాణాలయం పంచాక్షరి పవర్ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించి ప్రకటించారు. ఇక్కడ ఒక విషయం ప్రత్యేకంగా చెప్పుకోవలసి ఉంది. గీతా భారతాలను సమన్వయించాలన్న ఉద్దేశ్యం తిలక్‌గారి గీతారహస్యం చదివాక కలిగింది మాత్రమే కాదు. ఆ ఆలోచన వారికి సుమారు 20 సంవత్సరాల పూర్వమే కలిగింది. తిలక్‌గారి వాక్యం వారి ఆలోచనకు పుష్టి కలిగించింది. కుమారుడి మరణం రూపం దిద్దింది. కీలకనామసంవత్సరంలో (1908-1909) మూసీనది వరదలవల్ల హైదరాబాద్ పాత నగరం చాలా భాగం మునిగిపోయింది. ఎన్నో ఇండ్లు నేలమట్టమయినాయి. అలాంటి వాటిల్లో తాతగారి విద్యాగురువుల భగవచ్ఛాస్త్రిగారి ఇల్లుకూడా ఒకటి. గురువుగారికి తిరిగి ఇల్లు కట్టించాలన్న కోరికతో పీలుఖానా వైశ్య ప్రముఖులతో ఆలోచించి, శాస్త్రిగారి భారతోపన్యాసాలను ఏర్పాటు చేయించారు. తాతగారు పాఠకులుగా గురువుగారు వ్యాఖ్యాతగా ఆ సభలు జయప్రదంగా నిర్వహించబడ్డాయి. ఆ రోజుల్లో గీతాపారాయణం కూడా వాటిల్లో ఒక భాగంగా ఉండింది. ఆ ఉపన్యాసాలలో శాస్త్రిగారు తమ సమాజధోరణిలో గీతా భారతాలను సమన్వయిస్తూ ప్రసంగించారు. అప్పుడే తాతగారికి పై ఆలోచన కలిగింది. కుమారగీతకు వారు వ్రాసుకొన్న విపుల పీఠికలో 'స్వవిషయం' అన్న భాగంలో ఈ రకంగా వ్రాసుకొన్నారు. "మహాభారతము - నందలి ధర్మములను గాథలను గీతకు సమన్వయించి వ్రాసిన బాగుండునని దోచుచుండెను. ఇది గురువుగారికి సైతము తెలిపితిని. వారును యంగీకరించిరి. కాని కాలము వారిని వశమొనర్చుకొనెను. "ఆ నాడు వారికి కలిగిన భావం 20 సంవత్సరాల తర్వాత ఇంతకు ముందు చెప్పుకొన్నట్లుగా రూపం దిద్దుకొన్నది. ఆయనకు తిలకుగారి గీతారహస్యం ఎంతో నచ్చింది. దానిని ఆయన ఎంతగానో అభిమానించారు. తిలక్‌గారి గీతారహస్యం ఆంధ్రానువాదంలోని గీతాశ్లోకాలకు వ్రాయబడ్డ తాత్పర్యాన్ని యధాతథంగా కుమారగీతలో వారు ఎత్తివ్రాసుకొన్నారు. ఆ విషయాన్ని కృతజ్ఞతాపూర్వకంగా స్పష్టపరిచారు కూడా? గురువుగారి మరణం తర్వాత ఆయన ఎక్కడ ఎప్పుడు ప్రసంగించినా గురువుగారి ఫణితిలోనే గీతా భారతాలను సమన్వయిస్తూ ప్రసంగించేవారు. ఆ రకంగా సుమారుగా 20 సంవత్సరాల వారి చింతనాఫలం శ్రీకుమారగీత.

శ్రీ 'కుమార గీత' వ్రాత ప్రతి సిద్ధమైన శుభసందర్భాన్ని పురస్కరించుకొని ప్రజోత్పత్తిలో"(1331-32)బందరులో నాగేశ్వరస్వామి ఆలయమున శ్రీ సాంగవేద పాఠశాలాధికారులు. పండితులు, పౌరులు మొదలగువారు శివపురాణము, భారతము, రామాయణము—వీటి సారము నుపన్యాసములుగా, జెప్పించి నందికేశ్వర విగ్రహ

చిహ్నితమును,'భారత ధర్మోపన్యాస విశారద' బిరుదము గల స్వర్ణపతకము నొసగిరి. ఆసమయముననే నాదెళ్ళ పురుషోత్తమ కవిశేఖరులు భారతాంభోధి కుంభసంభవయని పిలచి యెంతయు సంతసించిరి."

కుమార గీత ముద్రణ తరువాత ఒకటి రెండు సంవత్సరాలకు భావ జ్యేష్ఠ బహుళ ఏకాదశినాడు (1986) ఆయన శివసాన్నిధ్యము చేరెను.

కుమారగీత వ్రాయడంలో ఒక సంప్రదాయాన్ని బలపరచడం లేదా సిద్ధాంతాన్ని నిర్మించడం తాతగారి లక్ష్యం కాదని ముందే మనవి చేసుకొన్నాను. గీతా భ్యాసానికి, గీతాధర్మాచరణకు సంప్రదాయాలు సిద్ధాంతాలు అడ్డుగోడలు కాకూడదని ఆయన విశ్వాసం! ఈ విషయాన్నే తమ ఉపోద్ఘాతంలో నిర్ద్వంద్వంగా ప్రకటించారు. "గీతా తత్త్వాభ్యాసకులు ద్వేషబుద్ధిచే శైవవైష్ణవాది మతములను నిందించక సమత్వ బుద్ధి కలిగియుండవలెను. ఎందుకన "సర్వభూతేషు సౌహృదం" భూతముల యన్నింటి యందును స్నేహ భావముంచవలయునని గీత ముఖ్యముగా బోధించుచున్నది. ఒక దేశీయుడు మరొకదేశీయుని, ఒక భాష గలవాడు మరొక భాషగల వానిని, ఒక మతస్థుడు మరొక మతస్థుని - వీరేగాక మా కన్నియు సమమే యనువారు గూడా పరులను నిందించుట హాస్యము సేయుట గర్హించదగిన విషయమే కాని సంతసించవలసినది గాదు. ఇట్టివారు తమతమ కుతర్కముల నెంత వరకు మానుకొనరో యంతవరకు గీతాపారాయణము సఫలము గాదు." అయితే స్వమతమును ప్రేమించలేనివారు ఇతర మతములను గౌరవించలేరు. తాతగారు ఆరాధ్యులు. లింగధారి బ్రాహ్మణులైన వీరశైవులు.'నకించన శివాదన్యం,నకించన శివాత్పరం, శివాతిరిక్తం నహిచ, సర్వం శివమయమ్ జగత్' అని 'శివఏవకేవలం' అని వారి విశ్వాసం. తాతగారు నిత్య శివపూజా దురంధరులు. అయినప్పటికీ ఆయన పై విధంగా ప్రకటించడం ఆయన సమత్వ బుద్ధికి తార్కాణం. కృష్ణుడు విష్ణువంశ కాబట్టి శైవులు గీతను అనాదరం చేస్తారేమో అన్న అనుమానం వల్ల ఆయన శైవుల కందించిన సందేశం నిజంగా ప్రశంసనీయమైంది. శైవులారా ! శ్రీ కృష్ణుని శివ రహస్య వేదియని మనము తెలుసుకొన్నచో బాధయే లేదు. అతని ధర్మములు మోక్షదాయకము లగుటచే మనకే కాక యందరికి నా చరణీయములు.'

తాతగారు కుమారగీత వ్రాసినవిధానం విలక్షణ మైంది. మొదట గీతాశ్లోకం, వెంటనే తిలకుగారి గీతారహస్యం నుండి గ్రహించిన తాత్పర్యము. ఆ వెంట ఆ శ్లోకానికి సంబంధించి భారతశ్లోకముల ఉటంకింపు వాని తాత్పర్యము,అవసరమైనచోట్లలో సమన్వయ వ్యాఖ్యానము—ఇది వారి రచనా ప్రణాళిక. ఒక్కొక్కప్పుడు ఒక గీతా శ్లోకానికి వివిధపర్వాలనుండి పది పన్నెండు శ్లోకాలను ఉదహరించారు. ఉదాహరణకు సాంఖ్య యోగంలోని 31వ శ్లోకాన్ని వివరిస్తూ ఆరణ్య, ఉద్యోగ, భీష్మ, శాంతి పర్వాలనుండి 12శ్లోకాలను ఉదహరించారు. ఇలాగే కర్మయోగంలోని 27వ శ్లోకానికి శాంతి నుండి 6, అశ్వమేధంనుండి 1 ఎత్తిచూపారు. విషాదాన్ని వదలి వేస్తే తక్కిన 17 అధ్యాయాలకు ఆయన ఎత్తి చూపిన భారత శ్లోకాల సంఖ్య క్రింది విధంగా ఉంది 2-190; 3-120; 4-122; 5-34; 6-60; 7-48; 8-42; 9-54; 10-32; 11-24; 12-37; 13-32; 14-25; 15-62; 16-27; 17-29; 18-90, (మొదటి సంఖ్య గీతాధ్యాయము, రెండవది ఉదాహృత భారత శ్లోక సంఖ్య.) అంటే విషాదం యొక్క 47 శ్లోకాలను వదలి తక్కిన 699 గీతా శ్లోకాలకు గాను 1028 భారత శ్లోకాలను ఎత్తి చూపారు.

తాతగారి శైలి చాలా సులభమైంది. ఏ మాత్రం భాషాజ్ఞానం కలవాడికైనా సులభంగా అర్థమౌతుంది. ఒకటి రెండు ఉదాహరణలు మనవి చేసుకొంటాను.

> "దేహినోస్మిన్యథాదేహే కౌమారం యవ్వనం జరా
> తథా దేహాంతర ప్రాప్తిర్ధీర స్తత్ర నముహ్యతి!"
>
> (సాంఖ్య-13)

"దేహమును ధరించిన యెల్లవారికిని నీ దేహమునందు పసితనమును పడుచుతనమును, ముసలితనమును సంభవించునటులే ఈ దేహము నశించిన పిదప మరియొక దేహము ప్రాప్తించును. కావున ఈ విషయమున జ్ఞానియగు పురుషుడు మోహము నొందడు."

> "యథాహి పురుషశ్శాలాం పునస్సంప్ర విశేన్నవాం
> ఏవం జీవ శ్శరీరాణి తాని తాని ప్రపద్యతే !"
>
> —అర్జున వచనము-శాంతి-15-96

"శిథిలగృహమును విడచి నూతన గృహమున ప్రవేశించునట్లు జీవు (ఆత్మ) డొక శరీరము విడచి మరొకశరీరమున ప్రవేశించుచుండును."

ఒక్కొక్కచోట అవసరమైన కథనంతా వ్రాసిరి. కర్మయోగంలో కర్మ ప్రాధాన్యతను వివరించే 20వ శ్లోకానికి శాంతి పర్వం నుంచి శ్లోకాలను ఉదహరించి అనుశాసన పర్వంలోని కీటోపాఖ్యానం పూర్తిగా వ్రాశారు.

ఉపోద్ఘాతంలో గీతాధర్మము గూర్చి చెప్పుతూ కోపాన్ని వీడనిదే కోరినది పొందలేదనడానికి ఉదాహరణంగా విశ్వామిత్రుని కథను అనువదించారు. భారతంలో చెప్పబడ్డ వివిధ గీతలను గూర్చి సంగ్రహంగా వివరించారు. ఇదేరకంగా విశ్వరూప సందర్శన యోగంలో భారతంలోని ఇతర విశ్వరూపాలను గూర్చి వివరించారు.

మా తాతగారిని, వారి కుమారగీతను సూచనాప్రాయంగా పండితలోకానికి పరిచయం చేయడం ఈ వ్యాసం యొక్క లక్ష్యం. ఆయనను గూర్చి, ఆయన గ్రంథాన్ని గూర్చి ఎంతైనా వ్రాయవచ్చు. కాని అవి సంకల్పించిన లక్ష్యాన్నిదాటిపోతుంది. నా యీ అల్ప ప్రయత్నం వల్ల తాతగారికి, గ్రంథానికి పండితలోకం ఏమాత్రం గుర్తింపు కలిగినా నా సంకల్పం ఫలించినట్లే !

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్

అపూర్వకృతి "మేలుకొలుపు ద్విపద" రచయిత యెవరు ?

భారతి (జూన్ 86) సంచిక 'కలగూరగంప'లో "తాళ్ళపాక తిమ్మక్క మరొక అపూర్వకృతి" అనే శీర్షికతో డా॥ నీరజా చక్రవర్తిగారు ఒక మేల్కొల్పు పాటను ఉదహరించినారు. ఇది తెలుగునాట తాళ్ళపాకవారి మధురకవితలకు గల పలుకుబడిని వ్యాప్తి ప్రచారాలను చక్కగా నిరూపిస్తూవున్న సరికొత్త నిదర్శనం. అయితే వారు పేర్కొన్నవిధంగా ఈ కృతి తాళ్ళపాక తిమ్మక్క రచించినది కాదు. ఇది అన్నమాచార్యునకు (అక్క గమ్మయందు జనియించిన) కుమారుడైన పెదతిరుమలయ్య రచన.

ఈ సుందరకృతినిగూర్చి తొలుదొల్త సాహితీలోకానికి పరిచయ మొనర్చిన వారు విద్యారత్న కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారు. "ప్రాచీనాంధ్రకవులు—తాళ్ళపాకవారు" అనే అమూల్యవ్యాసంలో వారు ఈ లఘుకృతినిగూర్చి పేర్కొని ఉన్నారు.[1] అందులో వారు ఉదహరించిన ఈ 'మేలుకొలుపు ద్విపద' యొక్క ఆద్యంతాలు ఇలాగ ఉన్నాయి :

మొదలు :-

> శ్రీగురు దర్థితో శేషాద్రియందు
> యోగనిద్రాకేళి నున్న యత్తఱిని
> వనజాసనాది దేవత లేగుదెంచి
> వినిపించిరపుడు నవ్విధమెట్టిదనిన
> శ్రీకర వేంకట క్షితిధరావాస !
> నాకేశనుత ! రమానాథా ! మేల్కొనుము
> వసుదేవ దేవకీ వరగర్భజాత
> కిసలయాధర రామకృష్ణ ! మేల్కొనుము

చివర :-

> అనిచెప్పె తాళ్ళపాకాన్నయాచార్య
> "తనయ తిమ్మార్యుఁడు తగ విన్నవించు"
> ఏఁచి యీకృతి ధరణీశ్వరు సభల
> నాచంద్రతారార్కమై వెల్గుగాత !

పండిత ప్రభాకరులు కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఈ కృతికి "శ్రీ వేంకటేశ్వర ప్రభాత స్తవము" అని నామకరణం కావించి తాళ్ళపాక పెద తిరుమలాచార్య రచిత "వేంకటేశ్వర వచనము"లకు చివర సమగ్రంగా ప్రచురించినారు.[2] ఇందులో 66 ద్విపదలున్నాయి.

మొదలు :

శ్రీ గురుండర్థితో శేషాద్రియందు
యోగనిద్రాకేళి నున్న యత్తటిని
వనజాసనాది దేవత లేఁగుదెంచి
వినుతించి రప్పుడవ్విధ మెట్టిదనిన
శ్రీకర ! వేంకట క్షితిధరావాస !
నాకేంద్రనుత రమానాథ మేల్కనుము
వసుదేవ దేవకీ వరగర్భజాత
కిసలయాధర రామకృష్ణ మేల్కనుము

చివర :-

మానవేశులు మహామహులు సేవింప
ఘనతర నిత్యభోగంబులు వెలయ
జనులకెల్ల మహాప్రసాదంబు లొనరఁ
గోరినవారికిఁ గోర్కు లీడేర
నీరీతి జగముల నేలుచునుండు
నని భక్తిఁ దాళ్ళపాకాన్నమాచార్య
"తనయుండు తిమ్మయ తగఁ బ్రస్తుతించె."

శ్రీ వేంకటేశ్వరవచనముల ముద్రణము సాగుచుండఁగా, రాజకీయ ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నీ ప్రభాత స్తవమును గుర్తించి యేకకవికృతియని యందు దీనినిగూడఁ బ్రకటించితిని —వే. ప్ర.

ఇక డా॥ నీరజా చక్రవర్తిగారు ఉదాహరించిన ఈకృతి చివరి కవి నామాంకిత ద్విపద, తొలుత

"అని యిట్లు తాళ్ళపాకాన్నయ కూర్మి
తనయ తిమ్మయ చెప్పె ధరలోన వెలయ"

ఇత్యాదిగా ప్రాసఘటితమై ఉండి, మౌఖిక వ్యవహారంయొక్క ప్రభావం కారణంగా రాను రాను

"అని యిట్లు తాళ్ళపాకాన్నమయ కూర్మి
తరుణి తిమ్మక చెప్పె ధరలోన వెలయ"

అని ప్రాసరహిత మంజరిగా మారి వుంటుందనడంలో సందేహం లేదు. 'తిమ్మయ' 'తిమ్మక'—ఈ పేళ్ళకుగల అత్యంత సన్నిహితమైన స్వరూపసామ్యం కూడా పై మారుపాటుకు దోహదం చేసి వుంటుంది.

ఇంతవరకు పేర్కొనిన అంశాలనుబట్టి, తాళ్ళపాక అన్నమాచార్యుని కుమారుడైన తిమ్మార్యుడే (తిమ్మయ లేదా తిరుమలయ్య) ఈ ద్విపదకృతి ప్రణేత అనే విషయం స్పష్టంగా నిరూపితమయింది. ఈ తిరుమలయ్యకు 'పెదతిరుమలయ్య' (పెదతిరుమలాచార్యుడు) అని సుప్రసిద్ధ వ్యవహారం ఉండటం సాహితీవేత్తలకు సువిదితమైనదే !

ప్రకృతం డా॥ నీరజ చక్రవర్తిగారు ఉదాహరించిన ఈ కృతిలో 83 పంక్తులు (దాదాపు 42 ద్విపదలు) ఉన్నాయి. అంటే ఇంచుమించు మూడవవంతు గ్రంథభాగం (20 ద్విపదలకు పైగా) లుప్తమైపోయిందని చెప్పవచ్చు. అయినా ఇందులో ఒకటి రెండు చోట్ల చక్కని పాఠాంతరాలు నెలకొనివుండడం విశేషం.

ఈ కృతికర్తయొక్క నాలుగవ కుమారుడైన చిన్నన్న (చిన తిరువేంగళనాథుడు) రచించిన పరమయోగి విలాసంలో ఇలాంటి స్తుతిఘట్టం ఒకటి ఉంది.[3]

"పాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె !"

అనే ద్విపద అందులో పునరావృత్త మవుతుంటుంది. చిన్నన్న రచించిన ఈ 'ప్రాబోధికీస్తుతి' యొక్క శైలికి, తండ్రియగు పెదతిరుమలాచార్యుని రచనయే ఒరపడియై విలసిల్లిందని చెప్పవచ్చు.

ఈరీతిగా మేలుపలుకులతో వేంకటేశ్వరుణ్ణి మేలుకొలుపుతూవున్న ఈ కమనీయ కృతిని ప్రాతప్రతుల సాయంతో పరిష్కరించి ప్రకటించడం అవశ్యకర్తవ్యం.

అధోజ్ఞాపికలు

1. I) భారతి, సంపుటము 18, సంచిక 11 (1936 నవంబరు) చూ. పుటలు 697-701.
   II) నిడుదవోలు వారి 'ఉదాహరణ వాఙ్మయ చరిత్ర' యందును ఈకృతిని గూర్చి వివరించినారు. చూ. ప్రథమముద్రణ (1950) పుటలు 112-113.
2. శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ సీరీస్—నెం. 10, శ్రీ వేంకటేశ్వర వచనములు—(శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే పరిశోధింపబడినవి) తి. తి. దేవస్థాన ప్రచురణ (1945) చూ. పుటలు 81-86.
3. పరమయోగి విలాసము (సంపా.,) పండిట్ వి. విజయరాఘవాచార్య. తి. తి. దేవస్థాన ప్రచురణ (1938) చూ. పుటలు 368-366.

డా॥ కె. జె. కృష్ణమూర్తి

భాషలలో నిండు మార్కులు

పరీక్షలకు సంబంధించిన ఉత్తరపత్రాలకు విలువకట్టడం వస్తూ ఉన్న అనౌచిత్యాన్ని గురించి చర్చలు జరుగుతున్నాయి. గణితం, సైన్సు మొదలైన వాటిలో ఆయాప్రశ్నలకు గరిష్ఠంగా నిర్ణయించబడిన మార్కులు అన్నీ - నిర్దుష్టంగా ఉంటే — వేస్తున్నారు. ఇంగ్లీషులో అట్లా వేయక, "ఇది 'భాష'గదా ! ఇందులో నిండు మార్కులు. వేయగూడదు." అనే పద్ధతిని పెట్టుకొంటున్నారు. ఈమాట ఇంగ్లీషు విషయంలో మాత్రమే కాదు. తెలుగు మొదలైన అన్యభాషల విషయంలోను కామర్సు మొదలైన విషయాలలోను గూడ ఉంటోంది.

ఒకప్పుడు ఒకానొక 'కామన్ పరీక్ష'కు చెందిన తెలుగు ఉత్తరపత్రాలు దిద్దేవారికి ఇచ్చిన మార్గదర్శక నియమావళిలో "ఎంత నిర్దుష్టముగా వ్రాసినను 85%కంటె ఎక్కువ 'మార్కులు ఈయగూడదు" అని వ్రాసిపెట్టారు. సాధారణంగా అంతకంటె ఎక్కువమార్కులకు అర్హంఅయ్యే ఉత్తరాలు ఎక్కడా ఉండవు. ఒకవేళ, ఉన్నట్లయితే ఏమి చేయాలి ? నేను దిద్దవలసిన ఉత్తరపత్రాలలో మూడు నాలుగింట అటువంటి మంచి ఉత్తరాలు నిజంగానే ఉన్నాయి ! పదింటికి ఎనిమిన్నరకంటె ఎక్కువ మార్కులే వేయదగి ఉన్నాయి. "సమగ్రంగాను నిర్దుష్టంగాను ఉంటే, నిండుమార్కులు ఎందుచేత వేయరాదో నాకు బోధపడడంలేదు. ఫలానా నెంబర్ల పేపర్లలో అటువంటి ఉత్తరాలు వచ్చాయి. నేను మార్కులు వేయదగినన్ని వేసేస్తున్నానా" అని వ్రాసి, వేయదగిన యెక్కువ మార్కులే వేసి పంపాను.

భాషలు మొదలైన విషయాలలో సమగ్రత అనేది ఉండనే ఉండదు. అనీ, ఏకొద్దిగానో తప్పులు ఉండక మానవు అనీ ముందే ఒక మూఢవిశ్వాసం పెట్టుకొని కూర్చుండడంవల్ల నిండుమార్కులు వేయగూడ దనే భావం ఏర్పడినది. ఆ రకపు ఆలోచనలో చాలా పెద్ద తప్పు ఉన్నది.

ఒకప్రశ్నకు "మాగ్జిమమ్ మార్కులు పది" అన్నారనుకొందాం. అంటే, అర్థం ఏమిటి ? ఆ ప్రశ్నయొక్క అనుత్తమమైన (-ఇంత కంటె ఉత్తమము వేఱే లేదు అనదగిన, ఉత్తరానికి పదిమార్కులు వేయవలసి ఉంటుందన్నమాట. అటు

వండి ఉత్తరం ఏమిటో పరీక్షకునికి తెలిసి ఉండాలి. అది యేమిటో ఆయన వ్రాసి పెట్టాలి. ముందుగానే, అవసరం ఐతే ఒకరిద్దరు అభిజ్ఞులచేత దానిని పరిశీలింపజేసి. నిష్కృష్టమైన రూపానికి తెచ్చి ఉంచాలి. దానికి నిండుమార్కు లివ్వే యేర్పాటు చేయాలి. అట్లా నిండుమార్కులకు అర్హత పొత్తిగా లేని ఉత్తరం అంటూ ఉండ రాదు. నిండుమార్కులకు అర్హమైన ఉత్తరం పరీక్షకుడే వ్రాయలేకపోతే, పరీక్షార్థియైన విద్యార్థి యెట్లా వ్రాయగలుగుతాడు ? అసలు, 'మాగ్జిమమ్ మార్క్స్' అనే మాటకు అర్థమేమైనా ఉండాలిగదా ! వాస్తవంగా ఆదర్శప్రాయం ఐనది కాక పోయినా, పరీక్షకుని దృష్టిలో ఆదర్శప్రాయమై నిండుమార్కులకు అర్హమైన ఉత్తరం అంటూ ఒకటి ఉండాలి ! లేకపోతే, అది స్వాభావిక న్యాయం అనేదానికి విరుద్ధం అవుతుంది. అటువంటి తప్పు విశ్వవిద్యాలయ అధ్యాపకులతోసహా అనేక విద్యాధికులు చేస్తూఉండడం గర్హణీయం.

గర్హనీయం అని ఊరుకోడానికి కూడా వీలులేదు. ఇటువంటి తప్పువల్ల భాషలు, కామర్స్, మొదలైన విషయాలను అభిమాన విషయాలుగా తీసుకొని డిగ్రీలుగాని అపై డిగ్రీలుగాని పొందినవాళ్లు 'సైన్సు'లు తీసుకొన్నవారికంటె హీను లుగా పరిగణింపబడుతున్నారు. ఉద్యోగాలు అనుచితంగా సైన్సులవారికే లభి స్తున్నాయి. ఈ తప్పును తక్షణం సరిదిద్దవలసిన అవసరం ఉన్నది.

చివుకుల వేంకటసుబ్బావధానులు

అనంతపురం జిల్లా గ్రామ వ్యక్తినామాలు :

కన్నడ నిర్మాణ ప్రభావం

శ్రీ ఆదవాని హనుమంతప్ప గారి "అనంతపురం జిల్లా గ్రామ, వ్యక్తి నామాలు" కన్నడ నిర్మాణ ప్రభావం అన్న (మార్చి, 1984) వ్యాసమూ, శ్రీ 'తి' గారి 'అనంతపురం జిల్లా గ్రామనామాలు కన్నడ "నిర్మాణ ప్రభావం - ఉన్నదా ?' అన్న (సెప్టెంబరు, 1984) వ్యాసమూ చూసి తిప్పయ్య మొదలగు పేర్లు ఈ ప్రాంతంలో ఉండడానికి సరియైన హేతువును ఈ కింద ఇస్తున్నాను.

'తి' గారు తిప్ప పదం తిరుప శబ్ద భవం తిరుప - తిర్ప - తిప్ప అని చెప్పారు. ఇది సరియైన విశ్లేషణ కాదు. ఎదువల్ల అంటే తిప్పయ్య, తిప్పేరుద్ర తిప్పేస్వామి, తిప్పమ్మ మొ. పేర్లు గల వాళ్ళు మెడలో కంటెను వేస్తారు, కంటె అనగా ఒక విధమైన లోహపు కడ్డి. శివుడు అండే రుద్రుడు శ్మశానవాసి కపాల పుర్రె తీసుకొని తిరుపమెత్తుకునే వాడు. అందుకే ఆయనకు తిరుపయ్య అని పేరు.

కొంతమందికి ప్రతికాన్పులోనూ పుట్టిన ప్రతి బిడ్డా చనిపోతూండే ఆ పసి బిడ్డ పేరిట నాణెములు తిరిపెమెత్తుకుని ఆ నాణెములను కరగించి కంటెను చేయించి ఆ కంటెను మెడలో వేసి తిప్పయ్య అని పేరు పెడతారు. శివుని మాదిరి తిరుపమెత్తుకొని తయారుచేసిన ఆ కంటెను మెడలో వేసి తిప్పయ్య అని పేరుపెడితే పుట్టిన పసిబిడ్డ బతుకుతుందని ఒక నమ్మకముంది. తిప్పయ్య అనే పేరు వాళ్ళు బిక్షం వెయ్యడానికి అర్హులు కారు అనే నమ్మకం కూడా వుంది. ఎందుకనగా వాళ్లే తిరుపం పెట్టించుకొని బతికినవాళ్లు కనుక బిక్షం వెయ్యకూడదు. ఈ ఆచారం ఇప్పటికీ వుంది. సర్వసాధారణంగా తిప్పయ్య అని పేరు పెట్టుకున్న ఏ వ్యక్తిని చూసినా మెడలో కంటె (కడ్డి) ఉంటుంది. శివుడు తిరుపం ఎత్తుకునే వాడు కాబట్టి ఆయనకు తిరుపయ్య అనే పేరు వచ్చింది. అదే తిప్పయ్య అయ్యింది.

తిరుపయ్య ⟶ తిర్పయ్య ⟶ తిప్పయ్య

తిప్పయ్య అని పేరు పెట్టడానికి ఇంకో కారణం కూడా ఉంది. పుట్టిన ప్రతి బిడ్డా చనిపోతూంటే పుట్టిన పసిపిల్లను తిప్పమీద అనగా పెంటకుప్పమీద పెట్టుతారు. అనగా ఆ బిడ్డ తమకు అవసరం లేదన్నట్టుగా పెట్టుతారు. ఇంకొకరు ఎవరైనా ఆ బిడ్డను తీసుకొచ్చి కన్నతల్లికి పెంచుకొమ్మని ఇస్తారు. తిప్పమీద దొరికింది కనుక తిప్పయ్య అని పేరు పెడతారు. ఇట్లా చేస్తే ఆ బిడ్డకి దోషం పోయి బతుకుతుందని ఒక నమ్మకం. ఆ నమ్మకంతోనే తిప్పయ్య అని పేరు పెడుతున్నారు. అంతేకాని తిప్పయ్య తిరుప (తి) శబ్ద భవం కానేకాదు.

బి. నరసింహులు

❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊❊

భారతికి రాసేవారికి మనవి !

- ★ భారతికి రాసేవారు కాగితానికి ఒక వైపునే పూర్తి తెలుగు లిపిలో నే రాయాలి. పూర్తి చిరునామా అవసరం.
- ★ రచనలని ప్రచురించటానికి స్వీకరిస్తే ఆ విషయం మేమే తెలియపరుస్తాము.
- ★ ప్రచురణకి స్వీకరించబడని రచనలని తిప్పి పంపాలని కోరుకొనే వారు తగినన్ని తపాలా బిళ్ళలు అంటించిన పూర్తి చిరునామా రాసిన కవరుని జత చేయవలసి ఉంటుంది. ఇలా కవరుని జత పరచని పక్షంలో రచనలని తిప్పి పంప టానికి కుదరదు. ఈ విషయంపై ఉత్తర ప్రత్యుత్తరాలకి ఆస్కారం లేదు.
- ★ ప్రచురణకి స్వీకరించిన రచనలని మూడు, నాలుగు నెలలలోపు వీలునిబట్టి ప్రచురించడం జరుగుతుంది ఈలోగా ఉత్తరాలు రాస్తే ప్రయోజనం ఉండదు.
- ★ రచనలు పడ్డ భారతి ప్రతులని ఆయా రచయిత్రులకీ రచయితలకీ పంపడం తప్పనిసరిగా జరుగుతుంది. ప్రతులు అందలేదనీ మళ్ళీ పంపవలసిందని రాసేవారు ఈ అంశాన్ని గమనించగలరు.
- ★ శాసనాల గురించి వ్యాసాలు రాసే వారు తమ వ్యాసాలతో పాటు వాటికి సంబంధించిన ఛాయా చిత్రాలని కూడా జతపరచి పంపవలసి ఉంటుంది.

—సంపాదకుడు

గ్రంథవిమర్శలు

నిజాం నవాబుకు ప్రజల జవాబు

(హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర: రచన: శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు. ప్రచురణ: స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, గాంధీభవన్, హైదరాబాదు. 840 పుటలు. రాయల్ సైజు. వెల నూరు రూపాయలు.)

దేశ స్వాతంత్ర్యసిద్ధికై తమ సర్వస్వాన్ని అర్పించిన త్యాగధనుల దివ్యస్మృతికి భక్తి శ్రద్ధలతో అంకితం చేయబడిన ఈ బృహత్ గ్రంథంలో, కేవలం హైదరాబాదు సంస్థానంలో జరిగిన స్వాతంత్ర్య సమర వివరాలే కాక, నాటి హైదరాబాదు రాష్ట్ర స్వరూపము, దాన్ని పరిపాలించిన అసఫ్ జాహి వంశస్థులైన నిజాం నవాబుల పుట్టుపూర్వోత్తరాలు మొదలైన అనేక చారిత్రక విషయాలు వున్నాయి.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ (1857) కాలానికి పూర్వమూ, తరువాతా మన దేశంలో అన్ని ప్రాంతాలతో పాటు హైదరాబాదు సంస్థానంలో బ్రిటిషు వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహవత్‌రామ్, తుర్రేబాజ్ ఖాన్ మొదలైన మహావీరుల గాథలు ఈ గ్రంథంలో చేర్చడం జరిగింది. హైదరాబాదు నగరంలో కొన్ని ముఖ్య వీధులకు ఆ వీరుల పేరు పెట్టారు.కాని వారిని తలచినవారు నేడు లేరు!

హైదరాబాదు సంస్థానం బ్రిటిషు వారు సృష్టించిన కృత్రిమమైన రాష్ట్రం. ఈస్టిండియా కంపెనీతో 1800 సంవత్సరంలో చేసుకున్న సంధి ప్రకారం అప్పటి నిజాం రాజా నిజామలీఖాన్, దక్కనుకు సూబేదారు (గవర్నరు) మాత్రమే. అతడు నిజాముల్ముల్క్ కుమారుడు. అనగా రెండవ నిజాము. అతడు సమ్మదగిన వాడుగా అనిపించక పోవడంతో బ్రిటిషు వారు, అతనిమీద నిఘా వుంచడానికి రెసిడెంటును నియమించారు. రెసిడెంటే ముఖ్యమంత్రిని, మంత్రులను నియమించేవాడు. బ్రిటిషు సైన్యాలు బొల్లారంలో ఉండేవి. బ్రిటిషు వారి యెడ కనపరచిన విధేయత వలన క్రమంగా కొన్ని అధికారాలు నవాబుకు సంక్రమించాయి. మన దేశంలోని సంస్థానాలన్నిటిలో హైదరాబాదు రాష్ట్రం పెద్దది. విశ్వాసపాత్రుడైన మిత్రుడుగా బిరుదు సంపాదించుకున్న నిజాం అంతరంగిక వ్యవహారాలలో బ్రిటిషు వారు క్రమంగా కలగజేసుకోవడం మానుకున్నారు.

తెలుగువారు, మహారాష్ట్రులు, కర్నాటులు గల ఈ రాష్ట్రం పదహారు జిల్లాలుగా విభజించ బడింది. ఇందులో తెలంగాణా ఎనిమిది జిల్లాలు, మరాఠ్వాడా అయిదు జిల్లాలు, కర్నాటక మూడుజిల్లాలు.

బ్రిటిష్ ఇండియాలో వస్తున్న పరిణామాల ప్రభావం ఈ రాష్ట్రం మీద పడకపోలేదు. ఖిలాఫత్ ఉద్యమ ప్రభావంతో హిందూ మహమ్మదీయులు ఏకమై స్వాతంత్ర్య సాధనకు పూనుకున్నారు. ఈ ఐక్యత అటు బ్రిటిషు వారికీ ఇటు నిజాం నవాబుకూ ఇష్టంగా లేదు. దీనితో పాటు కాంగ్రెసు ఉద్యమ ప్రభావమూ ఇక్కడి ప్రజలమీద పడసాగింది.

ఏడవ మరియు ఆఖరు నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో ఇటు ప్రజలలో చైతన్యం పెరగడం, అటు ప్రభుత్వ దమననీతి పెరగడం ఒకేసారి జరిగింది. మతపరమైన ఉద్రేకాలను రెచ్చగొట్టే పనులు జరిగాయి. పౌరహక్కుల కోసం ఆర్యసమాజం వారు, కాంగ్రెసు వారు, కమ్యూనిస్టులు పోరాడసాగారు. గణేశోత్సవాలు జరుపుకునే వారిపై అత్యాచారాలు, ఓం పతాక దహనాలు, హవనకుండాలను అపవిత్రం చేయడం మొదలైన క్రూర చర్యలు జరిగాయి. ఆర్యసమాజ కార్యకర్తలను హత్య చేయడం, జైళ్ళలో నిర్బంధించడం జరిగింది.

దేశంలో వందేమాతరం ఉద్యమం ఈ రాష్ట్రంలోనూ మంచి సంచలనాన్ని కలిగించింది. వేల సంఖ్యలో సత్యాగ్రహులు జైళ్ళకు వెళ్ళారు. విద్యార్థులు కళాశాలలను బహిష్కరించారు. ఇది 1938–39 నాటి మాట. తరువాత క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది. 1942లో హైదరాబాదు సంస్థానంలో– చైతన్యవంతులైన యువకులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. 1938 లోనే హైదరాబాదు స్టేటు కాంగ్రెసు సంస్థ చట్ట విరుద్ధమైనదిగా ప్రభుత్వం ప్రకటించింది. అంతకుముందే 1930 నుంచి పని చేస్తున్న ఆంధ్ర మహాసభలో రాజకీయవాదులు, మితవాదులు అతివాదులు ప్రవేశించి ఆ సంస్థ ద్వారా తమ స్వాతంత్ర్య సమరం సాగించారు.

ఆర్యసమాజీయులు పౌరహక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే వున్నారు పండిత్ నరేంద్రజీ, పండిత్ వందేమాతరం రామచంద్రరావు, పండిత్ వినాయకరావు విద్యాలంకార్ మొదలైనవారు ఈ ఉద్యమంలో ముఖ్యులు. కాంగ్రెసు నాయకులైన హయగ్రీవాచారిగారు, కమ్యూనిస్టు నాయకులైన రావి నారాయణరెడ్డిగారు మొదలైన వారెందరో ఆర్య సమాజంతో ప్రభావితులై పౌరహక్కుల కోసం పోరాడిన వారే అని రచయిత మాణిక్యరావు గారు 29వ ప్రకరణంలో పేర్కొన్నారు.

నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ అనే సంస్థ నిర్వహించిన పాత్రను గురించి రచయిత మాణిక్యరావు గారు చాలా వివరంగా వ్రాశారు.

ఆంధ్ర మహాసభ పతాక కింద అన్ని రాజకీయ భావాలు గల స్వాతంత్ర్యవీరులు పాల్గొన్నారు. గాంధీవాదులైన జమలాపురం కేశవరావు గారు, కమ్యూనిస్టులైన రావి నారాయణ రెడ్డి గారూ ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఏక వేదిక నుండి నిజాం ప్రభుత్వాన్ని యెదిరించారు. అయితే ధర్మవరంలో 1942లో జరిగిన తొమ్మిదవ ఆంధ్ర మహాసభలో కాంగ్రెసువాదులకు, కమ్యూనిస్టులకు అభిప్రాయ భేదాలు మొదలైనాయి. పదకొండవ మహాసభ భువనగిరిలో జరిగింది. ఆ సభకు అధ్యక్షులు రావి నారాయణరెడ్డి గారు. ఆంధ్ర మహాసభలో కమ్యూనిస్టు ప్రాబల్యం హెచ్చింది. దానితో మహాసభ రెండుగా చీలిపోయి జాతీయవాదుల ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుల ఆంధ్ర మహాసభ ఏర్పడ్డాయి. మడికొండలో జాతీయవాదులు పన్నెండవ మహాసభ జరిపారు. కమ్యూనిస్టుల పన్నెండవ ఆంధ్ర మహాసభ ఖమ్మంలో జరిగింది. ఈ చీలిక రజాకార్లకు, నిజాం నవాబుకు కొంతవరకు ఉపయోగపడింది.

అటు తీవ్ర మతోన్మాదులైన రజాకార్లకు లిటిల్ హిట్లర్ ఖాసిం రజ్వీ నాయకుడయ్యాడు. ఆజాద్ హైదరాబాద్ (స్వతంత్ర హైదరాబాద్) నినాదం లేవదీశాడు. రజాకార్లను స్వప్రయోజనాలకు ఉసి కొలిపిన ప్రభుత్వం ఆఖరుకి రజాకార్ల చేతిలో కీలుబొమ్మ అయిపోయింది.

రజాకార్లు రాష్ట్రంలో ముఖ్యంగా గ్రామ ప్రాంతాలలో జరిపిన దౌర్జన్యకాండను మాణిక్యరావు గారు ఈ గ్రంథంలో వివరంగా వ్రాశారు. జైళ్ళలో వున్న సత్యాగ్రహులపై సైతం దాడులు చేసి హింసించి, చంపిన వివరాలు ఇందులో పొందుపరచారు. మూడు ప్రాంతాల వారు ఏకగ్రీవంగా ఆమోదించిన నాయకులు స్వామి రామానంద తీర్థ, రాజీ యెరుగని త్యాగశీలి! "షల్ బ్రేక్, బట్ షల్ నాట్ బెండ్" (ఆహుతి అయిపోతాం, కాని లొంగిపోము) అన్నదే ఆయన నినాదం. యెన్నోసార్లు నిజాంనవాబు ఆయనతో

సంప్రదింపులు జరిపారు. భారత యూనియన్‌లో, రాష్ట్రం విలీనం కావడం ప్రజా ప్రభుత్వం యేర్పడడం, తప్ప మరో ప్రత్యామ్నాయ సూచనకు ఆయన ఎన్నడూ అంగీకరించ లేదు.

యుధాతధపు ఒడంబడిక భారత, హైదరాబాదు ప్రభుత్వాల మధ్య యేర్పడడం, భారత యేజెంటు జనరల్‌గా శ్రీ కె. ఎం. మున్షీగారు హైదరాబాదు రావడం, భారత సైన్యాల ఉపసంహరణ మొదలైన వివరాలుతో ఆఖరు ఘట్టంగా పోలీసు చర్యను గురించి కన్నులకు కట్టినట్టు వ్రాశారు ఈ గ్రంథంలో రచయిత.


తర తమ భేదం లేకుండా– అన్ని పార్టీలవారూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న తీరును వివరించారు రచయిత. పేరు పేరున వేలాది స్వాతంత్ర్యయోధులను గురించి వ్రాశారు. ఈ గ్రంథంలో ఎన్నో విలువైన చిత్రాలు ప్రచురించ బడ్డాయి.

భారత స్వాతంత్ర్యం కోసం జరిగిన తుది సంగ్రామం హైదరాబాదు నడిగడ్డ మీదనే జరిగిందని స్వామీ రామానంద తీర్థ అన్నారు.

ఈ తుది ఘట్టానికి పూర్వరంగాన్నీ, ఉద్యమం పుట్టుపూర్వోత్తరాలను ఇంత వివరంగా తెలిపే గ్రంథం మరొకటి ఇప్పటికి రాలేదంటే అతిశయోక్తి కాదు. సరళమైన శైలిలో ఎందరికో తెలియని అనేక చారిత్రక, సాంఘిక, మతపరమైన వివరాలను, రాజకీయ పరిణామాలను ఈ గ్రంథం చక్కగా చిత్రించింది. రెండు వందల యేండ్ల నిజాం పరిపాలన నిజస్వరూపం ఈ గ్రంథంలో సాక్షాత్కరిస్తుంది. నలభై యెనిమిది ప్రకరణాలతో వందల చిత్ర పటాలతో రమారమి 700 పుటలు గల ఈ బృహత్ గ్రంథం రచించిన శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు గారు బహు భాషలు తెలిసిన రచయిత. ఈ గ్రంథ రచనకు కావలసిన వివరాలను సేకరించడానికే రచయితకు యేండ్లు పట్టివుంటాయి. వాటిని చక్కగా గ్రథనం చేసి అ అమూల్య విషయాలను గ్రంథస్థం చేశారు ఇటువంటి అపురూపమైన గ్రంథాన్ని ఎంతో సంయమనంతో రచించిన శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు గారినీ, విషయ సేకరణలో తోడ్పడిన వారి మిత్రులనూ, వ్యయ ప్రయాసలకు ఓర్చి ఈ గ్రంథాన్ని ప్రచురించిన స్వాతంత్ర్య సమరయోధుల సంఘాన్నీ, ముఖ్యంగా శ్రీయుతులు టి. హయగ్రీవాచారి, కాటం లక్ష్మి నారాయణ గారలను అభినందించాలి.

నేటి తరానికి హైదరాబాదు రాష్ట్ర స్వాతంత్ర్యోద్యమాన్ని గురించి వివరంగా తెలియదు. ఇది అవశ్య పఠనీయమైన గ్రంథం. ఈ గ్రంథం చదువుతుంటే బ్రిటిష్ ఇండియాలో జరిగిన స్వాతంత్ర్యోద్యమానికీ, నాటి హైదరాబాదు రాష్ట్రంలో జరిగిన పోరాటానికీ మధ్యగల తేడాలు, మధ్యయుగాల నిజాం రాచరికం చేసిన దురంతాలూ, స్వాతంత్ర్యయోధులు అనుసరించిన భిన్న భిన్న మార్గాలు అవగతమవుతాయి. భారతమాత గర్భంలో యేర్పడిన ఈ వింత వ్రణానికి స్వతంత్ర భారత ప్రభుత్వం జరిపిన విజయవంతమైన శస్త్ర చికిత్సను గూర్చి చదువుతుంటే విషాదం, ఆనందం, ఆశ్చర్యం కలుగక మానవు.

దాశరథి




Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.


ప్రెస్టీజ్

ప్రెషర్ పాన్


దీనితో వండిన భోజనం తింటే ఎంత సంతృప్తికలుగుతుందో
దీనితో వండడం కూడా అంత సంతృప్తికరంగాను వుంటుంది!




వేపుడు




హెచ్చు వేపుడు



సాట్



ప్రెషర్ కుక్



బిర్యానీని చాకచక్యంతో వండండి. లేదా గుడ్డును వేగంగా వేపండి. లేదా
పూరీని చక్కగా పొంగించండి. మరి కూరను చకచకా తయారుచేయండి.
అన్నీ [illegible]. ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ అంతటి [illegible]
అన్నమాట. [illegible] అంత వాటంగా, [illegible] వుంటుంది. దీనితో [illegible] వేపుడు,
హెచ్చు వేపుడు, దోరవేపుడు మరియు ప్రెషర్ కుకింగ్ చేయవచ్చు.

ఒక్క ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మాత్రమే మూటికి మూడు పాళ్ళ భద్రతను
సమకూర్చగల అద్వితీయమైన గాస్కెట్ రిలీజ్ సిస్టంను కలిగియున్నది.

ఇప్పటికే ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ మీవద్ద వుండివుంటే, మూత
లేకుండా దీనిని కొని ఎక్కువగా సొమ్ము ఆదాచేసుకోండి. లేదా
సొంత మూత కలదానిని కొనండి. ఈ ప్రెషర్ పాన్ మీకోసమే మరి.

Prestige PRESSURE PAN ©

TTK తయారీ.

MAA (S) PP1B TEL 84



అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ
AMRUTANJAN
Pain Balm
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
OBM 5777 TG